ఎమెస్కో ప్రచురణ

# ఎమెస్కో వచన రామాయణం

శతావధాని కోట వీరాంజనేయ శర్మ

# ఎమెస్కో వచన రామాయణం

(ఐదవ సంపుటం)

ర చ న :

శతావధాని కోట వీరాంజనేయ శర్మ



193

యం. శేషాచలం అండ్ కంపెనీ

మచిలీపట్నం - సికింద్రాబాదు

EMESCO VACHANA RAMAYANAM - Vol. 5

*As retold by :*

SATAVADHANI KOTA VEERANJANEYA SARMA


*First Edition :*

OCTOBER 1980





*Publishers :*

M. SESHACHALAM & Co.,

Machilipatnam - Secunderabad.


*Cover Design :*

BAPU

*Printers*

PRASAD PROCESS,

Machilipatnam


**Price : Rs: 5-00**


*Distributors :*

M/s. ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,

3237, Rashtrapathi Road, Secunderabad-500 003




193

## ద్వాదశాదిత్యమండలం వలె ప్రకాశించే
## 12 సంపుటాల ఎమెస్కో వచన రామాయణ ప్రాశస్త్యం

ఏనాడు వాల్మీకి మహర్షి అపార తపశ్శక్తితో వేదాన్ని రామాయణాత్మకంగా ఆవిష్కరించాడో ఆ నాటినుండి అవిచ్ఛిన్నంగా శాఖోపశాఖలతో బహు నామాలతో ఆ కల్పవృక్షం భారతాన్ని పుణ్యభూమిగా, కర్మభూమిగా చేసి దిగ్దిగంతాలకు ప్రాకింది. ఇంకా ప్రాకుతుంది. అందుకే ఒక కవి "రామచంద్ర చారిత్రము నెందరెన్ని గతులన్ వర్ణించినన్ క్రొత్తదే" అని అన్నాడు. మేం కూడా ఆ పవిత్ర భావంతోనే ఈ మహా కార్యానికి పూనుకున్నాం. ఈ నూత్న ప్రయత్నంలో ఒక విలక్షణమైన మార్గం త్రొక్కటం జరిగింది. వేదానికి వేదం ప్రమాణంలాగా వాల్మీకి రామాయణానికి వాల్మీకియే ప్రమాణంగా అనువాదంలోనే అపవాదులు నిరాస్తం చేయబడినై. యథాతథంగా అనువదించినా స్వతంత్ర కావ్యం వలే చదువరులకు ఆనందం కలిగిస్తుంది. ఎన్నో గ్రంథ గ్రంథులు వున్నై. ఎన్నో పూర్వాపర విరుద్ధాలున్నట్లు పైకి కనుపిస్తాయి. వచ్చిన కథలేవస్తై. ఒకచోట శంకకు ఎక్కడో పరిహారం వుంటుంది. ఈ చిక్కులన్నీ ఇందులో విశదీయబడినై. తైలధారవలె అవ్యాహతంగా రచనా స్రోతస్సు ప్రవహిస్తుంటే చవిటి నేలలు, కేదారఖండాలు, నల్లని, ఎర్రని, రేగడ భూములు, నిస్సార నిరుపయోగ ప్రదేశాలు సస్యశ్యామలంగా మారి ఫలానుభవంతో, ఇహపర సుఖాలు తమంత తామే కోరి వరించి వస్తై. ఈ రచనా విన్యాసం సరికొత్తది. పండిత పామరభేదం లేకుండా స్త్రీ శిశు వివక్షణ లేకుండా అందరికీ రామాయణ కల్పవృక్ష ఫలాలను అందిస్తుంది. ఏ అనుమానం వచ్చినా ఈ రామాయణం ఆ ఘట్టంలో చూసుకుంటే తెలుస్తుంది. ఇంతకు పూర్వం తెలియని ఎన్నో రహస్యాలు వెలికి తీయబడినై. ఉదాహరణకు దశరథుడు ముగ్గురు భార్యలకు పాయసం నాల్గు భాగాలెందుకు చేశాడు? వాలి వధ ఎందుకు ధర్మబద్ధమైంది? తార పతివ్రతగా ఎందుకు ఆరాధ్యఅయింది? సీతా పరిత్యాగంలో రాముడు అన్యాయం చేశాడా? ఇంకా ఎన్నో ఎన్నో. ఈ బృహత్కార్యం ఎందుకు సంకల్పించామో చదివి పాఠకులు సాక్షులు గండి.

స్వామి! భవత్కృపాప్రబలసంగతి నాలవసంపుటంబునున్
భూమి భవాత్మదేవు పదముల్ స్పృశియింపఁగనుంచినాను శో
భామయసూనమట్లుగను, పావని! యైదవ సంపుటంబునున్
జామర పండితా! భవబంధహరంబుగ వ్రాయఁబూనుమా.

"నీవంటి ముద్దరాలు, ఆశ్చర్యకరసుందరి నన్నా చేపట్టటం? ఈ విరూపను, అసతిని, కరాళను, నిర్ణతోదరిని, వృద్ధను నెట్టి, నిన్ను భార్యగా కోరుట మానవులకు దుర్లభం. కనుక ఎవరు పంపారో వారే అన్ని విధాలా సమర్థులు. అక్కడికే పో" అని అన్నాడు. అతని మాటలు పరిహాసం కోసం అన్నవని గ్రహించలేని ఆ రక్కసి పరుగుపరుగున పర్ణశాలలోనికి పోయి, "రామా! ఈ విరూపను, ఈ కరాళవక్త్రను, ఈ లంబోదరిని కట్టుకుని నన్ను గౌరవించటంలేదు. దీన్ని ఇప్పుడే మ్రింగి సవతిపోరులేకుండా చేస్తాను. అప్పుడైనా నా శక్తి కని నాతో సంచరిస్తావు" అంటూ హుంకరించి రోహిణిపై పడే మహత్తరమైన ఉల్కలాగా బార సాచుకుంటూ పైకి దూకపోతూంది. వచ్చే రక్కసిని గట్టిగా బిగపట్టి, "లక్ష్మణా! చూచావా ఈ రాక్షసి దుశ్చేష్టలు? నీచులతో పరిహాసం చేయరాదని ఇందుకే పెద్దలన్నారు. త్వరగా మీ వదినను సంరక్షించు" అని చెప్పాడు. అన్నమాటలు ఆలించిన సౌమిత్రి ఇదివరకే విరూప, వికృత చేష్ట అయిన శూర్పణఖ చేతిలోని కరవాలంతో ముక్కూ, చెవులూ ఖండించాడు. ఆడుది కనుక అసువుల తీయలేదు.

## ఖరుడు శూర్పణఖ వికారరూపాన్ని చూచి కోపగించుట

మూర్ఖంగా సంచరించిన దానవి ముక్కుచెవులు కోయగానే మొర్రో అని అడవి మారు మ్రోగేలాగా అరుస్తూ, ఖండనస్థానాలనుంచి రక్తం కారుతుండగా, అక్కసు అధికం అవుతుండగా, ఆకసంపై కారుమబ్బు లాగా అడవినివిడి, జనస్థానానికి పరుగెత్తి, కొలువులోవున్న అన్న సన్నిధానంలో పైనుంచి పిడుగుపడ్డట్టు పోయి పడి ఘోరంగా ఏడ్వసాగింది రక్తంతో తడిసిన శరీరంతో, వికృతరూపంతో భూమిపై పడి ఏడుస్తున్న ముద్దుల సోదరిపాటు చూచి ఖరుడు కళ్లెర్రచేసి, "సోదరీ! ఎవడు నిన్నీ విధంగా విరూపను చేసి అవమానించాడు? కొండపై నిద్రిస్తున్న కోడె

త్రాచును చేతితోతట్టి లేపినవాడెవ్వడు? కాలకూటాన్ని మ్రింగ సాహించిన బలుడెవ్వడు? కంఠస్థానం కాలపాశానికి చూపిన నీచుడెవ్వడు? చెప్పు ఇప్పుడే వాని నెత్తురు త్రాగి వధిస్తాను. బలవిక్రమాలకు లోటు లేదు. కోరినపోట్లను కోరిన వేషాలు ధరించి సంచరించగల దిట్టను. ఆయువు సన్నగిల్లిన అధము డెవడు నీకిట్టి పాటు కల్పించాడు? నరసురగంధర్వ యక్ష కిన్నరాదులలో ఈ నీచకార్యానికి తలపడిన దుష్టుడెవడు? దేవపతి అయిన ఇంద్రుడు సైతం నాకు అప్రియంగా ప్రవర్తించడంటే, ఇతరుల సంగతి వేరే చెప్పటం దేనికి?

నీటిలో కలిపిన పాలను హంస గ్రహించినట్లు, నా, నారాచంతో ప్రాణాలు పీలుస్తాను. చెల్లెలా! యుద్ధరంగంలో ఎవడి ఫేనరక్తాలను నా శరజాలంగ్రోలాలో చెప్పు. ఎవడు తన శరీరాన్ని బోరగలకూ, డేగలకూ ఆహారం చేయకోరాడో, నిన్ను అతడిపెట్టి, వాడెక్కడున్నా, నాచేతచచ్చిన వాడేయని విశ్వసించు. నేను ధనుర్ధారినై కదనరంగంలో విలిస్తే, నీకీ చెడ్డ చేసిన నీచుడు దేవతలు సాయంచేసినా జీవించడు. వాణ్ణి రాక్షసులు రక్షించ లేరు. మహర్షులు కాపాడలేరు, చరాచరజగత్తులో ఇక వాడికి నిలువనీడ లేదు. నీవు సేదదీరి ఆ కాలండీరిన కష్టకర్ముని జాడ తెల్పు" అని ఆగ్రహోదగ్రుడై అరిచాడు. సభంతా ఆవేశంతో నిండిపోయింది.

## శూర్పణఖ ఖరునకు సీతారామలక్ష్మణుల సంగతి చెప్పుట

ఆదరించి అభయం ఇచ్చిన అన్నతో, అశ్రువులు ధారలు గట్టగా ఏడుస్తూ శూర్పణఖ చెప్పసాగింది. "అన్నా! ఏం చెప్పేది? వాళ్ళు మానవులో, దేవతలో, తరుణవయస్కులు, తాపసవేషధారులు, సుకుమారాకారులు, మహాబలవంతులు, మృగాజినాంబరులు, వన్య మూలఫలభక్షకులు, దాంతులు, ధర్మరతులు, దాశరధులు, రామలక్ష్మణులు, సోదరులు, రాజలక్షణం కలవారు, దేవతాసమతేజులు, వారిమధ్యలో ఒక సుందరి ఉంది. ఆమె అందానికి అవధిలేదు. ఆభరణాలకు ఆభరణం ఆమె చక్కదనం, ఆమెకోసం వాళ్ళిద్దరూ కూడబలుకుకుని, నన్ను దిక్కులేని దానివలె ఈ దశవస్థకు పాల్పరిచారు. ఆ మగ్గురి శవోష్ణ రక్తం గటగట

త్రాగేవరకూ నా కడుపుమంట చల్లారదు. నేను నిన్ను కోరిన మొదటి కోరికే ఇది. ఏ విధంగా తీరుస్తావో చూస్తాను" అని ఇంకా పూర్తి కాక ముందే ఖరుడు సింహాసనం మీదనుండి క్రిందికి దూకి, శరీరం ఆపాద మస్తకం చలిస్తుండగా, "దానవవీరులారా! మీతో సమర్థులైనపద్నాలుగుమంది రథికులు నా చెల్లెలివెంట పయనమైపోండి. వాళ్ళ చోటు తెలుసుకుని, యుద్ధంలో వాళ్ళ నెత్తురుతో నా తోబుట్టువుకు దాహం తీర్చండి. మన జాతి గౌరవం కాపాడండి. మునివేషధారులూ, శరచాపహస్తులూ, మహా బలులూ, ఇద్దరు మానవులు ఎదురొడ్డి నిల్చారు. వెంటనే సన్నద్ధులై వెళ్ళండి. నా సోదరి కోరిక చెల్లించండి" అని ఆజ్ఞాపించాడు. వాళ్ళు ప్రభువు చెప్పిన మాటలకు పరమానందభరితులై, శూర్పణఖ దారిచూపగా శస్త్రాస్త్రధరులై, వివిధ వాహనారూఢులై, ఉద్రేకం [illegible] యుద్ధానికి పయనించారు.

## రాక్షసులు రాముని మీదికి యుద్ధానికి పోవుట

వాతాహతికి మేఘంలాగా వాళ్ళు రాముడున్న ప్రదేశానికి వచ్చారు. వాళ్ళు వచ్చే సమయానికి ఆశ్రమం ముంగిలి భాగంలో ఆసీనులై ముచ్చట లాడుతున్న ముగ్గుర్నీ శూర్పణఖ రాక్షసులకు చూపింది. రాముడు, పరాభవంపొంది పారిపోయిన శూర్పణఖ ప్రతీకారంకోసం దౌష్ట్యంతో దండెత్తి వచ్చిందని క్షణంలో గ్రహించి, "తమ్ముడా! నీవు సీత పక్కను రక్షిస్తూండు, నేను వీళ్ళ సంగతి చూస్తాను" అని హెచ్చరించి రాక్షసుల వంక చూచి, "దైత్యులారా! మేం తండ్రి ఆజ్ఞ పాలించడంకోసం దండ కారణ్యానికి వచ్చాం. మేం శాకాహారులం. మునివ్రతానుపాలకులం. క్షత్రియులం. దాంతులం. ధర్మరతులం. మేం నిర్హేతుకంగా ఎవరినీ ఏమీ అనం. అటువంటి మాపైకి మీరేల వచ్చారు? ఇంతకుపూర్వం మేం తాపసులకు మీ భయం లేకుండా చేస్తామని అభయం ఇచ్చాము. మీ యంతట మీరే దీపాన్ని చేరే మిడతల్లాగా చేరవచ్చారు. ధైర్యమున్నంతవరకు ఉంటే నిలవండి. ధైర్యహీనులైతే పారిపొండి. నేను ముందుగా మీపై చేయి చేసుకోను. మీకు తగినంత వ్యవధి ఇస్తున్నా. తిరోగమనమో.

ప్రాణార్పణమో యోజించుకొనండి" అని నిశ్చలుడై, నిర్వికారుడై మేఘ గర్జనంలాగా పలికాడు. ఆ పలుకులు దానవవీరులకు ములుకుల్లాగా నాటి, శూలాయుధపాణులై, "ఓయీ! మానవా! మేం యెందుకు వచ్చామో వివరిస్తాం విను. నీవు కుదిరి కూర్చుండలేక మా ప్రభువుతో వైరం తెచ్చి పెట్టుకున్నావు. రాక్షసేంద్రుని తోబుట్టువును కర్ణనాసికాచ్ఛేదం చేసి ఆమెను వికృతరూపిణిగా చేయటం కాకుండా, మా ప్రభువుల ఆగ్రహాగ్నిలో అగ్నిపోశావు. దానికి ప్రతీకారంగా మీ ముగ్గురి రక్తం త్రాగాలని మా రాజసోదరి కోరింది. అది తీర్చటానికి వచ్చాం. నీవేమో నయగారంమాటలతో తుమ్ముల పంచింపాలని చూస్తున్నావు. మేం సమరంలోకి రానేరాం. వస్తే కథ చూడకుండా పోం. కయ్యానికి నీవు దిగకపోయినా మేం మాత్రం నిన్ను సహించటం కల్ల. ఇదిగో కాచుకో. వజ్రసన్నిభాలైన మా శూలాయుధ ఘాతానికి ప్రక్కకు ఎలా జీవిస్తావో మేం చూస్తాం" అంటూ రాముని వక్షస్థలాన్ని లక్ష్యంగా చేసి అందరూ ఒక్కసారిగా విసిరారు.

పగపట్టిన త్రాచులాగా నాలుకలు క్రోలుతూ వస్తున్న శూలసంతానాన్ని రాముడు బంగారు పుంఖాలుగల బాణాలు పద్నాల్గు కోదండంలో నిల్పి ఆకర్ణాంతం లాగి విడిచాడు. ఆ వస్తున్న శూలాలను ఆ అస్త్రాలు తాకి భిన్నాభిన్నంగా నరికినై. ఆ అస్త్రపాటవాన్ని చూచిన అసురులు దిగ్భ్రాంతులై తిరిగి ఏమీ తెచ్చుకునేలోపల, కొండలను భేదింపగల రుక్మపుంఖిత శరాలను మరి పద్నాల్గు ప్రయోగించాడు. ఆ బాణాలు నిర్దాక్షిణ్యంగా పద్నాల్గు ముఖాలుగా దూసుకొనిపోయి అతిరథులైన పదునలుగురి గుండెల్లో చొరబడి వెన్నుదాటి వెలుపలికి వచ్చి ధరపై వ్రాలినై. మొదలు నరికిన వృక్షాల్లాగా శోణితధారలు ప్రవహిస్తూ భూమిపై పడ్డారు. ఆ పాటు చూసిన ఆ దానవి కొండలు నిండేలాగా రోదనం చేస్తూ పరుగెత్తి ఖరుని పాదాలపై పడి "సోదరా! రక్షించు రక్షించు" అంటూ ఏడ్వసాగింది. "యెందుకే ఏడుస్తావు? నీకోసం రాక్షస నాయకులను పంపాను గదా? వాళ్ళు ఈపాటికి నీ శత్రువులను అంతం చేసేస్తుంటారు. వాళ్ళు నాకు ప్రాణంలాంటివాళ్ళు. ఓటమి ఎరియని యుద్ధాగ్రేసరులు. మేం సాధించిన విజయాలన్నిటికీ వారే కారకులు. ఇప్పుడేం వచ్చింది? ఇంకా ఏడుస్తావెందుకు?" అని ఖరుడు

కోపంతో సోదరిని కసురుకున్నాడు. "జరిగిందేమిటో చెప్పు. నీవు దిక్కు లేనివాళ్ళలాగా మాటిమాటికి ఏడ్వటం బాగుండలేదు. నే నున్నానుగా. భయం వీడి అక్కడ ఏం జరిగిందో వివరంగా చెప్పు. పగతీర్చుకుంటాను" అని అన్నాడు.

## శూర్పణఖ సోదరుణ్ణి రామునిపై యుద్ధానికి పురికొల్పుట

"సోదరా! చెప్పటానికేం మిగిలింది? నరాంతకులైన మనవాళ్ళు దేవాంతకులైన వాళ్ళచేతుల్లో పడి మడిశారు. ఇన్ని యుద్ధాలు చూచాం. ఎన్నో యుద్ధాలు చేశాం. ఇటువంటి విపరీతంగా కదనం చేసిన వీరుణ్ణి కాంచలేదు. రథమా? గుర్రమా? ఏమీలేదు. పాదచారి. ఒక్కడు. బ్రతకతలచు కొంటే పారిపొమ్మన్నాడు. మనవాళ్ళు విసిరిన శూలాలు మధ్యలోనే ముక్కలు చెక్కలైనై. మళ్ళీ బాణాలు వేసే అవకాశం వాళ్ళకు కల్పించలేదు పద్నాల్గు అస్త్రాలతో మన సేనానాయకుల్ని పదునల్గురికినీ ఏకకాలంలో భూశయనం చేయించాడు. నీతప్పులేదు నామీద అభిమానంకొద్దీ ప్రాణాధికులనే యుద్ధానికి పంపావు. అయితే ఏం? ఆ పురుషసింహం పొట్టనెట్టుకున్నాడు. ఇంకొక్క క్షణం అక్కడ వుంటే నాచావుకూడా జరిగేదే. భయపడి పారి వచ్చాను. ఇప్పటికీ ఆ కంపం తగ్గలేదు. అవమానోర్మికలతో, దుఃఖ నక్ర సంచయంతో నిండిన విషాద సముద్రంలో మునిగాను. ఊకడించి నన్ను ఒడ్డునకు చేర్చు. నీకోసం దారుణంగా మరణించిన రజనీచరులకోసం, నాపైకలిగిన అనురాగ నిదర్శనంకోసం, నీకు రాముణ్ణి ఎదుర్కొనే శక్తి వుంటే యుద్ధానికి సిద్ధపడు. నాపగవాణ్ణి నీవు చంపకపోతే నీముందే నేను చస్తాను. ఇప్పటి ఆతని విక్రమం చూస్తే, నీవూ, నీసైన్యం ఇతనిముందు క్షణం నిల్వలేవని తోస్తూంది. శూరమానివికాని నిజమైన శూరుడవుకావు. బలవంతుణ్ణని భావిస్తావుకాని అది భ్రాంతి మాత్రమే. నీవు దానవుడవు. వాళ్ళు మానవులు. అయినా వాళ్ళతో సమరం యమపాశాన్ని ఎదుర్కోవటం. నీవు నిజమైన పోటుమగవివైతే యుద్ధానికి సిద్ధంకా. పందవైతే పారిపో. వాళ్ళు నిన్ను ప్రాణంతో వదలరు. వాళ్ళు నాకంటికి రాక్షస వంశ నాశనానికి మానవాకారంతో పుట్టిన మృత్యువులాగా గోచరిస్తున్నారు.

## ఖరుడు సైన్యంతో రామునిమీదికి యుద్ధానికి పోవటం

అని శూర్పణఖ ఆక్రోశించింది. ఖరుడు పండ్లు కొరుకుతూ, నొసలు ముడిపెట్టి, "చాలు శత్రుస్తవం ఇంక ఆపు. ఇదివరకే నీఅవమానంతో రాజుకున్న క్రోధాగ్ని నాసైన్యాధిపతుల సంహారంతో ప్రజ్వరిల్లింది, ఇకదీన్ని ఆపటం ఎవరితరమూ కాదు. చూడు. ఖరుని శూరత్వం. దేవతలకే అజేయుడైన ఖరుడు నీచమానవులచేత అపజయం పొందుతాడా? ఏనాడు నాకు ప్రత్యర్థిగా రణరంగంలో నిల్చాడో ఆనాడే వాడు అంతకుని ఆశ్రయం పొందాడని నమ్ము. నా అమ్ములు రాముణ్ని తాకగానే వేడినెత్తురు వెడలి జిమ్ముని చిమ్ముతుంటే విలాసంగా కడుపునిండా జుర్రుకో. తమ్ముడా! దూషణా! బలభీమవేగం గలవాళ్ళు, సమరంలో వెనకడుగు వేయని సాహసికులూ, నీలజీమూత సన్నిభమైన దేహాంగల భయంకరులూ, క్రూరులూ, హింసారతులూ, సింహవిక్రములూ, నా చిత్తానువర్తులూ, ఉగ్రబలులూ అయిన పదునాల్గువేలసైన్యం సమకూర్చు. వివిధ యుద్ధ సాధనాలను సన్నద్ధపరచు. శత్రు దుర్నిరీక్ష్యమైన నా రథం తీసుకురా. సమస్త శస్త్రాస్త్రాలు అందులో సవరించు. నేను ముందుపోయి పౌలస్త్యులకు చావుకూరగా రామునకు విజయం లభించగా కీర్తి మూర్తినవుతాను." అని ఆదేశించగానే, సర్వ సైన్యాధిపతి దూషణుడు రెప్పపాటు కాలంలో అన్న ఆజ్ఞను పాలించి రథం సిద్ధం చేయించాడు.

ప్రళయార్క నిభంగా, శబలాశ్వయుక్తంగా, తప్తకాంచన సంకాశంగా, స్వర్ణమయచక్రంగా, చేపలవలె, పూలవలె, చెట్లవలె, పర్వతమువలె, పక్షుల వలె, శశివలె, రవివలె కామసంచారయోగ్యమై కనిపించేదాన్ని, బంగారు కేతనంతో, ఖడ్గ, శర, చాప, శూల, పరిఘ, పట్టిస, తూణీరాలచే నిండివున్న రథాన్ని రాక్షసరాజు అధిరోహించాడు. అతనివెంట దూషణుడు మహా ధ్వజినీ సేవితుడై ఆజ్ఞగొని అనుసరించాడు. అతమూ సమూహ పద ఘట్టనానికి, రథచక్రాల నలుగుడుకు, గుర్రాల డెక్కల ఘాతాలకు రేగిన ధూళి అకాలతిమిరం కల్పించి అడవి సత్త్వాలకు భీతి కూర్చింది. అసలే రాక్షసులు. అందులో మానవులతో యుద్ధం. ఆపై ప్రభువు పర్యవేక్షణలో ప్రయాణం. వారిసంతోషం పట్టనా పగ్గాలూ, ఊపితే పీకలు చాలకుండా

వుంది. శూల, ముద్గర, కృపాణ, పరశ్వధ, ఖడ్గ, వజ్రాసి, పట్టిస, పరిఘ, కార్ముక, కలంబ, పాశపాణులై, ఖర, నక్ర, వృక, వ్యాఘ్ర, సింహ, వరాహాది ఘోర వాహనా రూఢులై నడుస్తుండే, సముద్రం పొంగి వస్తున్నట్లు గోచరించింది. చరాచర పరివృతంగా ధరణి కంపించింది. ఉత్సాహంతో ముందుపోతున్న సైన్యం వెంటనుండేట్లుగా సారథి ఖరుని రథాన్ని వేగంగా నడిపించసాగాడు. ఆ రథ ఘట్టానికి దిక్కులు, విదిక్కులు చెవుడు బారినై. ఆ వేగంకూడా అగ్రహోన్ముక్తుడైన ఖరునకు చాలలేదు. ఖరకంఠ నిస్వానంతో, మహామారుతాహతికి రెండు జలధర శకలాలు తాకి గర్జించినట్లు, "వేగంగా రథం తోలు" మంటూ సారథిని ఖరుడు పొడుచసాగాడు.

## ఖరునకు దుశ్శకునాలు కనపడుట

ఈవిధంగా సర్వ సన్నద్ధమై జగదుపద్రవ కారణంగా భీషణ పరిరక్షితమై సైన్యం నడుస్తుంటే రథారూఢుడై వస్తున్న రాక్షసరాజు ఖరుడు దుశ్శకునాలను చూచాడు. గాడిదె రంగుతో మేఘం రక్తతుమ్రమణంగా వర్షించింది. పారిపోతున్న సైన్య వాహన సముదాయం సమతలంలోనే జారిపడింది. అప్పటికప్పుడు శ్యామలోహిత వర్ణంతో అలాతచక్రంలాగా సూర్యమండలాన్ని పరివేషం చుట్టింది. ఖరుని బంగారపు పెక్కెంపై గ్రద్ద వ్రాలింది. స్వరహీనంగా తీతువులు కూసినై. పక్షులు పూళ వేసినై. అకారణంగా సూర్యుణ్ణి చూస్తూ కుక్కలు మొరిగినై. పర్వతాలు బ్రద్దలై నెత్తురు చెమ్మకార్చినై. మబ్బు భూమ్యంతరిక్షాల భేదం తెలియకుండా దట్టంగా క్రమ్మింది. ఆసమయంలో సంధ్య రక్తవర్ణం దాల్చింది. ఖరునకు ఎదురుగా నిల్చి కంకవృకాదులు తీక్షంగా అరిచినై. నిప్పులు క్రక్కుతూ పరడులు భయంకరరావం చేసినై. పర్వం కాకుండానే భానుణ్ణి స్వర్భానుడు ఆక్రమించాడు. పరిఘాకారంగా కబంధం సూర్యమండలంచుట్టూ కనిపించింది. పెనుగాలి అభిముఖంగా వీచింది. దినకరుడు తేజుమాశాడు. రాత్రి రాకుండగనే గ్రహతారకలు ఆకాశంలో ప్రకాశించ సాగినై. గొంగడి షురుగులతోపాటి కాంతిహీనమైన కమలాలతో కొలంకులు వెలవెల

పోతున్నై. వృక్షాలు ఫలపుష్ప హీనమై పాదారిపోయినై. వాయురహితంగా ధూళిరేగింది. చిలుకలు అపస్వరాలు ఆలపించినై. జ్యోతిర్మండలం, వాయుమండలం పిడుగులూ, ఉల్కలూ పడచిమ్మినై. సపర్వతకాననంగా ధరణి వణికింది. ఖరదానవునకు, వామనేత్రం. వామహస్తం స్పందించింది. సింహనాదం చేయబోతే కంఠం రుద్ధమైంది. కన్నుల్లో నీరుకమ్మింది. తలనొప్పి పెట్టింది. ఇన్నివిధాల ప్రకృతి తన అనిష్టం చూపుతున్నా ఆ దుష్టుడు ప్రయాణం ఆపలేదు. పైపెచ్చు, అన్నిదిక్కుల మహోత్పాత లక్షణాలు కనిపిస్తున్నా రక్షఃపతి తనసైన్యాన్ని చూచి నవ్వుతూ "స్పష్టంగా కనుపిస్తున్న ఈ అపశకునాలను నేను లక్ష్యపెట్టను. వీటిని చూచి పిరికివాడు వికలుడవుతాడు. దురంత పరాక్రమవంతుడెవడూ సరకుసేయడు. నా శరధారలతో నక్షత్రాలను రాలుస్తాను. యముణ్ణి యమసదనంలోనే చంపుతాను. నాభగినిని పరాభవించి, నాపరివారాన్ని హరించిన ఆనీచుణ్ణి వధించక మరల జనస్థానానికి మరలుతానా? కోరిక తీరేలాగా నాసోదరి వానిరక్తం గ్రోలుగాక. మున్నెన్నడు యుద్ధంలో అపజయం నేను పొందలేదు. అందుకు మీరే సాక్షులు. నేనెన్నడూ అనృతం ఆడను. ఇంద్రుణ్ణి పాదాక్రాంతుణ్ణిగా చేసిన నాకీమానవుడేపాటి?" అని కంచుగీచినట్లు ప్రబోధించేయగా రక్కసిమూక సంతోషసాగరంలో తేలాడింది. వారి ఆనందం "కాలపాశబంధభూతం" అని వారు గుర్తించలేదు. ఉప్పొంగిన ఉత్సాహంతో, ప్రగల్భాలతో, స్వాతిశయంతో, అట్టహాసాలతో, పెండ్లికి తరలి వెళ్ళినట్లు తరలి వెళ్ళారు.

ఉప్పెనకుపొంగుతున్న సముద్రంలాగా పంచవటికి ప్రయాణిస్తున్న రాక్షస సైన్యం ఒకవంకా, పదాతిగా, మర్త్యుడుగా, ఒక్కటిగా నిల్చిన రాముడు ఒకవంకా వుండి దేవతలకు భీతి కల్పిస్తున్నారు. ఆ అసమ యుద్ధ దర్శనాకాంక్షులై దేవసిద్ధ ఋషిరాజగంధర్వయక్షులు గగనమధ్యంలో నిల్చి, రాక్షస కులనాశకుడై అవతరించిన శ్రీరామచంద్రుణ్ణి చూచి, "గోబ్రాహ్మణలోక సంగత జనేభ్యః స్వస్తి! జయతు జయతు రామః! సంయుగే సర్వదైత్యాన్ జయ గుణహితవక్రీనాశకాన్" అని ఉచ్చైర్నాదంతో ఉద్ఘోషించారు. ఖరుడు సారథిని అదలించి, సైన్యంకంటె అతిక్ర

మించి, ముందు నడుస్తుంటే, మంత్రులైన శ్యేనగామీ" "పృథుగ్రీవ" "కాలకార్ముక" "యజ్ఞశత్రు" "సర్పాస్య" "దుర్జయ" "మేఘమాలి" "పరుష" "మహామాలి" "రుధిరాశనులు" "విహంగమ" "కరవీరాక్షులు" పన్నెండుమంది సాయుధులై వెంటపోతున్నారు. వారివెనక స్థూలాక్షుడు, ప్రమాథి, మహాకపాలుడు, త్రిశిరుడు, అనే నలుగురు మహారథులు దూషణుని అంగరక్షకులై అనుసరిస్తున్నారు. ఖరకరనిశాకరుల (సూర్యచంద్రుల) పైకి పోయే గ్రహాల్లాగా రాక్షసనాయకులు ఖరకరకులమణి (సూర్యవంశ శ్రేష్ఠుని) పై కయ్యానికి పోతున్నారు. ఏం కానున్నదో అని నభశ్చరులు తిలకిస్తున్నారు.

## రాముడు సౌమిత్రికి యుద్ధశకునాలు చూపుట

ఆ తరుణంలో ఆశ్రమప్రాంతంలో విహరిస్తున్న రాముడు తమ్మునితో "తమ్ముడా! చూచావా? ఉత్పాతాలు కనుపిస్తున్నై. భూతకోటి భయావహంగా పరిణమించిన ఈ దుశ్శకునాలు, నిశాచరనాశనసూచకంగా గోచరిస్తున్నై. ఏదో ప్రళయం రానుంది. నిర్నిమిత్తంగా ప్రకృతి ఇంత అలజడి పొందదు. సమరసమయంలో పోరాడేవాని వదనం విన్నదనంతో వుంటే చావు సమీపించిందంటారు. నీ ముఖం సుప్రభతో ప్రసన్నంగా వుంది. నా మనస్సుకూడ ప్రశాంతంగా వుంది. ఆకాశంలో మేఘాలు గర్దభారుణాలై, ఖరనిస్వనాలై, రక్తధారాసిక్తాలై కనుపిస్తున్నై. నా చాపం సధూమంగా జ్వలిస్తూంది. శరాలు పొదిలో కదలుతున్నై. అడవిపక్షుల సవ్వడి అతిభయానకంగా వుంది. ఏదో ప్రాణగొడ్డమైన భయంకర పరిణామం జరుగునట్లుంది. దక్షిణనేత్రహస్తాలు అదురుతున్నై. మనకు జయం, శత్రువుల పరాజయం తప్పదు. ఆ దానవి మనలను ఇంతతో విడువదు. విన్నావా? ఆ భయంకర భేరీఝాంకృతులు, అసురుల అట్టహాసాలు. అది చెప్పినట్లు ఖరదూషణులు సైన్యంతో కదనానికి కదలివచ్చినట్లే తోస్తున్నది. మనం ముందే జాగ్రత్తపడటం మంచిది.

## రాముడు భార్యాసోదరుణ్ణి గుహకు పంపి సమరానికి సన్నద్ధుడగుట

నీవు వైదేహిని ఆ కొండబిలానికి చేర్చి గహ్వర ముఖాన్ని కాపాడు. బదులుపల్కవద్దు. నామీద ఆన పెడుతున్నాను. నీవు బల వంతుడవు. కదనప్రియుడవు. శూరుడవు. నీవు ఒక్కడవే ఈ సోకు మూకను స్రుక్కించగలవు. నే నెరుగక నిన్ను సీతారక్షణకు నియోగించ లేదు. ఆమె రక్షణ అవశ్య కర్తవ్యం. ఆ పనిలో నీకున్నంత అప్ర మత్తత నాకులేదు. నా దృష్టి బహు ముఖీనం - నీ చూపు ఏకలక్ష్యం. నీకడ దానవుల మాయోపాయాలు పనిచేయవు. ఆశ్రిత మహర్షులకు అభయం ఇచ్చింది నేను. ఆ మాట నిలబెట్టుకోటం నా విధి. నీవు అన్యథా భావించవద్దు. త్వరపడు" అని చెప్పాడు. రామానుజుడు మారుమాట చెప్పక ధనుర్ధరుడై, ఖడ్గకవచతూణధారియై, వదినను క్షేమంగా గిరికందరంలో సురక్షితప్రాంతం చేర్చి ముఖద్వారం ముందు పహరా ఇస్తున్నాడు. శ్రీరాముడు తమ్ముని సౌజన్యానికి మిక్కిలి సంతోషించి, వారు రక్షితస్థానానికి చేరగానే, అనలసన్నిభమైన కవచావృతవక్షుడై, చీకటిలో పొగక్రమ్మని కృశానుడులాగా వెలుగుతూ, శరచాపహస్తుడై, దిగ్వితాన భేదనం గలిగేలాగా సజ్యంచేసి గుణం మీటాడు. ఆగుణధ్వానం అసురనాయకుల ఆకంపింపచేసింది. ఖరుడు కోపంతో సైన్యాన్ని అదలించాడు.

అప్పుడు ముప్పైమూడుకోట్ల దేవతలు ఆశ్చర్యంతో ఆకాశపథంలో గుంపులుగుంపులుగా కూడారు. దేవదానవ యుద్ధంనాడు కూడ వారింత భయభ్రాంతులు కాలేదు. ఖరదూషణుల యుద్ధం కళ్ళారా పూర్వం చూచారు. ఇంద్రుడు వజ్రాయుధం వదలి ఖరుని కాళ్ళపై పడటంకన్నారు. అమరులు కనుక బ్రతికి బయటపడ్డారు. పద్నాల్గువేల మ్రుక్కడిరక్కసి మూక, ఒకడే ఒకడు రాముడు. వాళ్ళు వాహనారూఢులు. ఈతడు పదస్థుడు. వరగర్వితులు. మాయోపాయచతురులు. రాత్రించరులు. ఏ విధంగా యుద్ధం ముగుస్తుందో ఎవ్వరూ ఊహించలేకున్నారు. ఆ సమ

యంలో సత్యలోక సంబంధులైన మహర్షులు వచ్చి "స్వస్తి గోబ్రాహ్మణే భ్యోఽస్తు. యేత్రిభువనానాం అభిసంగరా ఛిదయామి నీచరాన్ పౌలస్త్య నిచయాన్ రణే రామచంద్ర మహీశ్వరోజయతు జయతు. చక్రపాణిర్వ్య ధారణే సర్వదైత్య పుంగవాన్" అని ఆశీర్వదించారు.

మహర్షుల ఆశీర్వాదానంతరం శ్రీరామునిలో అమేయపరాక్రమం, అఖండ దివ్యతేజం పరోక్షంగా ప్రాపించింది. అప్పటి దాశరథి ఆకృతి లయకాలంలో పినాకపాణి ఆకృతికి ప్రతిగా నిల్చి జదద్భీకరంగా వుంది.

## ఖరుడు సైన్య సమేతంగా రాముని చూచుట

కేతనకింకిణీధ్వానంతో, రథనేమికఠోరధ్వానంతో, హయఖురఘట్టన టకటకరావంతో, గజఘీంకారంతో, పదాతుల అట్టహాసంతో, నాయకుల హుంకారంతో, చాపటంకారంతో భేరీభాంకారంతో, రథికవరులధిక్కారంతో పదధిక్కారంతో కదనానికి కదలివచ్చిన శత్రుసైన్యం నిశ్శబ్దప్రదేశం చేరి రాముని తేరిపార చూచింది. ఒంటరిగా నిల్చిన రఘువీరుని చూచి కొందరు పెదవి విరిచారు. కొందరు చప్పరించారు. కొందరు ఇకిలించారు. కొందరు సకిలించారు. కొందరు స్వీయసేనాసముద్రానికి చెలియలికట్టగా భావించారు. కొందరు మానవుడైనా దైత్యుల భీమబలానికి తగ్గడని శ్లాఘించారు. దూరంగా వ్యూహ రచనలో నిల్చిన రాక్షసవాహినిని రఘురాముడుకూడా వీక్షించాడు. శత్రువులకు కవ్వింపు చర్యగా, హేలగా, లీలగా, ధనువు వంచి నారి సంధించాడు. ఒక్కసారి అల్లెత్రాటిని ఆకర్ణాంతంలాగి విడిచాడు. ఆ గుణధ్వనికి పర్వతాలు ప్రతిధ్వనించినై. సముద్రాలు ఘూర్ణిల్లినై. దిక్కులు బీటలువారినై. దిగ్గజాలు మొగ్గతిల్లినై. భూమి అదిరింది. మృగకులం చెదరింది. విపక్షుల గుండె చెదిరింది. ఖరుని రథకేతనం కదిలింది. దూషణుని డెందంలో భయం మెదలింది. అమాత్యుల ధైర్యం ప్రిదిలింది. ఆవేళ పుష్కలావర్త మేఘంలాగా, వార్ధి బహిర్గతబడబాగ్ని లాగా, దక్షాధ్వరధ్వంసహేతు వీరభద్రుడులాగా. రోషభీషణుడైన రఘువంశ భూషణుని మూర్తినుండి నిర్గతమవుతున్న తేజస్సు చూచి ఖాతజాలం

మహాఘోషతో స్తంభీభూతమైంది. దేవతలే తేరి చూడలేకపోయారు. దండకావాసులైన తాపసులంతర్ముఖులై ఆనందంతో ఆశీస్సులు కురిశారు.

## ఖరుడు సైన్యంతో శ్రీరాముని తాకుట

పేరువిన్నంతమాత్రాన ప్రాణాలు కంఠగతమయ్యే భయంకర సైన్యంతో వచ్చిన తన్ను నిర్లక్ష్యంచేసి మేరువుగా నిల్చిన రాముణ్ణి చూచి కడుపు భగ్గున మండగా ఖరుడు సారథితో "వైరికి అభిముఖంగా తేరు తోలు"మన్నాడు. ఖరుని రథం కదలగానే సర్వరాక్షససైన్యం ఒక్కసారి కదిలింది. ఉదయభానుణ్ణి మేఘంవలె ఆక్రమించిన దనుజవాహినిపై, తనకు అసహజమైన ఆగ్రహం కల్పించుకుని విలాసంగా తీవ్ర శరాలు విడిచాడు రాముడు. దానికి ప్రతిగా దైత్యులు తమ తమ ఆయుధాలు విసిరారు. చినికిచినికి పెనువానగా మారినట్లు నిర్లక్ష్యంగా మొదలైన సమరం లక్ష్యాన్ని అందుకుంది. కాండాలతో, మదవేదండతండాలతో, రథషండాలతో అసురులు చండాంశువంశమండనుడైన శ్రీరామునిపై బడి, ధారాధరం ధరణీధరంపై జలధారలు వర్షించినట్లు బాణాలు వర్షించారు.

క్రోధావిష్టులైన రాత్రించరులు పధ్నాల్గువేలమంది ఎడతెగని మారణాస్త్రాలను ప్రయోగిస్తుంటే రాముడు పొంగివచ్చే నదులను సముద్రుడు తనలో ఇముడ్చుకున్నట్లు క్షణంలో వాటినన్నిటినీ శక్తిహీనం చేశాడు. వజ్రాహతికి చెక్కుచెదరని శైలంలాగా తన్ను బాణాలు తాకుతున్నా చలించలేదు. శరీరం నుంచి రక్తం స్రవిస్తుంటే దినాంతవేళ మేఘం క్రమ్మిన మిహిరుడులాగా ప్రకాశిస్తున్నాడు. ఒక్క మానవునిపై మ్రుక్కడి రక్కసుల మూకపడి అలయిస్తుంటే గగనచరులై కాంచుతున్న సురలు కన్నీరు కార్చారు. అసురులు సంతోషంతో హద్దు మిగిలి తీవ్రమైన నారాచపరంపరతో దినకరవంశభూషణుని మిక్కిలిగా నొప్పించారు. అంత వరకు హేలగా భావించిన రఘురాముడు అంతరాకృతిలో శరసంధాన మోక్షణాలు శత్రువులకు తెలియరాకుండా ప్రయోగించి క్షణకాలం సైనికుల సాహసం నిలువరించాడు. శత్రువులు తిరిగి పుంజుకుని దండనాథుని సహాయంతో ప్రహరణ సాధనాలతో బీభత్సంగా తలపడి దాశరథిని నేలకు

కోలప తెచ్చి సింహనాదాలు చేశారు. ఆ కలకలానికి అమరులూ, ఋషులూ ఎంతో చింతపడ్డారు. దూరస్థుడైన లక్ష్మణుడు తెలియకుండానే ధనువున బాణం చేర్చాడు. మైథిలి మిక్కిలి మనోవేదన పొందింది.

## శ్రీరాముడు ఖరుని సైన్యాన్ని నురుమాడుట

ఇంతలో రాముడు మండలీకృతచాపుడై, వందలు, వేలు, యమదండాన్ని పరిహసించే విషలిప్తబాణాలు వైరిసమూహంపై ప్రయోగించాడు. అవి యముని కాలపాశంలాగా గుండెల్లో దూరి రక్తాన్ని పారిస్తూ, త్రాగుతూ అగ్నిజ్వాలలు పూర్వముఖంగా పోయినట్లు ఆకాశంవైపు పోయినై. అసుర సైన్యంలో హాహాకారాలు మిన్నుముట్టినై. బహుముఖాలైన బాణాలు ఏసి, గుండెల్లో దూసి, కోసి, వ్రచ్చి, గ్రుచ్చి, చేతులు, కాళ్ళు, తలలు, తొడలు, నొగలు, చెక్కులు పప్పులుపప్పులుగా కూలిపడగా, దాశరథి జగదభిరాముడూ, రాక్షసవిరాముడుగా ప్రకాశించాడు. కనకభూషణాలతో కన్నులకింపుగా అలంకృతాలైన అశ్వాలు సాదులతో కూడి చచ్చిపడినై. మావటీండ్రతో మత్తమాతంగాలు మడిసినై. రథికసారథులతో రథాలు నేలకూలినై. పటుతర గర్వమున్న భటవ్యూహాలు మూకుమ్మడిగా తరుగబడి కూలిపోయినై. మండలీకృత చండకోదండదండమండితకరుడై, చండాంశుప్రభతో వెలిగే విశిఖపరంపరతో ముఖ నిర్గతతేజః పుంజాయగా వెదపరించి సమరక్షోణిని శ్మశాన క్షోణిగా మార్పు పొందిస్తుంటే, మహర్షులు "రామచంద్ర! విజయీభవ! రఘుకులసోమ! శుభంభూయాత్" అంటూ ఆశీస్సులు వర్షిస్తూ ఆనందంతో తన్మయులైనారు. నిర్జరులు అనిమిషత్వాన్ని అర్థవంతం చేశారు. ఖాండవవనాన్ని శోచిష్కేశుడు (అగ్ని) నిర్దాక్షిణ్యంగా దహించినట్లు, చండప్రతాపంతో కళ్ళు కానక వచ్చిన ఖరేంద్రుని సైన్యం రాముని సవనానికి ఆహుతి అయింది. కొందరికి బాహువుల్లో శక్తి తగ్గిపోగా, కొందరికి ముఖంలోని నేత్రాలు బయటకు వచ్చినై. ఎక్కడివాళ్ళక్కడ చెల్లాచెదురై పారిపోతుంటే, సేనాపతులు చేయిపట్టి, కో అని అరచి, బలగాన్ని మళ్ళించి, బాహువు లప్పళించి,

మీసాలుదువ్వి, అహంకారంతో క్రొవ్వి. శూలాలు, బల్లేలు, ఈటెలు, గండ్రగొడ్డళ్ళు, కత్తులు, కుంతలాలు, సర్పాస్త్రాలు, గరుడాస్త్రాలు, దారుణాస్త్రాలు ధరించి, సారథుల నదల్చి, త్రపవిదల్చి, ధనుష్టంకొల్పి. ప్రతిష్ఠ నెలకొల్పి, విజృంభించి విరుచుకుని రామునిపై పడ్డారు. అవ్యాహతంగా అస్త్రాలు, శస్త్రాలు ప్రయోగించి ఆయాసం కల్పించారు. ఊపిరి పీల్చుకోకుండా ఉక్కిరిబిక్కిరి చేశారు. అలసని అసురుల యుద్ధకౌశలానికి రాముడు ఆశ్చర్యపడ్డాడు. ఇక వీళ్ళకు అవకాశం యివ్వటం మంచిది కాదనుకున్నాడు. గాధేయదత్త దివ్యాస్త్రాలను ధ్యానించాడు. అభిమంత్రించి అస్త్రప్రయోగం చేశాడు. ఆ అస్త్రం అనంతరూపాలుగా విస్తరించి, వారి శరశరాసనాదులనే కాక శిరస్సులుగూడా నరికి కొండపైనుండి గుండ్లు దొర్లించినట్లు మెడలపైనుండి పుడమికి దొర్లించింది. ఆపాటు చూచి దానవసైన్యం చేటుకాలం చేరువైందని తలపోస్తూ ఖరేంద్రుని శరణు కోరుతూ కాలికొలది పరువెత్తసాగింది. అమరులతో యుద్ధంచేసి అపజయం పొందని సేన ఒక మానవుని ఎక్కుడుపోటులో చచ్చినవారు చావగా బ్రతికినవారు బలుసాకైనా తిని బ్రతకవచ్చునని భావించి పారిపోవటం దూషణునికి తలకొట్టినట్లయింది.

తానేమో అన్నముందు ప్రగల్భాలు పలికాడు. తన పర్యవేక్షణలో తలపడి సైన్యం ఛిన్నాభిన్నమై దిక్కులవెంట పరుగెత్తుతుంటే తానేమి చేసినట్లు? దేవతలెరుగని ఈ అస్త్రవిద్య ఈ మానవమాత్రున కెలా తెలిసింది? శరీరం రక్తసిక్తమైనా పూచిన అశోకంలాగా చెక్కుచెదరక ప్రతిపక్ష భయంకరంగానిల్చుటకు ఏశక్తి తోడ్పడుతూంది? ఇంత పరాభిని ప్రయోగించిన అస్త్రశస్త్రాలు సముద్రంలో కురిసిన వర్షం సముద్రంలో నేలమయమైనట్లు అతని దాడుల్లో అంతరించిపోయినై. ఈ స్థితి ఇక సహించలేను. "యశోవా మృత్యుర్వా" అని తీవ్రంగా భావించి హతశేష సైన్యాన్ని అదలించి. తన రథాన్ని తలగడిచి నడిపిస్తూ, మహోద్రేకంతో రాముణ్ణి మార్కొన్నాడు. రోషభీషణంగా దూషణుడు రణంలో ముందుకు రాగానే చెదివిడిపడిన సేన మళ్ళీ సన్నద్ధమై రణభూమిలోకి వచ్చింది.

## రామునితో దూషణుడు భీషణయుద్ధం చేయుట

చావుకు తెగించి సంగ్రామంలోకి దిగిన రాక్షససేన, పరిఘ, పట్టిస శూల, భిండివాల, ముసల, ముద్గర శిలామల ఒక్కసారి ప్రయోగించింది. అగ్నిపై ఆజ్యంవలె దూషణుడు ఘోర దారుణ మారణాస్త్రాలు పుంఖాను పుంఖంగా కురిశాడు. రాముని కోదండం గండుమిగిలి ఖండనంలో అజేయమైన కల్మాషుల కాయాలను ఖండ ఖండాలుగా తరిగి కుప్పలుపోసింది. అయినా అసురులు వెనుకంజ వేయలేదు. యావచ్ఛక్తి కూడగట్టుకుని యాతుధానులు సర్వాస్త్ర ప్రయోగంచేసి చావుకు తెగించి సమరం సలిపారు. అసురుల [illegible]తో [illegible] అంధకారబంధురంగా కనుపించింది. దేవర్షులు రోమ హర్షణులై దిగ్భ్రాంతితో తిలకించసాగారు. శ్రీరాముడు సింహనాదంచేసి, గాంధర్వనారాచాన్ని ధ్యానించి, సర్వరాక్షస సైన్యసంహారంగా అభిమంత్రించి కోదండముక్తం చేశాడు. ఆ దివ్యాస్త్రం నిజతేజం నిరంధ్రంగా దిశలు నింపిస్తూ కోటాను కోటిబాణాలను సృష్టిస్తూ రోదోంతరాళాన్ని చీకటిమయం చేస్తూ, సృష్టికి అవసానకాలం చేరువైందని అనిపిస్తూ శత్రుసైన్యంపై పడ్డది. క్షణకాలం సూర్యగమనం స్తంభించింది. జగద్వలయం నిర్వాకమైంది. దిక్కులు తెలివి తప్పినై.

విరిగినకాళ్ళు, తెగినచేతులు, దొరలుతున్న శిరాలు, పడిపోయిన పిడేలు, పగిలినదేహాలు, మడమడిగిన పదాతులు, మరణించిన మాతంగ తురంగాలుగా యుద్ధభూమి కనుమూసి తెరచేలోపల వల్లకాడైపోయింది. ఆదానప్రదానాలు కనబడకుండా శరసంధానం చేస్తూండే కరకంఠచరణ నిక్కంతనం తప్ప రాక్షసులకు రాముడు కనుపించటంలేదు. అస్త్రాలు తగలటం, వెంటనే నొగలటం, వెనువెంటనే చావటం, చచ్చినేలపడటం యుగపత్క్రియగా(ఒకేసారిగా) జరుగుట వేల్పులుచూపి వెగడుపడ్డారు. తలపాగలతో ధరణిపొర్లాడుతున్న శిరాలు, కంకణ భుజకీర్తులతో తెగి బాహువులు కట్టలు కట్టలుగా ప్రోగుపడుతూ. నరికినచెట్ల వరుసగా తొడలు నరుకబడి, వివిధ రత్న కాంచనభూషణాలతో వరణాలు తెగి మూలముట్టుగా మొత్తందేహం నిలువలేక దొర్లపడి యుండగా, గుర్రాలపై ఏనుగులు, వాటిపై రథాలు,

వాటిపై సారథులు, వారిపై రథికులు పడి, భూత ప్రేత పిశాచాలకు ఆటపట్టై, కంకగృధ్ర సృగాలాలకు ఆలవాలమై, అరణ్యంలాగా, అంబుధిలాగా, పర్వతంలాగా, ప్రవాహంలాగా ఆ మహాసంగ్రామం నిశ్శేష భూత జాత భీతి జాతకమై దృగ్భీషణంగా మారిపోయింది.

## శ్రీరామునితో దూషణుడు పోరి చచ్చుట

విరిగిపోయిన తేరులూ, కూలినేలపాలైన గూడలూ, వ్రీలిపోయిన జెండాలూ, చెక్కలూ, చెరిచిన నోపలూ, పారిపోతున్న పీడలూ, త్రెళ్ళిన కరులూ, తెగిన హరులూ, నరికిన చేతులూ, దరిగిన మూతులూ, తారాడుతున్న భీతులూ కలిగిన నిజసైన్యాన్ని దూషణుడు దుఃఖం పొంగిపొర్లగా చూచాడు. అజేయమైన తన బలాన్ని నమ్మి అసువులు బాసిన అసురుల పాటునకు 'అపురు'మన్నాడు. చావగా మిగిలిన సైన్యాన్ని సన్నద్ధం చేశాడు. అయిదువేలమంది సాహసికులు తనవెంట రాగా తలపడి తన అస్త్రపాండిత్యం చూపాడు. రాముడు దూషణుని పరాక్రమం సహించక హతశేష సైన్యంతో అతణ్ణి నొప్పించాడు. అసురుడు రాముని బాణాలను లక్ష్యపెట్టక పెక్కు వాడిములుకులతో మిక్కుటంగా స్రుక్కించాడు. నొచ్చిన దాశరథి హెచ్చిన కోపంతో దూషణుని ధనువు నరికి, నాల్గు బాణాలతో గుర్రాలను చంపి, రెండు బాణాలతో సూతుణ్ణి తెగటార్చి, మూడు శిలీముఖాలతో వక్షఃస్థలాన్ని చీల్చాడు. ఆ బాధను సహిస్తూనే, బంగారపు తొడుగు కలదీ, పర్వతశృంగతుల్యమైందీ, దేవతల బలిగొన్నదీ, శంకువులతో తాపితమైందీ, శత్రువుల రక్తంతో పేరుకున్నదీ, వైరుల ప్రాణానిలానికి భుజంగమైందీ, వజ్రాయుధాన్ని సరకుకొనందీ, శత్రు పట్టణ ప్రాంచిత గోపురోద్దళన బంధురమైందీ పరిఘ ధరించి పుక్కు మిగిలి రామునిపై పడ్డాడు. ఈ లోపల రాముడు రెండు అర్ధచంద్రశరాలను ప్రయోగించి రెండు చేతులూ నరికాడు. ఇంద్రుని ధ్వజం కూలినట్లు పరిఘతో కూడి దూషణుని హస్తద్వయం నేలవ్రాలింది.

చేతులు తెగి రాక్షసుడు క్షితిపై దంతాలు విరిగిపడిన దంతివలె పడ్డాడు. పడిన రక్కసుని ప్రాణం పంచభూతాల్లో లీనమైపోయింది.

దుర్మార్గులలో ముఖ్యుడైన దూషణుడు చావగానే భూతసహితంగా భూదేవి ముద మందింది. అమరులు అభినందించారు. మునులు మోదించారు. నాయకునిపాటు చూచిన నక్తంచరులు, రాముని కవకాశం రాకుండా చుట్టుముట్టారు. స్థూలాక్షుడు పట్టిసమూ, కపాలుడు శూలమూ, ప్రమాథి పరశువూ, ధరించి, నేలమట్టమైన కీర్తి నిలబెట్టే కాంక్షతో పోరు ఘోరంగా సాగించారు. అవసరంకోసం ఆశ్రయించిన ఆగ్రహం అంతకంతకు పెరిగి రామచంద్రుని ఆకారంగా మారి మూడు మార్గణాలతో మహాకపాలుని శిరమూ, పదిబాణాలతో ప్రమాథిమస్తకమూ, శరసప్తకంతో స్థూలాక్షుని శీర్షం నరికి అయిదువేల అసురసైన్యంలో ఒక్కడు లెక్కకు దక్కకుండా పంచ సహస్ర బాణాలతో ప్రాణవాయువులను మహావాయువులో చేర్చింది.

## ఖరుని సేనాపతులు కాలకార్ముకాదులు రామునిచే చచ్చుట

లోకకంటకుడైన దూషణుడు సైన్య సమేతంగా సమరంలో చావటం ఖరునకు గొంతులో పచ్చివెలగ గుజ్జుపడినట్టైంది. సకల దైత్యకోటిలో సాటిలేని పరాక్రమవంతుడని కీర్తి గడించి యిచ్చిన జనస్థానం తనకీనాడు వధ్యస్థానంగా గోచరించింది. తనకు ప్రేమాస్పద అయిన సోదరి, ప్రాణాలు బలిగొనే మృత్యువువలె భాసించింది. హద్దుదాటి కొలుచుకున్న అహంకారానికి పరీక్షాసమయం ప్రత్యక్షమైంది. మిత్తినెత్తిన కూర్చున్న వానికి మేలుమాటలు వినపడవు. మంచివారు కనబడరు. పథ్యపానాదులు ప్రాణంమీదికి వచ్చినట్లు భాసం కలుగుతుంది. అందుకే ఖరుడు ఆగ్రహించాడు. పన్నెండుమంది ప్రళయమూర్తులైన తన సేనాపతులవెంట నిడుకుని తానుగా దాశరథితో తలపడ్డాడు. కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, దుర్జయుడు, యజ్ఞశత్రుడు, విహంగముడు, రుధిరాశనుడు, సర్పాస్యుడు, పృథుగ్రీవుడు, శ్యేనగామి, కరవీరాక్షుడు, పరుషుడు. వారివారి సైన్యంతో దిక్కులు చీకట్లు గ్రమ్మగా రామునిపై బహుముఖాలైన శితశరవర్షం కురిపించారు. వారందరు ఆనందోత్సాహంతో అనిలోకి దిగినంతకాలంకూడా అసువులు వదిలేందుకు పట్టలేదు.

71165

కూలుతున్న చాపాలతో, కుప్పలుపడ్డ భూషణాలతో, వ్రాలిన కేతనాలతో, పరియలువారిన స్యందనాలతో, కారుతున్న రక్తంతో, పారుతున్న ప్రవాహంతో, "కాలుని వంటయింటికి చాలును పదార్థం" అన్నట్లు పధ్నాల్గువేల అసురబలం, రక్తసిక్తం, కేశముక్తం, విగతజీవంఅయి కుశలుపరచిన వేదికలాగా ధరణి కూరిపోయింది. ఎన్నో వేల సంవత్సరాలు తాపసలోక భయంకరులుగా, జనస్థానం సౌమ్యులపాలిటి అగ్నిహోత్రంలాగా, దండకాటవిని పాలించిన దానవకులంలో ఆనాడు మిగిలింది ఇద్దరే ఇద్దరు. ఖరుడూ, త్రిశిరుడూ. శత్రుసంహారకుడైన రాముడు ఒకడుగా ప్రవేశించి యుద్ధంలో ఒకడుగానే మిగిలాడు. ఆనాటి రాముని యుద్ధం అద్వితీయం.

## రామునితో త్రిశిరుడు పోరి చచ్చుట

వాతాహతికి కొమ్మలు విరిగి మోడైన చెట్టులాగా ఖరేంద్రుడు సైన్య నాశనానంతరం సొదకట్టాడు. రామునిపైకి ఎకాఎకి రథం తోలుమన్నాడు. ఆ మాటకు త్రిశిరుడు అడ్డుచెప్పి "నేనుండగా నీవు రణానికి దిగటం నేను సహించను. నాకు రాముడో, వానికి నేనో, మారకులం కాక తప్పదు. నాచే రాముడు చస్తే, సంతోషంతో, జయలక్ష్మీ సమేతుడనై జనస్థానానికి పోతాం. అతనిచే నేను చస్తే అప్పుడు నీవే ఆకార్యం పూర్తి చేస్తావు. అంతేకాని ఇప్పుడు కాదు" అంటూ రథాన్ని రాముని కెదురుగా తోలించాడు. ప్రళయాంతకుడులాగా వస్తున్న త్రిశిరుణ్ణి రాముడు దూరంనుంచి చూచాడు. మూడుశిఖరాలుగల పర్వతం పెళ్ళగిల్లివచ్చినట్లు తోచింది. తాను చంపిన సైన్యం ఒక ఎత్తు. వీడొక ఎత్తుగా భావించాడు. త్రిశిరుడు వర్షాకాలంలో మేఘం పర్వతాన్ని ఆక్రమించిన చందంగా రాముణ్ణి శరవృష్టితో ఆక్రమించాడు. రాముడు ఐంద్రాస్త్రాన్ని అభిమంత్రించి ప్రయోగించగా, త్రిశిరుని అస్త్రాలు ఎక్కడికక్కడ తునాతునకలై గాలికి వగుదాకులవలె వాయుపథంలో గిరగిర తిరిగి సముద్రగర్భంలో తలదాచుకున్నై. పిశితాశనుడు విడువిడియక వారుణాస్త్రాన్ని వదిలాడు. అది కారుమేఘాలుకల్పిస్తూ సాంద్రగర్జనలతో బాణవర్షం కురుస్తుంటే "ఎప్పుడో

వచ్చే ప్రళయం ఇప్పుడే వచ్చిందా" అని భూతకోటి బెగ్గడిల్లిపోతున్నది. దాశరథి తత్ప్రతిక్రియగా వాయవ్యాస్త్రం విడిచాడు. దానినుండి నిర్ముక్తం కావటం ఏమిటి. ఉగ్రప్రాణులు సప్తమారుతుల ఒక్కసారి సంవర్తంగా చేసి వారుణం కల్పించిన అవరోధ మేఘ మండలాన్ని నామరూపాలు లేకుండా చేసి, జగదుపద్రవాన్ని వారించాయి. ఆగ్రహించి అసురుడు వాడి అమ్ములవాల్గు రాముని ఫాలభాగంలో నాటి ఆర్చాడు. ఆ బాణఘాతానికి రాముడు బాధ సహించినా, ప్రత్యర్థి అస్త్రపాండిత్యాన్ని అభినందిస్తూ: "ఓయీ! రాక్షసాగ్రణీ! నిన్ను మెచ్చుకున్నాను. నీ శక్తి చూశాను. ఇక నా శక్తి చూపుతాను. సమర్థించుకో" అంటూ, పద్నాల్గు బాణాలు గుండెల్లో గుచ్చి, నాల్గు బాణాలతో గుర్రాలను కూల్చి, ఎనిమిదింటితో సారథిని చంపి, ఒక్క బాణంతో ధ్వజాన్ని నరికి, రథంనుంచి క్రిందికి లంఘిస్తున్న త్రిశిరుణ్ణి రెండు బాణాలతో శిరస్సు నరికి దూషణుని చేరి తన దురవస్థను చెప్పుకొనునట్లు చేశాడు.

## శ్రీరామునితో ఖరుడు యుద్ధానికి తలపడుట

రామునిచే యుద్ధంలో రాక్షససైన్యం పద్నాల్గువేలు నామరూపాలు లేకుండాపోవటం, అదేయుండనున్న దూషణ త్రిశిరులు అంతకాలయంలో పాతకాపులు కావటం చూసి ఖరుని గుండె చెదరింది. "ఇది ఏమి పరాక్రమం? జరిగిన యుద్ధాల్లో ఇటువంటి వీరుడు, సర్వాస్త్రకోవిదుడు నా అనుభవానికి అందలేదు. ఒక మానవమాత్రుడు, ఒంటరివాడు, సహాయుడైనా లేకుండా, ఎదురులేని యుద్ధం చేయటం సాధ్యమా? ఇది నమ్మదగిందేనా? నా ఎదుట జరిగిన నాశనాన్ని నమ్మకపోవటం ఎలా? ఇప్పుడు కర్తవ్యం ఏమిటి? బ్రతుకుపై తీపితో పారిపోనా? సమరం చేసి చచ్చిపోనా. ఆత్మీయులందరినీ ఆహవంలో కోల్పోయి ఏకాకిగా బ్రతికి ఏం సాధించను? అవమానంతో, అపజయంతో జీవించటంకంటె వీరోచితంగా పోరాడి చావటం మంచిది. మేం మానవులను నిర్లక్ష్యంచేసి ఋషులను బాధించటంచేత వాళ్ళు యుద్ధంలో జయించలేక మంత్రతంత్రంతో మమ్మల్ని నాశనం చేయటానికి ఈతని నాశ్రయించి వుండాలి. లేకపోతే మానవుని చేతిలో దానవుడు

ఓడిపోతానా? ఇప్పుడు విచారించినందువల్ల ప్రయోజనంలేదు. నీరుపోయిన చెరువుకు కట్టవేసినట్లే. ఏం కానుందో చూస్తాను." అని మనస్సును నిశ్చయపరచుకొని ధనువందుకొని సజ్యంచేసి గుణటంకారం చేశాడు.

ఖరుని యుద్ధకౌశలం స్వయంగా చవిచూచిన సురలు భయభీతులైనారు. మునులకు ముచ్చెమటలు పోసినై. రాముడు నిర్విరామంగా పోరిడస్సి వున్నాడు. రాక్షసుడు రథచారి. రాముడు పాదచారి. అంగరక్షకసహితుడు ఖరుడు. రక్షణరహితుడు రాముడు. యుద్ధానికి ఇప్పుడే దిగుతున్నవాడు ఖరుడు. పోరాడిపోరాడి అలసినవాడు రాముడు. ఖరుడు మాయావి. రాముడు అమాయకుడు. దానవుడు ఖరుడు. మానవుడు రాముడు. స్వయంతపశ్శాలి దైత్యుడు. తాపసవరప్రసాది దాశరథి. నిసర్గజన్ముడు రాత్రించరుడు. కారణజన్ముడు రఘువంశదీపకుడు. దివ్యులు తీర్పుకై ఎదురుచూస్తున్నారు. కాలవిలంబానికి ఇద్దరూ ఇష్టపడంలేదు. ఉభయులు గుణటంకారం చేస్తూనే పరస్పరం ఇషీకప్రయోగంతో ఎదుర్కొన్నారు. ఒండొరులు కురిసే శరవృష్టి ఇద్దరినీ కానరాకుండాచేస్తూంది. సామాన్యాస్త్ర యుద్ధం క్రమంగా చరమస్థాయికి చేరింది.

తేజస్సంపన్నమైన శరజాలం రణరంగంలోకి దిగింది. ప్రయోగప్రతిహతాలతో చూపరులకు భయం సంతోషం కలిగిస్తూంది. ఎట్టకేలకు ఖరుడు విక్రమించి. సూర్యమండలపర్యంతం బాణాలను పరుచుకుంటూ శత్రుచ్ఛేదం చేయగల రౌద్రాస్త్రాన్ని రామునిపై ప్రయోగించాడు. అది అంకుశం. ఏనుగు గమనాన్ని నిరోధించినట్లు రాముని చాపశక్తి నిరోధించి గుండెను తాకింది. ఇంత దెబ్బ తాకినా, ఇంతసేపు పోరినా చలించని శ్రీరాముని శక్తి నిగాంచి ఖరుడు నిర్ఘాంతపడ్డాడు. రాముడు రాత్రించరుని సింహం లేడిపిల్లను చూచినట్లు చూచాడు. కాని, రాక్షసుడు రామునికి అవకాశం రానీయలేదు. తీవ్రమైన బాణాలతో, కోదండంతో శరంతొడిగి పట్టిన ముష్టిని (గుప్పిలి) నొప్పించి అస్త్రనిరోధం చేశాడు. వెంటనే ఘోరాస్త్రంతో చాపఖండనం చేశాడు. మర్మావయవాలు మాడిపోయేలా మార్గణాలు కురిశాడు.

## ఖరుడు శ్రీరాముని కవచాన్ని ఛేదించుట

ఆ విజయ సంతోష సంరంభంలో ఖరుడు రథాన్ని సమీపంగా తోలించి, అలాతంలాగా చాపం త్రిప్పుతూ సవ్యాపసవ్యాలుగా ప్రదరాలను ప్రయోగించి వక్షస్థల రక్షితంగావున్న పుక్కుకవచాన్ని ఛేదించి దిక్కుహరాలు ప్రతిధ్వనించేటట్లు అట్టహాసం చేశాడు. అసురులు ఆనందించారు. అమరులు హాహాకారాలు చేశారు. రాముడు రాక్షస శరతాడితుడై ధూమం లేని అగ్నివలె రక్తసిక్తగాత్రంతో ప్రకాశించాడు. అభేద్యమైన తన కవచాన్ని ఛేదించిన అస్త్ర విద్యా కౌశలానికి మెప్పు, "నీగతి ఇక చూడు" మన్నట్లు నిప్పు, రెండు నేత్రాలల్లో కానరాగా, అగస్త్యమహర్షి దత్తమైన వైష్ణవ చాపం స్మరించి, చేత ధరించి, కౌశిక మహర్షి ఇచ్చిన అస్త్రదేవతలను ధ్యానించి, దారుణాస్త్రంతో ఖరుని రథకేతనాన్ని రెండుగా ఖండించి, శిరస్సుపై, రొమ్ముపై, బాహులపై బలమైన మూడునాలుగు, ఐదుసంఖ్యల్లో బాణాలు రాముడు నాటాడు. ఖరుడు అది సహించక నాల్గు విశిఖాలు రొమ్ములో నాటాడు.

పట్టరాని కోపంతో పన్నగంవలె విజృంభించి, ముందు పదమూడు బాణాలతో సర్వాంగాలు నొప్పించి, నాల్గుతూపులతో గుర్రాలనూ, ఒకదానితో సారథినీ, మూడితో నొగలూ, రెంటితో అక్షమూ, పన్నెండింటితో చేతనున్న చాపం నరికి, క్రూరనారాచసప్తకంతో రాముడు క్రూరదైత్యుని గుండెలు చీల్చాడు. హతకేతనుడూ, హతహయుడూ, హతసారథీ అయి రాక్షసపతి రోషంతో ధరణికి లంఘిస్తూ గద చేతగొన్నాడు. అంతవరకు రథిగావున్న రక్కసుడు పదాతిగా మారునట్లు చేయంగానే దేవమానసుల మొగం విప్పారింది. ఆయుష్కాలం క్షణాలలోకి వచ్చిందని ఆహ్లాదం పొందారు. రౌద్రాకారంతో భయంకరమైన గద ధరించి నిల్చున్న ఖరాసురుణ్ణి కన్నులనిప్పులు రాలగా కాంచి రాముడు కఠినంగా పల్కసాగాడు.

## ఖరుని శ్రీరాముడు నిందించుట

"ఓరీ! రాక్షసాధమా! వరభుజబలగర్వంతో జనస్థానాన్ని ఆక్రమించుకొని నిర్జనం చేసి భయంకరారణ్యంగా మార్చిన మహాపాపివి. లోకక్షేమంకోసం సర్వం త్యాగంచేసి తపస్సు చేసుకునే సాధువులను అసంఖ్యాకంగా వధించిన క్రూరకర్ముడవు. మీది ఏమి జీవితం? లోకభయంకరంగా తపస్సు చేస్తారు. లోకనాశనకరమైన వరాలు పొందుతారు. సాటి మానవులను చంపుతారు. క్రూరమృగాల్లాగా రక్తం త్రాగుతారు. మాంసం తింటారు. అనాగరక జీవకోటికి ఆహారంగా మృగపక్షి సంతానాన్ని పరమేష్ఠి ప్రభవింపచేశాడు. బ్రహ్మవంశంలో పుట్టి, వేదాలు వల్లించి, తపస్సు చేసి, మళ్ళీ తాపసులను సంహరిస్తారు. విధాత సృష్టిని రక్షిస్తామన్న మీరు క్రూరులుగా మారటం, జక్షిస్తామన్న యక్షులు లోకపూజ్యులు కావటం విడ్డూరంగా లేదా? మీ పూర్వులు మహాశక్తి సంపన్నులయికూడ, నాశనం కావటం చూచి కూడ, మీకీ దుర్బుద్ధి ఎందుకు వికనాదరో బోధపడ్డం లేదు. ఋతుకాలం రాగానే వృక్షాలు ఫలించినట్లు అనుభవకాలం సమీపించగానే చేసిన కర్మ ఫలితాలు అనుభవానికి వస్తై. విషాన్నంవలె పాపఫలం ఎంతవాడికీ వృధాగా పోదు. మీవంటి సాహసహింసకులను, పాపకర్ములను దండధరుని పాలికి పంపటానికే తండ్రి ఆజ్ఞ పొంది వచ్చాను.

పాములు పుట్టలోకి పోయినట్లు నా బాణాలు నీ పొట్టలోదూరి, సహసైన్యంగా చచ్చిన నీ తమ్ముణ్ణి చూడటానికి ఇప్పుడే తరలిస్తాయి. నీచేత, నీ బంధుమిత్ర పరివారంచేత చచ్చిన సాధువుల ఆత్మలు ఇకనైనా సంతోషిస్తవి. నీదేహం భూపాతం కాగానే వియచ్చరులు ఆనందకోలాహలాన్ని చేస్తారు. నీ బ్రదుకుకాలం దగ్గిరపడింది కాబట్టే నాతో తలపడ్డావు. నిన్ను మించిన నీవారంతా నీరైపోవటం చూచి కూడా నీవు పోరాటానికి సిద్ధపడ్డం నీ చావు చెప్పక చెపుతూంది. తాడిచెట్టునుండి పండురాలినవిధంగా నీతల ఇప్పుడే నేల కూలుస్తాను. సర్వశక్తులూ సమకూర్చుకో. నీకు కొంత వ్యవధి ఇస్తున్నాను" అని. ఆ మాటలకు అసురుడు ఆజ్యంపడిన అగ్నిలాగా భగ్గునమండి "ఓరీ!మానవా! సామాన్యుల చంపినంతమాత్రాన నిన్ను నీవు ఇంత పొగడుకోనక్కరలేదు. బుద్ధిమంతుడెవడూ ఆత్మశ్లాఘ పరా

యణుడు కాలేడు. నీ బలాన్ని నీవు చెప్పుకుంటే ఏం గౌరవం? నీచులు నీలాగా వాగుతారు. చావుసమయంలో నిన్ను నీవు మెచ్చుకుంటున్నావు కాని, లోకంలో ఎవడూ ఈ పని చేయడు. దర్భ నిప్పుపై పడి కాల ననుకున్నట్లుంది నీ గర్వభాషణం నీ కంకటాన్ని ఛేదించి, నిన్ను రక్తసిక్తాంగుని చేసి, ధాతువులచే ప్రకాశించు ధరణీధరంలాగా గద చేతపట్టి నిల్చున్న నన్ను కన్నెత్తి చూడు. యమపాశాన్ని ప్రతిఘటించవచ్చు. ఇంద్రుని వజ్రాన్ని ఎదుర్కోవచ్చు. విష్ణుసుదర్శనాన్ని ఓహటింపవచ్చు. నా గదాఘాతాన్ని మాత్రం సైరించటం దుర్లభం. అది నీకు కాదు, సృష్టికర్తకుకూడ సాధ్యంగాని పని. ఇక నీ సంగతి వేరే చెప్పటం దేనికి? నన్నట్లు నిన్ను నేనంటానికి ఎన్నో వున్నై. మాటలతో మాకు పనిలేదు. ఆసన్న దినాంతం అయినది. రవి జారిన యుద్ధవిఘాతం వస్తుంది. ఈ లోపలనే మాకు చేయవలసిన పని ఒకటి వున్నది. ఆ ఉత్తమ కార్యం ఏమిటంటే! నీ చావుచూసిన సురలు అశ్రుమార్జనం చేసేలాగా చేయటం. అందుకు సిద్ధపడు" అని అన్నాడు.

## ఖరుని గదను శ్రీరాముడు ఖండించుట

ఈవిధంగా ఒకరినొకరు నిందించుకుంటూ ఖరుడు గదను గిరగిర త్రిప్పగా రాముడు కోదండంలో బాణం సంధించగా చరాచరజగత్తు స్తంభించింది. "ఇదిగో చచ్చావు, కాచుకో" అంటూ ఖరుడు నముచిపై ఇంద్రుడు వజ్రం ప్రయోగించినట్లు బలంగా విసిరాడు. రాముడు శాతశర ప్రయోగంతో గదను మధ్యలోనే తునాతునకలు చేశాడు. మంత్రబలంతో ఫణి ప్రాణం హరించినట్లు రామబాణం రాక్షసుని గదను ఖండించటం కాంచిన దేవతలు "రామా! వీరశూరశబ్దాలు నీకే చెల్లిన"వని సంస్తుతించారు. గదను వమ్ముచేసిన రాముడు దిగ్భ్రమ చెందుతున్న దైత్యుణ్ణి లక్షించి "పలువా! ఇందాక ఏమేమో ప్రేలావు. నీవు అంతగా చెప్పుకున్న నీ గద గతి ఏమైందో చూశావు గదా. ఇంకేమైనా నీవద్ద వాడతగిన ఆయుధాలుంటే తెచ్చుకో. నా చావుకు దేవతలు కాదు అశ్రుమార్జనంచేసేది, నీ చావుకు నీవాళ్ళు. గరుత్మంతుడు అమృతం హరియించినట్లు నీప్రాణాలు

హరిస్తాను. ఇక నీవు కాచుకో. గ్రుడ్డివాడు తెలియక అడుదాన్ని కౌగిట చేర్చినట్లు బాహువులు చాచి ధరణిపై బోరగిలపడిన నీ శరీరం భూమిని ఆలింగనం చేసుకున్నదన్న విధంగా చేస్తాను. ఆవిధంగా పడి దీర్ఘనిద్ర పో. అంతటితో ఈ అరణ్యం పీడ వదలుతుంది. గుండెలపై చేతులు పెట్టుకొని సంయమీశ్వరులు సుఖంగా బ్రదుకుతారు.

ఓరి నృశంసా! నీచా! దురాత్మా! విప్రకంటకుడవై, క్రూర కర్ముడవైన నీ పాలనంలో అగ్నిలో హవిస్సు వ్రేల్చే లోపల ఏమవు తామోయని ఇంతవరకు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బ్రతికారు. ఇక మీదట నిశ్చింతులై హాయిగా మునులు తమ విధులు నిర్వర్తించుకుంటారు. నీ చావుతో జనస్థానంలో మిగిలిన రాక్షసులు చెట్టుకొకడు, పుట్టకొకడుగా పారిపోతారు. విన్ననైన మోములతో, కన్నీటి కాల్వలతో నీ భార్యలు "ఇట్టి అల్పాయువు గలవాణ్ణి, అహంకారిని, అప్రయోజకుణ్ణి మగడుగా కట్టుకొన్నందుకు సంసారసౌఖ్యాలకు దూరలై విరర్థక జీవులై నశిస్తారు." "అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" అంటూ ఘోరంగా నిందించాడు. రాక్షసపతి రాముణ్ణి చుల్కనగా చూస్తూ, "ఓమానవాపశదా! ఇది రణం. ఒకసారి ఒకడికి అవకాశంవస్తే, ఇంకోసారి ఇంకొకడికి అవకాశం వస్తుంది. కాలంతీరిన సమయంలో వివక్షత కోల్పోయి, ఇంద్రియ శక్తి నశించి అప్రశస్తంగా ప్రేలినట్లు ప్రేలుతున్నావు ఇంత వరకు విజయమే నేనెరుగుదును. ఇప్పుడది వ్యతిరేకమైతే కావచ్చు. నిన్ను జయిస్తే నశించని కీర్తి నాకు వస్తుంది. నీచేత చస్తే వీరస్వర్గం వస్తుంది. అంతేకాని నోటి దురుసు మాటలెందుకు?" అని పల్కుతూ సమీపంగా వున్న పెనుకొండను సమూలంగా పెకలించి కటములదర, బొమలు ముడిపడ వడిసెలలో రాయి విసరినట్లు విసరివైచాడు. ఆ వేగానికి వృక్ష సంతానం మొదళ్ళతో త్రెళ్ళింది. మృగాలు గుండెలదరి నోటివెంట రక్తం కక్కుతున్నై. వాతధూతమై ధూళి వనమంతా వ్యాపించింది.

## శ్రీరాముడు ఖరుని శిరం ఖండించుట

ఖరుని భుజబలానికి రాముడు విస్తుబోయాడు. ఇంత శక్తిసంప న్నులు క్రూరమార్గానువరులు కాక సౌమ్యపథ సంచారులైతే లోకం ఎంత

శాంతి సౌభాగ్యాలతో వర్థిల్లుతుంది; గులాబులకు ముళ్ళు, ఏనుగులకు చిన్న కళ్ళు విధి కల్పించినట్లే, వీళ్ళకు క్రూరత్వం కల్పించాడు అని భావిస్తూనే శాతకుంభకాల్ని శరాసనంలో సంధించి వచ్చే పర్వతాన్ని పిప్పులపిప్పులై పడేలాగా పగులకొట్టాడు. "వీడినిక విడిచిపెడితే ప్రమాదం వస్తుంది. వీడు అలతీగా కదనరంగాన్ని వీడడు. ఇప్పటికే కాలహరణం చేశాను." అని కఠోరవాణాలు వైచి గాయంచిల్లులు పడి రక్తం కారేట్లుగా చేసి శక్తిహీనుణ్ణిగా సలిపాడు. ఖరుడు కాలం ఆసన్నమైనదని గ్రహించాడు. సమసిపోతున్న సర్వశక్తులను కూడతీసుకొని రామునిపైకి దూకాడు. రాముడు రెండడుగులు వెనక్కువేసి, ప్రకాశంలో బ్రహ్మదండం కంటే ప్రశస్తమూ, బడబాగ్నితుల్యమూ, అప్రతిహతమూ, అంతకపాశసన్నిభమూ అయిన ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించాడు అది పిడుగులాగా ఆకాంతము ప్రతిధ్వనింపగా ఖరుని వక్షంలో గాఢి పారింది. ఆ అస్త్రసంస్పర్శతో అసురుడు ఆద్యంతం, త్రిపురాంతకునిచే దగ్ధమైన అంధకాసురునివలె దహింపబడి బూడిదరాశియైనాడు. ఫేనంతో నముచీ వజ్రంతో. వృత్రుడూ, భస్మమైనట్లు రాముని ఐంద్రాస్త్రంతో రాక్షసుడు బూడిదె కావటంతో దిక్కులు తెలివొందినై. ఆకాశం నిర్మలమైంది. సూర్యుడు ప్రభతో ప్రకాశించాడు ఖరదానవబాధిత లోకం కళకళలాడింది. గుంపులుగుంపులై రాజర్షులు, మునులు, దండకారణ్యవాసులైన భిల్లులు, కోయలు రాముని చేర వచ్చారు. ఋషులు శ్రీరాముని సమీపించి "విజయధామా! దశరథరామా! నిన్ను స్తుతింపబోతే, ఆశీర్వదించబోతే ఆనందంతో కంఠం రుద్ధమై పోతూంది. నిన్ను గన్న కౌసల్యా దశరథులు కడు ధన్యులు. పార్వతీ పరమేశ్వరులు కుమారుని దేవతలకు దత్తంచేసినట్లు దండకారణ్య తాపసుల రక్షణార్థం నిన్ను దత్తం చేశారు. నీవు శరభంగుని దర్శనార్థం వస్తున్నావని తెలిసే ఇంద్రుడు ఆయన్ను ముందుగా కలిసి నిన్ని ప్రాంతానికి పంపే ఏర్పాటుచేసి వెళ్ళాడు. అందులకే అగస్త్యమహర్షికూడ తన ఆశ్రమంలో వుంచుకొనక పంచవటిలో నివాసం నిర్ణయించాడు. నేటికి మా బాధలు కడగండ్లు గట్టెక్కినై. మా మంత్రాంగం ఫలించింది. మా పనులు తీరినై. ఇక మేం నిశ్చింతులమై సవనకర్మలు సాగించుకొంటూ, తపస్సు చేసుకొంటూ కాలం నీ నామస్మరణంతో గడుపుతుంటాం" అని కృతజ్ఞతా

సూచక భాషణం చేస్తుంటే, సిద్ధచారణ దేవయక్ష గంధర్వాదులు పుష్ప వృష్టి కురిపించారు. దుందుభిధ్వానాలతో దిక్కుహరాలు నిండినై. "ఆహా! ఏమి పరాక్రమం! ఔరా! ఏమి దాక్ష్యసత్వం! పద్నాల్గువేల మనుజాశనులను పదాతియై నిల్చి ఘటికాత్రయంలో, కాలుని పురానికి పంపటం కలలో ఇలలో సాధ్యంకాని పని. దండకారణ్యం ఇప్పుడు నిజంగా జనస్థానం అయింది. మహర్షుల దర్శనార్థం నిర్భయంగా వెళ్ళరావచ్చు. విష్ణ్వంశ సంభూతుడు కనుకనే నిర్జరారికులాన్ని నిర్ధూమధామం చేశాడు." అని ప్రశంసిస్తూ అమరులు తమతమ నెలవులకు తరలిపోయారు.

## శ్రీరాముడు భార్యా సోదరుల చేరవచ్చుట

అసుర సంహారంతో విజయలక్ష్మీ కరగ్రహణం చేసి శ్రీరాముడు సతీ సోదరులను చూడబోతుంటే వారే గుహ వెడలి వచ్చారు. పరస్పరం క్షేమంగా వున్నందులకు పరమానందం పొందాడు. తాపసులు దాశరథిని ఆశీర్వదించి ఆశ్రమాలకు చేరుకొన్నారు. శ్రీరాముడుకూడ సీతాలక్ష్మణ సహితుడై స్వాశ్రమానికి చేరాడు. భువన భయంకరులైన ఖరదూషణుల సంహారంచేసి విజయియై వెలిగిపోతున్న భర్తను పుష్పసుకుమార సుందరమైన బాహులతో జానకి గాఢాలింగనం చేసుకుంది. రాముడు ప్రియురాలు స్వయంగా ప్రసాదించిన కౌగిలి సుఖంలో కరిగిపోయాడు ఎన్నోప్రశ్నలు వేసి మైథిలి శ్రీరాముని వుక్కిరిబిక్కిరి చేస్తూంటే శాంతప్రసన్నముఖుడై రాక్షసులతో జరిగిన రణరంగ వార్తలు వివరంగా వినిపించాడు. కందరాంతర్భాగంలో ఏకాంతంగా వున్నప్పుడు అనుక్షణం తను పొందిన ఆరాటం జానకి తెలిపింది. అప్పుడప్పుడు మరది వచ్చి మీ క్షేమం తెలుపుతూ, నా కళలం గుర్తిస్తూ కంటికి రెప్పలాగా కాపాడినట్లు చెప్పింది. రాముడు తమ్ముణ్ణి కృతజ్ఞతాభరంతో గ్రుచ్చిగ్రుచ్చి ఆలింగనం చేసుకున్నాడు. లక్ష్మణుడు వినమిత శిరస్కుడై, తన కర్తవ్యపాలనకు అన్న ఆనందించినందుకు తన పుట్టువు సార్థమైనట్లు తలచాడు.

## అకంపనుడు రావణునకు ఖరాదుల వధగూర్చి చెప్పుట

ఖరుడు తమ్మునితో, సైన్యంతో కదనరంగంలో మడిసిన సంగతి జనస్థానానికి చేరుకుంది. ఆవార్త చిలవలు పలవలై వ్యాపించింది. అంతః

పుర రాక్షసాంగనలు, వారి బంధువులు, వారి పరివారం శోకాధి దేవత ఒడిలో జోకొట్టబడ్డారు. రామలక్ష్మణులు ఎప్పుడో తమ్ముకూడ హత మారుస్తారన్న భయంతో సామాన్య రాక్షసులంతా తలకొక దారిపట్టి పారి పోయారు. అంతఃపుర రక్షణకోసం వుంచిన అకంపనుడు భయకంపి తుడై, లంకానగరానికి పరుగెత్తాడు. దశకంఠుడు నిండు సభలో, సంద డిగా నున్న సమయంలో అకంపనుడు ఆక్రోశిస్తూ రావణుని పాదాలపై పడ్డాడు. దశగ్రీవుడు వచ్చినవాణ్ణి ఓదార్చి, కారణం ఏమిటని ప్రశ్నిం చాడు. అకంపనుడు రెండు చేతులెత్తి మ్రొక్కి "మహాప్రభూ! జనస్థానా నికి చేటుకాలం వచ్చింది తమ సోదరులు పధ్నాల్గువేల సైన్యంతో యుద్ధరంగంలో ప్రాణాలు కోల్పోయారు. రాణులు దిక్కులేనివారైనారు. ఎక్కడివాళ్ళక్కడ భీరావహులై పారిపోయారు. జనస్థానం ఇప్పుడు హతస్థానం అయింది. నేను అంతఃపుర రక్షణంలో వున్నందున చావక మిగిలాను. తమకీ వార్త చెప్పటంకోసం వచ్చాను. ఇంక తమ చిత్తం" అని చెప్పాడు.

లంకాపతి ఆపలుకులు విని లయకాల రుద్రునివలె మండిపోయాడు. "ఎవడురా ఇంత పనిచేసింది? సకల సౌభాగ్యవంతము, సర్వశక్తిమంతము ఐన జనస్థానాన్ని కూల్చివేసిన మూర్ఖ ఎవడు? సింహం మీసలతో చెలగా టమా? పిడుగుక్రింది కాపురమా? నా కపకారం తలపెట్టి దేవతలే సుఖపడ లేరు. వీడు సుఖిస్తాడా? అష్టదిక్పాలకులు సింహాసనసోపానాలుగా నుండు నట్లు చేసిన నా కోపాగ్నిని ఏమిడుక దగుల్కొల్పింది? నా ఆజ్ఞ లేక పంచ భూతాలు సంచరించలేవు. చెప్పు. ఇంద్రుడా? యముడా? వరుణుడా? అనిలుడా? నీవు చూస్తుండగానే పాదాక్రాంతుల చేసి ప్రతీకారం తీర్చు కుంటాను" అన్నాడు. ఆ ఆర్తుడు వణుకుతూ. "ప్రభూ! నన్ను రక్షిస్తా నని అభయం ఇస్తే అంతా చెప్తా" నన్నాడు. "నన్నాశ్రయించిన నీ కింకా ప్రాణ భయం దేనికి? నేను నిన్ను రక్షిస్తున్నాను. వున్నది వున్న ట్లుగా వివరించు" మన్నాడు. అకంపనుడు ఆ మాటలకు తేరుకుని -"ప్రభూ! బలిష్ఠబాహుడు, అసమానబలుడు, వృషాంసుడు, చంద్రునివంటి చల్లని వదనం గలవాడు, దశరథ రాజాసు పెద్దకుమారుడు, ధృతకీర్తి,

బాణానలమూర్తి, అపరాజితుడు, రాముడను పేరు గలవాడు, మన జన స్థానాన్ని మారణహోమం చేసినవాడు" అని తెలిపాడు. "అకంపనా! ఇంతమాత్రం కాదు. ఇంకా విపులంగా చెప్పు. దేవతల సహాయంతో జనస్థానానికి వచ్చాడా? అసలు యుద్ధకారణం ఏమిటి? ఎక్కడ జరిగింది?" అని మళ్ళీ రాక్షసరాజు అడిగాడు. అకంపనుడు తెలిసినంత చెప్పసాగాడు.

## అకంపనుడు రాముని పరాక్రమం రావణునకు వివరంగా చెప్పుట

"దేవరా! నాపలుకులు అసత్యాలుగా, అవహేళనంగా, అత్యుక్తులుగా నీవు భావించవద్దు. నీ కపకారం కోరే వాడు నీ జాతిలో లేడు. నిన్నా శ్రయించి, పోయిన సౌభాగ్యం పుంజుకొని రాక్షసులంతా స్వేచ్ఛాజీవనులై సుఖిస్తున్నారు. కలకాలం నీ ప్రభుత వర్ధిల్లాలని కాంక్షించేవాళ్ళం. ధను ర్ధారులలో అంతటివాడు పూర్వం పుట్టలేదు. ఇప్పుడు లేడు. ఇకముందు పుట్టడు. అతనికి స్వాధీనమైన దివ్యాస్త్ర విద్య నేనింకెక్కడ చూడలేదు. యుద్ధంలో ఇంద్రుడు నిల్వలేడు. పేరు శ్రీరాముడు. అన్నివిధాలా అన్న యంతవాడు తమ్ముడు. పేరు లక్ష్మణుడు. అరుణ వర్ణ శరీరచ్ఛాయ కలవాడు. దుందుభిధ్వానం వంటి కంఠరవం గలవాడు. వికసితపద్మం లాగా మనోహరమైన వదనం కలవాడు. అన్న సేవలో అనుక్షణం అప్ర మత్తుడై వుంటాడు. అన్ని కార్యాల్లో అగ్నికి వాయువువలె తోడ్పడుతాడు. ఆ ఇద్దరిలో రామునిచేత జనస్థానం హతస్థానమైంది.

నీవు భావించునట్లు దేవతలు రాలేదు. ఇంద్రుడు రాలేదు. శరశరా సనాలు తప్ప అతనికి తోడు మరెవ్వరూ లేరు. పదాతిగా నిల్చాడు. పద్నాల్గువేల భయంకర రాక్షససైన్యం ఆయుధ గజరథతురగసంకీర్ణమై ఆహవంలో నిలిస్తే మూడు గడియలకాలంలో ఊషరక్షేత్రంగా మారి పోయింది. నీ దండయాత్రలో ఎన్నో యుద్ధాలు చేశాం. ఎందరినో వీరాధివీరులను చూశాం. ఇటువంటి శూరుణ్ణి, ఇంత అస్త్ర విద్యా రహస్య కోవిదుణ్ణి నేను చూడలేదు. అంత భీకర యుద్ధంచేసే మన

సైన్యాధిపతులు ప్రయోగించిన ఏ అస్త్రంకూడా అతని సమీపానికి పోలేదు. మధ్యలోనే తునిగిపోయేవి. అంపవాన కురుపిస్తూంటే తప్పిదారి అయినా అతని శరీరాన్ని తాకలేదంటే ఆశ్చర్యం కలగటంలేదా ? దూషణత్రిశిరులు మాత్రం అతణ్ణి కొద్దిగా నొప్పించారు. మరుక్షణంలోనే సొరకాయల తరిగినట్లు శిరాలను తరిగాడు. ఖరేంద్రుడు చెప్పుకోతగ్గ యుద్ధం చేశాడు. అభేద్యమైన అతని కవచాన్ని ఛేదించి శరీరమంతా శరజాలంతో జర్ఝరీ భూతం చేశాడు. నీలజీమూతకాయుడైన శ్రీరాముడు వికసిత కింశుక వృక్షంలాగా, శంపాసాంద్రజలధరంలాగా శోభించాడేకాని చెక్కుచెదరలేదు. ఖరుడు కోదండ ఖండనంచేసి అవకాశరహితంగా అస్త్రపాతాన్ని చేస్తున్నప్పుడు రాముడిక లేడని మునులూ, దేవతలూ ఘోరంగా శోకించారు. కాని, అదేమి నేర్పో, అదేమి రహస్యవిద్యో, కొండంత చాపంసజ్యమై హస్తంలో నిల్చింది. ఇంకేముంది ? సారథి రథ హయకేతన చాపాలను ఏకకాలంలో దునుమాడి, కవచం నరికి నేలకు తెచ్చాడు. తిరుగులేని ఖరేంద్రుని గదను చెండులాగా తుండెతుండేలుగా ఖండించాడు. పర్వతాన్ని విసరితే పిండిపిండిగా కొట్టాడు. ఐంద్రాస్త్రంతో చివరకు అసువులనే హరించాడు. పంచశిరస్సుల నాగాలవలె అతని బాణాలు, ఏయే విధాల దిగులతో ఏయే మార్గాల, ఏయే రూపాలతో మనవాళ్ళు పారిపోతున్నా, ఆయా విధాలుగా ఎదుర్కొని నాశనం చేసినై. ఎక్కడ చూచినా రాముడే కనుపించాడు. దేవా ! ఈ విధంగా మన జనస్థానం మట్టిపాలైంది," అని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ. కలరూపు తెలిపాడు. కాళ్ళబడి కాగల కార్యం చూడుమన్నాడు.

విషయమంతా విన్న దశగ్రీవుడు విస్తుబోయాడు. "ఇక నీ వేగి మనవాళ్ళను లంక చేర్చు. నేనా మానవసోదరుల అంతు తేలుస్తాను. నాతో పగ తేలికగా పోదు. ఇప్పుడే పోతాను. ఖరాదులతో యుద్ధం కాదు రావణునితో యుద్ధం. తేల్చుకొనే తిరిగి వస్తాను. నీ వింక పో" అంటూ లంకేశ్వరుడు ఆసనంనుంచి లేచాడు. అకంపనుడు చేతులు జోడించి "ప్రభూ! ఆగండి. త్వరపడకండి. అతనితో ఎదురుగా నిల్చి సమరం

నల్పటం మంచిది కాదు. ఆతడాగ్రహిస్తే గట్లొరసి పారే ప్రవాహాన్ని బాణాలతో బంధిస్తాడు. తారాగ్రహమండలంతో భాసించే ఘనపథాన్ని శిలీముఖాలతో ఛేదిస్తాడు. ఆతడు శ్రీమంతుడు. ఉర్వీతలాన్ని ఉద్ధరించ గలడు. సప్తసాగరసంగరంగా ముంచగలడు. ఆతడు ఉద్ధతుడు. అస్త్ర కౌశలంతో అంబుధులను హద్దులు దాటేటట్లు పొంగిస్తాడు. నిర్జలంగా ఇంకిస్తాడు. వాయువు స్తంభిస్తుంది. సూర్యచంద్ర గమనం నిల్చిపోతుంది. ఆతడు ధనువు ధరించనంతవరకే దాక్షిణ్యం కురుస్తాడు. ధనువు తాల్చాడో సృష్టిస్థితిలయాలు అతని కరగతమవుతవి.

## సీతాపహరణమే శ్రీరాముని వధకు మార్గం అని దైత్యుడు చెప్పుట

ప్రభూ! క్షమించు. నీవే కాదు పదునాల్గు భువనాలు ఎత్తివచ్చినా, త్రిమూర్తు లెదిరించి నిల్చినా, దేవనాగాసురగణాలు ప్రతిఘటించినా అతని శిరఃకేశం కదలాడదు. పాపాత్ముడు స్వర్గంలో ప్రవేశించలేనట్లు అధి ముఖులైన ధనుర్ధారులు అతనిని దాటలేరు. ఇది ముమ్మాటికీ సత్యం. అతణ్ణి చంపే ఉపాయం నాకు తోచింది చెపుతా విను. రాముడెంతటి వీరుడో అతని భార్య అంత అందకత్తె. ఆమె సౌందర్యానికి ఆమే సాటి. ఆమెను ప్రత్యక్షంగా వర్ణించటం విషయ ప్రస్తారం, చర్విత చర్వణం, ఆమ్రేడితం అవుతుందే కాని అసలు చెప్పినట్లు కానేకాదు. ఆమె అతనికి అదృష్టదేవత. అప్సరసలు ఆమెకు చెలికత్తెలుగా సేవ చేయటానికి పనికివస్తారు. నాగకిన్నరగంధర్వ వధూటులు ఆమె అనుగ్రహానికి పాత్రలైతే వారు కృతార్థులు అయినట్లే. ఆమెను అపహరించివేస్తే, ఆమె వియోగాగ్నిలో శలభమై నశిస్తాడు. అంతకంటే వేరు మార్గంలేదు. ఆ అపహరణ అయినా వారలేని సమయంలో జరగాలి. ఆ సమయంలో లక్ష్మణుడు వుంటే నీ మాయలూ, గీయలూ పనిచేయవు. ఆతడు నివురు కప్పిన నిప్పు. తెలియరాని లోతు. పగబట్టిన మిన్నాగు సుప్త పంచాననం. రాముని కోపం అపసవ్యహస్తమైంది. లక్ష్మణుని కోపం జీవి

శాంతమైంది. ఇతనికి ఆగ్రహం కోపించినంతగా రామునకు కోపించదు. అతడు సహజ ప్రసన్నమూర్తి. వాళ్ళను గురించి నాకు తెలిసినది ఇది. నీ బుద్ధివైభవంతో ఇంకా సూక్ష్మంగా పరిశోధించి కార్యసాధనకు కడంగు. ఏట్టి పరిస్థితులలోనూ ఎదురుగా యుద్ధానికి దిగవద్దు. నీకు చెప్పవలసిన దంతా చెప్పాను. ఇక నీ ఇష్టం" అని ముగించాడు.

## రావణుడు మారీచుని వద్దకు పోవుట

అకంపనుడు చెప్పే ప్రతి వాక్యాన్నీ జాగ్రత్తగా విన్నాడు. అందుకు పూర్వం అంతరంగంలో ఊహించినప్పుడే ఆలోచించాడు. అకంపనా నీవింతగా చెప్పిన విషయం నిర్లక్ష్యంగా చేయను. ఏది యుక్తమో, ఏది సర్వశ్రేయస్కరమో, ఏది ప్రమాదమో, ఏది ప్రమోదమో జాగ్రత్తగా విచారించి కార్యరంగంలో కాలుపెడతాను. నీవింక నిశ్చింతుడవై, జనస్థానంలో మిగిలివున్న మావాళ్ళను ఒక్కచోటికి చేర్చు. వాళ్ళను శోకం పొందవద్దని, ప్రతీకారం చేసి పగ తీర్చుకుంటానని ప్రతినపూనినానని చెప్పి సముదాయించు. రాముడో, రావణుడో నిలుస్తాడు. ఇద్దరు మాత్రం ఇక వుండరు." అంటూ రావణుడు అంతఃపురానికి వెళ్ళాడు. అకంపనుడు జనస్థానానికి చేరుకున్నాడు. ఏకాంతంగా కొంతకాలం గడిపాడు. చేయబోయే పని పూర్వాపరాలను బహుముఖాలుగా పరిశీలించాడు. నిర్ణయానికి వచ్చాడు. నిశ్చలుడైనాడు. పుష్పకాన్ని ఆహ్వానించాడు. గరుడాకృతి సమక్షంలో సాక్షాత్కరించింది.

బలాకాకారంలో ధవళకాంతులు చిమ్ముతూ ఆకాశంలో పోతుంటే అకాలచంద్రోదయంలాగా గోచరిస్తున్న విమానంలో ఆసీనుడై దశవదనుడు తాటకీ యాశ్రమంలో అవతరించాడు. రాకరాక వచ్చిన రాక్షసపతిని మారీచుడు ఆహ్వానించి, అర్ఘ్యపాద్యాలు ఇచ్చి, ఆసనం సమర్పించి, అమానుష భక్ష్య భోజ్యాలతో తృప్తుని గావించి, "రాక్షసేంద్రా! బహుకాలానికి దర్శన మిచ్చావు. అంతా కుశలమే కదా? ఇంత హఠాత్తుగా సామాన్యుని ఆశ్రమానికి రావటం ఏదో గొప్ప పనివుంటే కాని జరుగదు. అంత అవసర కార్యం వుంటే కబురుచేస్తే నేనే వచ్చేవాణ్ణి కదా? ఇంత

శ్రమపడి రావాలా?" అని సానునయంగా, సవినయంగా ప్రశ్నించాడు. "పూజ్యుడా! నిన్ను రప్పించవలసిన పనికాదు కనుకనే నే వచ్చాను. లంకా పట్టణమంతా సలక్షణంగానే వుంది. చెట్ట జరిగింది జనస్థానానికే. పధ్నాల్గువేల సైన్యంతో ఖరదూషణ త్రిశిరాదులు మానవునిచే హతులైనారట. అకంపను డింతకుముందే ఆ వృత్తాంతం చెప్పాడు. అది విన్నప్పటినుంచీ అవమానాగ్ని నన్ను కాలుస్తూంది. ఆత్మీయుల మరణం అనుక్షణం వేధిస్తూంది. ప్రతీకారభావం పెరుగుతూంది. అందుకు నీ సాయం అర్థించి వచ్చాను. నీళ్ళముంచినా, పాలముంచినా నీదే భారం" అని పంక్తిముఖుడు దీనంగా పల్కాడు. దైన్యం ఎరుగని దానవపతి తన్నింతగా బ్రతిమాలటం ఏదో ప్రమాదం రానున్నదని మారీచుడు ముందుగానే అనుమానించాడు. ఖరదూషణాదుల వధ దేవతలకే సాధ్యం కాలేదు. మానవుని చేతిలో మరణించటం ఎలా జరిగింది? వైరకారణం ఏమిటి? ఒక్కడు ఇందరిని ఏ విధంగా చంపాడు? ఎవడా మానవుడు? అంతా అగమ్యగోచరంగా వుంది. అతడెందుకు వచ్చాడో, తానేం చేయాలో, చేయతగిందో లేదో, చేయకపోతే ఏం జరగరాని పని జరుగుతుందో అన్న శంకతో క్షణకాలం మౌనంగా వుండి, లేని ఆదరగౌరవాలను ఎరువు తెచ్చుకుని "లంకేశ్వరా! వినరాని మాట నీ నోట విన్నాను. ఖరదూషణాదులు గతించారా? నమ్మసాధ్యం కాకుండా వుంది. అందులో ఒక్క మానవుని చేతులోనా! అంత శక్తి గల మానవుడు నాకు తెలిసినంత వరకు రాము డొక్కడే వున్నాడు. అతనికీ, వీళ్ళకూ వైరం ఎందుకు వస్తుంది? విషయం అయోమయంగా వుంది. ఇప్పటి నీ రాకకు కారణం ఏమిటో బోధపడటం లేదు" అని మారీచు డన్నాడు.

"పూజ్యుడా! నీవు సరిగానే ఆలోచించావు. ఆ రాముడే మన వాళ్ళను సంహరించాడు. అసలు వైరకారణం నాకూ తెలియదు. అతడు పంచవటిలో ఆశ్రమం నిర్మించుకుని భార్యానుజ సహితుడై వున్నాడట. అతని భార్య త్రిలోకసుందరి అట. ఆమెను అపహరించి తెస్తే, ఆమె ఎడబాటును సహించలేక ఆత్మహత్య చేసుకొంటాడు. అందుకని అతని

భార్యను హరించే తలంపుతో వచ్చాను. నాకా కార్యంలో నీవు సహాయపడాలి. నా పగ ఈ విధంగా తీర్చుకుంటాను" అన్నాడు.

## రామునితో విరోధం వద్దని రావణునకు మారీచుడు చెప్పుట

ఆ మాటలకు మారీచుడు అశనిపాతం అయినట్లు అదిరిపడ్డాడు. "లంకేశ్వరా! ఈ గతిమాలిన ఆలోచన నీకు చెప్పిన దుర్బుద్ధి ఎవడు? అతడు నీ క్షేమం కోరి చెప్పాడా? లేక నీ చేటు కోరి చెప్పాడా? ఆ చెప్పినవాడు నీకు హితుని రూపంలో వున్న శత్రువు. ఇంకొకటి ఇంకొకటి కాదు. సతి అవమానం సామాన్యుడే సహించడు. ముల్లోకాలేలే పురుషోత్తముడు సహిస్తాడా? కాలభుజంగం కోరలను పెకల్చుమని ఏ పలుగాకి నిన్ను ప్రేరేచాడు? దవానలాన్ని కౌగిలించమని ఏ కలుషాత్ముడు పంపాడు? హస్తాగ్రంలో అశనిని నిల్పుమని అన్న నీచుడెవడు? నిద్రితసింహాన్ని తన్నమన్న అధముడెవ్వడు? పవిత్ర కులాభిజనాగ్రహస్తమై, శౌర్యదానమై భుజాగ్రవిషాణమై, (దంతాలు) శత్రుభయంకరమై సంచరించే రామచంద్రగజాన్ని ప్రాణాశ కలవాడు ప్రతిఘటించడు. కలహానంతరం వాలం ముడుచుకొని, రాక్షస వంశ నాశనకారణాలైన శరశాతాసిదంష్ట్రలతో నోరు తెరచి, నిద్రిస్తున్న నరసింహమూర్తిని నిర్నిమిత్తంగా మళ్ళీ ఎందుకు లేపుతావు? చేయతగినవన్నీ ఇదివరకే చేశావు. సంపాదించతగిన కీర్తి పూర్వమే సంపాదించావు. అడ్డులేని భోగాలు అనుభవిస్తున్నావు. అతడు అడవికి వచ్చిన కారణమేమిటో, మనవాళ్ళు అతనితో వైరం ఎందుకు పెట్టుకున్నారో ముందు తెలుసుకుని అనంతరం ఆలోచించాలిగాని, త్వరపడి చేయగూడని పనిచేసి పశ్చాత్తాపపడటం మంచిది కాదు. రాముడు గుణగ్రాహి. బలవంతుడనని చీటికిమాటికి తగాదాకు రాడు. సమరంలో చచ్చినవాళ్ళకోసం చావనివాళ్ళ నందర్నీ చంపటం నీకు ధర్మం కాదు. రాక్షస కులం నీ నీడలో రక్షితమవుతూంది.

నీ చేతగాని శివధనుర్భంగం చేసిన రాముణ్ణి మానవమాత్రుడుగా భావించబోకు. లక్ష్మణుడు రామునికంటె ఉద్ధతుడు. మహాకోపి. వారిద్దరికీ నామరూపభేదమే కాని అంతరంగికంగా అసమత్వం లేదు. ఇప్పటికి ఈ

దురాలోచన వదలి, దూరాలోచనపరుడవై సహనంతో యోచించు. తన కోపం తనకే శత్రువన్న పెద్దమాట ఒకసారి స్మరించు. ఇంత దూరం మాట్లాడినందుకు నన్ను క్షమించు. నేను నీ క్షేమం కోరేవాళ్ళలో ప్రథముడనని నీకు తెలుసు. నీకు ఈ దుర్బోధ చేసినవాడు నీకే కాక మన రాక్షసకులానికి నాశనం వస్తుందని గుర్తించలేదు. నీవు కూడ ఆత్మబంధు నాశనంతో ఆగ్రహంలో వున్నావు కాని ఆలోచించలేదు. ఏదో రహస్యంగా జరిగింది కనుక యిక ఈ విషయం ప్రసక్తం రాకుండా చూడు. నేను చెప్పిన మాటల్లో గుణముంటే గ్రహించు. లేకపోతే నన్ను మన్నించు. అంతేకాని నీకు అవమానం జరిగితే నేను సహించానని మాత్రం తలపునకు రానీయకు. క్షేమంగా తిరిగి లంకకు పో. సుందరమందిర వనసీమల్లో సుందరాంగులతో హాయిగా సుఖించు. రాముడు తన భార్యతో సుఖంగా కాలం గడుపుతాడు" అని ఎంతో హృద్యంగా నీతి బోధించాడు. రావణుడు కూడ మారీచుని వుపదేశం మంచిగానే వున్నదని తృప్తుడై లంకకు వెళ్ళిపోయాడు.

## శూర్పణఖ లంక కేగి రావణుని చూచుట

ఖరేంద్రుని సంహారంతో జనస్థానం హతస్థానంగా మారి రాక్షస రహితం అయింది. సోదరులతో సమరభూమికి వచ్చిన శూర్పణఖ. పధ్నాల్గువేల ప్రచండ దానవ సైన్యం ప్రాణాలు కోల్పోవటం చూచింది. ఖరదూషణత్రిశిరులు కదనరంగంలో కాలి బూడిదరాసులు కావటం కాంచింది. ప్రతీకారవాంఛ, అయినవారి ప్రాణాంతకంగా పరిణమించినా, ఆ చెడిపెకు అంతకంతకు ఆగ్రహం పెరిగిందేకాని మంచి ఆలోచన మనస్సుకు రాలేదు. లోకభీకరులై, వరప్రసాదులైనవారంతా ఎవని బాణాగ్నికి శలభాలైనారో వాడిని ఇంకా సాధించాలనే వాంఛించిందికాని ఆపై పరిణామం అనుకూలమో ప్రతికూలమో ఆలోచించలేదు. ఆ అనూహ్యంగా జరిగిన దుర్ఘటనకు నెత్తీ నోరూ కొట్టుకుంటూ, శైలకాననాలు మారుమ్రోగేలాగా

ఘోరంగా ఏడుస్తూ, పెడబొబ్బలు పెట్టుకుంటూ, రావణరక్షితమైన లంకానగరంలోనికి పోయింది. హేమమయసౌధోపరితలంలో నవరత్న ఖచితకాంచనసింహాసనంపై ఉదయభానుడులాగా వెలుగుతూ ఆసీనుడైన అన్నను చూచింది. జాతరూపవేదికలో జాజ్వల్యమానంగా ప్రకాశించే జాతవేదునివలె నొప్పి, సకల దేవగంధర్వ భూతతాపసాదులకు అజయ్యుడై, విధిలో యమధర్మరాజుకన్న కఠోరుడై వున్నవాణ్ణి విలోకించింది.

ఆతడు ఇప్పుడామె కంటికి అప్రతిమ శక్తిమంతుడుగా గోచరించుతున్నాడు. దేవదానవయుద్ధంలో అనివారణమైన ఇంద్రుని వజ్రంతో గాయపడి నిల్చిన కాయం, ఐరావత దంతపీడనంతో వ్రణకిణాంకితంగా ప్రకాశిస్తున్న వక్షం, తన్ను అవమానించిన రాముని గర్వాన్ని నేలమట్టం చేయ సమర్థత కలవాడని చెపుతున్నై. పదిశిరాలు, ఇరవై చేతులు, వింజామరాలు, శ్వేతచ్ఛత్రం వెడదకరం గలిగి లోకోత్తర రాజలక్షణాలతో, స్నిగ్ధవైడూర్య సంకాశంతో, నిగనిగ వెలిగే మణికుండలాలతో భాసించే వదనంతో, తేజోవంతమై, దివ్యమైన విష్ణుచక్రాది నానాయుధ ప్రహారణాలను సహించిన సంఘాతాకారంతో, అనేకమైన అర్ణవ సప్తక ప్రక్షోభణుడై, విమాన వేగా నిక్షేపణుడై, సముద్రాదినిక్షేపణుడై, సర్వభూతశక్తి ప్రక్షేపణుడైన రావణుడు తనకు అన్న కావటం అదృష్టం అని పొంగిపోయింది. అన్యదాభిమర్శనుడు, అఖిల దివ్యాస్త్ర శస్త్రప్రయోక్త. సంయమిజనసప్తతంతు విఘ్నకరుడు. భోగవతీపతివాసుకిని ప్రధనరంగంలో పరాజితుణ్ణి చేసినవాడు, తక్షకుని ఓడించి అతని భార్యను హరించి, కైలాసంలో యక్షపతి కుబేరుణ్ణి వాని పాదాక్రాంతుణ్ణి చేసుకుని తత్క్షణమే పుష్పక విమానం తెచ్చినవాడు. సుందరాతి సుందరమైన నందన చైత్ర రథవనాలను నిర్భయంగా నేలమట్టం చేసినవాడు. ఉదయించే సూర్యచంద్రుల అరచేతితో ఆపే బలసంపన్నుడు. లోకం హాహాకారాలు చేసేలాగా పదివేల సంవత్సరాలు ఘోరంగా తపంచేసి, పదితలలు నరికి అగ్నికుండంలో వ్రేల్చి పరమేష్ఠిని ప్రసన్నం చేసుకున్నవాడు. అతనిచే, దైతేయ, దేవ, గంధర్వ, పిశాచ, పతంగ, పన్నగ, యక్ష, కిన్నర కింపురుషాదులచేతనే కాక, మనుష్య జాతి కాని ఇతర సమస్త ప్రాణులచేత సమరంలో చావులేకుండా వరాలను

పొందినవాడు, హోమాలనుచెరచి, సోము న్ని హరించి, ఫలించే యజ్ఞాలను పాడుచేసి, బ్రహ్మహంతయై, దుష్టుడై, బాధకర్ముకుడై, దయాహీనుడై, అహితహితరతుడై, శత్రుహతకుడైనవాడు, తప్పక తన కోరిక తీరుస్తాడని తలపోసింది.

రాక్షసకుల వర్ధనుడూ, ప్రత్యక్ష కాలాంతకుడూ, సర్వభూషణా లంకృతుడూ, భూతచయరావణుడూ, గీర్వాణ జగద్విద్రావణుడూ, అట్ట హాసహూత్ర దేవకామినీగర్భ విస్రావణుడూ, వింశతిభుజబలభంజితకఠిన దంత కైరావణుడూ, లోకపీడన పరాయణుడూ, దుష్టరాక్షసజన తురాయణుడూఅయిన రావణుని క్రూరరాక్షసి శూర్పణఖ వీక్షించి భయంతో చేరబోయింది.

## రావణుని శూర్పణఖ నిందించుట

మంత్రిశేఖరులతో దానవేశ్వరుడు ఇష్టాగోష్ఠిలో నున్నాడు. బలిసిన ఎంద్రివలె, నిప్పుత్రొక్కిన కోతివలె, మనుజానితిన్న పులివలె సభామర్యాద నైనా పాటింపక, రక్షో విభుడన్న గౌరవంలేక, అగ్రజుడన్న అభిమానం లేక, కర్ణనాసికాచ్ఛేదంతో కారిన నెత్తురు గట్టిపడి చారలు కట్టి వికృతంగా కనుపిస్తున్న మొగంతో, పీడిన నాచువంటి వెంట్రుకలు విరియబోసుకుని, రోషంతో రొప్పుతూ, అవమానంతో ఏడుస్తూ సభ అదిరిపడేలాగా ఆకాశం మీద నుంచి హఠాత్తుగా దిగింది. మిన్నువిరిగి మీదపడినా చలించని పంక్తికంఠుడు బ్రుక్కిపడ్డాడు. సమన్వయం చేసుకొనేలోపల శూర్పణఖ "ప్రమత్తుడా, దుర్మదుడా! ఎల్లప్పుడు కామభోగాలతో జాల్మరవై, నిరంకుశుడవై నిన్ను సకుటుంబంగా మ్రింగటానికి సమీపించిన మృత్యువును కనిపెట్టలేకున్నావు. నిరంతరం గ్రామ్య భోగాలపై ఆసక్తి, రక్తి కలిగి కామప్రవృత్తిలో బడి తిరిగే రాజును శ్మశానంలోని అగ్నివలె చూస్తారు కాని, సవనాగ్నివలె గౌరవిస్తారా? మతిచెడగొట్టుకుని, ఎవడు రాజ్య కార్యాల స్వయంగా చూడకోడో, వాడు సహకార్యజాలుడయి స్వరాష్ట్ర సంపదలతో సర్వనాశం అయిపోతాడు. ఏ ప్రభువు చారచక్షువుగాక, విచారణదక్షుడు గాక, ప్రసన్నముఖుడై సాటెప ప్రజలకు దర్శనం ఈయక, అన్నివేళల్లో

అంతఃపురంలోబడి, అవసర కార్యాల్లో ఎవరి మాటలనో నమ్ముతూ, అస్వతంత్రుడుగా వుంటాడో వాణ్ణి పౌరులు బురదను ఏనుగు పరిహరించిన విధంగా పరిహరిస్తారు.

ఉన్మత్తుడా! నీవు పొందిన విజయాలలో పొంగిపోతున్నావు: కాని, నీవు రాక్షసలోకానికంతటికీ ప్రమాదమన్న సంగతి మరచిపోయావు. తాము స్వయంగా చేయవలసిన పనులు ఇతరులపై ఎవరు పెడతారో వారు వాళ్ళ చేతనే ఊబిలో పూర్తిగా మునిగిపోతారన్న సామాన్య రాజనీతికూడా పాటించక ప్రవర్తిస్తున్నావు. వీథివానివలె తినేవాడూ, ఇంటివానివలె చేసేవాడూ లేనట్లు నీ పని నీ వలె ఇతరులు చేస్తారా? నీ ఉపకారం చేయటం కోసం దేవదానవుల రంధ్రాన్వేషణ చేస్తుండే మదిర త్రాగి మదవతులతో కాలం గడుపుతున్నావా? ఇంత రాజ్యానికి అధిపతివైనా ఒక్క చారుణ్ణికూడా నియమించుకోలేవే? ఇంక నీ రాజరికం ఏమి నిలబెట్టుకుంటావు? నీ ప్రాణం ఎలా కాపాడుకుంటావు? నీ కింకా పసితనం పోలేదు. చురుకుతనం రాలేదు. చేయవలసిన పనుల్లో వ్యగ్రత లేనేలేదు. ఇటువంటివాణ్ణి ఎంత కాలం ప్రభువుగా ప్రజలు మన్నిస్తారు?

వేగులతో ఎప్పటికప్పుడు శత్రువుల మర్మాలు తెలుసుకుంటూ, వాళ్ళ ఎత్తులకు పై యెత్తులు వేస్తూ, స్వీయమంత్రాంగం బయల్పడకుండా రక్షించుకోవటంలో జాగ్రత్తపడుతూ వుండని రాజును ప్రకృతి జనులు తమ కంటే హీనుడని తలుస్తారు. దూరదర్శి అనే బిరుదు రాజుకు వుంది. ఆతడు దేశం నలుమూలలా తన చారులను పంపి రహస్యాలను సేకరిస్తూ, ప్రతిక్రియ మార్గాలు ఆలోచిస్తూ, పొరుగుల ఉపద్రవం రాకుండా పాలిస్తూంటాడు కనుక ఆ బిరుదు అతని కిచ్చారు. నీ పట్ల అది నిరర్థకం. ఈ విధంగా మంత్రులు సేవించగా, పరివారం భోగాలు సమకూర్చగా సుఖం మరగిన నీవు, నీ శత్రువులచే జరిగిన స్వజనవినాశనజనస్థానలయం ఎలా తెలుసుకోగలవు? పద్నాలుగువేల సైన్యం ఖరదూషణాది బంధు సహితంగా రాముని వింటికోలకు బలి అయిపోయింది. నీ అనుజుల నంపర్కి

నిర్మూలనంచేసి, ఋషుల కభయప్రదానం ఇచ్చి, దండకారణ్యాన్ని ఒక్క రాముడు నిర్భయం చేశాడు.

వట్టి పిసినిగొట్టు పెద్దమ్మవు. వేగులవాళ్ళకు వేతనమిచ్చి పెట్టుకో లేకపోయావు. వున్నవాళ్ళకు తగినంత జీతం ఇవ్వవు. వాళ్ళకూ, వీళ్ళకూ వశవర్తివై కార్యతంత్రాలను కాలతన్నావు. మందబుద్ధివై ఎప్పుడూ మత్తుతో వుండి మంత్రులతో వ్యర్థంగా మంతనాలు సలుపుతావు. మీదెరుగవు. స్వదేశంలోనే కీడు జరుగుతుంటే ఇంతవరకు నీ వెరుగవు. నిన్ను ఏమని మందలించాలో తెలియటం లేదు. జీతభత్యాలు సరిగా ఇవ్వక, ఇచ్చింది సరిపడునంతగా ఇవ్వక లోభిగా సంచరించే రాజును కష్టాలు చుట్టుముట్టుకుంటే భటవర్గం కనీసం కన్నెత్తి కూడ చూడదు. వృథాగా కోపిస్తూ, అకారణంగా అహంకరిస్తూ తన్ను తాను పొగడుకొనే భూపతిని సేవకులూ, స్వజనమే చంపుతారు. తెలివితేటలతో కార్య తంత్ర సంచయం తీర్పక, ఆపదలు నెత్తిన పడ్డా ఆలోచింపక, సంప దంతా పోయి సన్యాసిగా తయారై, గడ్డిపోచకున్న విలువకూడా లేక దిక్కుమాలి తిరిగేవాడు ప్రభువైనా పౌర జనం చులకనగా చూస్తారేకాని సామాన్యుని పట్ల పొందే జాలైనా పొందరు. ఎండిన కట్టెలకూ, మట్టి పెళ్ళలకూ, చివరకు దుమ్ముకైనా ప్రయోజనం వుంటుందేమో కాని, ప్రభువుగా వుండి భ్రష్టుడైనవాడు చిల్లిగవ్వకూ, చీపురు పుల్లకూ కూడా పనికిరాడు. కట్టి విడిచిన బట్టలాగా, పెట్టి తీసిన పూలదండ లాగా రాజ పద భ్రష్టుడైతే రాజు నిరర్థకుడే అవుతాడు. ఎవడు అప్రమాద బుద్ధియో, ఎవడు విషయ విచక్షణా సహితుడో, ఎవడు ఇంద్రియ నిగ్రహుడో, ఎవడు కృతం తెలిసి నడుస్తాడో, ఎవడు ధర్మశీలుడో అట్టి ధారుణీపతి చిరకాలం స్థిరసౌఖ్యం అనుభవిస్తాడు.

నయనాలు మూసి నిద్రించినా, నయదృష్టితో మేలుకుని అనయం వుంటూ, లోపల రాగద్వేషాలు వున్నా, కనుపడనీయక ఎక్కువ దయా, తక్కువ కోపం చూపించే నృపతిని అఖిలజనులు ఆదరిస్తారు. గౌరవిస్తారు. అవసరమైతే ఆత్మత్యాగం కూడా చేస్తారు. నీయందు ఎంత వెతికినా వివేకలేశం లేదు. పౌరుషానికి లోటులేదు. ప్రతీకారానికి పేరుమోశావు. ప్రశస్తి

శ్రేణిని పాదాక్రాంతం చేశావు. కాని చారచక్షువు లేకపోవడంతో జనస్థానం అకాల లయాన్ని పొందడం అరయలేకపోయావు. లౌకిక భోగాల్లోపడి శత్రువులను ఉపేక్ష చేశావు. అధికారణంగా ఆత్మీయులైనవారంతా హతులైనారు. దేశకాల పాత్ర విభేదాలు తెలిసికోలేవు. గుణదోషాలను గ్రహించే కౌలదిలేవు. కాబట్టి "లంకేశ్వరా! త్వరలోనే సర్వసంపదలకు దూరమై వ్యసనం పొందే వేళ రానుంది." అని నిర్దాక్షిణ్యంగా, కఠిన కర్కశంగా పలుకుతుంటే, రాక్షసలోకభర్త, ధన భుజ వర బల గర్వ దర్పితుడు కొంతకాలం విచారించి, కళ్ళు ఎర్రబడగా ఎత్తికోలు మాటలతో హేళన చేస్తున్న చుప్పనాతిని చూచి, "చెల్లెలా! అక్కడ జరిగిన సంగతి సర్వం వచించు. ఎవడా రాముడు? ఏపాటి పరాక్రమవంతుడు? రూపం ఏవిధంగా వుంటుంది? వాడు దండకారణ్యానికి రావటానికి కారణం ఏమిటి? సోదరులను ఏ ఆయుధాలతో వధించాడు? అసలు మనవాళ్ళకూ, వాడికీ సంఘర్షణ ఎందుకు వచ్చింది? ఇంత తెలివి గలదానివి నీవుండి కూడా దారుణ మారణ కాండ జరుగుతుంటే నాకెందుకు వార్త పంపలేదు? సహాయ సహకారాలు లేకుండా, ఎట్టి వాహనం లేకుండా, నేలపై నిలిచి మానవుడొక్కడు మహోద్ధతులైన మనవాళ్ళను సంహరించటం ఎలా సాధ్యమైంది? దిక్పాలకులకే దిక్కులేకుండా చేసిన శూర ఖర దూషణులు నానాస్త్రాలతో మరణించటం నాకు అర్థం కావటంలేదు. వాడు అడవిలో ఒంటరిగా వుంటున్నాడా?" అని అడిగాడు.

## రావణునకు శూర్పణఖ రాముని వృత్తాంతం వర్ణించి చెప్పుట

"అన్నా! అవమానభారంతో, ఆత్మీయుల మరణంతో, ఆత్మాభిమానంతో, గంగవెరులెత్తి కాని మాటలన్నాను. క్షమించు. అంతా చెపుతాను. ఆలకించు. ఒకనాటి ఉదయం నేను అడవిలో స్వేచ్ఛగా తిరుగుతూ, పంచవటికి పోయాను. అక్కడ చక్కగా వున్న పర్ణశాల కనపడింది. ఇంతకు పూర్వం లేని ఈ ఆశ్రమం ఎప్పుడు వెలిసింది? ఎవ్వరున్నారు? ఎందుకు వచ్చారు? అన్న ఆరా తెలుసుకుందామని అక్కడికి వెళ్ళా. పర్ణశాల ముందర దర్భలు ఆసనంగా పరచుకుని, ఆజానుబాహుడు, పీనవక్షుడు, జలధరశ్యా-

ముడు, విశాలనేత్రుడు, ప్రసన్న వదనుడు, గుణ గాంభీర్యుడు, జటాకృష్ణాజిన వల్కలాంబరధారుడు పద్మాసనస్థుడై కూర్చుని వున్నాడు. అతనికి వామపార్శ్వం వైపున జగదేక సుందరి కూర్చుని మాట్లాడుతున్నది. కొంచెం దూరంగా తప్త కనక వర్ణుడు, అతికోపుడు, రూక్ష వీక్షణుడు, సునిశిత బుద్ధిశాలి, అన్నివిధాలా అన్నకు దీటైన తగినవాడు అవసరమైన దర్భలు, సమిధలు, కట్టెలు సమకూర్చుకుంటున్నాడు. నేను వాళ్ళను సమీపించి అడుగవలసిన ప్రశ్నలు అడిగాను. అతడు శాంతంగా తాను అయోధ్యాపతి దశరథుని పుత్రులమనీ, పేరు రామలక్ష్మణులనీ అతడు తమ్ముడనీ ఈమె జనకమహర్షి కూతురు, పేరు సీత, నాకు భార్య అని చెప్పాడు. తండ్రి ఆజ్ఞానుసారం కొంతకాలం ఇక్కడ వుండవలసి వచ్చాం. నీవెవరని నన్ను ప్రశ్నించాడు.

నేను లంకేశ్వరుడైన రావణుని కూరిమి తోబుట్టువనీ, పేరు శూర్పణఖ అనీ, మేం పౌలస్త్యులం, బ్రహ్మవంశం వాళ్ళమనీ చెప్పాను. అతడు విని వూరకున్నాడు. కానీ, నేనే తొందరపడ్డాను. అతణ్ణి మానవ శ్రేష్ఠుడని గుర్తించినా, అతని భార్యను చూచి అసూయ పుట్టింది. ఎందుకంటే ఆమె అతని ప్రక్కనగాక నీ ప్రక్కన వుండాలని. ఆమెను నీకు బహూకరించి నీ మన్నన పొందుదామనుకున్నాను. ఆ భావం నాకు కలగటానికి కారణం లేకపోలేదు. ఆమె సౌందర్యం అట్టిది. యక్షకాంతలను, కింపురుషాంగనలను, దైత్య కామినులు నాగకన్యలను, గంధర్వ భామినులను, అప్సరసలను చూచాను. వారంతా ఈమె పాదనఖాగ్రం ముందు పనికిరారు. ఆమె రాముని ప్రియదార. రమణీయ సంచార. జగద్విదితయశఃకలిత. రంభోరు లలిత. సారంగనాస జ్యోత్స్నాస మహాస. శృంగార సదన. పూర్ణచంద్రవదన. భక్తిమహిత భావపూర్ణ. దివ్యహేమవర్ణ. అలినీ కుంతలభార. సుజ్ఞానసార. పంచాననమధ్య. త్రిలోకారాధ్య. సీతాభిధాన. సుశ్రీనిధాన. అపరలక్ష్మిలాగా, వనలక్ష్మివలే వున్న అందాల రాణిని అపహరించాలని ఆశ పుట్టింది. ఎవడికి సీత భార్యో, ఎవడు ఆమె ఆలింగన సౌఖ్యంలో ఆనందిస్తాడో వాడు త్రిలోకాధిపత్యాన్ని సయితం కాలదన్నతాడు. ఆ వుదారభావ విహార నీకు తగిన దారా అని నిర్ణయించి, మీ ఇద్దరినీ

ఓర్చి చూచి హఠాత్తుగా ఆమెను సమీపించాను. నా మోసం మారంగా వున్న లక్ష్మణుడు గ్రహించి తటాలున నావద్ద నిల్చి అడ్డుకుని, ఆడుదానను కనుక చంపక ముక్కు చెవులు కోసి అవమానించి పో పొమ్మని హెచ్చరిస్తూ ముందుకు త్రోశాడు. ఆ బాధలో జనస్థానానికి పోయి ఖర దూషణులతో చెప్పి ఏడ్చాను. వాళ్ళు నన్ను ఓదార్చి, ముందు పధ్నాల్గుమందిని వాళ్ళపైకి పంపారు. వాళ్ళు సైన్యంతో వెళ్ళి చచ్చారు. ప్రతికక్షి సాధ్యం కాదని ఖరుడు స్వయంగా సమరం సల్పాడు. మూడు గడియల కాలంలో అంతా హతమైపోయారు నీకు చెప్పే వ్యవధానమేదీ? ఆ రాముని యుద్ధం ఏమిటో. అంతా ఆశ్చర్యంగా వుంది

కాండ సంధానం, కాండ వికర్షణం, కాండ ప్రయోగం కాంచ లేకుండా జరిగింది. బాగా పండిన పైరుపై వడగండ్లు పడితే నేల పాలైనట్లు నేల కూలుతున్న సేన మాత్రం కనుపించింది. బంగారు తొడుగు గల కోదండం ధరించి బాణాలు విసురుతుంటే పగపట్టిన త్రాచులు పైకురికినట్లు మనవాళ్ళపై పడ్డమేమిటి, ప్రాణాలు హరించటమేమిటి, ఏకకాలంలో జరిగిపోయేది. ఇందుకు ఎవర్ని నిందించినా ప్రయోజనంలేదు. ఇది స్వయం కృతాపరాధం. అక్కడికెందుకు పోవాలె? పోయి ఆ సీతను ఎందుకు చూడాలె? చూచి వూరుకోనక నీ కోసం ఆమెను అపహరించాలని ఎందుకు ప్రయత్నించాలె? అందుకు ప్రతీకారంగా ముక్కు చెవులు పోవటం కాక ఆత్మబంధువుల అందర్నీ ఎందుకు పోగొట్టుకోవాలె? ఈ సంగతి నీకు చెప్పి నిన్నుకూడా కలహంలోనికి కాలు దూర్చేట్లు ఎందుకు చేయాలె? అన్నా! అసలుమాటగా చెప్పుతున్నాను. ఆ సుందరి మాత్రం నీవు కోటి జన్మలెత్తినా నీకు లభ్యంకాదు. నా మాటలలో నమ్మకం లేకపోతే నీవు పోయి చూడు. చూచి నేనెందుకు అపహరణానికి యత్నించానో తెలుసుకో. ఆమెను చూచి నీవు ఒంటరిగా రాలేవు. ప్రాణాలైనా ఇస్తావు. లేకపోతే ఆమెనైనా తెస్తావు. నేను చెప్పింది నీకిష్టమైతే ఇప్పుడే లే. అపసవ్యపాదం జయార్థం ముందుపెట్టు. వాళ్ళు బ్రతికి వుండగా ఆమె నీకు స్వాధీనం కాదు. కనుక యుద్ధసన్నద్ధుడవై పో. నీ బలమెంతో, ఈ జరిగిన పరిణామాన్ని బట్టి శత్రువుల బలమెంతో సరిగా నిర్ణయించుకో. అంతేకాని, నా మాటలపై

విశ్వాసం వుంచి కార్యక్రమానికి దిగవద్దు. వాళ్ళను వుపేక్ష చేస్తే మన కులానికే విపత్తు వస్తుంది. దండకారణ్యంలో వున్న తాపసులందరికీ రాముడు దైత్యవధ చేసి రక్షిస్తానని అభయం ఇచ్చాడు. ఆ మాటకు అంకురారోపణం జరిగింది ఇకముందు ఏమి చేస్తారో ఎవరికీ తెలియదు. సీతాపహరణం ముఖ్యమని ఎందుకు చెప్పానంటే, వాళ్ళను యుద్ధంలో గెలవటం నభూతో నభవిష్యతి. వాళ్ళు బ్రతికితే మనం బ్రతకటం కూడా నభూతో నభవిష్యతి. అందుకే ఆలోచించి, "ఏక క్రియాత్ ద్వ్యర్థకరీ బభూవ" అన్నట్లు ఆమెని గ్రహిస్తే అవమానంలో రాముడు ముందు చస్తాడు. అతనితో తమ్ముడు లక్ష్మణుడు చస్తాడు. ఆమె నీకు అంతఃపురాంగన అవుతుంది. విషయంలోవున్న రహస్యం విప్పిచెప్పాను. అనుకూల ప్రతికూలాలు నీవే ఆలోచించుకో. అనుజన్మల ఆత్మలకు శాంతికలిగేట్లు ప్రవర్తించు" అని తాను రాముని కామించి తగాదా తెచ్చానన్న సంగతి మాత్రం మరుగుపరచి తక్కినదంతా, వున్నదున్నట్లుగా శూర్పణఖ చెప్పింది. సావధానంగా క్షణదాచరపతి (రాత్రి చరించేవాళ్ళ నాయకుడు) విన్నాడు. సోదరిని హర్మ్యానికి పంపాడు.

## రావణుడు రహస్యంగా మారీచాశ్రమానికి పోవుట

చెల్లెలు చెప్పిన సీత సౌందర్యం భావించి రోమహర్షణుడయ్యాడు. అనుజాతను పంపిన అనంతరం మంత్రులతో మంత్రాంగం చాలాసేపు సాగించాడు. తర్వాత వాళ్ళకు సెలవిచ్చి, తాను ఏకాంతమందిరంలో, పన్నే వ్యూహాన్ని పలుసార్లు వెనకాముందరా చింతించి, స్థిరనిర్ణయానికి వచ్చి వాహనమందిరంలోకి వెళ్ళాడు. "అకంపనుడు చెప్పిందానికీ, చెల్లెలు శూర్పణఖ చెప్పిందానికి ఏమీ భేదం లేదు. కార్యసాధనం కావాలంటే కలహం ముందు పనికిరాదు. సీతాపహరణం జరిగితీరాలె. ఎవరు దీనికి తోడ్పడతారు? ఇటువంటి సంశయ సమయాల్లో మారీచునివంటి మర్మజ్ఞుడు, మాయకుడు ఇంకొకడు లేడు. ఇంతకుపూర్వం ఈప్రస్తావన చేస్తే మంచిదికాదని మందలించాడు. మళ్ళీ అనే విషయం అతనికిచెపితే అంగీకరిస్తాడా? తిరస్కరిస్తాడా? నేనర్థించటం, అతను తిరస్కరించటం

జరిగే పని కాదు. ఏమైనా అతని సహాయంతోనే అవమానాంబుధి అవతరించాలె", అని తలపోసి సారథిని పిలిచి రథం సిద్ధం చేయమన్నాడు. అతడు కామసంచారమూ, కాంచనాంచితమూ, ఖరపిశాచవదనఖరయుతమూ, అంబుదధ్వానమూ, ధవళాతపత్రమూ, ధవళవాలవ్యజనమూ అయిన తేరు సిద్ధంచేసి తెచ్చాడు. కర్ణకాంచనకుండలాలు కాంతులీనగా, స్నిగ్ధవైడూర్య సన్నిభుడూ, వింశతికరుడూ, దశవదనుడూ అయిన రావణుడు, దర్శనీయంగా వెలిగే పదితలలుగల పర్వతంలాగా, చంచలాబలాకాసహితంగా వున్న శరత్తులాగా రథారోహణం చేశాడు.

ఆ రథం అంతరిక్షపథంలో, చల్లని మంచినీటితో నిండిన సరస్సులనూ, అనేక ఫల పుష్పభరిత వృక్షాలతో నిండిన పర్వతకాననాలనూ, అందలి తాపసాశ్రమాలను, సాల, తాల, తమాల, తక్కోల, నారికేళ, కదలి, కాథకి, పూగ, పున్నాగ, క్రముకాత, కేతకీ, భల్లాత కింశుకాది భూరుహ లతాభూషణంబై, నాగ, సువర్ణ, కిన్నర, గంధర్వయక్షాదుల చేతనూ, అత్యంత మితాహారులైన మునులచేతనూ, జితకాములచేతనూ, వైఖానసులచేతనూ, మాషవంశజులచేతనూ, మరీచిప, వాలఖిల్య, సిద్ధచారణులచేతను అలంకృతమై, నిరంతరం వేద ఘోషంతో, యజ్ఞధూమంతో, పతనపాతకప్రవచనాలతో నిండి భూలోకనాకంగా వున్న వేలాప్రదేశాన్ని చూస్తూ ముందుకుపోయి, వేయిపుపాటలాధరల ఆటలపాటలతో, అంచల, క్రౌంచ పక్షుల మధురమంజుల స్వరసంచయంతో, నీహారతుల్యములూ, నిర్మలములూ, హరివిశాలములూ, హారసంభారములూ, మనోహరగీతవాదిత్రసం జుష్ట దేవయానాలూ తేజరిల్లగా, అచ్చరలూ, వియచ్చరులూ, విజతపోబలసాధిత సమస్త లోకులూ, సువాసనావాసిత వృక్షాలూ, కలిగి కన్నులపండుగమై, ఘ్రాణతర్పణమైన సుందరవనాలతో నిండినదాన్ని, ముక్తాప్రవాళ నీరజసక్తము, స్వచ్ఛజలపూర్ణ తటాకచంచల్లహరీయుక్తము, వృక్షలతాగుల్మవ్యక్తము, విత్తధాన్యవనితాజనతాయుతమైనదాన్ని. కరితురగ స్యందనభరితమై, మలయమారుతసంచారమై మనసునకు ఆహ్లాదం కలిగించే దాన్ని వేలాతీరస్థదేశాన్ని కాంచి క్రిందికి చేరువగా వచ్చి, శతయోజనాయత శాఖలతో ప్రకాశించుచున్న మహా వటవృక్షాన్ని సమీపించింది.

పూర్వం గరుత్మంతుడు గజకచ్ఛపాలను కాళ్ళగోళ్ళలో ఇరికించు కుని, తినటానికి ఈ మర్రికొమ్మపై వ్రాలగా, అతని భారం సహించలేక పెళ్ళున విరిగింది. ఆ కొమ్మపై వాల ఖిల్యాదులు తీవ్రంగా తపస్సు చేస్తుంటే వారి తపానికి భంగం రాకుండా దాన్ని ముక్కున కరచుకుని పోతూ, దారిలో ఒంటికాలుతో వాటిని భక్షించి, నిషాదుల విషయం చెరచి, మునీశ్వరుల ముస్తలగా నొనర్చి, ద్విగుణీకృతవిక్రముడై గగనానికిలంఘించి, వైజయంతిలో ఇనుపకమ్ముల కిటికీలను పగిల్చి, నాగరక్షణతో దాచిన అమృతాన్ని హరించి తల్లి దాస్యం బాపినట్టి చరిత్రకు స్థానమైనదీ, అరుణ సోదర కృతచిహ్నమైనదీ, సుభద్రమనే పేరు గలదీ అయిన అవటవృక్షాన్ని అధిగమించి, సముద్రతరణంచేసి, ఖిరాశనుడై, మృగచర్మధరుడూ, జటా ధారుడూ, వల్కలాంబరుడూ అయి తపస్సు చేసుకుంటున్న తాటకానందను డైన మారీచుని ఆశ్రమంలో ఆగిపోయింది.

## రావణుడు మారీచునితో జనస్థాన వృత్తాంతం చెప్పుట

రథావతరణం చేసి రావణుడు ఆశ్రమంలో ప్రవేశించాడు. వచ్చిన ప్రభువును యథావిధి పూజించి ఆతిథ్యం ఇచ్చి మారీచుడు "రాజా ! అంతా క్షేమంగానే వున్నారు కదా? ఇంత త్వరలో మళ్ళీ రావటానికి అవసరం ఏమి వచ్చింది? మాటిమాటికి ప్రభువులు రాజకార్యాలు మానుకుని ప్రకృతి జనులకోసం వచ్చిపోతుంటే, తెలియనివారు నిందలు వేస్తారు. ఎన్నో అనుమానాలకు అవకాశం వస్తుంది. సన్నిధానానికి పిలిపించాలి. అవసర మైతే కొలదికాలం మాత్రమే అతనికి ఏకాంతం ఇవ్వాలి. నాకు తెలిసినంత వరకు ప్రమాదాలు ఏమీ వున్నట్లు లేవు. చేయవలసిన యుద్ధాలుకానీ, ఆక్రమించవలసిన రాజ్యాలుకానీ, అణచవలసిన శత్రువులుకానీ లేనే లేవు. ఇంక ఈ రహస్య గమనానికి హేతువేమిటి?" అని రావణుని ప్రశ్నించాడు. "మంత్రీ! జాగ్రత్తగా విను. నేను స్వయంగా వచ్చానంటే ఎంత అవస రమో అది ఆలోచించు. నేనిప్పుడు ఆర్తుడనై వున్నాను. నీ సహాయం కోరి వచ్చాను. నీకంటే వేరే శరణ్యం నాకు లేదు. లోగడ వచ్చినప్పుడు జనస్థానాన్ని గూర్చి నీకు కొంత చెప్పాను. అప్పుడు నీ హితం పాటించి

జరిగిన సంగతి సమగ్రంగా విచారించి తెలుసుకున్నాను. నా సోదరులైన ఖరదూషణులు, చెల్లెలైన శూర్పణఖయు, త్రిశిరాదులు సేవింపగా పద్నాలుగు వేల తీవ్ర తేజులతో, శూరులతో జనస్థానం నివాసస్థానంగా చేసుకుని, ధర్మరతులను, తాపసులను బాధిస్తూ, మానవలోకభయంకరులుగా దండకారణ్యాధిపతులుగా వున్న సంగతి నీకు తెలుసు కదా? అక్కడ మనవాళ్ళ చేత పీడింపబడే మునులంతా చేరి తండ్రిచేత వెళ్ళగొట్టబడిన ఈ రాముణ్ణి ఆశ్రయిస్తే, ఈ పరాధముడు వాళ్ళకు అభయం ఇచ్చాడట. అది తెలిసి నా చెల్లెలు వాళ్ళ గుట్టుమట్టులు గుర్తించాలని వాళ్ళున్న పంచవటికి పోతే, రాముని తమ్ముడట, లక్ష్మణుడట, నిష్కారణంగా పట్టుకుని కర్ణనాసికాచ్ఛేదం చేసి "నీ దిక్కున్న చోటికి పో. నీ మాయలు ఇక్కడ సాగ"వని ఎన్నో కారుకూతలు కూశాడట. ఆ సంగతి ఖరదూషణులు విని ససైన్యంగా యుద్ధానికి పోతే, ఒక్క పరుషవాక్యమైనా పలుకకుండా, బాణాలతో ప్రాణాలు తీశాడు. ఇక అక్కడ మన ఆటలు సాగవు. మన అధికారం మట్టిపాలైంది. ఇది ఇంతటితో ఆగుతుందో, లేక మనదాకా వస్తుందో చెప్పలేం. పరసహాయం లేకుండా, పదాతిగా మన ఆత్మీయులను సమరహోమం చేసినవాణ్ణి 'మన కెందుకులే' అని వుదాసీనంగా వూరకుంటే ఇంక నా రాజత్వానికి అర్థం ఏముంది? ఎక్కడ రాక్షసుడు కనపడ్డా యమలోకానికి ప్రయాణం కట్టిస్తాడు. ఇటువంటి విషయాల్లో నీ బుద్ధి విశేషంగా పనిచేస్తుంది. అందుకే నీ సహాయం అర్థించి వచ్చాను."

## రావణుడు మారీచుని తోడ్పడుమని వేడుట

అది ఏమిటో వివరిస్తా విను. ఎదురుపడి యుద్ధం చేయటంకాదు, మోసం, నయవంచన. రాముడు భార్యను విడిచి బ్రతకలేడు. వట్టి ఇంద్రియలోలుడు. తనకంటే చిన్నవాడైన తమ్ముడు భార్యను విడిచివస్తే, తానేమో భార్యను వెంట తెచ్చుకున్నాడు. ఇంతకంటే వేరే నిదర్శనం ఎందుకు? ఈ బలహీనత సాకుగా తీసుకుని అతని భార్యను అపహరిస్తాను. భార్యావియోగకర్శితుడై, బాధపడుతూ మతిభ్రష్టుడై తిరిగేవేళ అతణ్ణి చంపుతాను. నీవూ, నా తమ్ముళ్లూ బాసటగా నిలిస్తే నిర్జరకోటినైనా నేలపాలు చేస్తాను.

నన్ను గూర్చిన సర్వవిషయాలూ నీ వెరుంగుదువు. నన్ను రాముడు కాదు, వాణ్ణి పుట్టించినవాడికూడా సాధ్యం కాదు. వీర్యంలోగాని, దర్పంలో గాని, వుపాయంలోగాని, మాయలోగాని నిన్ను మించినవాడులేడు. నీకు నీవే సాటి. ఆ సంగతి తెలిసే కదా అందర్నీ వదలి నీ వద్దకు వచ్చాను. అందుకు "నన్నేం చేయమంటా"వని అడుగుతావేమో. నే నాలోచించిన ఎత్తుగడ చెపుతా. నీవు పంచవటిలో రాముని పర్ణశాలకు సుదూరంగా వాళ్ళకు కనుపించీ. కనుపించకుండా శరీరంనిండా బంగారు వన్నెచిన్నెలు వెలుగుతుండగా లేడిరూపంతో అమాయకంగా తిరుగుతూ వుండు. సీత నీ అందానికి ఆశపడి అన్నదమ్ములను నీకోసం పంపుతుంది. భార్యకై ప్రాణా లర్పించే రాముడు తప్పక ఆమె కోరిక తీర్చటానికి తమ్ముడితో నీ వున్న చోటికి వస్తాడు. క్రమంగా కూతవేటు దూరం కొనిపో. వాళ్ళ దృష్టిపథం నుంచి వర్ణశాల తప్పగానే, నేను రాహువు చంద్రుణ్ణి గ్రహించినట్లు సీతను గ్రహించి తగినచోట దాస్తాను.

ఆ తర్వాత వాళ్ళ నీడలాగా వెన్నంటి అవకాశంచూచి అంతం చేస్తాను. ఇంతమాత్రం నాకు తోడుపడు. ఇది నీకొక లెక్కలోది కాదు. నీవు చేయవలసిందల్లా అన్నదమ్ములను ఆమెనుంచి వేరుచేయటం ఒక్కటే. తక్కిన కార్యమంతా దానవేశ్వరుడేచేస్తాడు" అని మారీచునితో దశవదనుడు చెప్పాడు. రావణుని పల్కులు వినగానే మారీచునకు పయి ప్రాణం పైనే పోయింది. చకితుడైనాడు. నిశ్చేష్టితుడైనాడు. నోరెండిపోయింది. కంటి చూపు నిల్చిపోయింది. ఎండిన పెదవులు తడుపుకుంటూ, బిగువు జారి పోగా, ప్రేతకల్పుడై, రావణునివంక చూడలేక చూస్తూ, వుభయులకు క్షేమం కలిగేవిధంగా చేయి మోడ్చి చెప్పసాగాడు. "ప్రభూ! నన్ను గురించి, నిన్ను గురించి నీవు చెప్పింది నిజమే. ముఖప్రీతిగా మాట్లాడే వారు లోకంలో కోకొల్లలు. వినటానికి అప్రియంగా వున్నా సత్యమైన మాటను జంకకుండా చెప్పేవాడూ, వినేవాడూ అరుదుగా వుంటారు. మొదట నీకు సీతపై మోహం ఎవరు కల్పించారో కాని అది నీకు తీరని మానసికజాడ్యంగా మారింది. సీతాపహరణం చేటుకు మూలం. బుద్ధి పూర్వకంగా మృత్యువును కొనితెచ్చుకోవటం. నీవు చెప్పినంత పరాక్రమ

వంతుడవైతే ఖరదూషణులవలె కయ్యానికే కదలివెళ్ళాలి. కాని, వీరుడు లాగా, ఆడదానిని అపహరించటం దేనికి? "పృష్ఠతాడనాత్ దంత భగ్నః" (ముడ్డిపై తంతే మూతిపళ్ళు రాలినవి) అన్నట్లు మనోవికారం వేరుగానూ, మాటలు వేరుగానూ ఎందుకు చెప్పటం? నిష్కారణంగా శూర్పణఖ చెవులు ముక్కు కోశారని చెప్పావు. అసలక్కడే జరిగింది అనర్థం. శూర్పణఖ స్వేచ్ఛా సంచారిణి. వాళ్ళ అందాన్ని చూసి ఆశించిందో. లేక సీత చక్కదనాన్ని నీకు వశం చేయాలని తలంచిందో, ఈ రెంటిలో ఏదో ఒకటి జరిగివుంటుంది. [illegible] కనుక అవమానించి పంపారు అని నా వూహ.

అంతటితో ఆగక అహంకారంతో, అనాలోచితంగా ఆయన పైకి మనవాళ్ళంతా యుద్ధానికి సిద్ధపడ్డారు. ఆయన చేయవలసిన పని చేశాడు. అంతేకాని, మునీశ్వరులకు అభయం ఇచ్చానని తనంతటతానుగా మనపైకి రాలేదు. మొదట తప్పు చేసింది మనం. ఆ తప్పు సమర్థించుకోటం నిమిత్తం ఇంకా తప్పులు ఎందుకు చేయటం?

## రావణునకు మారీచుడు రాముని బలపరాక్రమాలను తెల్పుట

నీ కిదివరలో కొంతవరకు రాముణ్ణి గురించి చెప్పాను. అప్పటికి అంతే అవసరమైంది. ఇప్పుడు పూర్తిగా చెప్తాను. నీవింత దేశాన్ని పాలిస్తున్నా వేగులను నియమించుకోలేవు. అందుచేత ఎవరెట్టివారో నీకు తెలియదు. నాకా మహావీరుని సంగతి ఎలా తెలిసిందో కూడా చెపుతాను. ఆ పూజ్యునికి ఆగ్రహం కలుగకుండు గాక. ఈ జగత్తులోని రాక్షసకులం నిర్మూలం కాకుండు గాక. తండ్రీ! నీవు చిన్నవాడవు. మేం హర్షించి నిన్ను పెద్దను చేశాం. నీమీద కొండంత ఆశలు పెంచుకున్నాం. ఆ కారణంచేత నీకు అనిష్టమైనా కొన్ని సత్యాలు చెప్పక తప్పదు. నిలువునా నీ ప్రాణాలు తీయటానికి జానకి జన్మమెత్తకుండు గాక. ఆమెకై నీవు చేసే దుష్టయత్నంలో నాకు ఏ విధమైన హాని కలుగకుండు గాక. కామ వృత్తుడవు నీవు లంకాపతి కావటం చేత, అజేయుడవై, సాటిలేని సౌందర్యం

కలదైన లంకానగరం నాశనం కాకుండు గాక. విచక్షణారహితుడవై, విశృంఖలంగా తిరిగే నీనుంచి బంధుజనం పాడుకాకుండు గాక.

రావణా! రాముడు క్షత్రియమాత్రుడే కాదు. మనవమాత్రుడేకాదు. ఆకారం తాల్చిన ధర్మం. నడుస్తున్న సత్యం, చూస్తున్న సంయమనం, చేస్తున్న వైదికకర్మం. సంభాషిస్తున్న శాంతం. అంతేకాని, నీవన్నట్లు క్షత్రియపాంసనుడూ, కుశీలుడూ, లోభీ, ధర్మహీనుడూ, అసమర్థుడూ కాదు. ఆయన, తండ్రి బలవంతంగా పంపినా అడవికి రాడు. నీకు చెప్పినవాళ్ళు నిజం చెప్పలేదు. తండ్రి పినతల్లిచే వంచితుడైతే ఆయన్ను ఋజువాదిని చేయటంకోసం, పినతల్లి తృప్తికోసం తనంత తానుగా వనానికి వచ్చాడు. ఆతడు కర్కశుడు కాడు. కళాహీనుడూ కాదు. అవశుడూ కాదు. ఇంద్రియవశుడూ కాదు. రాముడు దేవతలపాలిటి సుత్రాముడు. తాపసులపాలిటి అగ్నిహోత్రకుండం. ఆశక్తులపాలిటి అభయముద్ర. దీన జనులపాలిటి శ్రీసతి. ఆ జానకి లోకపావని. సుమలి సూర్యతేజాన్ని హరించినట్లు నీ తేజాన్నీ, రూపాన్నీ కూడా హరిస్తుంది. ఆలోకేశ్వరి నేనా నీవు అపహరింపబోయేది? ధనురింధనంతో, శరజ్వాలా లిరలతో, జాజ్వల్యంగా వెలిగే రాఘవ వహ్నిలో పడటానికి ఎందుకు పరుగెత్తుతావు? చాపవ్యాదితమైన దీప్తవక్త్రంతో, అస్త్రపాశంతో, నిర్దయతో, సామర్థ్యంతో, విపక్షసంహారుడైన శ్రీ రామచంద్ర దండధరుని ఎదుర్కొని సుఖవ్యాపార జీవాసువుల ఎందుకు బలిపెట్టుకుంటావు? సీతాసహచరత్వంలో ప్రకాశమానుడైన శ్రీరాముని చాపం ఆమె రక్షణలో అప్రమత్తంగా వుండే నీ తరమా ఆమెను హరించటానికి? నరసింహుడైన రాముని సతి పరమ, మహాపతివ్రత, ఆ తల్లిని సమీపించకు. నీ మేలు కోరి చెపుతున్నాను. రాముడు జానకిని ప్రాణాధికంగా ప్రేమించుతాడు. ఆమెకు అపకారం జరిగితే నీవే కాదు చతుర్దశ భువనాలు ఎదురునిల్చినా బాణాగ్నిలో హుతం చేస్తాడు. సాగనిపనికి ఇంత సాహసం చేయకు. ఆతని కంటబడితే ఆయువు తీరినట్లే.

కొంతకాలం రాజ్యభోగ సుఖలాలసుడవై బ్రదుకదలిస్తే, రామునితో విరోధం తెచ్చుకోకు. నీవూ, నీ జాతి క్షేమంగా వుండాలంటే ఆయన

మనస్సును నొప్పించకు. వెంటనే తిరిగి లంకానగరం పో. ధర్మహితుడూ ప్రాజ్ఞుడూ అయిన విభీషణుని సభకు రప్పించు. అతనితో మంతనం సలుపు. చేసే పనిలో మంచిచెడ్డలు నీకు నీవు గాక పదిగురు పెద్దల్లో పెట్టి తేల్చు. స్వపక్ష బలాబలాలూ, పరపక్ష బలాబలాలూ, హితాహితాలూ అన్నీ కూలంకషంగా ఆలోచించు. నాకు తోచిన మాటలు నాలుగు నీకనిష్టమైనా చెప్పాను. ఇటువంటి ప్రాణాంతక, కులాంతక సమయాల్లో, నిష్ఠురంగా ఉన్నా నిజమే చెప్పాలి కనుక చెప్పాను. నేను సదా నీ మేలుకోరేవాడినే కనుక నాకు [illegible] అనిపించిన వాటి తెలిపాను. మరి రెండు మాటలు చెపుతా విను.

## మారీచుడు రావణునితో తాను మున్ను పడిన పాట్లు చెప్పుట

నేను పూర్వం వేయి ఏనుగుల బలంతో, పర్వతాకారంతో, నీల జీమూత సన్నిభమైన శరీరకాంతితో, బంగరుకర్ణకుండలాలు ప్రకాశిస్తుండగా లోకభయంకరంగా ఉన్న శూలాన్ని కేల ధరించి విపులాటవులమెల్లసంచరిస్తూ, దండకారణ్యవాసులైన తాపసులను తింటూ, ఎదురులేక జీవిస్తూండేవాడిని. ఒకనాడు కౌశికుడు ఒక యాగం తలపెట్టి హోమం చేస్తుంటే పొగలేచింది. నేను చూచి పోయి, మాయ కల్పించి సవనాన్ని పాడుచేసి, యజ్వలనందర్నీ తనివితీర భక్షించి వెళ్ళిపోయాను. ఆ తరువాత నాలుగయిదు సార్లు ఈ విధంగానే జరిగింది. కౌశికుడు చండకోపుడూ, శక్తిమంతుడైన తపస్వి అయినా, శపించటానికి ఇష్టపడక, పరిత్యజించిన కోపాన్ని పరిగ్రహించి యుద్ధానికి తలపడక అయోధ్యకుపోయి దశరథుని అర్థించాడు. ఆయన స్వయంగా వచ్చి సవన రక్షణం చేస్తానంటే వద్దని, పన్నెండేళ్ళ బాలుడైన రాముణ్ణి కోరాడు. అందుకు సమ్మతించి, రామునికి తోడు తమ్ముడైన లక్ష్మణుని తోడిచ్చి పంపాడు. తిరిగి గాధేయుడు క్రతువు ప్రారంభించాడు. అలవాటుగా నేను అలవోకగా పోయాను. చాపహస్తులయి, సూర్యచంద్రుల్లాగా భాసిస్తున్న బాలకులు కనుపట్టారు. వరగర్వంతో ఉన్న నేను వాళ్ళను లక్ష్యపెట్టుటకు ఇష్టంలేక మాయతో కల్లూ, మాంసం రక్తం హోమకుండలములో వర్షింపసాగాను. ఆ రాముడు మాయాచ్ఛేదక

మైన వైష్ణవాస్త్రాన్ని ప్రయోగించి నా నిజరూపం గుర్తించి, దారుణాస్త్రాన్ని లక్షించి విడిచాడు. ఆ వేగానికి నూరు యోజనాల దూరములో వున్న లవణసముద్రములో పడి మూర్ఛపోయాను. లక్ష్మణుడు తక్కిన రాక్షసుల తరిగి ముక్కలు కుప్పలుగా పోశాడు. ఈన షోడశ వర్షప్రాయుడైన రాముడే అంత పనిచేస్తే, ఇప్పుడు ఇంకెంత చేస్తాడో వూహించు. అందుకు ఖరదూషణాదుల వధ ప్రాతిపదికగా గ్రహించు.

కాబట్టి రామునితో యుద్ధంగానీ, రామపత్ని అపహరణంకానీ, రామునికి ఆగ్రహంవచ్చే ఏ పనికానీ తలపెట్టవద్దు. ఎవదు రక్షిస్తారని ఆశల పెంచుకుని అసురలోకం అంతా ఆశ్రయించిందో, వాడే వాళ్ళ నాశనకార్యానికి నాంది కావటం నా కిష్టంలేదు. రావణా! లోకజ్ఞానం లేనివాణ్ణి గాదు. నీ మేలూ, దానితో దానవకులం మేలూ దర్శించి నీకు ఈ విషయము ఇంతగా చెపుతున్నాను. సజ్జనుడు తాను స్వయముగా పాపం చేయకపోయినా, పాపుల సహవాసముతో భ్రష్టుడైనట్లు నీ వాక్కుని పాపకర్మలతో, అనుబంధం లేని అసురులంతా వుసురులు వీడుతారు. శూర్పణఖ చేసిన తెలివితక్కువ పనికి బంధుజాలమంతా పాడైపోలేదా! ఒకవేళ మోసగించి నీ ప్రయత్నం సాధించుకున్నావంటే అది నీ కులాంతానికే కూడివచ్చిందని విశ్వసించు. సద్యఃఫలితంగా యుద్ధం జరక్కపోయినా, ముందైనా జరిగితీరుతుంది. ఆ యుద్ధంలో అసురాంగనలంతా విధవ లవుతారు. రామబాణాగ్నికి సుందర లంకానగరం భస్మపటలం అవుతుంది. ఇదంతా నీ తలంపులో నాకు కనబడుతున్నదృశ్యం. పరదారాపహరణం పరమేష్ఠికైనా పనికిరాదు. అహల్యను ఆశించి ఇంద్రుడు చెడ్డాడు. దమయంతిని కోరి బోయ దగ్ధుడైనాడు.

వారికై వారు కోరివచ్చిన కాంతలు వేలసంఖ్యలో నున్నారు. అపురూప సౌందర్యవతులైన ఆత్మదారలున్నారు. స్వేచ్ఛగా అనుభవించు. కామచరులైన రాక్షసులు పరివేష్టించియున్నారు. తెలివిగలమంత్రులున్నారు. బుద్ధిమంతులు, బాహావిక్రములు తమ్ములున్నారు. అశనిసంకాశులైన ఆత్మజులున్నారు. నీ కిపుడేం తక్కువ? నీ క్షేమం గిట్టనివాళ్ళు నీ వాళ్ళల్లో చేరి నీ నాశనం కళ్ళారా చూడాలని చేసిన దుర్బోధ ఇది.

అందరు ఆడవాళ్ళవంటిది కాదు ఆమె. ఆమె బాహ్యసౌందర్యం నీలాంటి నీచకాముక శలభాలకు అగ్నిహోత్రం అని తెలుసుకో. నేను నీకన్న పెద్దవాడనౌటచే పెద్దగానూ, బంధువుడనౌటచే బంధువుగానూ, సచివుడనౌటచే సచివుడుగానూ, మిత్రుడనౌటచేమిత్రుడుగానూ, చనవు తీసుకుని ఇంతగా సంభాషించాను. ఎన్నివిధాల ఆలోచించినా ఈ కార్యం నీకు మేలు కూర్చదు సరి గదా, నీ చావుకు సన్నిహితంగా వుంది.

## మారీచుడు రాముని బారిపడి తప్పించుకున్న సంగతి చెప్పుట

ప్రభూ! ఎంత నిగ్రహించుకున్నా రాముని శక్తి కలతపెడుతూంది. దాచుకోలేకపోతున్నా. గాధేయు సవనరక్షణ సమయంలో ఎలాగో బ్రదికాను. తర్వాత నా వెనుకటి మునీశ్వర సంహారం మానలేదు. రాముడు చిత్రకూటంలో వుండే, మునులంతా అతనికి తెలియకుండా పంచవటికి చేర్చి ఇక్కడి మా బాధంతా చెప్పారు. ఆలకించి అతను అభయం ఇచ్చాడు. అప్పటినుంచీ మేం రాక్షసాకారంతో తిరగటం మానేశాం. నేనూ, కొంతమంది నా అనుచరులూ, లేళ్ళరూపంలో తిరుగుతుంటాం. సమయం దొరకినప్పుడల్లా పర్ణశాలల్లో ప్రవేశించటం, చంపటం, రక్తం తాగటం, మాంసం తింటం చేస్తున్నాం. ఒకనాటి వుదయం పంచవటి ప్రాంతానికి పోయాం. సీతారామలక్ష్మణులు ఆనందంగా ఉదయశోభను వీక్షిస్తూ పర్ణశాలముందుగా కుశలపై కూర్చున్నారు. అంతకుపూర్వం వాళ్ళు వనానికి వచ్చినట్లు కర్ణాకర్ణిగా విన్నానేకాని చూడలేదు. ఆనాడు పాలుగారుతూ చూతపల్లవకోమలంగా వున్న రామలక్ష్మణులు బలిష్ఠ గంభీరమూర్తులుగా కనుపించారు. తాపసవేషం, మితాహారం, భూతావనాసక్తి, శాంతప్రసన్న వదనం, నిర్భయ నిశ్చలత్వం నన్ను ముగ్ధుణ్ణి చేసినై. కాని, పాత వైరం మనస్సులో కలుక్కుమన్నది. శత్రువు చిక్కాడన్న సంతోషంతో గంతులు వేస్తూ, వాడి కొమ్ములు వంచి గుండెల్లో పొడవటానికి చంగున లంఘించాను. ఎలా కనిపెట్టాడో నా భావం సజ్యం చేసివుంచిన కోదండంలో మారుతాస్త్రాలను మూటించిని గుర్చి నాపై ప్రయోగించాడు. ఆ బాణ తీవ్రత ఎటువంటిదో అనుభవం వున్నవాణ్ణి కనుక అందకుండా పారిపోయాను. సహచరులంతా శరాహతికి శమన నిలయం చేరారు.

ఆనాటినుంచీ క్రౌర్యం మానుకుని తాపసవృత్తిలో జీవిస్తున్నాను. రాముని పేరు చెప్పినా, విన్నా నాగుండె కొట్టుకుంటుంది. అప్పటినుంచీ ప్రతి చెట్టునా, గుట్టనా, రాయినా, రప్పనా, రాముడూ, విల్లూ కనపడుతుంటుంది. యముడు పాశహస్తుడై వెన్నంటుతున్నట్లు రాముడు నన్ను వెంటాడుతున్నట్లే భయం కలుగుతూ వుంటుంది. ఈ భయం పోవటానికి నిద్రిస్తే కలలోకూడా రాముడే కనపిస్తాడు. కలవరింతలతో కాలం గడుస్తుంది. ఇంకా విచిత్రం ఏమంటే: రాముడనే కాదు, రకారం ముందు వచ్చే రత్నాలూ, రథాలూ, రామలు అనే పదాలు విన్నా ప్రాణం కంఠగత మవుతుంది. అతనితో అకారణ వైరం వద్దు. బలినీ, నముచినీ జయింపగల సమర్థుడు. నీవు నిజంగా సమర్థుడవైతే, శక్తిసంపన్నుడవైతే, ప్రతీకార భావం బలంగా కలవాడవైతే ఎదురుగా పోయి యుద్ధం చెయ్యి. అంతేకాని సీతాపహరణం మాత్రం చేయకు. ఆమెను కొనిరావటం మృత్యువును లంకకు తేవటం.

నీవింత వైరం పూనటానికైనా సరియైన కారణము లేదు. అహమికతో మన మప్పాతి అకారణంగా వాళ్ళకు ఆగ్రహం కలిగించింది. ముందు భయముకోసం ముక్కుచెవులు మాత్రం కోసి, ఆడది కనుక అసువులతీయకుండా వదిలాడు. అంతటితో ఆగక కడుపులో నీళ్ళు కదలకుండా వున్న ఖరదూషణాదులను ప్రేరేపించింది. కళ్ళుగానక కయ్యానికి తలపడి అంతా కాలధర్మం చెందారు. ఈ విషయంలో రాముడు చేసిన తప్పేమిటి? అంతా స్వయంకల్పితమైన అపరాధమే. ఇంతకు పూర్వము నిస్తుల సత్యోద్దాముడనీ, అనంతధైర్యస్థైర్యుడనీ, ఆశ్రిత చకోరసోముడనీ పిలువబడే రాముణ్ణి అఖిల మానవలోకవిరాముడని పిల్చే అపరాధం ఎందుకు కల్పిస్తావు? అటు దుష్టాలను అనంవిధ్వంసం ఇటు నా మాటలను ప్రయోజన ప్రవర్తనం కలిగించు. ఇంతకంటే నే చెప్పేది ఏమీ లేదు" అని మారీచుడు ఒకవంక చావుకు తెగించి, హితాన్ని లగించి ప్రసంగం ముగించాడు.

## రావణుడు మారీచుని తిట్టి సాయానికి సన్నద్ధుని చేయుట

మరణాన్ని కోరేవాడు మందులపై విరక్తి చూపించినట్లు, మారీచుని యుక్తమూ, క్షేమమూ, హితమూ అయిన మాటలను రావణుడు తిరస్కరించాడు. విధిప్రేరితుడై రావణుడు వివేకం కోల్పోయాడు. ఉగ్రుడై, వింతరితనేత్రాలు చింతనిప్పులు కాగా, "మారీచా! ఈ వ్యర్థప్రసంగం చేయుమని నిన్ను ఎవ్వరు కోరారు. ఎంత నోరు పారేసుకున్నావు! రాముడు మానవుడు. మూర్ఖుడు. పాపాత్ముడు. రాజులమ్య గల ఏవాటాలు నీవా తీర్చేది? ఒక ఆడది కాపిస్తే, తల్లిదండ్రులను విడిచిపెట్టి అడవుల్లో పడి జంతువులాగా జీవించేవాణ్ణి ఏదో గొప్పవాడని భ్రమిస్తున్నావు. వాడు నా దృష్టిలో అధముడు. నీవు చూస్తుండగానే నా సోదరుల చంపిన ఆ దుష్టుణ్ణి ఏం చేస్తానో చూడు. వాడి ప్రాణానికి ప్రాణమైన సీతను అపహరించి అల్లాడి చచ్చేట్లు చేస్తాను. వాడితో యుద్ధం కాదు ఎందుకు? నా నిశ్చయాన్ని నీవా త్రిప్పేది? ఇంద్రాదులు సైతం నా సంకల్పాన్ని మార్చలేరంటే ఇక నీవా మార్చేది? గుణదోషనిర్ణయాలను గూర్చి అడిగినప్పుడు మంత్రులైనవాళ్ళు తెలివితో ఆలోచన చెప్పాలి. ఇప్పుడు నీతో మంతనాలు సలపటం కోసము రాలేదు. చేయవలసినదేదో అది ముందే నిశ్చయమైంది. ఇక మిగిలింది నేను చెప్పినట్లు నీవు చేయటం. నేను నిన్ను ఈ కార్యాన్నిగురించి నీ అభిప్రాయం ఏమిటని అడిగితే బ్రతుకుపై ఆశ నీకు వుండే చేతులు కట్టుకుని తెలిపింది చెప్పాలి. కాని, అడగని దానికి ఇంత చొరవగా పలికినందుకు నిన్నేం చేసినా తప్పులేదు. హితమైన మాటలైనా అప్రియమైన రీతిగా రాజుకు చెప్పరాదంటే, అప్రియమైన మాటలు పరుషంగా చెప్పిన నిన్ను ప్రాణంతో వుంచాను. అందుకు మరింత ఆనందించు. మానం ప్రధానంగా కలిగే ప్రభువు, అభిమానానికి భంగం కలిగించే విధంగా వున్నట్లయితే అవి ఎంత శుభసూక్తులైనా, ఎంతటివాడు చెప్పినా చెవిని పెట్టడు. నీవు తెలిసిన మూర్ఖుడవా, తెలియని మూర్ఖుడవా?

ఇంద్రునివలె విక్రమం, అగ్నివలె పుష్టం, చంద్రునివలె సౌమ్యం, యమునివలె దండం, వరుణునివలె ప్రసన్నం కలిగి పాలించే ప్రభువు ప్రకృతిజనులకు పరమ పూజనీయుడని నీకు తెలియదా? నాకు ధర్మబోధ చేసిన నీవేం ధర్మం పాటించావు? నేను ప్రభువును. నీవు మంత్రివి. నేను పని పడివచ్చాను. చేయమన్నాను. ఇష్టమైతే చేయి. కాకపోతే చేయకు. నా కార్యంలో మేలు కీళ్ళను నిన్నడగలేదు. నీ ధర్మాన్ని దాటి, కారు కూతలు నోటికి వచ్చినట్లు ప్రేలుతున్నావు. ఇక నాకు ధర్మం తెలిపే అధికారం నీ కెక్కడుంది? ఇప్పుడు నీవు నాకు చేయవలసిన సహాయం ఏమిటో మళ్ళీ చెప్తాను. విను. రజతకాంచన చిహ్నాలతో రమ్యంగా వుండే బంగారుజింక రూపం ధరించు. రాముని ఆశ్రమం పొంతకు చేరి సీత గుర్తించేలాగా నీవు సంచరిస్తూ వుండు. ఎంత మహాసాధ్వులైనా ప్రకృతిసిద్ధంగా వాళ్ళు చపలలు. సూక్ష్మ వస్తు పరిగ్రహణాసక్తులు. హృదయ దౌర్బల్యం పురుషులకంటే వారికి ఎన్నో రెట్లు అధికం. అందువల్ల క్రమంగా, నీ మేనిబంగారుఛాయా, ఒడలిపైన కనుపించే పొడలు వెండిపూలఛాయా, అ[illegible]యికంగా, అందముగా వుండే కళ్ళలోని జిలుగు వెలుగూ ఆమెను తప్పక ఆకర్షించి తీరుతై. ఆకర్షణ అనే బీజావాపం కాగానే అన్నిపనులూ అదే చేస్తుంది. ఆమె ఆ వింతజంతువును పట్టి తెమ్మని కోరుతుంది. రాముడు భార్యకు బానిస కనుక జింకకోసం వెళ్ళతాడు. చిక్కీ మెల్లగా దూరంగా కొనిపోయి, అతని కంఠస్వరంగా "హా! సీతా! హా! లక్ష్మణా!" అని [illegible] కూయి. ఆ కూత విన్న జానకి మనస్సు వికలం కాగా, మరదిని రాముని వెదక పంపుతుంది. ఆ అవకాశం రాగానే ఆమెను నేను ఇంద్రుడు శచినివలె అపహరిస్తాను.

ఇంతమాత్రం సహాయం చేయి. అర్ధరాజ్యం ఇస్తాను. అందరి కంటె అధికంగా ఆదరిస్తాను. కార్యసాధనంకోసం ముందు నీవు పో. నీ వెనుక నేను వస్తాను. వంచనలో సీతను గ్రహించి యుద్ధంతో పని లేకుండానే హాయిగా లంకానగరం చేరుకుంటాను. ఇది నీకు కొంచెం పని. నాకు గొప్ప పని. ఇష్టపడి చేస్తే ఎంతో సంతోషిస్తాను. ఇష్టపడక పోతే బలాత్కారంగా చేయిస్తాను. అసలు చేయకపోతే అపమృత్యువు

నాచే నీకు తప్పదు ఆలోచించుకో. జీవించటమో, చావటమో. రాజును వ్యతిరేకించినవారు రాజ్యంలో జీవించటము, సుఖించటము ఎన్నడూ జరుగదు. విధి నీ మొగాన ఏమి విధించినదో", అని అధికారదర్పంతో, అహంకారాంధతతో పలికాడు.

## మారీచుడు రావణుని ఘోరంగా తిట్టుట

మారీచుడు చెప్పిన మాటలలోని మంచి అంతా వేపకు తీపిపోసిన విధముగా వ్యర్థమైంది. మీదు మిక్కిలి అహంకారం పెరిగింది. దానితోడు విచక్షణా జ్ఞానం విడిచిపోయింది. కళ్ళెర్ర చేశాడు. కత్తిపై చేయివేశాడు. క్షణంగడవటం యుగం గడుస్తున్నట్లు కళవళపడుతున్నాడు. "తేల్చి చెప్పు" మన్నట్లు చూపుల్లో వ్యక్తం చేస్తున్నాడు. మారీచుడు తేరుకున్నాడు. మనస్సును నిగ్రహించుకున్నాడు. "రావణా! నేను చల్లగా చెప్పిన మాటలు నీకు కారుకూతలుగా వినిపించినై. నీవు నన్నన్నది తప్పు. నిజంగా తెలిసిన మూర్ఖుడవు నీవు. నీ చేతలోని గుణదోషాలు నీకు తెలుసు. చేసే పని వల్ల వచ్చే ఫలితాఫలితాలు తెలుసు. కాని, కార్యం పెద్దదని చెప్పి నన్ను ఖండిస్తానంటున్నావు. నీ మాట కంగీకరిస్తే రాముని చేతా, అంగీకరించకపోతే నీ చేతా నాకు చావు తప్పదు. అందుకు నేను ఏడ్వడం లేదు. నీవు సుఖించే మార్గమైతే సంతోషముతో నేనే చచ్చేవాడిని. నీనా చావు కాక సకల దానవకుల నాశనం జరుగుతుందే అని ఇంతవరకూ ఏడ్చాను. అందుకే వినవని తెలిసినా, విధి నాకున్నదని చెప్పాను. ఎప్పుడు మళ్ళీ నీవు వచ్చావో అప్పుడే చచ్చినవారిక్రింద చిత్రగుప్తుడు చిఠాలో చేర్చుకున్నాడు.

పుత్రమిత్ర కళత్ర భృత్యామాత్య సహితముగా చచ్చే ఈ పనికి [illegible] ఆలోచన ఎవడురా నీకు చెప్పింది? నీవు సుఖంగా బ్రతకటం చూసి అసూయపడిన పలుగాకి ఎవడురా? ఏ కుచ్చితుడు ఘోర దారుణ మృత్యుముఖాన్ని సౌందర్యమూర్తిగా చిత్రించి చూపించాడు? నీచేత పరాభూతులైన వారెందరో వున్నారు. వాళ్ళు నిన్ను జయించలేక, మార్గాంతరములో నీ మరణం వాంఛించి, సహజంగా నీవు నీచకాముకుడవు కనుక బలవంతు

మైన రాముని భార్యపై మరులు గొల్పారు. "కామాతురాణాం న భయం న లజ్జా". ఇంకేం నీకు వెర్రితలకెక్కింది. ఆమెను అపహరిస్తావు. ఆయనచే చస్తావు. నీకీ ఆలోచన చెప్పినవాళ్ళు నీ పీడ విరగడై పోయినందుకు లోలోపల సంతోషిస్తారు. నేనే నీకు దిక్కా? లంకలో మంత్రులు లేరా, వారితో ఆలోచించావా? ఇది చెపితే వాళ్ళు అంగీకరించరు. మంత్రము బయటికి పొక్కుతుంది. అందుకని మూర్ఖులలో వెల్ల మూర్ఖుడవై రహస్యముగా నా వద్దకు వచ్చావు. ఈ వెర్రి ఆ చుప్ప నాతే నీకు గట్టిగా ఎక్కించివుంటుంది. దాని కోరిక తీర్చబోయి దండకారణ్య జనస్థానం హతస్థానంగా చేసి ఖరదూషణాదులు కాలగర్భములో కలిసిపోయారు. నీకు కూడా అదే గతి పట్టబోతున్నది నేనేం చేస్తాను. "బుద్ధిః కర్మానుసారిణి" నీచుడవై, స్వకులనాశనుడవై, తుచ్ఛకాముకుడవై పాపివైన నీచేత చచ్చి నరకంలో పడేకంటే, శత్రువుగా రాముణ్ణి భావించి, సకల జననందనీయుడైన ఆయన చేతి శరంతాకి చస్తే సర్వలోకాలూ నాకు స్వాధీనమవుతై. నానావిధ ఘోరపాపాలు నశిస్తై. మూర్ఖుడా! నిర్ణయించుకున్నాను. ఈ క్షణంతో నీ సామర్థ్య గల నేస్తం తీరిపోయిందని, నీ లంకకే కాక, నీకే కాక, నీ పక్షమైనవాళ్ళందరికీ నేలమీద బత్తెం వట్టి పోయిందని, ఇంత జరిగినా జానకి నీకు దక్కదని, ఆమె నీ కోసం రాముని భార్యగా జన్మించిన "అవమానపడిన అతివల ఆక్రోశంలో నిశాపం" అని. నిన్ను నిగ్రహించి నీచేత చావను. శత్రుభావంతో రాముని సేవించి, ప్రభువునని విర్రవీగే నీ పనిచేసి, ఏకకాలంలో ప్రభుభక్తి, మాయాశరీర ముక్తి సాధిస్తాను, పోతున్నాను. ముందు నాచావుచూచి సంతోషించేందుకు నీ వున్నావు. నీ చావు చూసేందు నీ వాళ్ళెవరూ మిగులరు. ఇది నా భవిష్యద్దర్శనం, శాపంకూడా. పోతున్నాను. నా పని నేను చేస్తాను. నీవేమైతే నాకేం, నేనుండనుగా" అంటూ, ఆశ్రమంలో వున్న పరికరాలను కళ్ళ కద్దుకున్నాడు. "చివర కలిగిన మీ సంబంధం మళ్ళీ జన్మలో కలుపుకుంటాను. సెల"వంటూ లేచాడు.

# రావణ మారీచులు పంచవటికి ప్రయాణించుట

మారీచుడు ఎన్ని కఠిన వాక్యాలు పల్కినా ఆశించి వచ్చిన పనికి అంగీకరించినందుకు పంక్తిగ్రీవుడు ఇరువది చేతులతో దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాడు. "భేష్, ఇప్పుడు మాటలాడిన మాటలో మధురం వుంది. నేను కోపంకొద్దీ మాటలన్నందుకు ఫలితం వచ్చింది. ఇదివరకు ఎవడివో కాని ఇప్పుడు నీవు నిజంగా మారీచుడవైనావు. నాకు తెలుసు. నీవు ముందు కాదన్నా తరువాత తప్పక సాయం చేస్తావని. మా మంత్రి అయిన మారీచుడు. మంత్రాంగంలో మంత్రుల తలవన్నే మారీచుడు, మా క్షేమం కోరే మారీచుడు, యుద్ధరంగంలో దక్షిణ భుజంగా వుండి సలహాలిస్తూ సహాయం చేస్తూవుండే మారీచుడు అన్యథా ఎందుకనుకుంటాడు? ఎక్కు నా బంగారు రథం. ఇద్దరం కలిసి పంచవటికి పోదాం. నేను చెప్పినచోట దిగు నీ పని నీవు పూర్తిచేసి నీ యిష్టానుసారం వెళ్ళు. జానకి ఒంటరిగా వున్న సమయం చూసి నా పని ముగించుకుని లంకకు నేనూ పోతా" అంటూ రథం ఎక్కాడు మారీచుణ్ణి చేయిపట్టి ఎక్కించుకున్నాడు. రథం కదిలిపోయింది. దారిలో శైలకానన నదీనద రాష్ట్ర పట్టణ గ్రామాలను దాటుకుంటూ దండకాటవిలో ప్రవేశించింది. ఇద్దరూ రథం దిగారు. నలుదిక్కులా చూశారు. ప్రకృతిరమణి ఫాలభాగంలో మెరిసే బొట్టులాగా ప్రకాశిస్తున్న పర్ణశాల కనుపించింది. రావణుడు మారీచుని చూసి. "మంత్రీ! చుట్టూ ఫల పుష్ప భరితంగావున్న అరటి చెట్లపొదల్లో తుమ్మెదలు పిండస్తూ వున్నదే అదే రాముని పర్ణశాల అనుకుంటా. ఎడమవైపుగా వున్న చిన్నలోయలో సెలయేరు, పూలచెట్లూ తీగలూ, పచ్చని గరికా వున్నై. ఆ ప్రదేశం నీ సంచారానికి తగి వుంది. నేనీ సమీప వృక్షాల నీడలో దాగివుంటాను. నా రథం కామరూపంతో కనపడకుండా చేస్తాను. శుభసూచకంగా దక్షిణభుజం అదురుతున్నది. లగ్నం నాకిప్పుడు బాగా వుంది. ఇక నీ శాంబరీ శక్తి చూపించి నన్ను కృతార్థుని చేయి" అని వీపు తట్టి అన్నాడు.

## మారీచుడు మాయా మృగంగా మారుట

మారీచుడు మనస్సులో తన చావు నిశ్చయమని నిర్ణయించుకుని, అంతరంగంగా తన వధకు కారణమైన రావణుని మరణం కోరుతూ, మాయా మృగరూపంగా మారిపోయాడు. ఆ మారిన లేడి రూపం చూచి అసురపతి ఆశ్చర్యాంబుధిలో మునిగాడు. తన కార్యం సఫలమైనట్లుగా తలచాడు. మారీచుడు మాత్రం మరొక విధంగా భావించాడు. "అరణ్యవాస దీక్ష కొద్దికాలంలో ముగించి, అఖిల లోక జనానందంగా అయోధ్య కేగి భార్యతో సుఖిస్తూ పరిపాలించవలసిన నిన్ను, భార్యావియోగదుఃఖంలో పడద్రోసి పాపం చేస్తున్నాను. ఆ పాపానికి పరిహారంగా నా శరీరాన్ని నీ శరీరానికి బలి చేస్తున్నాను. నీవు పుణ్యపురుషుడవు. ధర్మరతుడవు. సత్యపరాక్రముడవు. నాకు పుణ్యలోకప్రాప్తి మాత్రం కల్పించు. ఈ నీ సతివియోగం కూడా నీ సాధురక్షణ, దుష్టశిక్షణ వ్రతంలో భాగంగా పరిణమించు గాక" అని ఆ ప్రాంతంనుంచి అంతర్హితుడైనాడు.

పంచవటి పర్వత సుందరకందరంలో, లోకంలో లేని జింక లోచన గోచరమైంది. మణికాంతుల మరపించే కొమ్ములు, తెలుపు నలుపు కలసిన లలితమైన ముఖం, ఎర్రతామర, తెల్లకలువ కూడిన నోరు, ఇంద్ర నీలాన్ని కాదనే చెవులు, కొంచెం పైకి లిక్కించిన మెడ, నీలంకావి నీల వర్ణంగల అధరం, మల్లె, జాబిల్లి, వజ్రంవంటి వన్నెల చిన్నబుచ్చుతున్న పొట్ట, తామరపూవులో వుండే కేసరాలను గేలిచేసే వీపూ, పక్కలు, మధూక వైడూర్యాల వర్ణసముదయాన్ని అపహసించే గిట్టలూ, తనువూ, జంఘలూ కలిగి, ఇంద్రధనుస్సులాగా వంగి పైకెత్తిన తోకతో తిరుగుతూ ఆ ప్రాంతాన్నంతా ఆకర్షణీయంగా చేస్తున్నది ఆ మృగం. ఆ మాయా మృగం మైథిలిని మభ్యపెట్టేందుకు లేచిగుళ్ళను మునిపళ్ళతో త్రుంచుతున్నది. కనవు నేలలో గారాబంగా కాసేపు తిరుగుతున్నది. అంతలో గాలిలాగా కదలి అరటిచెట్లలో అవతరిస్తున్నది. కౌసల్యా వధూనికకు కనుపించేదిశలో సమీపంగా వచ్చి ఒయ్యారంగా అటు ఇటు చూచి చంగున దాటి వచ్చికబయల్లో నిలిచి, గరికె కొనలు కొరికి దగ్గరలో వున్న లేళ్ళవైపు

పరుగులు తీసి, గాలిచప్పుళ్ళకు బెదరి కనులు త్రిప్పుతూ పారిపోయి, మళ్ళీ పర్ణశాల సమీపానికి చేరి అలసినట్లు పడుకుంటున్నది. ఆవలించగా నోరు తెరుస్తున్నది. కళ్ళుమూసి నిద్రిస్తున్నట్లుగా నటిస్తున్నది. అంతలో శ్రమ తీరినట్లు లేచి అటు ఇటు పరుగెత్తుతున్నది. మెరిసే మన్ను వెండి బంగరు రంగుల బిందువులు కలిగిన [illegible] మెరిసేలాగా [illegible] చూస్తున్నది. [illegible] చంచల నేత్రాలతో [illegible] చూస్తున్నది. [illegible] [illegible] మృగాలు దగ్గరవచ్చి [illegible] నుంచి వచ్చే మనిషి వాసనను [illegible] మృగములలో క్రూరమైన [illegible]. మృగరూపమైన [illegible] మోసగించుటకై వచ్చిన మృగాలను స్పృశిస్తూ నైజగుణాన్ని [illegible].

## సీత మాయామృగాన్ని చూసి మనసు పడుట

అమాయక అయిన సీత అరటివనానికి చేరువగా పెంచిన సుగంధవీ, మల్లికా, అశోకసుమాలను పూజార్థంగా కోస్తున్నది. మాయలేడి చూచింది. మనస్సును దిటవు చేసుకున్నది. అంధకారంలో మెరపులాగా చేరువగా వచ్చి చంగుచంగున దుముకుతూ కొంతదూరం పోయి ఆమె దృష్టికి ఆనేలాగా చిత్రవిచిత్ర చేష్టలు చేస్తూంది. సీత నిదానించి లేడివంక చూచింది. ఆ చూపులో జింకపై స్నేహభావం పుంది. మారీచుడు దీని గ్రహించాడు. మాయపారించదని తన్ను తానే మెచ్చుకున్నాడు. ఇక తన చావు తప్పదని నొచ్చుకున్నాడు. ఆమె వింతపడి చూచినకొద్దీ వింతవింత నడకలలో మారీచుడు మైథిలి మనస్సును ఆకర్షించసాగాడు. తన మేని కాంతితో వనము వెలిగించే చిత్రమృగాన్ని సీత కనిపెట్టక మాపులతో చూచి "రండి రండి" అని మురిసిపోయి, భర్తను పిలిచింది. ముందుగా సౌమిత్రి వచ్చి దిశల పరికించి, వదిన ఎందుకు పిలిచిందో గ్రహించాడు. అన్నవైపు తిరిగి "అన్నా! వదిన వింతలేడిని చూచింది. అది మనకు చూపించేందుకు పిలిచింది. నేను చూచాను. ఈ లేడి లేడికాదు. మారీచుడు జింకరూపంతో వేటకువచ్చే రాజులనూ, తపస్సు చేసుకునే మునులనూ

ఈ రూపంతోనే చంపుతున్నాడని మనం ఋషుల నోట విన్నాం. వాడే వీడు. ఈ రూపం మాయాకల్పిత గంధర్వలోకం వంటిది. ఇది చూడ తగ్గదీ, కని ఆశింపదగ్గదీ కానేకాదు. వదిన దీన్ని చూచి భ్రాంతి పడి పట్టుస్తుంది. నీవుకూడా చూచి నిజం తెలుసుకో. ఇంతకాలమైంది ఈ ప్రాంతానికి మనం వచ్చి. ఎప్పుడైనా ఇటువంటి లేళ్ళనుగానీ, ఇతర జంతువులనుగానీ చూశామా? నాకేమో అనుమానంగా వుంది. అనాలోచితంగా తొందరపడి ఏ పనీ చేయవద్దు. నా మాటకు వేరే అర్థం లేదు. ఇది రాక్షసుని మాయా శరీరం. మీరు దాన్ని ఆశింపవద్దని మాత్రమే" అని హెచ్చరికగా విషయం వివరించాడు.

## సీత లేడిని తెమ్మని రాముని కోరుట

ఇంతలో దానికి భర్తను చేరవచ్చింది. "ఆగు మరదీ! నీకు మేమిద్దరం తప్ప లోకమంతా మాయా కల్పితంగానే కనపడుతుంది. స్వామీ! నాకు ఆ జింకపై ఆశ కలిగింది. తేలికగా కొనివచ్చే మార్గం ఆలోచించండి. ఇక్కడ మనం వున్నంత కాలం దానితో వినోదించవచ్చు. ఆపై అయోధ్యలో అంతఃపురాల్లో అలంకారంగా వుంచవచ్చు. మనం ఇంతకు పూర్వం ఈ అడవిలో ఎన్ని మృగాలను చూడలేదు. ఇలాక కిన్నెర వానర చమర జంతువుల శరీరం ఇంత శోభాయమానంగా వుందా? విధాత ఈ సృష్టిలో కొన్ని వింతలను సృష్టించాడు కదా? ఆ వింతల్లో ఈ వింత మృగం ముందు వుంది. చూడండి. అది సంచరిస్తున్న స్థలమంతా ఎంత అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుందో ఆ చోటునే శోభను అద్దినట్టే పోతోంది. దానిని పట్టితెచ్చి పర్ణశాలను వెలిగించండి. తొల్లి చూచినప్పటినుండీ. నా మనస్సును దాని లాగుతోంది. మురిపించే కోరికకు మనస్సు లొంగిపోయింది. ఇది రాక్షస మాయ అని ఎందుకు అనుమానించాలి? సృష్టిలో ఎన్ని వ్యాపకం లేని పదార్థాలూ, జీవులూ లేవు? దీని తనువు బంగారం, వెండి, మణులవలె ప్రకాశించడమే కదా అనుమానానికి కారణం? సౌందర్య శబ్ద సార్థక్యం నిజంగా ప్రకృతి పట్లనే కదా జరిగేది. ఆ మాత సృష్టించే అద్భుతాలలో ఇది ఒకటి

ఎందుకు రాకూడదు?. నేనెన్నడు మిమ్మల దేనికీ నిర్బంధించలేదు. ఇప్పుడు కూడా నిర్బంధంలేదు. నాకు కలిగిన వ్యామోహం మీకు నివేదించాను. అవకాశం వుంటే సాధించండి. లేకుంటే మానండి.

మనం అయోధ్యకు వెళ్ళంగానే ఈ వింత జంతువును చూడటం కోసం. అత్తలూ, మరదళ్ళూ ఎంత ఉత్సాహపడతారో మీరే యోచించండి. ఇది జీవంతో చిక్కితే ఇంతకంటె సంతోషించవలసిన విషయం వేరేమి వుంటుంది? ఒకవేళ సజీవంగా సాధ్యం కాకపోతే దీని చర్మమైనా సాధించి తెండి. దానిని పచ్చికపై పరచి ఉషోదయ కాలంల్లో మీ ప్రక్కన ఆసీనురాలనై అనుష్ఠాన విధానంలో తోడ్పడతాను. కేవలం నేను కోరానని కాక మీకు కూడా ఆ మృగం ఆకర్షణీయం గానూ, ఆశ్చర్యకంగానూ వుంటేనే చేయండి. నూతన వస్తువులపై భ్రాంతి పెంచుకొనటమే కాక ప్రకృతి ప్రసాదించిన గుణం మంచి చెడ్డల గురించి మరి పట్టించుకొనం." అని వివిధ విషేధాలలో విడని ధ్వనిస్తూ, ప్రణయం చిందిస్తూ, మనోహరమైన గళ [illegible] ధరాంతంపై చేస్తూ పలికింది. సౌమిత్రి ప్రతి పక్షమైన హృదయ తంత్రి అప్రయత్నంగా మ్రోగి తెగింది. ఆగ్రహం కట్టలు త్రెంచుకుంది. అది మారీచుని మాయా రూపం వలనే కాని [illegible] జింకగా [illegible] [illegible]. [illegible] హితంగా హృదయం [illegible] [illegible]. [illegible] అమ్మ [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] వాదిస్తూంది

ఈ విపత్కర సమయంలో [illegible] [illegible] [illegible] [illegible] చిరాకు [illegible], [illegible] [illegible]. "[illegible] నీ [illegible] కారణం ఏమిటి?" 'అదే చెప్ప వచ్చాను. [illegible] [illegible] ఒక మెట్టు. ప్రమాద పట్టం ప్రారంభం కాబోతున్నది. మారీచుడు మాయా మృగ రూపంలో మైథిలిని ఆకర్షించాడు. ఆమె రాముని ప్రోత్సాహ పరుస్తూంది. లక్ష్మణుని కోపం తీవ్రరూపం దాలుస్తూంది. సౌమిత్రి నిషేధిస్తే జానకి కోరిక రాముడు తీర్చదేమో. అది నీ వల్లనే జరగాలి. అందుకే నీ కోసం వచ్చాను.' 'అయితే నన్నిప్పుడు ఏం చేయ మంటావు?

రాముడిప్పుడు మానవ భావంతోనే వున్నాడు. ఆమె కోరిక తీర్చటానికి సంసిద్ధంగానే వున్నాడు. లక్ష్మణుడు గట్టిగా వారిస్తే ఆగిపోతాడని అనుమానంగా ఏంటి?' 'సౌమిత్రిని సౌమ్యమూర్తిని చేయలేవా'? 'అది నావల్ల కాదు. అని నను కాంతి ప్రసరించినంతమేర తేజస్సుకే కాని, మాయకు చోటులేదు. రామునిలోనే తీవ్రభావం ఈ మాయా మృగంపై కలిగిస్తాను. అప్పుడు లక్ష్మణ తమ్ముడు అతిక్రమించడు. అతని నమ్మించచేసే భావాలు స్ఫురింప చేస్తాను. కార్యభంగం కానంత చూస్తాను." 'అదే నాకు కావలసింది. ఇది జరక్కపోతే రావణవధ సాధ్యంకాదు. ఇంకా లోక విద్రావణుడౌతాడు. సర్వశక్తి సమాహింపబడ నామరూప రహితంగా నాశనమైపోతే.' "సీతా భయపడక్కరలేదు. సృష్టి స్థితిలయాలు నా చూపాలేకా. చేసిచూడు. ఏం జరుగుతుందో" అంటూ ఒక చిలుక చప్పున లేచిపోయింది. వెంటనే చిలుక కొమ్మల చాటున కూర్చొని ఏం జరగబోతున్నదో గమనిస్తూంది.

## శ్రీరాముడు సౌమిత్రిని సమాధాన పరుచుట

పరమానురాగవతి, ప్రాణేశ్వరి పలుకులువిని రాముడు పర్వత కందరంలోకి చూశాడు. కాంచన రోమాలూ, రత్నాంచిత శృంగాలూ, నీరజాప్తప్రభా, నక్షత్ర సముదాయం మెరిసినట్లు మెరిసే ఒడలిపై పొడలూ కలిగి విస్మయం కూర్చింపా వింతలేడి. జానకి చెప్పినదానికీ, ఆ లేడివున్న వునికికీ సరిపోవటంతో రాముడుకూడా రాక్షస మృగంపై ఆశపడ్డాడు. "మాచావుకదా తమ్ముడూలేడిని? అద్భుతంగానూ, ఆశ్చర్యంగానూ వుండి ఆకర్షణీయమై ఆసలు పెంచుతున్నది. ఇంతకు పూర్వం చూడలేదు. ఇక ముందు చూడబోము. ఇంద్రుని నందన వనంలో కానీ, కుబేరుని చైత్ర రథంలోకానీ, ఇంత వింత జింక వున్నదని విన్నామా? అందుకే అన్నీ వదలి వచ్చిన మీవదిన ఆశపడ్డది. దీని రోమాలు ప్రతిలోమానులోమంగా వున్నై. ఆవలిస్తే అగ్నిశిఖలాగా, మేఘంలో నుంచి మెరుపు వెడలినట్లు వదనంలోనుంచి నాలుక వెలికి వస్తూంది. దీని మోము ఇంద్రనీలాన్ని ఎకసక్కమాడుతుంది. శంఖ ముక్తాసమంగా దీని జఠరంవుంది. ఈలేడికీవి

అందాలకీవి. నానారత్నస్థగితాభూషణంవలె మెరిసిపోతున్న ఈ హరిణ రూపాన్ని చిలకించి నేనే మోహపడుతుంటే అమాయిక నీవు ఆశపడటంలో ఆశ్చర్యం ఏమీలేదు. అమిషార్థంగానో, వినోదార్థంగానో ధరణీపతులు మృగాలను వధించుతారు. ధానుష్కులా, మణిహేమ[illegible] [illegible] రూపంలోనేకాక [illegible] [illegible]? [illegible]లైనవారు [illegible]పదార్థాలపై ఆశతో [illegible] [illegible], అర్థశాస్త్రవేత్తలైన విజ్ఞులు [illegible] పదార్థాలను [illegible] [illegible]. ఈ మనోహర మృగానికి [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] చూచిచెప్పు. [illegible] ఈ[illegible], [illegible]లో జరిగే [illegible] తప్పా [illegible] చెప్పటానికి వేరే మృగాలు ఎక్కడవున్నై? ఆమె అంటవటంలో అర్థంవుంది.

## రాముడు మారీచుని మాయ రూపం ఐతే అవశ్యంవధ్యమే అని చెప్పుట

అవనిజవృష్టితో కాక నీ బుద్ధిబలంతో చూచినా హరిణగ్రహణం కోసం పోవటం అవశ్యకర్తవ్యం. ఎందుకంటే: మారీచుడు ఈ రూపంతో మహర్షుల ఆహరిస్తున్నాడనికదా అన్నావు. అట్టిస్థితిలో వారికి అభయం ఇచ్చిననేను ఆ రాక్షసుని చంపటం అవసరమని వేరే అనవలసిన పనిలేదు కదా? తాపసులు దొరకని సమయంలో వేటకువచ్చిన పృథివీపతులను చంపుతాడు. కనుక నేను పోక తప్పదు. మాయామృగంకాకపోతే మైథిలి కోరిక తీరుతుంది. మాయామృగమే అయితే మరణించటంతో మహర్షులు సంతోషిస్తారు. పూర్వం ఈ దండకలోనే వాతాపి అనే రాక్షసుడు పచన మాంసరూపంతో మునుల గర్భంలో ప్రవేశించి తేలువలె గర్భకుహరం చెరపట్టి పగిల్చి చావంగానే ఆ మాంసం ఆహారంగా స్వీకరించేవాడు. అవసానకాలం వాడికి రాగానే అగస్త్య గర్భంలో ప్రవేశించాడు. కొంత సేపటికి పూర్వంలాగా బయటకువచ్చే ప్రయత్నం చేస్తుంటే, "ఓరీ బ్రహ్మహంతకా! ఇంక ఎక్కడికిపోతావు? నిష్కారణంగా తపోధనుల చంపిన

పాపం నీవు అనుభవించనక్కరలేదా? "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అన్నాడు. అన్నాడో లేదో అసురుడు ఆయన గర్భంలో అరిగిపోయాడు. ఈ మృగం మృగం కాకపోతే వాతాపికి పట్టిన గతే దీనికీ పట్టుతుంది. లేడిని తెచ్చే ప్రయత్నంలో నేను వెళ్ళుతాను. నీ వదిన రక్షణభారం నీది. ఈమె మీదనే మన ప్రయత్నాలన్నీ ఆధారపడివున్నై. చిక్కితే జీవంతో, చిక్కకపోతే చర్మంతో మృగాన్ని తెస్తాను. ఈనా ప్రయత్న విషయంలో శంకించమాని, మీవదిన రక్షణ విషయంలో ప్రతిదీ శంకించు. మన తండ్రికి ఆప్తుడూ, మనకు పూజనీయుడూ, దృఢసత్వుడూ అయిన పక్షిరాజు జటాయువు నీకుతోడుగా వుంటాడు. ఇంతవిశ్లేషించి నీకు చెప్పనవసరం లేదు. కర్తవ్యనిర్వహణ దీక్షలో నేనే నీవుకదా. పోయి వెంటనే వస్తాను జాగ్రత్త" అని చెప్పాడు.

## శ్రీరాముడు మాయామృగం కోసం పోవుట

అన్న చెప్పిన మాటలు ఆలోచించిన సౌమిత్రి వూరుకున్నాడే కానీ, సమాధానం పొందలేదు. రాముడు ధనుర్బాణాలు ధరించి మృగం సంచరించే స్థలాన్ని చేరటానికి ప్రయాణించాడు. పర్ణశాలలో జరిగిన పరివర్తనం మారీచుడు గుర్తించాడు. ఇక తను చేయవలసినది తెలుసుకున్నాడు. రాముడు కోదండపాణియై తనవైపు రావటం చూశాడు. చిక్కితే ప్రయోగిస్తాడని చింతించాడు. "రామబాణంతో చిక్కితే నాకు స్వర్గ ప్రాప్తం కలుగుతుంది. చిరకాలం రాక్షసలోకంలోనే జీవించాను. రావణుడు కోరిక ఫలించదు. చిక్కకుండా తప్పించుకుంటే రావణుడు కోపిస్తాడు. చిక్కకపోతే వదలడు. ఒక్కబాణంతో చంపుకుంటాడు. రెండు మార్గాలు సూచరాలే. మొదటిదానికన్నా రెండవది యుక్తంగా వుంది. బ్రతికినన్నాళ్ళు చెరలో వుండటం, సాధించవలసిన కార్యం వ్యర్థం కావటం తప్ప వేరే ప్రయోజనం ఏమీలేదు. సజీవంగా ఆ బాధ భరించటం స్వేచ్ఛాపరుడైన తనకు చావుక్రిందనే జమ. కనుక రెండవ మార్గం అనుసరిస్తాను. శ్రీరాముణ్ణి దూరంచేస్తాను. కట్టుదిట్టని నాపైక్రమించిన రాముడు ప్రతి

దూరంగా బాణప్రయోగం చేస్తాడు. తాకగానే వస్తాను. వచ్చేముందు సీత, లక్ష్మణుడు వినేలాగా ఆక్రందించి మరీ వస్తాను. సీత మరిదిని రక్షక రామునికై పంపుతుంది. లక్ష్మణుడు పర్ణశాల దాటగానే రావణుడు సీతాపహరణం చేస్తాడు కాలవిరామంలోనే వస్తాడు. వచ్చి దగ్గరకే వస్తాడు," అని వర్తమానభవిష్యత్తుల విలోకించి, రాముడు చేటువైన కోలకి గుండెల దరకా చెట్లసందుల్లో దాగబడ్డాడు

రాముడు సాహసంగా లేడితిరిగే చోటికి చేరుకున్నాడు. లేడి విస్మయగా మొగంపెట్టినప్పుడు వేగంగాపోయి పట్టుకొనబోయే సరికి జింక పారిపోయింది. రాముడు వెనుకవెన్నాడాడు. చేరువకువచ్చి, దూరం పరుగెత్తి, చిగురుల కొరికి, పూలమేసి, మందల్లోకలసి, అనాసక్తంగా వున్నట్లు నటించింది. చేయిచాపగానే చౌకళించింది. తనమేని కాంతి ఒక్కసారి దిక్కుల మెరిపించి, ఆకర్షించి, అలయించి, కలవరించి, కామంపెంచి, చెవులురిక్కించి, గ్రీవంనిక్కించి, స్వజాతిమృగాన్ని చూచినట్లు, దానికోసం పోతున్నట్లు నటించి. భయనించి, చిత్రవిచిత్ర రీతులతో శ్రీరామునికి శ్రమకలగకుండా, ఆశ్రమానికి దూరమై పోతున్నాననే ఆలోచన రాకుండా. చాలసేపు దూరం మాయామృగం రాముణ్ణి కొనిపోయింది రాముడు కూడ ఇదంతా జింక సహజగుణంగానే తలచి. ఓపుతో, నేర్పుతో, సజీవంగా కొనిపోయి మైథిలి మనసు రంజింపచేయాలనే సంకల్పంతో వెన్నంటు తున్నాడేకాని, శ్రమకలుగుతున్నదనే భావం చెంతకు రానీయలేదు. వచ్చిన చోటికేవచ్చి, పోయినచోటికేపోయి. చూచిన వాటినేచూచి అలసిఓపికకాగా రాముడు దగ్గరగావున్న రావిల వృక్షనీడలో నిలుచున్నాడు మాయలేడి మందలోచేరి తలుక్కుమన్నది. పూర్తిగా రాఘవుడు డస్సిపోయాడు. ప్రాణంతో మృగాన్ని పట్టటం సాధ్యంకాదన్నభావం స్ఫురించింది. వెంటనే లేడిరాకున్నా చర్మమైనా తెండన్న జానకిమాట గురుతు వచ్చింది.

ఆభావంరాగానే రామునిహస్తం అప్రయత్నంగా కోదండాన్నిఅందు కుంది. ఆవెంటనే అవికటహరిణం, "తన్నుకిసరించివంచించి. అటమటించి, మిక్కిలి తటమటించి. మోసగించి. ఛలించి, సత్వం సడలించి, శాంతం వెడలించి, మాయలోముంచి, ఆశను ఆకర్షణలో తేలించి, మించిన

దూరానికి కొనివచ్చిం"దన్న తలపుకూడ వచ్చింది. వెంటాడుతున్న రాముడు వెనుకనే ఆగినట్లు గుర్తించిన వంచనామృగం మందలో నుంచి మళ్ళీ పచ్చికబయలులో తచ్చాడజొచ్చింది. రాముడు దాన్ని చూచాడు. మిక్కిలిగా అలసిపున్నాడు. దాహం తీవ్రంగా వుంది. మారంగా కూడా వచ్చాడు. ఇక పట్టుకునే ప్రయత్నం ఫలించదనే నిశ్చయానికి వచ్చాడు. ధనువును సజ్యంచేసి, మృగాన్ని లక్షించాడు. మారీచుడు అదిగమనించాడు. మరణం ఆసన్నమైందని మనస్సు నిగ్రహించాడు. తాను ముందు నిర్ణయించుకున్నప్రకారం చేయటానికి సిద్ధపడ్డాడు. మనసులో రామనామం తలుస్తూ, పైకి ప్రమాదంతెచ్చే మాయకేక వేయటానికి సంకల్పంచేశాడు. చెంగుచెంగున దూకుతూ, తన మాయావిద్యా కౌశలమంతా ప్రదర్శిస్తూ సమీపించి దూరమవుతూ, కొంత కాలక్షేపంచేశాడు. రాముడు మాత్రం కాలుకదల్పలేదు. శరంచాపంలోనికి తొడగటం, మృగానికి తాకటం, చచ్చి నేలపైపడటం జరిగింది.

## హాసీతా! హాలక్ష్మణా! అంటూ అరచి మారీచుడు మరణించుట

పూర్వం విశ్వామిత్ర సవనరక్షణ సమయంలో నిగ్రహించాడేకాని, మారీచుణ్ణి సుబాహువలె చంపలేదు. "ఈనాడు మృగరూపంలో వున్న తనను నిజంగా మరణం చేకూరుస్తూన్నా"దని తగలంగానే, లోపల "రామా, రామా, రామా" అని ముమ్మారుతలచి, బిగ్గరగా రాముని కంఠస్వరంలాగానే, "హాసీతా! హాలక్ష్మణా!" అని అపాయ సమయంలో అరచినట్లు అరచి అరయోజనం పైకిఎగిరి అవనిపైపడి ప్రాణాలు విడిచాడు. ఆ మాయావి మరణ వేళ అరచిన అరుపూ, రాముని వామ భుజ స్పందనము యుగపత్క్రియ (ఒకే సమయం) గా జరిగింది. శరప్రయోగానంతరం రాముడు జింక వున్నచోటికి చేరాడు. అక్కడ వింతగొల్పిన మృగంలేదు. హేమమాలీ, హేమభూషణుడూ, చిత్రకేయూర మండితభుజుడూ, పర్వతాభదేహుడూ, రక్తసిక్తాంగుడూ, బాణయుక్తపార్శ్వభాగుడూ, మహాదంష్ట్రుడూ, క్షితితలవేష్టమానుడూ

ఆయిన ఘోర రాక్షసుడు కనుపించాడు. అతని ప్రక్కభాగంలోనే రామ ప్రయుక్త శరం నాటివుంది. సీతాపతి, ఆ దృశ్యం చూచి నిర్ఘాంతపడ్డాడు. సౌమిత్రి పొందిన శంక సత్యమే అయింది. ఆ క్షణమే మైథిలిపై మనసు పరుగుతీసింది. "లక్ష్మణుడు చెప్పిన మారీచుడు ఈ రాక్షసుడే అయి వుంటాడు. వీడు మరణసమయంలో అరచిన అరుపు భార్యా సోదరులు విని వుంటారు. "ఏమి కీడు జరిగిందో" అని ఆదుర్దాపడుతూ వుంటారు. నేను ఆలస్యం చేయకుండా పర్ణశాలకు పోవాలె. ఏ అనర్థం రాకముందే చేరుదామంటే చాలా దూరం వచ్చాను" అని అనుకుంటూ, మరొక లేడిని చంపి మాంసం సేకరించి భయసందేహాలతో రాముడు పర్ణశాలకు పయనించాడు.

## సీత సౌమిత్రిని రామునికి తోడుపడ పొమ్మని చెప్పుట

పర్ణశాలలో సీత రామునిరాక ఆలస్యమైనకొద్దీ కలవరపడసాగింది. గిరికందరంలోకి చూసింది. రాముడుగానీ, మృగంగానీ కానరాలేదు. తహ తహ హెచ్చి గుండెలు దడదడకొట్టుకుంటున్నై. ఆ సమయంలోనే మారీచుని చావుకేక మైథిలికి వినిపించింది. ఒక్కసారి శిలా ప్రతిమలాగా అయిపోయింది. నోటదడి ఆరింది. తనువు కంపించింది. మాట పెగలక బలవంతంగా సౌమిత్రిని "మరదీ" అని పిలిచింది. ఆదుర్దాతో "మరదీ! మీ అన్నగారి ఆర్తనాదం విన్నావు గదా. నాకు భీతి కలుగుతూంది. ఇంకా ఇక్కడ నిలుచున్నావెందుకు? శరచాపధారుడవై అగ్రజునికి తోడుపడ అవసరం లేదనుకున్నావా? అనుకోని ఆపద ఆయనను అడ్డగించి వుంటుంది. నీ సాయంకోరి పిలిచివుంటాడు. త్వరగా పో. ఆ ధ్వని విన్నాక ఇంత వరకు ఇక్కడ ఎట్లా వున్నావు? ఆలస్యం అయితే అక్కడ ఏం కీడు మూడుతుందో" అని ఆంగలార్చి రామానుజునివంక వేడిగా చూడసాగింది.

## లక్ష్మణునిపై సీత కోపించి పలుకుట

సీత ఎంత వెళ్గబెల్లినా లక్ష్మణుడు పర్వతంవలె చలించలేదు. మారు మాట పలకలేదు. ఉన్నచోటనే వున్నాడు. ఆ నిర్వికారస్థితి చూచినకొద్దీ

భూజాతకు ఒడలు మండసాగింది. ఉలకక, పలుకక బెల్లంకొట్టినరాయి వలె నున్న లక్ష్మణుని చురచుర చూస్తూ, "ఏమయ్యా! లక్ష్మణా! అన్న కష్టసమయంలో వుండి ఎలుగెత్తి పేరుపెట్టి పిలిస్తేకూడ ఎనుబోతుపై వర్షం కురిసినట్లు పట్టీపట్టనట్లున్నావు. ఇప్పటి స్థితిలో నీవు మిత్రాకృతిలో వున్న శత్రువుగా కనుపిస్తున్నావు. దుష్కాముడా! ఆయన నీకు చేసిన అపకారం ఏమిటి? కాళ్ళపై పడి ఏడుస్తుంటే, కనికరంతో నాను వెంట పెట్టుకుని రావటమే నా తప్పు? నాకంటే నిన్నధికంగా ప్రేమించటమే తప్పా? నయవంచకుడా! నీ నటన తెలుసుకున్నానులే. నా ఆత్మేశుని మరణం అంతరంగంలో ఆశించావు. కాకపోతే కాలు కదపవేం? లేక నా కోసం? కావచ్చు. అందుచేతనే అన్న ఆక్రందనం విని కూడ గ్రుక్క పుగించి గుటకలు మ్రింగుతున్నావు. ఆయన కపాయం సంభవిస్తే నన్నిక్కడ రక్షిస్తావా? నీవు అడవికి వచ్చింది అన్న కోసమా? నాకోసమా? అగ్రజుని కొరకైతే విపత్తులో చిక్కినవేళ తోడ్పడక విలాసంగా జీవించ గలవా? నా కోసమైతే ఆయన లేక నేనుంటానా?

చిన్ననాటినుంచి చేసిన చెలిమికి నీవిచ్చే ఫలితం ఇదేనా? నీవంటే అభేద బుద్ధితోనే కదా మహర్షి ఇచ్చిన సర్వాస్త్రవిద్య నీ కిచ్చింది. నా ఎడబాటైనా ఒకవేళ ఓర్చుకోనునేమోకాని నీ ఎడబాటు సహింపలేడే. నాల్గు గడియల కాలంలో నీలో ఇంత మార్పు ఎలా వచ్చింది? ఈ మొండితనం ఏమిటి? ఎంత మొత్తుకున్నా వినిపించుకోవేందుకు? నీ యీ దుష్టచర్యను గూర్చి ఏమనుకోవాలో బోధపడ్డం లేదు. ఇప్పటి నీ వుద్దేశమేమిటో దాచకుండా చెప్పు. అది విన్నమీదట నేను ఆలోచించుకుంటాను. అంతే కాని నీ మౌనం నేను సహించలేను" అని అన్నది.

## జానకికి లక్ష్మణుడు సమాధానం చెప్పుట

"ఎందుకమ్మా వదినా! ఇంత భయం? నా అన్నకోసమైతే అది అనవసరం. నా అన్నసంగతి నాకు తెలిసినంత నీకు తెలియదు. నీకు తెలిసినంతవరకు చాలు నాఅన్న అజేయుడని. శివధనుర్భంగం నీ వెరుగుదువు. పరశురాముని గర్వభంగం నీకు తెలుసు. పధ్నాల్గువేల కరకు

రక్కసుల ఖరదూషణ త్రిశిరులతో నాల్గు గడియలకాలంలో వారిని ఇంటికి కాపురానికి పంపటం నీవు చూచావు. అప్పుడే సహాయంకోసని నా అన్న, నీ పతి ఇప్పుడు ఆర్తుడై అర్థిస్తాడా? నన్ను గూర్చి నీవన్న మాటలు కొన్ని నిజం. నాకూ, అన్నకూ భేదం లేదు. నే వచ్చింది అన్నకోసమే. ఇంకెవరి నిమిత్తమూ కాదు. నా అన్నకు అపకారం జరిగితే ప్రకృతి యథాతథంగా ఉండదు. తల్లీ! క్షుద్రులైన రక్కసులే కాదు, మూడు లోకాలు ఎత్తివచ్చినా నా అన్న చేతిలో కోదండం వున్నంతవరకు భయం లేదు. ఆయన చేతిబాణం భంగించటానికి పరమేశ్వరుడే అవతరించాలె. అంతేకాని సామాన్య జీవులకు సాధ్యంకాదు. అమ్మా! వదినా! నామాట నమ్ము. వృథా భయాన్ని పొందకు. అతిశీఘ్రకాలంలో పోయిన పని తుదముట్టించి పర్ణశాలకు రాగలడు. ఇప్పుడేమి ప్రమాదం వచ్చిందని ఇంత కలవరపడటానికి? నీవు విన్న కంఠస్వరం మా అన్నది కానేకాదు. ఖరాదులు వచ్చినప్పటినుంచీ రాక్షసులు మనపై కక్షపట్టి వున్నారు. ఇక్కడ అన్న లేక, నేను లేక నీవు ఒంటరిగా వుంటే ముప్పు తప్పక వస్తుంది. అన్నిటికంటే అన్న ఆజ్ఞ నాకు పాలించవలసిన పరమవ్రతం. ఆయన వెళ్తూ నన్ను అప్పగించి చెప్పిన మాటలు నీవు విన్నావు కదా? ఇంక నిన్ను వదలి నేను ఎలా పోగలను? అసలు అంత అవసర మేమి వచ్చింది? రాక్షసులంతా మాయావులు. అన్న కంఠస్వరాన్ని అనుకరించి ఎవరో ఆ కేకపెట్టి వుంటారు తల్లి. సర్వసమర్థుడైన నా అన్న రాముడు ప్రాణం ఎన్నటికీ పెట్టివుండడూ, పెట్టడు కూడ. నీవు నిమ్మళించి విచారించు. అపార్థాలు అపకారం ఇవ్వదు" అని సౌమిత్రి శాంతంతో జానకి మాటలకు సమాధానం చెప్పాడు.

## హద్దుమీరి వదినె అధిక ప్రసంగం చేయుట

ఆ మాటలు సీతకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయినవేకాని జలం చల్లినట్లుగా కాలేదు. ఏ భావం పొందవద్దని జితేంద్రియుడు, నిష్కాముడు, నిశ్చలుడు నిర్మలంగా హెచ్చరించాడో ఆ భావమే ఆమెలో అవతరించింది. చెట్టు చెడు సమయానికి కుక్కమూతి పిందెలు పుడుతవని అనుభవజ్ఞులైన

వారసు యుక్తి జాబితాలో సార్థక్యం పొందింది. దాదాపు పదమూడేండ్ల కాలం పాటు సేవలో మైమరచి సుఖించిన మైథిలి, అన్నసేవకై తన లౌకిక సుఖాన్ని త్యాగంచేసి కష్టకష్టాలు పడుతున్న సౌమిత్రిని, అన్న ను ఒక్క మాటాడితే కన్నులో మాటకైనా వెనుదీయని లక్ష్మణుని సీత శంకిస్తున్నదంటే అది ఆమె దాని స్వభావమనాలో, అనుభవకాలం ప్రేరేపణ అనాలో తోచటంలేదు. ఏది మనస్సు అనే నిప్పురాటికి లక్ష్మణుని సత్య భాషణం అనే పచ్చిమట్టి కొరకటంతోటే చెడభావం అనే నిప్పురవ్వ లేచి అనుభవకాలం అనే మాదిలో పడి అంటుకుంది. దానితో సీతకు కమెక్కిన క్రోధం పెరిగింది. జనకుని బిడ్డగా, కౌసల్యాకోడలుగా రాముని సతిగా కాక సామాన్య స్త్రీవలె రోజుతూ, ముక్కుపుటాలు చలిం చగా, పెదవులు కంపింపగా, చెక్కులు ఎర్రబారగా, బొమలు ముడిపడగా, తోక త్రొక్కిన కాలనాగినివలె మరచిని మాటలతో కాఱుస్తూ:

ఓరీ దయాహీనా! నృశంసా! అనార్యా! హంతకా! వంచకా! సత్కులపాంసనా. ఏమని ప్రేలుతున్నావు? రాముడజేయుడట కావచ్చును. అతనికి మాత్రం తోడు లేకుండా ఉండదా నా భర్త మరణం నీకు కావాలి. కావాలి కనుకనే కండముందు జరుగుతున్న నా భర్త కష్టాలు నీకు చీమ కుట్టినంతైనా బాధ కలిగించలేదు. ఇది ఆశ్చర్యపడవలసిన విషయ మేమీ కాదు. దాయాదులు ప్రచ్ఛన్నకూపాల్లా, గోముఖవ్యాఘ్రా ల్లా సుఖజీవులైన సోదరుల నాశనాన్ని నిరీక్షింపుతూ వీలాగే వుంటారు. (ఇక్కడ వాల్మీకి మహర్షి హృదయం అగాధం. పరమ భక్తుడైన భరతుణ్ణి లక్ష్మణుడు అనుమానించాడు. అన్నివంటి సౌమిత్రిని సీతలను అనుమానించింది. పతివ్రతా శిరోమణి సీతను రాముడు అనుమానించాడు. అవతార పురుషుడైన రాముణ్ణి లోకం అనుమానించింది. ఇక అనుమానరహి తంగా జీవించే ప్రాణి ప్రకృతిలో వుంటుందా? దీనికి వివరణం కథలోనే వుంది.)

నీకై నీవేవచ్చావో? కైకేయి కొడుకు నిన్ను పంపాడో? ఈ మాయా వేషం దేనికివేశావు? వచ్చేవాడివి భార్యనువదిలి ఒంటరిగా ఎందుకు వచ్చావు? నా భర్తకు సహాయ పడితలచివస్తే ఆపద సమయంలో ఆదుకుంటానికిపోవా?

నీవు నాకోసమే వచ్చావు. "ఇటువంటి సమయం ఏనాటికైనా రాదా" అని ఇన్నాళ్ళుగాచి, వేచివున్నావు. నీవు ఆశించినట్లే ఆయన అక్కడ చిక్కుపడ్డాడు. ఇక్కడ నేను చిక్కుపడ్డాను. నేటితో నీ నైజగుణం ఎటువంటిదో తేలిపోయింది. నీవు పాపివి. కైక కొడుకువి. నన్ను కన్నెత్తి చూడగలవా? కామాంధుడా! పాపీ! కృతఘ్నా! అక్కడ ఆయన ఆపదలో ఉంటే ఇక్కడ నీవు "అన్నమాట దాట"నంటూ వంక పెట్టుకుని వుంటావా? ఆయన లేని క్షణంలో నేనూ లేను. మిమ్ముల, నేనాశిస్తానని భావించటానికి ఎన్ని గుండెలున్నవి నీకు? చూడు నీవుపోకపోతే ఇప్పుడే మరణిస్తాను," అని అన్నది. "వినాశకాలే విపరీత బుద్ధిః."

## లక్ష్మణుడు సీతపై కోపించి రామునికడకు పోవుట

సీత నోటి వెంట ఒళ్ళు తెలియక వస్తున్న ప్రతి అక్షరం పరమ పవిత్రమైన సౌమిత్రి రక్త ప్రసరణాన్ని ఉడికించి తీవ్రం చేస్తున్నది. హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నవి. "ఇంతటి నీచభావం సర్వాంగ సంజాతకు ఎందుకు కలిగింది? ఇన్ని దుర్భాషలు ఆజిహ్వ ఎలా ప్రకటిస్తున్నది? ఈమె రామపత్ని, జనకపుత్రీ అయిన సీతయేనా? ఆ సంప్రదాయ సంస్కృతి సంస్కారాలు ఏమైనవి? ఇది భర్తపై నిజమైన అనురాగ జనితమేనా? త్రిలోక కంటకులైన దానవుల తుదముట్టించిన కోదండపాణికి ఏహానువుచే అపాయం ఈమె శంకించింది? నాలోఏం నైచ్యప్రవృత్తి కనిపించింది. పరమేశ్వరా! ఇది ఏమి పరీక్ష? తన అజ్ఞానం వల్ల తనకేకాక తను ఇంత అంగలారుస్తున్న భర్తకెంతపాటు రానుందో ఊహించనైనా ఊహించదేమి? నేనుతోచినన్నా, చెప్పినా గ్రహించదేమి? ఇప్పటికే నాహృదయం స్థాయి తప్పింది. ఈమె నా ఆరాధ్యుడైనవానికి సహధర్మచారిణి కనుక బ్రతికి పోయింది. ప్రకృతి సహజంగా లభించినగుణాలు ప్రాణికోటికి వివేకం పెంచలేవు. దీనికి ఎదురీదుతూ అనుక్షణం విచక్షణా బుద్ధితో పాశవ ధర్మాన్ని ప్రతిఘటిస్తూ పరమాత్మ వైపు ప్రయాణించాలి. అంతేకాని కూపస్థ మండూకం లాగా అదేలోక మనుకుంటూ అక్కడేవుండి అక్కడే చావకుండా జ్ఞానభాగం వున్న మానవ మేధ వివేకవంతంగా ప్రవర్తించాలి? కానీ, ఈ దుర్భాష లేమిటి? ఈ దుర్బుద్ధి

ఏమిటి? ఇప్పుడు నేనేంచేయాలి? ఈమె మూర్ఖతకు నా అన్నను దుఃఖంపాలు చేయాలా? ఈమె కఠినవాక్యాలు వింటూ ఇక్కడ నేనుండాలా?" అని ఆలోచిస్తున్న సౌమిత్రి బుద్ధిని మనస్సు బలంగా ఎదుర్కొన్నది.

"లక్ష్మణా. నీవు ఇక్ష్వాకుడవు. సుక్షత్రియుడవు. నాతిగల బ్రహ్మచారివి. ఇంద్రియజేతవు. మనసా. వాచా, కర్మణా, సీతారాములకు సర్వం ధారపోస్తున్న త్యాగమూర్తివి. విశుద్ధశీల సంపన్నుడవు. అన్నింటికీ సృష్టిలో విధి హద్దులేర్పరిచాడు. హద్దు దాటనంతవరకే అనుభవించటంలో ఆనందం వుంది. నీవదిన నీపట్ల హద్దు దాటింది. ఎన్నివిధాల చూచినా ఈమె క్షంతవ్యకాదు. నీసౌజన్యం ఈనియమాతిక్రమణంచేసిన జానకిలో పరివర్తనం పశ్చాత్తాపం తేలేదు. నీవుకూడ పరుష వాక్యాలతో, ఎత్తిపొడుపులతో. తీవ్రంగా మందలించి నీ ధర్మం నిర్వర్తించు. "వజ్రం వజ్రేణభిద్యతే." సందేహించకు. ఈమెలోని యోగ్యత నీ ప్రేమారాధకుడైన అన్నభార్య కావటం ఒక్కటే. అదికూడ ఆత్మాభిమానం దెబ్బతినకుండా వున్నంతవరకే. ఇప్పుడీమె నీఆత్మాభిమానం పైనే అడుగుపెట్టి అవమానించింది. "ప్రాణం వాపి పరిత్యజ్య మానమేవాభి రక్షతి. కూలిపోయిన అభిమానాన్ని మళ్ళీకూడ తీసుకో" అని. మనఃప్రతిఘటనంతో లక్ష్మణుడు ఆపాదమస్తకం కంపించాడు. పౌరుషభావాన్ని బలవంతంగా ఆకర్షించాడు. జీవితకావ్యంఅంతాతిరుగవేశాడు. పౌరుష భాగమే కనుపించింది కానీ, పరుష భాషణ భాగం కనుపించలేదు. తన తీక్ష్ణదృష్టితో సీత పల్కినవాక్యాలను పరిశీలించాడు. ఆమాటలనే ఆమె పై ప్రయోగించటానికి వున్ముఖుడైనాడు.

పరమ పావని, శాంత స్వభావిని, మహాయోగిని అయిన సుమిత్ర కళాహీన వదనంతో, కాషాయాంబర ధారణంతో, జపమాలాలంకృత పాణితలంతో, స్ఫాటికవర్ణకేశబంధంతో హృదయంలో సాక్షాత్కరించింది. మానసికంగా కొడుకు చేసిన ప్రణామం అందుకొంది. "శాంతించునాయనా! శాంతించు. "మాంవిద్ధి జనకాత్మజాం" అని హెచ్చరించి అంతర్ధానమైంది. కఠోర నిద్రా ముద్రిత. భూతలశయన. పరమ సుకుమారి, బాహ్యశరీర, సంస్కారరహిత. వూర్మిళ భర్తపాదద్వయం స్పృశిస్తూ, "శాంతిశ్శాంతిశ్శాంతిః" అన్నట్లు హృదయం గుర్తించింది. మనస్సు తన ఇంద్రజాల శక్తిని వుపసం

హరించుకున్నది. సౌమిత్రి మళ్ళీ శాంతమూర్తి అయినాడు. కావురు కమ్మిన బుద్ధి కలకల లాడింది. పద్మపత్రాలవంటి కన్నుల్లోనుంచి జాతిముత్యాల వలె నీటిబొట్లు నేలపై టపటప పడగా శిరం వంచి నమస్కరించాడు. "తల్లీ! నీమాటలకు బదులాడటం నాయుక్తము కాదు. నాకు అన్నదేవుడు. నీవాయన గేస్తురాలవు కనుక దేవతవు. నీపల్కులు మర్మచ్ఛేద కాలైనా, మనస్సు ప్రతిఘటిస్తున్నా, కష్టకాలం ఎదురు చూస్తున్నా, నీ నిందను సహిస్తున్నాను. స్వార్థం అల్పమైనప్పుడే హద్దుల నతిక్రమించే స్త్రీస్వభావం, అది అధికాధిక మైనప్పుడు దాని గమ్యం ఏమిటో ఎవరికీ బోధపడదు. అయితే "నాకీహృదయం సహించదు" అన్నావు. అధిక ప్రసంగం, అపార్థకల్పనా, ఆడువారికి అతిసామాన్య ధర్మం.

విముక్త ధర్మ మర్యాదయులూ, చంచలాత్మికలూ, భేదకారిణులూ, క్రూరస్వభావులూ అతివలు. సాంఘిక ధర్మంలో కల్పించిన ప్రత్యేకస్థానాన్ని క్షణంలో విపరీతంగా వినియోగించుకోగలరు. ఇందులో ఒకరినొకరు నిందించుకోవలసినదేమున్నది? ప్రకృతి నిర్మాణ మట్టిది. "మధుతిష్ఠతి వాచి యోషితాం, హృది హాలాహలమేవ కేవలమ్."

అమ్మా! బిడ్డవంటి నన్ను, తమ్ముడు భరతుణ్ణీ పరుషవాక్యాలతో బాధించావు. ఆ మాటలు చెవిలో కర్రు కాల్చి పెట్టినట్లున్నై. ఇక నేను సహించలేను. నీ సన్నిధానంలో నిమిషంకూడా నిలువలేను. ఋతభాషి నైన నేనన్న మాటలూ, కోపనవై అందుకు నీవు నన్నన్న మాటలూ సాక్షిభూతులైన వనేచరులు విందురు గాక. వారే ధర్మాధర్మాలు నిర్ణయించు కుందురు గాక. అసహాయుడనై, అగ్రజాజ్ఞా పరిపాలనాబద్ధచేతస్కుడ నైన నన్ను నిష్కారణంగా నిష్ఠురోక్తులాడిన పాపఫలం త్వరలోనే నీ వనుభవించనున్నావు. తల్లీ! నీకు స్వస్తి. ఈ వనదేవతలు నిన్ను రక్షింతురు గాక. ఇప్పుడే అన్నవున్న ప్రదేశానికి అరుగుతున్నాను. నిర్నిమిత్తంగా నా హృదయం క్షోభిస్తూంది. నిమిత్తాలు దుష్టంగా కన్పిస్తున్నై. తిరిగి అన్నతోవచ్చి నిన్ను చూడగలనో లేనో," అని చివర మాట పూర్తి చేయకముందే సీత భోరుమని ఏడుస్తూ, ఎక్కిళ్ళు పెడుతూ, "ఛీఛీ! దుర్మార్గుడా! ఎంత [illegible]! ప్రత్యక్షంగా పోతుంటా

పరోక్షంగా నాకు నీతులు బోధిస్తున్నావా? విషమైనా తింటాను; గౌతమిలోనైనా పడతాను; కంఠానికి ఉరినైనా వేసుకుంటాను, నిప్పుల్లోనైనా దూకుతాను. కాని, పరపురుషుని కామవాంఛతో కన్నెత్తి చూడకపోవటమే కాదు కాలివ్రేలితో కూడ స్పృశించను," అంటూ గుండెలు కొట్టుకుంటూ, అటు ఇటు పరుగెత్తుతూ, ఏడుస్తూ, తిడుతూ జానకి భయానక దృశ్యం ప్రదర్శిస్తున్నా, వంచిన తల ఎత్తక ఓదార్పు మాటలు సౌమిత్రి ఎన్ని చెప్పినా, చెప్పినకొద్దీ ఉగ్రురాలవుతున్నదే కాని యుక్తాయుక్తాలు పరిశీలించటంలేదు. ఇంకా ఘోరంగా దూషించసాగింది. అన్న మాట దాటలేక, వదిన కారుకూతలు వినలేక, కర్తవ్యం తోచక, అధోముఖుడై నమస్కరించి, బలవంతాన భవిష్యం నెట్టగా, విధి లేక సౌమిత్రి సీతను ఒంటరిగా పర్ణశాలలో విడిచి వెళ్ళాడు.

## రావణుడు యతిగా మారుట

మహాయుద్ధంలో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన రక్షణవలయంలో పార్శ్వభంగం జరిగి ప్రవేశార్హత కలగగానే పరిపంథి సంతోషించినంతగా సీతను లక్ష్మణుడు విడిచివెళ్ళగానే పంక్తిముఖుడు సంతోషించాడు. సీతాపహరణానికి వ్యూహం ఆలోచించాడు. ఇంతలో దారువృక్షంపై ఉండి పరిస్థితి గమనిస్తున్న చిలుక ప్రక్కన పూర్వం వచ్చిపోయిన చిలుక మళ్ళీ వచ్చి వాలింది. అంతవరకూ కార్యవిఘ్నం అవుతుందేమోయని కంగారు పడుతున్న చిలుక, పోయిన చిలుక రాగానే ఎక్కడలేని ఉల్లాసాన్ని తానే పొందింది. కళ్ళతో కృతజ్ఞతలు తెల్పింది. నీ కోసమే వేచివున్నా నన్నట్లు సంకేతించింది. అందులో ఒక చిలుక—

ఇంద్రుడు :- "తల్లీ! మహామాయా! దేవలోకమంతా నీకు ఋణపడి ఉంది. వజ్రసంకల్పం గల ముగ్గురిలో సామరస్యం చావకుండా సహజంగా కార్యం సాధించావు. ఈ పని నీకే సాధ్యమయింది. "మహామాయా దురత్యయా" అని పెద్దలు ఇందుకే అన్నారు.

మహామాయ :- సురసార్వభౌమా! ఇక మీ కల్పిత నాటకం, నిర్విఘ్నంగా నిర్నిరోధంగా, వేగవంతంగా సాగిపోతుంది. ప్రతినాయకుడైన

పంక్తికంఠుడు రంగంలో ప్రవేశింపబోయున్నాడు. పంచసంధులలో మొదటిది బీజసంధి ప్రవర్తింపబోతూంది. నీవు సూత్రధారుడవుగా, నేను నటిగా. నాయికగా నటిస్తాను.

ఇంద్రుడు :- తల్లీ! నీవు తలచుకుంటే కానిదేముంది? కాని. నాకొక సంశయం కలిగింది. నాకీ సన్నివేశమంతా ఏలా? అతినికృష్టమైన ఆ మాటలు మరదిని ఎలాగననగలిగింది? అతడవి ఎలా సహించాడు? సీతను విడిచివచ్చిన తమ్ముణ్ణి రాముడు సహిస్తాడా? ఎక్కడికక్కడ ఎన్ని క్లిష్ట సమస్యలున్నై.

మహామాయ :- దేవపతీ! నీ సందేహం లోకసందేహం. అదినాకు కనుక అంతర్యం చెబుతాను. సృష్టిలో జీవకోటి రెండుగా విభజించబడి ఉంది. స్త్రీపురుష శబ్దసంకేతం అదే. పురుషశబ్దంలో సృజనాత్మక చైతన్యం, పౌరుషం, బలిష్ఠత, దృఢతా మొదలైన గుణసముదాయం మాత్రమే ఉంది. స్త్రీశబ్దం గుణాలన్నిటికీ మూలభూతమైన త్రిగుణాలసంకేతం. సత్వరజస్తమోగుణాలను తెలిపేందుకే సకారతకారర కార ఈ కారంగా "స్త్రీ" అని సాధించారు. అందుకే ఈ కారం ఎప్పుడూ స్త్రీలింగమే. పురుషుడు కేవలం బీజమాత్రుడు. సృష్టి నిర్మాణమంతా స్త్రీ గర్భగోళంలోనే సాగుతుంది. అదే నా రూపం. లోకానికి అది అవ్యక్తం. మానవశక్తితో దైవశక్తిని సాధించవచ్చు. సీత మానవరూపంగా సహజ సంస్కారవతిగా పుట్టింది. అందుకే మారీచుని కేక విన్నవెంటనే "అన్న ఆపదలో వున్నాడు. వెంటనే తోడు పొ"మ్మంది. ఇంతవరకిది లోకసహజం. అంతవరకే ఆమె పాత్ర. ఆపైనంతా నేనామెలో వుండి ప్రవర్తించింది. భూతావేశంలో అసాధ్య కార్యాలు సాధ్యం కావటం లేదా? అదే ఇది. ఆమె ఆ విధంగా అంటున్నానన్న జ్ఞానం అప్పుడామెలో లేదు. లక్ష్మణుడు మిన్నువిరిగి పైనపడినా అన్న మాటకు భంగం రానీయడు. ఆ సమయంలో అతడి చేయ కదిలించి అంతకంటే వేరేమీ లేదు. ఆ ప్రయోగంతోనే అతడు

వెళ్ళాను. ఇక సౌమిత్రి ఎలా దాన్ని సహించాడో చెపుతా విను. అతని హృదయపీఠంలో మూడుమూర్తులున్నై. తల్లీ, భార్యా, అన్నా. అతనికి పుక్కిలింతలుగా కోపం వచ్చింది. తల్లీ, భార్యా దన్ని విరోధించి ధ్రువసృష్టి చేశారు. నేను ఊర్మిళాలక్ష్మణులు కోరేమంటూ వారిని చేరబోయి. వారు ఆధ్యాత్మిక శక్తితో నన్ను కొట్టారు.

ఇంద్రుడు :- ఆ ... పిచ్చుకపిల్ల కొన్ని రహస్యాలు తెలుసుకున్నావు. వీటి నన్నిటినీ నీవే ఉపయోగిస్తున్నావు కనుక సౌమిత్రి కాకున్నా రాముడు వాక్కోసైనా అంగీకరిస్తాడు. ఇక సెలవా ?

మాయ :- దేవరాజా. ఒక మాట. ఆ పొన్నవృక్షం పొంచి వున్న వెవరో తెలుసునా ?

ఇంద్రు :- తెలియకేం రావణుడు. రావణుని స్మరించి యతిగా మారాడు. అవసరమైనప్పుడు మళ్ళీ దర్శిస్తాను. నేను ముందు రాబోయే పాత్రల సంసిద్ధం చేస్తాను."

అని ఇంద్రుడు అదృశ్యుడైనాడు. మరు మాయకూడా తిరోహిత అయింది. పర్ణశాలవైపు వస్తున్న యతికి ఇప్పుడు పదితలలూ, ఇరవై చేతులూ లేవు. రత్నాభరణాలు లేవు. కాంచనవస్త్రాలు లేవు. వున్నత కాయం లేదు. ఖడ్గధారణం చేసే దక్షిణ హస్తంలో జపమాలిక వుంది. వామహస్తంలో కమండలం. చంకలో జింక చర్మం వున్నై. లలాటంలో బాహుపుల్లో. వక్షఃస్థలంలో విభూతి ముద్రలు వున్నై. శిర ప్రదేశంనుంచి మోకాళ్ళవరకు కాషాయవస్త్రం కట్టుకుని వెనుకకు ముడిచి దోపబడి వుంది. చిన్నగొడుగు తలపై వుంది. కాళ్ళకు పావుకోళ్ళు వున్నై. రామలక్ష్మణ శూన్యమైన పర్ణశాల దివాకర నిశాకరులు లేని సంధ్యలవలె వున్నది. రాక్షస యతి రాకాతిథిమీదపైన రోహిణినివాయిదోయే గ్రహంలాగా దుర్బుద్ధితో పర్ణశాల చేరబోయాడు. ఆ భూతాహితుని రాకతో చెట్లకొమ్మలు కదల లేదు. గాలి ఎక్కడా మెదలలేదు. నిరంతరం వేగంగా పారే గోదావరి,

క్రూరుడు సన్న్యాసరూపం దాల్చేసరికి భయపడి మెల్లగా పారజొచ్చింది. అసురపతి యతిరూపంలో తృణచ్ఛన్నకూపంలాగా గోచరించాడు.

"భర్త దూరతీరాలకు పోయి ఇంటివరకు రాలేదే, తోడుపోయిన సౌమిత్రి సకాలంలో ఆయన చేయికి చేరాడో లేదో." అని సందేహభయాలతో వాడిపోతున్న దానిని చూస్తూ, ఒట్టిగా నిట్టూర్పులు విడుస్తూ అరవిరిగా వున్న మైథిలిని రావణుడు కల్లారా చూశాడు. "అరవిందముఖా, కాంచనాభా, ఈమె సౌందర్యాన్ని గురించి ఏం చెప్పాలి? నా చెల్లెలు చెప్పినట్లు ఈమె దక్షిణవాసుల మాదిరిగా ఉందే. ఈమె కురులు అంధకారం పరుస్తుంటే ఈమె నవ్వులు వెన్నెలలు కురుస్తున్నై. ఈమె వదనం కలువరాయుడై వెలిస్తే, ఈమె వక్షోజాలు చక్రవాకజంట కూడుస్తున్నై. ఈమె నేత్రాలు సారంగాలను మించుతుంటే, ఈమె నాసిక సంపెంగల పెంచుతూంది. ఈమె పాదములు అరవిందాలై రాణిస్తుంటే, ఈమె యానం కరిపై వెలుగుతూంది. ప్రకృతి సహజమైన సకలసృష్టి విలాసం పరిమార్చి, అద్వైతంలో విహరించి వెళ్లే రామసామ్రాజ్యంలాగా ఈమె సౌందర్యం కన్నులవిందు చేస్తూంది. ఓహో! ఈమె కళ్లు నేత్రాలకు విందమ్ములు. తనూరుహములు మంజులమైన ప్రవాళమ్ములు. నడుము పికీగితమ్ములు. నిశాలరాణికి వృషభమే కుంచమ్ములు. నిశ్చలంగా ఉన్న ఈమె శరీరకాంతి చూచి కంపాలక పడిస్తూంది. ఈమె కేశభారాన్ని చూచి జలధరం వెల్లావెదురౌతూంది. ఈమె సుప్రసన్నవదనం చూచి చంద్రుడు క్షీణిస్తున్నాడు. ఈమె వికసితనేత్రాలు చూచి అంబుజాలు ముకుళించుకున్నై. సుస్థిరంగా ఈమె వక్షోజాలు చూచిసిగ్గుతో చక్రవాకలు పారిపోతున్నై. ఈమె అధరాన్ని చూచి పండిన దొండపండు నేల పడుతూంది," అని భావిస్తూ నడిచాడు.

## రావణుడు యతి వేషంతో సీతకడకు వచ్చుట

వస్త్రం చేతిలోలేని వన్యలాగా వస్త్రాలను ప్రదర్శిస్తూ చేస్తూ, ఆశ్రమాంతరంలో ఆసీనమైయున్న సీతను సమీపించాడు. సమీపించగానే పఠిస్తూవున్న వేదమంత్రాన్ని ఆపి, "సుమంగళీ! భర్తపై అలిగి ఏకాంత వాసం అనుభవించ వచ్చిన పార్వతివా? లక్ష్మివా? శారదవా? లోకంలో ఎందరివో

చూచాను. వారంతా నీకు చెలికత్తెలుగా వుండి వూడిగం చేయటానికి పనికి వస్తారు. సింహం లోక భయంకరంగా వుండికూడా నీ కౌనుగా చేరి ఘనత గాంచింది. కాలాహి విషం కలిగికూడా నీ వేణిని కూడి సవురు పెంచుకుంది. ఏనుగు పెద్ద శరీరం వుండికూడా నీ గమనంలో దాగి ఖ్యాతి ఆర్జించింది. లేడి చంచల నేత్రాలు కలదై కూడా నీ చూపుగా మారి నుతి పాత్రమైంది. ఓహో హో! మృగాలే నిన్నాశ్రయించి చిరకీర్తి నార్జిస్తే, నీ సర్వాంగాలను పురుషుడే ఆశ్రయిస్తే అతని అదృష్టం అందుతుందా వాక్యాలకు?

వనవాటి సెలయేటిలో మునిగి ఆడుతున్న పూతీవవలె వున్నది నీ ఒడలు. మెరపు కన్నెల పిరుదులపై నడయాడే కారుమొగులు వలె నీ జడ వున్నది. కలుముల జవరాలు కుచ గుబ్బలపై పూసిన గంధంవలె వున్నది నీ శరీర పరిమళం. అతిగా వర్ణించటం అప్రస్తుతం. నిజంగా నీవు మదన కోదండ నిర్గత మార్గణానివి. ఇంత సౌందర్య రాశివి, ఇంత సుకుమారివి, ఒక్కదానివే ఈ ఆకుల కొంపలో వుండటం చూస్తే నాకు వెర్రెత్తుతూంది. కోతులు, కొండముచ్చులు, పులులు, చిరుతలు, సింహాలు, ఏనుగులు, తోడేళ్ళు దట్టంగా తిరుగుతుండే ఈ ప్రదేశంలో నీవు భయం లేకుండా ఎలా వున్నావు? మదించిన ఏనుగులు మందలు కట్టి తిరుగుతుంటై. వాటి ఘీంకారాలకూ, పన్నగ విహారాలకూ పురుషులే భీతిల్లుతారు. నీవు జంకు గొంకు లేకుండా సంచరించటం చూస్తే జాలి వేస్తూంది. నువ్వు ఎవరిదానవు? ఏకాంతంగా ఎందుకు వున్నావు? అయ్యయ్యో! మానవాశనులైన రాక్షసులు మాయా వేషధారులై స్వేచ్ఛగా తిరుగుతుంటారు. వారి దృష్టిలో పడితే ఎంత అపాయం వస్తుందో నీకు తెలియదు. నీ విషయం వివరంగా చెప్పు. చేతనైన సాయం చేస్తాను. నిన్ను చూస్తే ఎందుకో నాకు నిర్వ్యాజ కరుణ కలుగుతూంది. ఈ ఆశ్రమ నిర్మాణాన్ని చూస్తే నువ్వు సభర్తృకంగా ఇక్కడ కాపురం చేస్తున్నట్లే కనుపిస్తూంది. ఆయన ఆహార సంపాదనార్థం అడవిలోకి వెళ్ళాడా?" అని సహజ తాపసివలెనే ఆమెను అడిగాడు. సీత కూడ శంకింపకుండగనే గృహిణీ ధర్మ తత్పర అయింది.

## మాయా యతిని జానకి సత్కరించుట

"యతిశ్రేష్ఠా! ఇదిగో పాద్యాసనం. దీనిపై ఆసీనులు కండు. ఇదిగో అర్ఘ్యం ఇదే పాద్యం. ఇవే మధురఫలాలు. తనివితీర ఆరగించండి." అని మనఃపూర్వకంగా మాయా యతిని సత్కరించింది ఆమె ఒంటరితనం, మధుర భాషణం, మనోహర సౌందర్యం, రావణుని గంగవెఱ్ఱులెత్తిస్తున్నై. మనసు రంధ్రాన్వేషణం చేస్తున్నాడు. ఆత్మనాశనం కోసం ఆమెను అపహరింపచేయుటకు విధి ప్రేరేపిస్తోంది. జానకి యతిని పూజిస్తూనే అడవికి పోయిన సోదరులు తిరిగి రాలేదన్న ఆరాటంతో దిక్కులు పరికించి, శూన్యమార్గాన్ని, నిశ్చలంగా ఉన్న వృక్షాలను చూచి దీర్ఘంగా నిశ్వసించుచూ ఉంది. ఆ యోగక్షేమాలకన్నా యతి ప్రశ్నించిన విషయం మనస్సులో రాగా, "యథార్థం చెప్పటమా, మానటమా" అని కొంత చింతించి "ఉన్నదున్నట్లు చెప్పటమే యుక్తం అసత్యం పలికితే శంకించి శపించవచ్చు అయినా అనృత దోషం నిష్కారణంగా పొందటం దేనికని నిశ్చయించి, సంక్షిప్తంగా తనకథ చెప్పసాగింది.

## మాయా యతికి సీత తన వృత్తాంతం చెప్పుట

ఆర్యా! మిథిలాపతి అయిన జనకుడు నా తండ్రి. నా పేరు సీత. మీకు క్షేమం కలుగుగాక. నా భర్త పేరు శ్రీరాముడు. వివాహానంతరం సర్వ సౌఖ్యాలతో పన్నెండేండ్లు అయోధ్యలో మామగారి ఇంట గడిపాను. పద మూడో ఏట నా భర్తకు యువరాజ్యాభిషేక నిమిత్తం మా మామగారు ప్రయత్నం చేశారు. సమస్త సంభారాలు. చతుస్సముద్ర ముద్రితమైన భూమండలంలో గల ప్రసిద్ధ పుణ్యతీర్థాలన్నీ సేకరించారు. వాక్చాతుర్యం గల నా మూడో అత్త కైకమ్మ, వార్త చెప్పవచ్చిన వృద్ధ భర్తను వశీకరించి. నా నాథుని పద్నాలుగేండ్లు అరణ్యవాసిగా, తన కుమారుడైన భరతుని ప్రభువుగా చేయమని రెండు వరాలు కోరింది. ఆ కోరికలు చెల్లించకపోతే, అన్నం, నీరూ ముట్టక అసువులు వీడుతానని హఠం చేసింది. దానికి మామగారు తత్తుల్యార్థాలు ఇస్తాను. ఇది మానుమని ఎంత వేడినా ఆ ఇల్లాలు ఆయన మొర

ఆలకించలేదు. పట్టిన పట్టు విడువలేదు. అప్పటికి నా పతికి ఇరవై అయిదేండ్లు. నాకప్పుడు పద్దెనిమిది ఏండ్లు. (పెండ్లినాటికి రామునికి పన్నెండు, సీతకు ఆరు వత్సరాలు. అయోధ్యలో కాపురం పన్నెండేళ్ళు.) మహానుభావుడూ, పురుషోత్తముడూ, అయిన నా స్వామికి, కామబద్ధుడై మామ అభిషేకం ఆపివేశాడు. చిన్నత్త పిలిపించి వరాల విషయం చెప్పింది. జనకుని సత్య వాక్య పరిపాలునిగా చేయటం కోసం నా స్వామి నాతో కూడి వనవాస వ్రతం తీర్చ ఈ వనానికి వచ్చాడు. మాతో నా పతి వైమాత్రేయుడైన (రెండవ తల్లి బిడ్డడు) లక్ష్మణుడు, పరమ యోగ్యుడు, అన్ని విధాల అన్నయంతటివాడు, అన్న సేవా కాంక్షతో అనుగమించాడు.

నా పతి తాపసపూజా తప్పడు. ఒరులకు ఇస్తాడేకాని వారిచేత పుచ్చుకోడు. ఆయన ఎప్పుడూ ఋతభాషణుడే కాని, అనృత భాషణుడు కాడు. ఇటువంటి పరమ సద్గుణ సంపన్నునకు అర్ధాంగినై ఉండుటకు నేనెంతో ఆనందిస్తూంటాను. కొంచెకాలం మీరిక్కడ నిలిస్తే సోదర సహితంగా వారు వస్తారు. వారు మిమ్మల్ని ఎంతో భక్తి గౌరవాలతో సత్కరిస్తారు." అని జానకి చెప్పగానే మారీచుడు మరణించిన సంగతి మనస్సుకు వచ్చి "తానిక జాగుచేయటం తగ"దని నిశ్చయించిన రావణుడు పరిసరాలను పరికించాడు. రామలక్ష్మణులు వస్తున్న జాడ కనిపించలేదు. ఇంతలో సీత "యతీంద్రా! తమ గోత్రనామాలు ఏమిటి? ఎక్కడ నివాసం? ఇక్కడికి ఎందుకు వచ్చారు? దయతో సెలవిస్తే వింటాను," అని ప్రాధేయ పూర్వకంగా ప్రశ్నించింది.

## రావణుడు తన్నెరింగించి సీతను దుర్భాషలాడుట

తన రాకను గూర్చి తానై పలుకవలసిన సమయంలో అప్రయత్నంగా సీత ప్రశ్నలతో చేకూరిన అవకాశాన్ని రావణుడు పురస్కరించుకుని, కర్కశ కఠోర కామ వ్యాపార వచన రచనా నైపుణ్యంతో, స్వీయ కుల బల వర గర్వంతో " ఓ సీతా! ఎవని పేరు ఉచ్చరిస్తే పసిబిడ్డలు పాలు త్రాగరో, అస్వేదులూ, అనిమిషులు, అమరులు ఐన ముప్పైమూడు కోట్ల దేవతలు, స్వేదులూ, నిమిషులు, మర్త్యులు అవుతారో, ఎవడు పద్నాల్గు లోకాలలో వున్న రాక్షస సంతతికి రాజో, ఎవడు బ్రహ్మవంశ సంజాతుడో

ఎవడు పౌలస్త్యుడో వాడేవీడు. వీడే రావణుడు. నీవుకూడా సుఖం కలుగు నాక. నీ పరోక్షంలో నీ సౌందర్యాన్ని గూర్చి విని, విన్నిప్పుడు చూచాను. ఇదివరకు ఎందరినో సుందరీమణుల అపహరించి తెచ్చి హాయిగా అతను (మన్మథుడు) సుఖం అనుభవించాను. ఇంతెందరో ఇందు వదనలు నా పరాక్రమ ఖ్యాతి భోగాల నాశించి స్వయంగా తాముగా వచ్చి నన్ను వరించి తాము సుఖిస్తున్నారు. నిన్ను పిన్నదాని. ఇప్పుడు వన్నదాని వారిలో పొందిన సుఖం అభిమానమనిపిస్తున్నది. నీవు నాకు దేవేరివై, వారినందర్నీ పాలించు. శత్రు భయంకరంగా సముద్ర మధ్యంలో వున్న లంకలో పర్వతంపైన నా నగరం వుంది. అది మయుడు ప్రత్యేకంగా నాకై నిర్మించియిచ్చిన నగరం. లోకంలో దానికి అదే సాటి. నన్నేలి, రాక్షసలోకానికి రాణివై, దైవం ఇచ్చిన నీ సౌందర్య జీవితం ధన్యం చేసుకో. మానవ శక్తితో నిర్మాణమైన అయోధ్యా నగర సౌభాగ్య సౌందర్య సంపదలకే మురిసిపోతున్న నీవు, దైవీ మానుష శక్తులు రెంటినీ తపస్సులో సాధించి, సాహస పరాక్రమాదులతో సంపన్నం చేసిన లంకా నగరం చూస్తే, మళ్ళీ అయోధ్య మాట తలపెట్టగలవా? అక్కడ వున్న ధర్మ హర్మ్యాలనూ, సుందర కందర నందనాలనూ. దాదు మాణిక్య దీప్త సంశోభితాలైన సౌధ వీధులనూ, లతా వృక్ష గుల్మ మండితాలై, పుష్పల కందర వికసితా పూర్ణాలై, యువ యువతీ జనసంగాన సంవాదనాదపూరితాలై. మనోల్లాసంపొందించే విహారప్రదేశాలనూ చూస్తూ, నైక పేటికల జంటరలో చూడముచ్చట గొల్పే జలయంత్రాల నానావిధ్వుల్లాస్తేంబిన స్వాభావిక నావికావిశిల్పానుకాని సీతా! ప్రకృతి సౌందర్యానికి సాధనమైన ప్రకృతియోగం నీకు ప్రసాదిస్తాను. నీ అపూర్వ సౌందర్యానికి ఈ అడవుల కాపురం ఎంత మాత్రం తగదు. రత్నం బంగారంలో భాసించినట్టు ప్రాసాదంలో భాసిస్తుంది." అంటూ ప్రత్యేకంగా లేచి ముందుకు పోసుంకించాడు.

## రావణుని సీత నిందించుట

సభ్యతా సంస్కారాలు దూరంచేసి, లజ్జాభిమానాలు ఉజ్జగించి, కేవల రాక్షసభావంతో రావణుడు పలికిన పలుకులు ములుకులవలె చెవుల

మారటంతో, సీత ఆడుసింహివలె దుష్టావేశురాలై, తృణీకారభావంతో ఆ యతిని తీక్ష్ణాపాంగవీక్షణాలతో నిట్టనిలువునా దహిస్తూ, ఓరీ ! క్షుద్రుడా ! ఏం ప్రేలుతున్నావో ఎరుగుదువా ? నీవు రావలసినవని ఆహ్వానించి నందుకు, అర్చించినందుకు కృతజ్ఞతను మాటగా ఇంత కృతఘ్నుడవవుతావా? నీచుడా ! నీ మాయావాగురల చిక్కే మందభాగ్యలవంటిదాననని అనుకున్నావా నేను? పర్వతంలాగా అచలుడూ, అంబుధివలె అక్షోభ్యుడూ, అయిన శ్రీరాముని నాపతిగా రామానువ్రతను సీతను. శ్రీమహిత లక్షణుడూ, అప్రతిమపరాక్రమవిక్రముడూ, నిర్జితవీరజమిత్రతేజుడూ అయిన రఘువంశ భూషణుడు రామచంద్రుడు నా భర్త. నేను రామానువ్రతనైన సీతను. నరసింహుడూ, సంపాదనామితశౌర్యవంతుడూ, తేజోమేదురభుజవక్షుడూ అయిన దాశరథి నా హృదయేశుడు. రామానువ్రతనైన నేను సీతను. సౌందర్యజితమన్మథుడూ, శాంతిరసపోషుడూ, సుక్షత్రియుడూ, జితేంద్రియుడూ, నియమపాలనుడూ, సత్యపరాక్రముడూ, గాధేయసవనరక్షా దక్షుడూ, ఖరదూషణాది రాత్రించర కంఠవిలుంఠనుడూ అయిన కాకుత్స్థ ముక్తాహారతరళం నా జీవిత భాగస్వామి. నేను-నేను - నేను - రామానువ్రతను. రాఘవసాధ్వి ! సీతను.

అన్యదుర్లభనూ, సింహికయిన నన్ను నక్కవు నీవు కోరేవాడవా? సూర్యగోళంవంటి నన్ను స్పృశించే అర్హత నీకు ఉందా? రామపత్నిని వాంఛించిన ఫలం ఇప్పుడే పొందగలవు. నిష్ఠురక్షుధాకుపితహర్యక్ష దంష్ట్రికను పీక సాహసింతువా? గూఢపాత్రశ్లేష్మ కఠోర దంతాహతిలో కాలకూటం లేసుకున్నావా? ఫణీశ్వరశ్రేష్ఠమైన మందరాన్ని అరచేత పగులగొట్టగలవా? దాశరథి జ్యేష్ఠుని ధర్మపత్నిని భావించి భ్రమసి ఆశ పడుతున్నావా? విషం మింగి బ్రదకటం, సూదులతో కన్నులు పొడుచుకుని చూడటం, మెడకు బండ కట్టుకుని అంబుధిని అధిగమించటం, సూర్యవంశ మణి శ్రీరాముని అర్ధాంగిని ఆశించి సుఖించటం సృష్టిలో జరిగే పనికాదురా దురాత్మా ! కాలాయసశూలాగ్రాలపై ముగ్గులు వేస్తే ఏమవుతుందో, మండే మంటను గుడ్డలో మడిస్తే ఏమవుతుందో, కత్తివాదరను నాలుకతో నాకితే ఏమవుతుందో, నన్నాశించితే అదే అవుతుంది. సూర్యచంద్రాగ్నులను

గుప్పిలి పట్టటంవంటిదిగా నన్ను పట్టటం భావించు. సింహానికీ, నక్కకూ, సముద్రానికీ చవిటి పడియకూ, వైనతేయునకూ పిచ్చుకకూ, ఏనుగకూ ఎలుకకూ, నెమలికీ కోడికీ, సురనదికీ, కాలువాగుకూ, హాటక సౌగంధిక సుమానికీ, అడవి పూవునకూ ఎంత అంతరమో అంత అంతరం నా భర్తకూ నీకూ ఉంది. సీసం బంగారం కాదు. గద్ద రాజహంస కాదు. గాడిద గుర్రం కాదు. కాకి కోకిల కాదు. రాబందు గరుత్మంతుడు కాడు. రాక్షసాధము డెప్పుడూ రాముడు కాడు. [illegible] రాముడు కోదండపాణియై నా ఎదుట నుండగా నేను సజలను కాక అబలనని అనుకోటం మృత్యువును స్త్రీగా భావించి ప్రేమించటం. నా భర్త లేడని దిరాగతానికి సాహసిస్తావా తెగపడిన నేయినవుతాను. నీ వంశ నాశనం చేస్తాను." అని గర్జిస్తూ సీత భర్త రామికి వాతాహతకదళివలె కంపించిపోయింది. ఆ మాయాతాపసుడామె తొట్రుపాటును సోదరుడు తోడురా శ్రీరాముడు వచ్చే వేళని గమనించాడు. ఇంక కాలహరణం కూడదనుకున్నాడు.

## రావణుడు సీతకు తన స్వరూపమును చూపి భయోక్తులు పలుకుట

ఫాలభాగంలో భ్రుకుటి ముడిపడగా, కుపిత కఠోర వాక్యాలతో పంక్తిముఖుడు వింశతినేత్రాలల్లో విస్ఫులింగాలు వెదజల్లుతూ, "ఓసీ! సీతా! మానవీ! నన్నేమనుకున్నావు? శంకరుడుమిత్రుడైన యక్షేశుడు నాకు అగ్రజుడు. నేను దశకంఠుణ్ణి. నా పేరు రావణుడంటారు. నీవు చెప్పిన మృత్యువే నేనుగా భావించి గరుడ గంధర్వ యక్షులు పారిపోతారు. కారణాంతరంగా కుబేరుడు నాతో కలహించి సంధి చేసుకున్నాడు. నా భయంతో లంకానగరం స్వాధీనం చేసి మంచుకొండకు ప్రయాణంకట్టాడు. అతని కామగమైన పుష్పకవిమానం నా విహారార్థం బలాత్కారంగా గ్రహించాను. నా రాక వింటే వాసవాది దిక్పాలకులు అదలి, వదలి, సదలి, తరబడి ముసుముందుగా కోరినవన్నీ చేకూర్చి సేవించవస్తారు. నేనున్నచోట గాలి వీచదు. అగ్ని మండదు. వేడివెలుగు చల్లనవుతాడు. నేను నడచిన

మేర ఆకుకూడా చెట్లలో అల్లాడదు. మహావేగవతులైన నదులు మందంగా ప్రవహిస్తాయి.

క్రూరులూ, భీకరాకారులూ, అయిన రాక్షసమూకలు నన్ను సేవిస్తుంటై. సౌందర్యపూర్ణంగా, అంబరచుంబిప్రాకారసంకీర్ణంగా, కేసర ప్రవాళ శత్రుహృదయ విదీర్ణంగా, ఉష్ట్రఖరకరితురగసింహవ్యాఘ్ర వాహనాదులతో. వజ్ర, వైడూర్య, నీల, గోమేధిక, పుష్యరాగ, మరకత, మాణిక్య, ముక్తా, ప్రవాళసంకీర్ణగోపురవిలసిత తోరణాలతో, సర్వర్తు సంప్రాపిత సుమ ఫలభారపూరభూరుహాలతాపరిమండిత విహారవనాలతో. సర్వవస్తు సంభార సంతృప్త దినాలతో, నిరంతరానందోత్సాహ సంవర్ధన నవపుల సంకులమైన నా లంకా ద్వీపాన్ని, సీతా! దర్శించి ధన్యవుగా. అల్పమైన భోగాలను మరిగి, తిరిగి నర నర సౌఖ్యాలకోసం ఇంక పరితపించవు. మరణించే మానవుడితో ఏం సుఖపడతావు? అమరుడైన దశగ్రీవుని అలివై అనంతకాలం అఖండ సుఖాన్ని అనుభవించు. నీ భర్త పరాక్రమం చెప్పావు. నా విక్రమం నేను చెప్తా విను. ఈశ్వరుడు వసించే వెండికొండ నా భుజసంత దండితమై గడగడలాడింది. అష్టదిక్పాలకులు నా హైమ సింహాసనానికి ఎక్కే సోపానాలైనారు. స్వర్గమర్త్య పాతాళాలు నా సార్వభౌమత్వం అంగీకరించి సామంతంగా పడియున్నై. గ్రహాంతరయానం చేశాను. సర్వజ్ఞ్ణి నాసోహం అనిపించాను. ఎందరెక్కినా చోటు కల్పించే కామసంచారశక్తిగల పుష్పకవిమానం సాధించి లోకాలోకాలలో నిరాటంకంగా విహరిస్తాను. ఇంతటి నేను నీకై పరితపించి అడిస్తే, ఆడదాని మాటలు విని తిరస్కరించి పెద్దకొడుకును రాజ్యభ్రష్టుణ్ణి చేసిన తండ్రి మాటలు పాటించి అడవికి వచ్చిన ఆ మగడు ఒక పురుషుడేనా? అతనికై నీవు అల్లాడతావా? ఇప్పుడు తిరస్కరించి, ముందు శోకిస్తావు. వేదుల పారంగతుడైన ఆతనితో ప్రయోజనమేమిటి? పురూరవ షష్ఠి ప్రథమంలో పాపంతో పన్ని, రాజపతి ఏచ్చిన ఊర్వశి లాగే నీవూ అవుతావు. చతుర్ముఖ ప్రసాదిత వరబలంతో, నిరంతరాత్మ లింగార్చనా మంత్రపఠనా స్వగతంతో, పితిహోత్రప్రతిభాన నశవదనంతో, ఏకసమయ బహు విధాస్త్ర శస్త్రధారణా సంచలనా సమర్థవింశతిభుజంతో, దృశ్యాదృశ్య

ప్రకటిత రామసంహార సంప్రదాయానుడనై ప్రతిఘటించి నిలిస్తే, రాముడూ గీముడూ ఎక్కడ వుంటాడు? ఏమవుతాడు? తానుగా చేరవచ్చిన మేరునగాన్ని తన్నబోకు. కల్పవృక్షం పెరటిలో నిలిస్తే, కామ్యపదార్థాలకు కొరతవుండదు. అనురక్తవై అంగీకరించినా, అగ్రహంతో తిరస్కరించినా, నీ అపహరణం తప్పదు. ఏమంటావు? ఇష్టంగా రావటం ఇద్దరికీ క్షేమం" అన్నాడు.

## సీత రావణుని నిందించుట

వెనువెంటనే జానకి రోషభీషణాకారియై, "ఏమిరా రాక్షసా! నీవు విశ్రవసుని తమ్ముడవా? పౌలస్త్యుడవా? ఛీ ఛీ. తులసివనంలో గంజాయి మొక్కవలె ఆ మహా తపస్వికి నీవెలా పుట్టావు? యక్షగుహ్యగణేశుడైన ధనపతికి నీవు సోదరుడవెలా అయినావు? ఆయన తమ్ముడనని చెప్పి సిగ్గు విడిచి అసంస్కార కార్యానికి ఎందుకు తలపడ్డావు? ఇంత నీచకాముకుణ్ణి, ఇంత వివేకహీనుణ్ణి, ఇంత అల్పాయుష్కుణ్ణి ప్రభువుగా చేసుకున్న రాక్షసుల పాపం! సమూలంగా నశిస్తారు. అది ఇదిచేస్తాననీ, అంతవాడను, ఇంతవాడననీ, ప్రగల్భాలు పలుకుతావు. నిన్ను చూస్తే జాలి కలుగుతూంది. అంత ప్రయోజకుడవే నీవైతే, ఒక్కడవలె దొడ్డిదారిని ఈ ప్రవేశం దేనికి? గడియకాలం కాలు నిలద్రొక్కి నిలువు. నా భర్త వస్తాడు. కార్యం సాధిస్తావో, కాలుని పురానికి ప్రయాణిస్తావో ఇప్పుడే తేలుతుంది. నా పతిపేరు ఉచ్చరించగానే నీ శరీరం చెమటలు క్రమ్ముతున్నై. దీనికేనా ఇంత విర్రవీగుతున్నావు? పౌలోమిని గ్రహించి ఇంద్రు వజ్రాహతి జీవించగలవేమోకాని, రామపత్నిని హరించి రాక్షసా! బ్రతుకలేవు. ఇది ముమ్మాటికి సత్యం. రామబాణం అప్రతిహత మహాస్త్రం. నీవు నా అదృష్టం పండి రాలేదు. నీ అదృష్టం పండి ఇక్కడకు వచ్చావు. వేవేలుగ నీ మరణాన్ని నీవే సిద్ధం చేసుకుంటున్నావు. నీ చితికి నీవే నిప్పంటించుకుంటున్నావు. సన్నిపాతజ్వరార్తుడు చావు సమయంలో తనవారని, పెరవారని భేదం తెలియక, అపభ్రంశంగా ప్రవర్తించినట్లు నీవు ప్రవర్తిస్తున్నావు. పథ్యమైన నా మాటలు తాగినవానికి దారి కనబడనట్లు వ్యామోహితుడవైన నీకు వివేకం వుండదు."

నీకిప్పుడు తలకెక్కదు. అని సీత నిందిస్తుంటే, దశవదనుడు ఆ మాటలు సహించలేక, వింశతి నేత్రాలు వింశతి కొలిమి తిత్తులు కాగా, దశ భుజాలపై దశ భుజాలతో చరుస్తూ, "ఓసీ! సీతా! నా యతివేషం చూచి, ఇదే నా రూపమని తలచి వాగుతున్నావు. పర్వతాలను పెకలించి [illegible]మంటావా? మృత్యుదేవతను తెచ్చి నీ ముందర పడవేసి ఈడ్వమంటావా? హిమాచలాన్ని గుప్పిటితో గ్రుద్ది పగులగొట్టి పిండి చేయమంటావా? సూర్యగమనాన్ని నిరోధించమంటావా? సాగరాలలోని నీరంతా త్రాగమంటావా? నన్ను చూస్తావా? చూచి సహిస్తావా? ఇదిగో నన్ను తేరిపార చూడు" అంటూ స్వస్వరూపాన్ని దాల్చాడు.

నిలుచున్న కొండలాగ మాయా యతి మాయమై, పది తలలతో, ఇరువది చేతులతో, చిత్రవిచిత్ర హేమకుండలాలతో. వెన్నెల తీగలవలె వెలిగే యజ్ఞోపవీతంతో. [illegible] ప్రతి[illegible] సువాసాలతో. బహుముఖ నామాలు గలిగిన అస్త్ర శస్త్రాలతో. రక్తవర్ణంగల పట్టు వస్త్రాలతో. రక్తవర్ణంగల నేత్రాలతో. విశాల దేహంతో వెలుగుతున్న గాత్రాలతో. నడుమునను పెట్టుకున్న బంగారు పటకాలోనుండి [illegible] వరకూ వున్న, వజ్ర సన్నిభమై, హేమ [illegible]ంతో మెరిసే ముఖంతో, [illegible] విశాలమైన [illegible] రొమ్ముతో రాక్షసలోక ప్రభువైన రావణుడు నిల్చాడు. ఆ రూపం చూచిన సీత దిగ్భ్రాంతి పొందినట్లు అచేతన అయింది. రావణుడు "సీతా! చూచావా నన్ను? నా ప్రతాపాలో, యథార్థాలో ఇప్పుడు చెప్పు. నిజంగా నేను నీకు దాసుడను. ఈ సచరాచర జగత్తునంతా జయించి నీ పాదాల [illegible]స్తాను. సందేహించకు. ఇంక నన్ను [illegible]. కోపం తెచ్చుకోకు. [illegible] ప్రేమించు. ఏమి చూచి ఆ పురుషాధముని విడువలేకున్నావు. అయోధ్యలో [illegible] సుఖపెట్టలేక, తండ్రి ఆజ్ఞ [illegible] [illegible] పెట్టి నిన్ను నట్టడవికి [illegible] వచ్చాడు. కన్నని తిండీ, కంటికి నిద్రా, [illegible] కాపురం పెట్టి, [illegible] మునివేషం వేసి [illegible] [illegible] వంచువనీ, [illegible] వనీ [illegible]న్నావా? [illegible] డుల చంపినంత మాత్రాన. సర్వలోక విద్రావణుడైన రావణుని కూడ

చంపగలనని భ్రాంతి పడుతున్నావేమో? నేను అజేయుడను. నాకు దేవ దానవ యక్ష గుహ్యక గంధర్వాది దేవతలచే గానీ, మృగాలు వానరాదుల చేతగానీ సమరంలో చావు లేదని. అట్టి వరం వున్నదని నీకు తెలియదు కాబోలు. నేను సంకల్పించి విరమించను. చివర వరకూ చూస్తాను.

## సీతాపహరణం

నీ మగనితో నాకు పగ వుంది. మా ఇరువురి [illegible] కాలంలోనే నీవు చూస్తావు. అవకాశం లభించినప్పుడు [illegible] యుద్ధం [illegible]? ఏది ఏ సమయంలో ఎలా చేయాలో నాకు తెలుసు. నీకు తగినవాణ్ణి నేనే కాని అల్ప మానవుడైన రాముడెన్నటికీ [illegible] నా నిశ్చయం. ఇంతేగాక, నాకా పోలిక ఏమి వున్నదో నీవే చెప్పు. నాకంటె సమర్థుడంటే నల్లో ప్రభువా రాక్షసలోకం [illegible] చేస్తారే వెర్రిదానా? నీతో నాకు తర్కం ఎందుకు? నేను వచ్చిన పని నిర్విఘ్నంగా పూర్తి చేసుకుని పోతా"నంటూ, భయంకరమైన ప్రకాశంగా నిలబడి యున్న సీతను కాముకుడై బుధుడు రోహిణిని ఆకాశంలో పట్టినట్లు భూలోకంలో రావణుడు జానకిని పట్టాడు. ఒకచేత కొప్పుజుట్టూ, ఒకచేత తొడలను గ్రహించి కామగమైన రథాన్ని సంస్మరించాడు. అనుకున్నంతలో రథం ముందు అవతరించింది. ముగ్ధ మనోహరమైన సీతతో సహా ఆ రథం ఎక్కగానే అది ఆకాశానికి ఎగిరింది. రథారోహణం చేసిన రావణుడు అసహాయుడై [illegible] పట్టుకున్నాడు. భయంకరుడూ, ఉగ్రుడూ, పరదారాసక్తుడూ, పాపిష్టుడూ అయిన [illegible] చూచి వనదేవతలంతా వాపోయి [illegible] అయ్యారు. [illegible] సీత "రామా రామా" అని ఆక్రందన చేస్తూ [illegible] ప్రయాణిస్తూ [illegible]

[illegible]

రక్షింపవా? భోగభాగ్యాలను జీవితాన్ని కేవల ధర్మ సత్య రక్షణకోసం త్యాగం చేసిన ప్రభూ! రామచంద్రా! అధర్మంగా, నీవులేని సమయంలో నీ అర్ధాంగినైన నన్ను అసురుడు అపహరించుకుపోతున్నాడు. నన్ను రక్షింప రావా? అవినీతిపరులైన దుష్టులనణచి సాధుపుంగవుల సంరక్షించే వ్రతం గల నీవు, నీ పట్ల జరిగించిన అవినీతిని ఎందుకు సహిస్తున్నావు? దుర్మార్గుల పాపఫలం వెనువెంటనే ఫలించదేమో. ఎదిగి, పండి, ఫలించిన పైరు లాగా కాలక్రమానగాని అనుభవానికి రాదనుకుంటాను అలా వస్తే, లేడి కోసం పోయిన నా నాథుడింతకాలం రాకుండా ఎందుకు వుంటాడు? దుర్భాష లాడి తోడు పంపిన లక్ష్మణుడైనా తిరిగి ఎందుకురాడు? ఓరి కామాంధుడా! ఇష్టంలేని సతిని నికృష్టుడవై హరించి ఏమి సుఖం ప్రాపించుకొంటావురా? కాలోపహతుడవై, రాగల అనర్థ పరంపర లక్షింపక, సంధ్య: ఫలితంగా కార్యం నెరవేరింది కదా అని మిట్టిపడకు. చావుమందు తీపిగానే వుంటుంది. ముందున్నది ముసుళ్ళపండుగ. నా జాడ తెలిసిన నా నాథుడు నిన్నూ, నీ లంకా ద్వీపాన్నీ సముద్రంలో శరసంధానంతో ముంచుతున్నప్పుడు నీకు తెలియవస్తుంది. నాపురది శిత శాత సాయకాగ్నిలో నీవారినందర్నీ కాల్చిబూడిద చేస్తున్నపుడు గుర్తువస్తుంది. ఈవార్త తెలిసి కైకేయి తనవాళ్ళతో కూడి తన ఎత్తుఫలించిందని, రామవిధుడిక అడవికే అర్పితమని చెప్పి ఆనందిస్తుంది. ఓ వృక్ష లతా పక్షి వాహినులారా! మీకు భక్తితో మ్రొక్కుతున్నాను. నన్ను అన్వేషిస్తూ మీ పొంతకు రాగానే నా భర్తతో నా యీపాటు చెప్పండి. ఓ వియచ్చరులారా! మీరైనా నా ప్రేమమూర్తి రామచంద్రుని చేరి "నీ అర్ధాంగి రావణునిచేత దొంగిలింపబడ్డ"దని తెలుపండి. పర్వత శిఖరాగ్రమా! ప్రస్రవణగిరీ! మాల్యవంతమా! మనఃపూర్వకంగా నమస్కరిస్తున్నాను. నన్ను వెదకుతు ఈ ప్రదేశానికి రావచ్చు. రాగానే, రావణుడు సీతను అపహరించాడని నా నాథునికి నావార్త అందించండి. గోదావరీమాతా! నీ పట్లని జల సేవనంచేతా, పానంచేతా ఇంతకాలం సుఖించాను. ఈ అసురుడు అతి వేగంగా అనంతపథంలో పడి నా భర్తకు దూరంగా నన్ను కొనిపోతున్నాడు. నీ చేరువకు రాగానే అలలుల ఎలుగుతో నా భంగపాటు నా జీవితేశ్వరునికి చెప్పు. నీకు త్రికరణశుద్ధిగా నమస్కరిస్తున్నాను. దండకారణ్యవాసులైన

తాపసులారా! వనేచరులారా! మీ రక్షకుడు, మీ ప్రేమపాత్రుడు, మీ అభిమానధనుడు రామచంద్రుడు నా వియోగ దుఃఖంలో పడి తెలివితప్పి, చెట్టుచెట్టు, గుట్టగుట్ట, పొదపొద విడువక నాకై తిరుగుతుంటాడు. ఆ కరుణామూర్తిని కాంచి జాలిపడి నా పోకడ తెలపండి. చాలు. ఆయనకు నా వార్త తెలియగానే నా శత్రువు దేహముక్తి, నాకు లంకాద్వీప విముక్తి ఒక్కసారే లభిస్తై. మీ ఉపకారం జన్మజన్మలకు మరవను. దీనురాలను, దిక్కులేనిదానను. ఇంతమాత్రం పుణ్యం కట్టుకోండి.

## జానకీ జటాయువును చూచి రోదించుట

"ఓ మహాత్మా! జటాయువా! నీవు నాన్నగారి జనకునకు చెలికాడవు. నా పతికి నమ్మిన విశ్వాసపాత్రుడవు. నన్ను కనిపెట్టుకొని కాలం గడుపుతున్నావు. నాకే ఇప్పుడు ముప్పువచ్చింది. వేటకై పోయిన నా భర్తలా ఆలస్యమైతే మరలి వచ్చేవారు. ఆపదేగానే మాయాయతి వేషంలో రావణుడు స్మృతిహీనవైన నన్ను బలాత్కారంగా అపహరించి రథంలో కొనిపోతున్నాడు. నీవు వృద్ధుడవు చెనటి రక్కసుణ్ణి ఎదిరించలేవు. నిస్సహాయుడవై ఉన్నావు. తండ్రీ! జటాయువా! నీవు వెంటనే పోయి నా దురవస్థ వారికి తెలుపు. అక్కడనుంచే వారు ఈ దుర్మార్గుని గమనాన్ని శరశక్తితో నిరోధించి, వీణ్ణి హరించి నన్ను విముక్తను చేస్తారు. నన్ను కాపాడుతూ నా భర్తా, మరదీ ఉన్నారని నిశ్చయుడవై నిద్రిస్తున్నావు. "అన్యథా చింతితం కార్యం. దైవమన్యత్ర చింతయేత్." నేను నీ ప్రియమిత్రుని భార్యను సీతను త్వరగా విడ్ర లేవరా," అంటూ ఘోరంగా ఆక్రందిస్తూ అరుస్తున్న జానకి కంఠధ్వని జటాయువు గుర్తించాడు. గురగురమంటూ కూర్కుతున్న పక్షిరాజు కొట్టి లేపినట్లు మేలుకొని పైకి చూచాడు. రథంలో వాటిన అంతట రావణుని ఒడిలో పడివున్న సీతనూ. మహావేగంతో ఉన్న రావణునీ చూచాడు. వెంటనే రెక్కలు టపటపలాడించి, విహాయసానికెగిరి రథాన్ని నిరోధించి "రావణా! ధర్మరక్షణలో నాజీవితమంతా ధారపోసిన వాణ్ణి. గృధ్రపతిని. మహాబల సంపన్నుణ్ణి. పేరు జటాయువు.

# జటాయువు రావణుని దూషించుట

రాముడు లోకైకవిక్ర మోద్దాముడు. ఆర్తరక్షణ పరాయణుడు. అతిశాంతుడు. అమృతమూర్తి. మానవలోక సార్వభౌముడు. ఆయన ఇల్లాలు ఈమె. ఈమెనా అపహరించటం? ధర్మబద్ధుడైనరాజు పరదార హరణానికి పాల్పడతాడా? అందులో రామపత్నే కాక రాజపత్ని కూడ. తల్లివలె కాపాడతగిన ఈమెను బలాత్కరించటం నీకు భావ్యంకాదు. పరులసొత్తుపై భ్రాంతి ప్రాణాంతకం అవుతుంది. నీవుకూడ దానవపతివి కాబట్టి ధర్మమార్గంలో నడపటం తగినపని. అధర్మ మార్గంలో నడచి అంతకాలయిం చేరటం ఆశించ తగినపని నీకుకాదు. ఏ కాలంలోనైనా, ఎట్టి సమయంలోనైనా ఆడవాళ్ళు రక్ష్యలు. ఆపైన గృహిణులు మాతృ దేవతలు. మానవాశనుడవైన నీకు మానవ మర్యాదలేమి తెలుసు? వావి వరుసలు విడనాడి సంచరించే నీచమార్గం మీది. నీవీమెను కొనిపోయి ఏమిచేస్తావు? మూసలో కరగుతున్న అయోమయజలం కంఠంలోనించి కడుపులోనికి దిగుతుందా పాపీ? సుకర్మలకు ప్రాప్తించ తగిన యశశ్శ్రీలు దుర్మార్గుడవైన నీకు ఏవిధంగా సంప్రాప్తమైనై? ధర్మార్థకామాలు రాజదండాన్ని ఆశ్రయించి నడవాలి కాని నిరంకుశంగా ప్రవర్తించటం ప్రజానాశనానికే కారణం అవుతై.

పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోదన్నట్లు, ఎంత వేద ధ్యానంచేసినా, ఎంత కఠోర తపస్సు చేసినా నీ నైజగుణం పోలేదు. బలవంతంగా నీకు బోధించినా, మనసున కెక్కురవా? ఎక్కడను [illegible] స్థిరంగా ఉంటావా? నీ నగర విషయంలోకాని, నీ విషయంలో కాని నా రామ ప్రభువు ద్రోహం కల్పించుకోలేదే? దేనికి ఈ అకారణ వైరం తెచ్చిపెట్టుకున్నావు? తేలికగా ఇది సమాప్తంకాదు. సపుత్రబాంధవంగా నాశనం చేసికాని విడువడు. నీవాడే. నీయంత వాడని నీవు భావించేవాడే. ఖరుడు సోదర పరివార సహితంగా చుప్పనాతి కోసం పోరాడి సోదికైనా రాకుండా సమరంలో చచ్చాడు. చావక మిగిలిన నీవూ, నీ పరివారం, జానకి అపహరణ కారణంగా రామ శరాగ్ని కుండంలో పడి చావనున్నారు. వద్దు. లంకాపతీ! నీమేలుకోరి చెపుతున్నాను. ఆశీవిషభుజంగంతో ఆటలాడ

వద్దు. కాలపాశం కంఠానికి చుట్టుకోవద్దు. ఎవడైనా మోయగలిగినంత బరువు మోయాలి, కాని, అత్యాశకుపోయి అణగిపోవటం కూడదు. నీ పూర్వులైన హిరణ్యాక్షహిరణ్యకశిపులంతటివారు చావులేని వరాలు కోరి చక్రధారి చేతిలో చచ్చారు. ఇక నీవెంత? నీవరబల గర్వమెంత? పదార్థం రుచిగావున్నదని, తినగలిగినంత తినాలేకాని మించితింటే అదే మృత్యుప్రదా యమవుతుంది. "అతిసర్వత్ర వర్జయేత్." ఏ పనులు చేస్తే లోకంలో శ్రేయఃకీర్తి ధర్మాలు నశించి, శరీరతాపం కలిగి చివరకు పేరు మాసిపోతాయో ఆ పనులు బుద్ధిమంతుడెప్పుడూ చేయడు.

రాక్షసరాజా! అరవై వేల వత్సరాలు నాకు నిండినై. ఎట్టి అరగొర లేకుండా పైతృక రాజ్యాన్ని హాయిగా పాలించి తృప్తుడనైనాను. నీవు యౌవనుడవు. రథకవచ ధారివి. నన్ను చులకనగా చూడకు. నా హితోక్తులు చెవిని పెట్టు. నీ యువకత్వం, నా ముసలితనం రణభూలోకి రానీయకు. నేను [illegible]. [illegible] నాకు బాగా తెలుసు. అయినా, నేను చూస్తూ వుండగా, బ్రతికివుండగా నీవు సుఖంగా లంకకు పోలేవు. [illegible] నిన్ను నేను నిరోధించగలను. [illegible] ఇప్పుడే సంపూర్తి [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] అనహాయస్థితిలో వున్న [illegible] నీ [illegible] కాదోయ్. [illegible] చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో చెంపలు వేసుకోవాలి. నా తల్లిని నా కప్పగించిపో. లేకుంటే కసితీరేటందుకు [illegible] చేస్తాను. కాదా? ఇక్కడనుంచి నీ రథం అడుగుముందుకు పోదు. ఆలోచించుకో. నా ప్రియమిత్రుని పుత్రునకు ప్రియం కోసం ప్రాణాన్నైనా బలి ఇస్తాను కాని నిన్ను ఏమాత్రం కృతకృత్యుడుగా

పోనీయను. నీవు నా ప్రాంతారణ్య భూమి గుండా పోతున్నావు. నీకు రణరూపంగా ఆతిథేయాన్ని కల్పిస్తాను. ఆరగించు. ఏమాపొగరు! రథం తోలమంటున్నావు? ఓరినీకాట్లా! ఒక్కతన్నుతో తాడిపండు రాల్చినట్లు రథంలో నుంచి నిన్ను నేల రాస్తాను. ఆగు. చూడు. నా విక్రమం" అంటూ రెండు రెక్కలూ విప్పి రథాన్ని అడ్డగించి గమనాన్ని ఆపివేశాడు.

## జటాయు రావణ యుద్ధం

అనుకోని ఈ సంఘటనానికి అసురపతి నిర్ఘాంత పోయాడు. సులువుగా పక్షిరాజును ప్రక్కించటం సాధ్యంకాదు. కామచారి అయిన రథం ఆసత్త్వసంపన్నుని ఆత్మబలంవల్ల అదృశ్యంకాలేక పోయింది. విహంగాధిపతి విచిన రెక్కల అవరోధానికి సూర్యగమనమే ఆగినట్లయింది. సహస్రకరుని కిరణాలు ధరణికి చేరలేకపోతున్నై. తూర్పు పడమర దిక్కులు రెండూ ఇంద్రధనుస్సువలె ఆపక్షాలు ఆక్రమించివున్నై. దశకంధరుడు క్షణకాలం చింతించాడు. తలపడక తప్పదనుకున్నాడు. వింశతి భుజాలతో శరశరాసనాలు ధరించి, "ఓ పక్షీ! స్వపరతారతమ్యం తెలియకుండా సమరానికి సంసిద్ధుడవవుతున్నావు. పక్షివినీవు. నేను దానవుడను. నా గమనాన్ని త్రిలోకాలే నిలువరించ లేక పోయినై. ఇది నీ తలమీరిన పని. వృద్ధుడవు. కాలానుసారంగా కదతేరక, బలవన్మరణం కోరి ఎందుకు తెచ్చుకుంటావు? శరప్రయోగం జరగకముందే దారి ఇచ్చి తప్పుకో. నిన్ను చంపటానికి నాకు నిముసంకూడా పట్టదు. నిష్కారణంగా నిరోధించి చావకు" మని పదినోళ్ళతో ఒక్కసారిగా పలికాడు. ఆఘోషకు పర్వతాలు ప్రతిధ్వనించినై. పక్షిమృగకుల సంచారం స్తంభించింది. మేఘమండలం పగిలినట్లయింది. పక్షిరాజు హసించి "మాటలతో పనేమి? మార్గాన గలిగితే మార్గాను. లేదా? లోకమాతను సీతను అప్పగించి శీఘ్రంగా పొ"మ్మన్నాడు.

వాగ్యుద్ధం క్రమంగా తీవ్రమైంది. రావణుడు ఎడతెరిపి లేకుండా బాణవృష్టి గృధ్రరాజుపై కురిశాడు. జటాయువు అవలీలగా అసురనిక్షిప్త

వస్తున్న అంపకోలలు చండతుండ ఘాతోదు నఖాగ్రపాతంచే తుండ్లుతుండ్లుగా త్రుంచాడు. దానవుని దేహమంతా కాళ్ళ గోళ్ళతో చీరి రక్తసిక్తంచేశాడు. అప్పటి వారి యుద్ధం రెండు జలధరాలు ఘర్షించినట్లు, పక్షాలున్న పర్వతాలు రెండు ఢీ కొన్నట్లు, చూపరకు భీతి కొల్పుతూంది. దావానలంపైన జల్లిన అల్ప జలం వలె రావణుడు ప్రయోగించిన శిలీముఖాలు వ్యర్థం కావటంతో, జటాయువు జవసత్వాలు తాను ఎంచుకున్న పరిమితికి మించినట్లు గుర్తించిన రావణుడు కాలదండసన్నిభమైన దశశరమార్గణాలను చాపంలో తొడిగి ఆకర్ణాంతం నారిలాగి "పక్షీ చావు" మంటూ ప్రయోగించాడు. అవి నిప్పులు క్రక్కుతూ వచ్చి జటాయు శరీరాన్ని తాకి మిట్టిమిడిపి పడి వ్యథపాలైనై. రావణుని రథంలో ప్రక్కగా పరుండబెట్టిన సంతాపలోచనయైన జానకి పాటును చూచి, జవ సత్వాలు సంతరించుకుని, తీవ్రకోపంతో, ఆమెపై అభిమానం విజృంభిం చగా, వాయువేగ మనోవేగంతో రాక్షసపతి రథంపైకి దూకి, ముత్యాలు పొదిగిన, శరయుక్తమైన, ప్రధానహస్తప్రాయసన్నిక్షిప్తమైన లంకేశుని చాపాన్ని ద్విఖండంగా ఖండించాడు. జటాయువు సాహసించి తన చేతి చాపం త్రుంచినందుకు రాత్రించరుడు కసరకపడి, వేరొక చాపం అందు కొని అసాధారణాస్త్రాలను ఆపకుండా విడిచాడు. ఆ శరవృష్టి తాకి విహంగనాథుడు విహ్వలించాడు. కాని, స్వామి కార్యార్థం తన తనువు త్యాగం చేయుటకు ఒప్పుకుంటున్నాడు. సత్యధర్మాలను స్మరించాడు. తన కర్తవ్య నిర్వహణంలో లోపం రానీయకూడదనుకున్నాడు. స్వయమరణం శాశ్వత మార్గానికి ప్రాతిపదిక కావాలని సర్వదేవతలను అర్థించాడు.

కోల్పోయిన శక్తిని కూడదీసుకున్నాడు. కొత్తగా చేపట్టిన రావణ ఘోర చాపాన్ని తుత్తుమురు చేశాడు. హేమమయమైన కవచాన్ని బ్రద్దలుకొట్టాడు. పిశాచవక్త్ర ఖరాలను చంపాడు. త్రివేణుకంటకమూ, కామగమూ, పావకార్చిస్సమమూ అయిన రథాన్ని భేదించాడు. చంద్రకాంతు లీనే శ్వేతచ్ఛత్రం విరిచివేశాడు. చమూపతిమధ్యంలో సూతుని తల ఇరికించి నొక్కి ప్రాణం తీశాడు. ఏకకాలంలో, భగ్నచాపుడూ, హత సారథీ, హతాశ్వుడూ అయి పంక్తిముఖుడు చంకలో సీత ఇరికించుకుని

ధరణికి లంఘించాడు. పాపశ్రేష్ఠుడైన పంక్తిగ్రీవుడు, విల్లువిరిగి, సూతుడు చచ్చి, రథంచూర్ణమై పదాతికాగానే, భూతకోటిఖగరాజును మేలుమేలని మెచ్చుకుంది.

ముదుకడూ, బడలినవాడూ, బలంతగ్గినవాడూ అయిన గృధ్రరాజు స్థితిని చూచి రావణుడు అదే సమయమని అవనిజతో ఆకాశానికి ఎగిరాడు. వెంటనే ఖగనాథుడు కూడ ఎగిరి మార్గాన్ని అడ్డి "ఓరీ దుర్మతీ! దివ్యాస్త్ర దీక్షితుడైన రామపత్నిని నీవు కొనిపోవడం రాక్షసకులం మూలముట్టుగా కూలిపోవటకే సుమా.

## జటాయువు రావణుని పరుషంగా పల్కుట

[illegible]ంధుమిత్ర పుత్ర [illegible] సైన్యసమేతంగా గరళం పవిత్రమైనదని గ్రహించావా? మూఢుడా! కాగల పనాన్ని తెలుసుకోలేక చెడ్డకార్యాలు చేసిన జనులు, విపత్తులు ముంచివచ్చినప్పుడు నీ వలెనే చెడు స్తారు. కాలుడు నీ కంఠంలో పాశం బిగించాడు. గాలంతో ఎరమ్రింగిన చేపవైనావు. ఇక నీ వెక్కడ కేగినా, ఎవరి శరణుజొచ్చినా, రాముని దృష్టిపథంనుంచి నిన్ను రక్షించలేరు. ఒంటరిగావున్న దాన్ని హరించి పారి పోతున్నావు. [illegible] నీచా, దొంగవలె తేవా ఏమి బలంవి? నన్నెదిరించి నిల్వలేకనే [illegible] సమయంలో ఎత్తుకొని పారిపోతున్న నీవు రామబాణాన్ని ఏ విధంగా తప్పించుకోగలవు? ఆగరా, పాపాత్మా! ముహూర్తకాలంలో [illegible] రామలక్ష్మణులు వచ్చి జానకిని [illegible] వెదుకుతూ ఇటే వస్తారు. వారితో తలపడి క్షణకాలంలో [illegible] చేరుదువో. అప్పుడు నీకు దారుణమైన చావు తప్పదు. చావుకు [illegible] చెప్పి పందవలె పారిపోతా వెందుకు? స్వకులనాశనానికే సరిపడే పాపకార్యం నీ విప్పుడు చేశావు. ఇక నీ మరణాన్ని నివారించే శక్తి సృష్టించిన విధాతకు కూడా లేదు" అని సీతకు బోధిస్తూనే మహావేగంతో ప్రదక్షిణంగా వచ్చి వీపుపై వ్రాలి, ముక్కుతో పొడిచి, గోళ్ళతో చీరి రావణు దేహాన్ని పొడుగు పడచేశాడు. మదగజాన్ని మావటీడు అంకుశంతో అదుపులోనికి తెచ్చినట్లు జటాయువు

రాక్షసుణ్ణి విల్వ్యాంపటంతో దశకంఠునికి తల తిరిగిపోయింది. ఈ లోపల ఖరనఖరాలచేతా, చండచంచూపుటంచేతా దైత్యేయుని తలవెంద్రుకలఊడల్చి, ముఖం పొడిచి బాధించాడు. ఆ హింసకు తట్టుకోలేక దానవవిభుడు పెదవులు కొరుకుతుంటూ గిర్రున వెనక్కు తిరిగాడు. తిరిగి సవ్యాంకంలో జానకిని పొదివిపట్టి, పాణితలంతో జటాయువును బలంగా చరిచాడు. ఆ హస్తఘాతాన్ని అతిలాఘవంగా తప్పుకొని అభిముఖంగా వచ్చి ఎడమ వైపున వున్న పదిచేతులనూ చిగుళ్ళు చిదిమినట్లు ముక్కుతో చిదిమి భూమిపై పడవేశాడు. వెంటనే పుట్టలోనుంచి పాములు వెలివచ్చినట్లు పోయిన చేతులు మొలచినై. అంతట సీతను రక్షించుకుంటూ రణం చేయటం రాక్షసునకు సాధ్యం కాలేదు. శకుంత పతి పెట్టే బాధను సహించటం కూడా సాధ్యం కాలేదు. క్షణకాలంలో భూమికి దిగి జానకిని దించి మరుక్షణంలో పులుగురేనిని ముష్టులచేతా పాదాలచేతా నొప్పించాడు. దానికి తగినట్లు [illegible] పక్షఘాతాల దానవుని బాధించాడు. కొంతకాలం పోరు ఘోరంగా సాగింది.

## రావణుడు జటాయువు రెక్కలు నరుకుట

[illegible] వృద్ధుడు [illegible] [illegible] సీతను విడిచి [illegible] [illegible]లేదు. [illegible] సన్నాహాలైన చేసినవి తాను చేసిన ప్రయత్నమంతా వ్యర్థమవుతుంది. ఈ సంకటసన్నివేశంలో జలధిలో మునిగిన వాడికి తెప్పకొయ్యలాగా అకస్మాత్తుగా లంకేశునకు ఒక ఆలోచన స్ఫురించింది. స్ఫురణకు రావటం తడవుగా వీపువెనుకకి ఎగిరి ఒరనుంచి ఖడ్గం

పెరికి దక్షిణ హస్తంలో ధరించి సమసంగ్రామం చేస్తూనే రెండురెక్కలూ ఘోరంగా నరికాడు. పక్షులకు ప్రాణసదృశమైన పక్షాలు తెగగానే పర్వతం కూలినట్లు పక్షిరాజు నేలపై పడ్డాడు. పడిక్రిందనున్న జానకివైపు దీనంగా చూస్తూ, "తల్లీ! నీ రక్షణకు శక్తివంచన లేకుండా సేవచేశాను. ఇంత వరకూ నీ విభునిగానీ, మరదిగానీ రాలేదు. నిన్ను విడిచి నీ పిలుపు వినగానే రామచంద్రునికోసం వెళ్ళితే ఈపాటికి నీవు లంకలో రాక్షసాంగనా రక్షితవై వుండేదానివి. కాలహరణం కోసమే యుద్ధం చేశానుగాని శత్రువును జయించగలనని కాదు. నా ప్రాణం పోకుండావుంటే నీ భర్తకు నీ వృత్తాంతం చెపుతాను. రావణవధోపాయం కూడ చెపుతాను." అన్న భావాలు ఆ చూపుల్లో వెలయించాడు.

దైవప్రాతికూల్యంవల్ల సహాయంకోసం వచ్చి జటాయువు రావణాసురుని శాతాసిధారలచే రెక్కలు తెగి కాలజీమూతదేహంతో నేలబడి గురగురమంటూ కంఠగతప్రాణుడై యుండగా జానకి పట్టరాని దుఃఖంతో పల్లటిల్లిపోయింది. రాక్షసేంద్రుడు, ప్రత్యర్థి పడిపోవటంతో మండిమండి చల్లారిన దావదహనునివలె శాంతుడైనాడు.

## జానకి రామలక్ష్మణుల తలంచి ఆర్తధ్వని చేయుట

నేలపడి, ఖిన్నవదనంతో "రామా రామా" అన్న అస్పష్టధ్వనితో కన్నులు మూతలుపడి అవసానకాలం చేరువ కాగా, తెలివి కోల్పోయి దయనీయస్థితిలో వున్న జటాయువును చూచి, ఆపుకోలేని శోకంతో జానకి భయకంపితగాత్రంతో మెల్లమెల్లగా చేరవచ్చి, కరుణారస తరంగితాలైన కరద్వయంతో గాఢంగా గుండెలకు చేర్చుకుని, "తండ్రీ! నీ ఋణం నేనెలా తీర్చుకునేది? బ్రతికితే కొంతైనా చేయగలనేమోగాని క్షణాలలో సాగిపోనున్న జీవితయాత్రను ఎలా పుద్ధరించగలను? నా దీనస్థితి చూచి నన్ను కాపాడనెంచి, నిండుప్రాణాలు ధారపోశావు. పక్షివైన నీకే ఇంత జాలి నాపై కలిగితే హృదయ 'వివేకజ్ఞానాలు గల వంశంలో పుట్టిన ఈ అధమునికి జాలి కలుగదేమి? నీవు చూపించిన పరాక్రమం దేవతలుకూడ

పీడిపట్ల చూపలేరు. వృద్ధుడవే కాకపోతే యుద్ధరంగంలో నీక్రుద్ధతకు ఈ నీచుడు బలి అయిపోయేవాడు. మందభాగ్యురాలను. మంచిమాటలు చెప్పి హెచ్చరిక చేసిన మరదిని దూరం చేసుకున్నాను. సంరక్షించగా వచ్చిన నీ వుసురు పోసుకున్నాను. నా పూర్వజన్మకృత పాపం తక్కువది కాదు. జగన్నాథా! నీ త్యాగానికి నేనేమీ బదులు చేయలేను. నా భర్త నిన్ను చేరి నీకు ఉత్తమ లోకాలు కల్పించమని దైవాన్ని ధ్యానించుతాను. తెలివి వుండే నా దుర్గతి చెప్పి త్రోవ చూపు. లేకపోతే నా బ్రతుకు ఏమికానుందో దైవానికే ఎరుక.

రామా! రక్షించు. మరదీ! లక్ష్మణా! నన్ను మన్నించి కాపాడు. నా ఏడుపు, నా ఆర్తనాదం తిలకించిన జడ చైతన్యాలు నా నాథునికీ వార్త తెలుపునుగాక. ఈ పూజ్యుడైన పక్షి ప్రభువునకు పుణ్యలోకాలు ప్రాప్తించు గాక" అంటూ చెట్టును పెనవేసుకున్నది. శాంతించిన రక్కసుడు వడివడి వచ్చి జానకిని చేయిపట్టి లాగాలని చూశాడు. కాని, చెట్టును పట్టి వుండటంతో సాధ్యం కాలేదు. పెనగి పెనగి ప్రయోజనం లేక, విసిగి, శిరోజాలు చేతికి మెలిత్రిప్పి బలంతో లాగాడు. ఆ ఘాతుక కృత్యానికి నరాలు సడలి కంఠం నొచ్చి కన్ను తిరిగి చెట్టువదలి సీత "తల్లీ! నీ బిడ్డగతి చూడు" మంటూ శిలపై పడిపోయింది. "రామా! రక్షించు. లక్ష్మణా! కాపాడు" అనే మాటలు అపస్మారక స్థితిలోకూడా ఆమె నోటివెంట అవ్యాహతంగా వస్తూనే వున్నై. సాధ్విజన సేవ్యమానమైన జానకి ఏడ్పుకు చరాచర జగత్తు సంచలించింది. స్తంభించింది. గాలి వీచలేదు. సూర్యుడు వెల్గలేదు. అగ్ని మండలేదు. దేవతలూ, ఋషులూ, శోక సంతోషాలు పొందారు. బ్రహ్మ, సూక్ష్మధ్యానం కదలటంతోటే కన్నులు తెరచి, భావి దర్శించి, "కావలసిన కార్యం చక్కబడ్డది. త్వరలో జగత్కల్యాణం చేకూరుతుంది హా"మ్మని ధ్యాననిష్ఠుడైనాడు.

## రావణుడు సీతను ఎత్తుకొని పరుగెత్తుట

ఒడిసెపంగన నేలబడియున్న జానకిని ఎత్తి భుజముపై పెట్టుకొని, రావణుడు రామలక్ష్మణులు రాకముందే లంక చేరాలని వచ్చే వేగంతో

71,165

కొంతదూరం పరుగెత్తి అమాంతం ఆకాశానికి లంఘించి, అంతకంతకు వేగాన్ని హెచ్చించి దొంగలాగా పారిపోసాగాడు. నీలనీరదంవంటి దేహంగల రావణుని భుజంపై వ్రాలిన సీత మెరుపులాగా గోచరించింది. పరిచే వేగానికి ఎదురయ్యే గాలికి జానకి, బంగరుపట్టు రంగుగల పచ్చపెంపు పైట చెరగు చెదరి, సాగి, చలిస్తుంటే, రావణుడు అగ్నిశిఖలో చుట్టిన పెను కొండలా ఉన్నాడు. సీత ధరించిన పరిమళ భరిత కుసుమహారాలు తలపై నుంచి జారి దనుజునిమీద పడి ధరణిపై పడ్డాయి. [illegible] లాపలం ఆకాశంలో [illegible] కిరణాలతో శోభిల్లుతూ [illegible] దరమై అప్పుట్లు ప్రకాశిస్తూంది. [illegible] రక్కసుని మూపుపై మూర్ఛిల్లి పడియున్న జానకి వదనం తూడు తెగిన నళినంలాగా శోభాహీనంగా ఉంది. మేఘాచ్ఛాదనంలో తోచే చంద్రబింబంవలె స్పష్టాస్పష్టంగా కనుపిస్తూంది. [illegible] ముఖముతో, [illegible] నాసికతో, [illegible] బంగరుకాంతుల వెలుగుతో, [illegible] మైథిలి వదనం ఆకసంలో ఉదయిస్తున్న చంద్రబింబంలాగా ఉంది. ఆమె [illegible] నిలువుగా పాతిన నల్లరాతిపై వ్రేలవేసిన బంగారం చప్పకోలవలె భాసించింది. ఒరంపెట్టి వెలికి తీసిన మేలిమి బంగారంవలె మెరుగులు చిమ్ముతున్న సీత శరీరం భుజంపైగల రావణుడు [illegible] కూడిన జలధరంలాగా, రత్న ఖచిత స్వర్ణ మేఖల దాల్చిన వారణంలాగా కనిపించాడు. వాయువేగంతో పోతున్నప్పుడు భూమిని [illegible] భూషణా [illegible] చిరుమువ్వలు [illegible] శబ్దిస్తుంటే. ఉరుములతో, మెరపులతో వర్షించే జలధరంవలె [illegible]. జానకి [illegible] నేత్రాలే [illegible] తోడిపెట్టి, రావణుడు పోతున్నప్పుడు, కొన్ని ముత్యాలు రాలి, కొన్ని అతని చుట్టూ [illegible] పర్వతం చుట్టూ నక్షత్రాలు [illegible].

[illegible], పుష్పహీనమై, ప్రాణ మాత్రావశేషమైన సీత పాదాలనుండి మంజీరం మధుర శింజితంతో మహిపై పడింది. క్రమంగా ఆభరణాలు ఒక్కొక్కటే ఒక

పుల్కావలె ఉర్వుపై పడసాగింది. ఆమె మెడలోని ముత్యాలహారం తెగి భూమి పడుతుంటే గంగ ఆకాశం నుంచి [illegible] వస్తున్నట్లుంది. [illegible] కదులుతున్న కొమ్మలమీద వున్న పక్షుల కిలకిలా రావంతో వృక్షాలు సీతను భీతి పొందవద్దని ఓదారుస్తున్నై. [illegible] నట్లు. [illegible] సందోహం భూమి [illegible] పొగులుతూంది. [illegible] భూమిపై [illegible] ఆమె [illegible] ప్రవహించ [illegible] పోతున్నై. [illegible] వున్నాయి.

[illegible]

రోషంతో రోజుతూ, తన దౌర్భాగ్యాన్ని నిందించుకుంటూ, రావణుని చూచి —

## సీత రావణుని మర్మభేదనంగా మాటాడుట

గర్హ నిర్భేదకమైన మాటలు పలుకసాగింది. "ఏమిరా నీచరాక్షసా! నీకు సిగ్గులేదా? ఒంటిగా వుండటం చూచి దొంగవలె వచ్చి నన్ను అపహరించి భయంతో పారిపోతున్నావు. నీ మాయచేతనే నా భర్త అడవిలో దవ్వగా పోయి వుంటాడు. లేకపోతే ఎన్నడూ ఇంత ఆలస్యం చేయని పతి ఈనాడింత ఆలస్యం ఎందుకు చేస్తాడు? నయవంచకుడా! పౌరుషవంతుడవైతే నాపతి వుండగా వచ్చి ఈ పని చేయలేకపోయావా? నృశంసుడా! నన్ను రక్షింప వచ్చిన పక్షిరాజు నీ బ్రదుకు బండలు చేశాడు. ధర్మంగా తలపడలేక, వృద్ధతతో బడలినవేళ హఠాత్తుగా రెక్కలు నరకటం పౌరుషమనుకున్నావా? పేరు చెప్పుకొని పర్వతాలలో ప్రవేశించలేక, యుద్ధంలో నా పతికెదురునిచ్చి గెలువలేక, స్త్రీమాత్రహీనురాలైన నన్ను దొంగిలించి పారిపోతున్న నీవు రాక్షసరాజువా? నీకు లోకం లోపడిందా? ఆ లోపడిన లోకం ఏమి? ముహూర్తకాలం నిలువమంటే నిలువక [illegible] పరుగు తీస్తున్నావేమి, నిన్ను చూచి చెరబట్టి వారెవ్వరూ లేరే. మెలకువగా మాటాడిన రామశక్తి వస్తాదేమోనన్న భయమేకదా నీ యీ పరువు పరుగు కారణం? [illegible]. మానాభిమానాలు వదలిన మహాపాతకుడివి మర్మభేదకారైన [illegible] పౌరుషవంతునిగా చేయగలవా? ఛీ ఛీ! నీ [illegible] మగవాన్ని నీ మొగాన వుమ్మివేయరా?

[illegible] అంటరానిదని, ఇంకా [illegible]. పాపాత్మా, మాయావుడా, ఎక్కడికి [illegible] వెళ్ళలేక [illegible] నీ పాపం [illegible] నీ అదృష్టం [illegible]. నీ అదృష్టత్వం ఎంతవరకో నేను చూస్తా. ఈ సమయంలో రామలక్ష్మణులు కంటబడితే నిన్ను నిముషాన కాల్చేస్తారు. [illegible] సమీపానికి [illegible] లేనట్లు, వారి బాణాలు తేరి చూడనైనా లేని నీవు పోరేం చేస్తావు? నీ హితంకోరి నేను

చెప్పే మాటలు విను. నన్ను వదలి నీ దారిని నీవు పో. పోయి నీ నగరాన్ని, నీ వారినీ కాపాడుకో. నా భర్త నీవు చేసిన నీచకార్యానికి నిన్ను చంప కుండా, నీ లంక తగులబెట్టకుండా. నీ వాళ్ళను నీఱు (బూడిద) చేయ కుండా విడిచేటట్లు నేను చేస్తాను నా మాట పాటించకుండా బలవంతాన నన్ను లంకకు చేరిస్తే, ముందు చెప్పినవన్నీ నేనక్కర లేకుండగానే జరిగి. తెగిపడిన నీ శిరస్సులపై కాకులు వాలగా గ్రద్దలు వాలటం చూచి మరీ నా నాథుని చేరుతాను. నీవంటే గిట్టని వారో, నీచేత అవమానం పొందినవారో నీచావుగోరే ఈ మార్గం బోధించి ఉంటారు. మూర్ఖప్రకృతి వారిమాటలునమ్మి మృత్యువు చేతులారా లంకకు మోసుకుని పోతున్నావు. ఏవేవో ఊహలు చేసుకుని నన్నపహరించావు. కామభావంతో నన్నుతాకావో నీచింతవు నేనందుకు భయపడి దుఃఖించటం లేదు. లోకమూర్తులనుకాపాడే నాపతి నాకోసం శోకం పొందుతాడని శోకిస్తు న్నానురా. నాజీవన్మరణాలురెండూ నావద్దనేవున్నై. నన్నేంచేయలేవు. నేను నిర్ణయించుకున్న గడువులోపల నాలక్ష్యం నెరవేరాలి. అంతవరకే నాబ్రతుకు. ఆపై క్షణం నేనుండేదా! చావు సమయంలో సంభవించే సందిగ్ధంవలె, నీ చావుకు ముందీగుణం సంక్రమించింది. నీ నాశనాన్ని నీవే గుర్తించ లేకున్నావు. పథ్యమైన నామంచిమాటలు గ్రహించలేని నీకు యముడిక తనలోకంలో ఆతిథ్యానికి ఆహ్వానం పంపుతాడు. [illegible] తథ్యం. నీ మహాపాపకార్యానికి ఫలితంగా కాలుడు వైతరణీస్నానం. అసి పత్ర వనవిహారం. క్రాగుతున్న అయోమయ జలం ఆహారంగా సత్క రిస్తాడు. నీ ఆయువు నేటితో నిండింది. యమభటపాశ బద్ధుడవైన నిన్ను ఎవరూ రక్షించలేరు. విధిబలీయంగా ఈడుస్తుంటే మంచిమాటలు మనసు పడవు. అంతేకాక అనుకూలంగానే ప్రేరణ కల్పిస్తుంది నన్ను నీవేదోచేస్తా వనిబెదరి భీతితో పలుకుతున్న పలుకులుకావు. నిన్ను నాభర్త వధించి నన్నెట్లు నుగ్రహిస్తాడని నాకుతెలుసు. నీవు నన్నంటి బ్రతకలేవనీ తెలుసు. నీవుచేసిన ఈ నీచకార్యం నాపతికి ఎలాతెలుస్తుందని ఆలోచిస్తున్నావు. లోక నిందకు భయంలేదు. లోకం స్వార్థభూయిష్ఠం. అది మేలుచేస్తున్నంత కాలం పూజిస్తుంది. కీడు చేయకపోయినా, మేలు నిలపగానే అనేక విధాలుగా

దూషిస్తుంది భ్రష్టుడవైన నీచేత తాకబడిన శరీరం అగ్ని సంస్కారం చేసి ఆత్మపతిని సేవిస్తాను. భార్యావమానాన్ని సహించేపందకాదు నాపతి. నిన్ను సమూలంగా నాశనంచేసి, దేవతలు మెచ్చగా నన్ను స్వీకరిస్తాడు." అని అనేక భంగుల సీత రావణుని నిందిస్తున్నా, లజ్జాభిమానాలు విడిచి మృత్యువు వెన్నంటి తరుముతుండగా బ్రమసుపై తీసిపోయే జీవిలాగా, అభ[illegible]ధముని లాగా, పారిపోతూనేవున్నాడు.

## సీత తన భూషణాలను కపులముందు పడవేయుట

ఎంతచెప్పినా క్రూరకర్ముడు వినక తనను కొనిపోతుంటే, ఇంకెవరూ తనకు సాయంరాకన్న నిరాశతో జానకి అనంతపథంనుంచి క్రిందికి చూచింది. అదృష్టవశాత్తు ఒక పెద్ద కొండశిఖరంపై తిరుగుతున్న కపి కుంజర పంచకం కనిపించింది. వీరైనా నాశోక నా భర్తకు తెలుపగలరేమో నన్న ఆశతో పైటకొంగు చించి, పడిపోగామిగిలిన ఆభరణాలను అందులో మూటకట్టి వారి ముందుపడేలాగా విసరి వేసింది. సీత ఈవిధంగా చేయటం జీవితంపై ఆశతో తిరిగి చూడకుండా పరుగుతీస్తున్న పంక్తిముఖుడు చూడలేదు. సాధ్వి సీత పడుతున్నబాధ చూచి స్థావరాలు చైతన్యం చెడి అచలాలైనై. "రామా రామా రామా" అని అంటున్న సీత ఆక్రందన ధ్వానంతో ప్రకృతి ప్రతిధ్వనిస్తూంది. రావణుడు నిరాటంకంగా, పంపానదివాటి పల్లెలూ, పట్టణాలూ, నదీనదాములు, పర్వతకాననాలు గమించి, ముందుతున్న లంపటి ఒడిలో కట్టుకున్నట్లు సీతను చెదరిపడకుండా స్వీయ భుజాంకంపై రక్షించుకుంటూ, మహావాయువధాన, ధనుర్విముక్త శిలీముఖంలా దూసుకుని పోయి, నక్ర, పాఠీన, భుజంగ, తిమి, తిమింగిలాది జలచరసందోహంతో, ఉత్తుంగ తరంగ పతద్ఘోషతో, అనంత నీలాకారంతో కనుపించే నీరాకర సమీపాన్ని చేరుకున్నాడు. క్షణకాలం సేద తీర్చుకున్నాడు. ఇహ లోకంతో ఋణంతీరుతున్నదని రావణునిచూచి వేల్పులు సంతసించారు. తాము పన్నిన వ్యూహం ఫలోన్ముఖమైనందుకు పరమేష్ఠి, ఇంద్రుడూ పరవశించారు. మరణించిన మారీచుడు సంతోష గంతులువేస్తూండగా, చిత్రగుప్తుని చేరబోయి, తనచావుకు కారకుడైన దశకంఠుని మరణ కాలం ఎంతవుందో చిట్టాచూపి చెప్పమంటున్నాడు.

# రావణుడు సీతతో లంకలో ప్రవేశించుట

మంచిపనులవల్ల కలిగేఫలం మానసికమైంది. పయిగా దీర్ఘకాలికమైంది. చెడ్డ చేతలవల్ల లభించేఫలం బాహ్యమైంది సద్యస్ఫూర్తి కలది. ఇది అనాదిగా లోకానికి అందుతున్న సత్యదర్శనం. ఏకారణం చేతనైతేనేమి కైక రాముని పట్టభంగం చేసింది ప్రతిఫలంగా. అనాసక్తంగానైనా తన కొడుకు రాజైనాడు. తండ్రిని సత్యవాదిగా చేయాలని వృద్ధమాతనూ, స్వపరిజనాన్ని, సర్వసుఖాలనూ, త్యాగంచేసిన రాముడు కట్టుగుడ్డలకు కూడా నోచుకోని కారడవులపాలైనాడు. కౌముడు వృద్ధ పోషణంలో తాతి తండ్రిని రాజ్యభ్రష్టుని చేసి రాజ్యాన్ని ప్రయోజనం సాధించాడు. సత్యప్రతిపాలనం కోసం హరిశ్చంద్రుడు భార్యా సుతులను కోల్పోయి కాటి కాపరి అయినాడు. దుష్టభావంతో రావణుడు సీతను హరించి కృతార్థుడైనాడు. దయామూర్తులైన ఋషిమహాత్ముల వంచించి దండకారణ్య వాసులైన తాపసుల రక్షించినరాముడు ఇల్లాలను పోగొట్టుకున్నాడు. అందుకే మానవ లోకం చెడుమార్గంవైపే నడుస్తుంది. అంతరింద్రియాల కన్నా, బాహ్యేంద్రియాలు బలమైనవి. కనుపించే దానికంటే కానరానిదే శక్తివంతమైందీ, శాశ్వతమైందీ. ఈ పరమసత్యం అజ్ఞానులై, బాహ్యసుఖలాలసులై, అల్పులైనవారు విశ్వసించరు. చీటికీ మాటికీ దాన్ని నిందిస్తుంటారు. ఈ సత్యాన్నే రావణుడు సీతాపహరణంలో కృతకృత్యుడై ధ్రువపరిచాడు. ప్రవాహంలో కొట్టుకుని పోతున్న సత్పదార్థాన్ని ప్రాణాలకు తెగించి అందులో పడి దాన్ని ఒడ్డుకుచేర్చి భద్రపరచి చస్తే, ఆతని అపకృత్యం అని అనుభవిస్తూ అర్థమైన మాటలాతండ్రిని అంటున్నారు వ్యర్థంగా ప్రేలుతున్నారు. ఆ పిమ్మటనే రావణుడు ముత్తాతలు, తాతలు, తండ్రులు ఆర్జించిన తపస్సంపదను అనుభవించి, పుష్టులై, కన్నుమిన్నుకానక, దురాగతాలను ఏరికోరి చేస్తున్నాడు. ఎంతవారినైనా తృణీకరిస్తున్నాడు. తానుపొందిన ఔన్నత్యం తన ప్రయోజకత్వమే యని పొంగుతున్నాడు.

ఆ అహంకారంతోనే తాను పొందినవరంలో తన మరణం ఎలా దాగివుందో దర్శింపక, రామునితో వైరం పెట్టుకుని ఆయన అర్థాంగిని

హరించి అంబరాన చేరాడు. ఊపిరి పీల్చుకున్నాడు. నిశ్శంకగా నిజ నగరమైన లంకలో ప్రవేశించాడు. దానవశిల్పి పూర్వం శాంబరీమంత్రాధి దేవతను తన మందిరంలో బంధించినట్లు దశవదనుడు సరాసరి కొనిపోయి తన అంతఃపురంలో బంధించాడు సీతను. వెంటనే పిశాచకాంతలను పిల్చి, "అప్రమత్తులై ఈమెను ఎల్లప్పుడూ కాపలాకాయండి. మీరు కాకుండా, ఇంకా ఇతర కాంతలను కాని, పురుషులకాని ఈ ప్రదేశంలో ప్రవేశింప నీయవద్దు. ఈమె తెలివిచ్చి ఏమి కోరితే అది లోపం లేకుండా సమకూర్చండి. ఈమెను తెలిసికాని, తెలియకకాని, పరుషంగా పలకవద్దు. ఈమె ఏకాంతాన్ని ఎన్నడూ భంగింపవద్దు," అని ఆజ్ఞాపించి, ఆలోచనా మందిరానికిపోయి చేయదగిన కార్యాలనుగూర్చి చింతించి, విరించి దత్తవర మాయామోహితుడై, ఆసనంప్రక్క అమర్చిన ఆగమనసూచికను గంటను మ్రోగించాడు.

## రావణుడు జనస్థానానికి రాక్షసుల కాపు పంపుట

ప్రతీహారి రాగానే, "అష్టపలాశని" ప్రవేశపెట్టుమన్నాడు. రాగానే, వారినిచూచి "మీరంతా ఇష్టాయుధాలు ధరించి అవష్టంభంగా దండకాటవికి పోయి, అక్కడ ఇప్పుడు హతస్థానంగావున్న జనస్థానంలో ప్రవేశించండి. అది పూర్వం మావాళ్ళు ఖరదూషణాదులు పాలించిన చోటు. మీరంతా సాధ్వసపడకుండా, రోషాన్నీ, పౌరుషాన్నీ సముచితంగా గ్రహిస్తూ, పరిత్యజిస్తూ చారచక్షువులతో సంచరించండి. ఆ ప్రదేశంలోకి వలన వచ్చిన మానవాధముడు రాముడనేవాడు నా భ్రాతలసందర్నీ వధించాడు. ఆ కారణంచేత నాకు వైరం వచ్చింది. శత్రుసంహారానికి పథకం వెదుకుతున్నాను. దాంతో ధైర్యంకంటే కోపం హెచ్చింది. అతని చంపికాని నేను సుఖనిద్ర పోను. అకస్మాత్తుగా పేదవాడు ఐశ్వర్యవంతు డైనట్లు, ఖరాదులను చంపి సుఖంగా జీవిస్తాను. మీరు వెంటనే పోయి, వాడూ, వానికి తోడుగా వున్నవాడూ, ఏమేం చేస్తుంటారో, ఎక్కడెక్కడ తిరుగుతుంటారో, ఏం వ్యూహాలు పన్నుతుంటారో అప్రమత్తులై తెలుసు కుంటూ, ఎప్పటికప్పుడు ఆ వార్తలు నాకు తెలుపుతుండండి. వాళ్ళు నాకే

కాక మన జాతికే శత్రువులు. నేను మిమ్మల్నే ఎందుకు ఈ రహస్య కార్యక్రమానికి వినియోగిస్తున్నానో మీరే గ్రహించండి. మీ రణపాటవం, మీ వ్యూహరచనా, మీ నేర్పూ, మీ తంత్రం జరిగిన యుద్ధాల్లో ఎన్నో సార్లు నేను చూశాను. మనసారా మిమ్మల్ని బహూకృతుల చేశాను. ఈ పనికి మీకంటే సమర్థులైనవారు ఇంకెవ్వరు లేరు. కార్యసాధనోపాయాలు నేను మీకు చెప్పవలసినవి ఏమీ లేవు. నాకు కావలసింది శత్రుజయం. వాళ్ళను నేను చంపినా, మీరు చంపినా నాకు ఒకటే. రంధ్రాన్వేషణ విరోధి తెలియకుండా చేయాలె. మన మంత్రాంగం పొక్కకుండా చూడాలె. కార్యం సాధించి నాకింకా మీరు సన్నిహితులు కావాలె. అష్టపలాశను లందే అయుధ్యులని ఖ్యాతి సార్థించాలె. మీకు శుభం కలుగుతుంది. పోయిరండి". అని స్పష్టంగా చెప్పి ఎనమండుగురు రాక్షసులను గూఢచారులుగా దాశరథులపై పంపించాడు. అనుజ్ఞాతులైన రాక్షసులు ఆ క్షణమే దండకారణ్యానికి తరలిపోయారు. తలపై నున్న బరువు దించుకొన్న బాటసారివలె దీర్ఘంగా శ్వాసించాడు.

## తన సౌధాన్ని రావణుడు సీతకు చూపించుట

అనుకున్నట్లు బలిష్ఠులూ, అవధ్యులూ, అహితులూ, మొదలైన పేర్లు గలిగిన అసురవీరులను ఎనమండుగురిని, రామలక్ష్మణుల ప్రవర్తనం రహస్యంగా గ్రహించుటకువీలుగా చారులుగా పంపి, తన మోహం తలపుకు రాగా. కోరోపల తృప్తి పొంది ఆసనంనుంచి లేచాడు. వెంటనే, తుంటి విలుకాని కొంటెపూవుటంపు పదును గ్రుచ్చుకొనగా, సరాసరి జానకిని ఉంచిన సౌధానికి వచ్చాడు. వచ్చి, కాపిత దైత్యసతీపరీతనూ, నయన యుగళగళత్పీలజాతనూ, నిర్జితాననాంబుజాతనూ, అనిలాహతోపవనస్థానవ కదలీ సమేతనూ, దర్శనవిముఖీకృతనిజ వదనపవనవిజాతనూ, సీతను దానవనేత ప్రీతితో చూశాడు. లేడుల వెంటబడగా మందనుంచి దాటి వల పిలుగుల పడుతున్న మృగివలె వున్నదాన్నీ, భయంతో విశ్వసిస్తున్న నాగిని వలె నిట్టూరుస్తున్నదాన్నీ, వృంతచ్యుత కుసుమంలాగా నేలపడియున్నదాన్నీ బలాత్కారంగా లాగాడు. "నా వైభవం ఎటువంటిదో చూద్దువుకాని

రమ్మన్నాడు. అచేతన పదార్థాన్ని కొనిపోయినట్లుగా సోపానాలు తరించి ఉపరిభాగం చేరి సుందరమైన నిజమందిరం చూపించే తలపుతో—

"సీతా! చూడు. మీనగరివైభవం నా నగరివైభవం. అసురకాంతలే కాక అందాలఖనులైన అప్సరఃకాంతలు వేలకొలదులుగా ఉన్నారు. మనం నిలిచివున్న చోటికి ఎదురుగా ఎన్ని మేడలున్నవో చూడు. అవి అన్నీ నా అంతఃపురాలే. వాటినిండా వనితనం పుట్టిపడేలాగా చిత్రించిన వస్తుజాతం ఒక ఇంటికిమించి వేరొక ఇంటిలో ఉంది. స్ఫాటికమూ, రాజతమూ, హాటకమూ, దాంతకమూ, వజ్రమూ, వైడూర్యమూ అయిన స్తంభాలతో నిర్మించిన ఈ మెట్లెక్కి ఇంకా పైకి పోదాం పద. చూడు సీతా! నీ వెర్రితనం మాను. ఇది మాయానగరం కాదు. మయ నిర్మితం. ఇదిగో ఇవి చూడు. హేమదంత సమేతం, పూతమైనవాతాయనవ్రాతాలు. అవి చూడు. హృదయంగమమం, ఉద్దామం, నిర్జిత సోమధామం అయిన కాంచన ధామాలు. నయనపర్వమై, కలహాజితకేకికోలమై మృదులచంచూపుట పక్షమైన జాలహంగనాజాలం అదిగో. ఫలపుష్పభారంతో ఆకుపచ్చని రంగుతో దట్టంగావున్న ఆకులుగల శాఖలతో వృక్షాలు ఎంత చూడ ముచ్చట గొలుపుతున్నవో చూడు. చలువరాతి సోపానాలు కల సరస్సులు క్రీడాపర్వతాలు, అన్ని ఋతువుల్లో పూలు పూయించే యాంత్రిక వాతావరణం ఇక్కడకాక ఇంకెక్కడ నీవు చూస్తావు? దేవలోకంలో తప్ప మాతలేని దేవతలు నన్ను చూడవస్తారు. రూపరహితమైనా గాలి సుఖం మీరెరుగుదురు. వీవన చేబూని వీస్తున్న వీడే వాయువు. ఆ వైపున నా విహారవనాలకు నీళ్ళు పెడుతూ, తీగలు ప్రాకిస్తూ చెట్లకు దోహదం చేసేవాడే వరుణుడు. నా లంకానగరములో వంటలు వార్పులు చేసే వనితలే లేరు. అనుకున్న సమయంలో అగ్నివచ్చి అన్నీ సమకూర్చి పోతుంటాడు. ఘ్రాణతర్పణంచేస్తున్న ఆ పారిజాతాల దండలు ప్రతినిత్యం ఇంద్రుడు పనికట్టుకుని తెచ్చి నా పగ హెచ్చకుండా బహూమతిగా ఇచ్చి పోతుంటాడు. తలయెత్తి, నా నగర సింహద్వార శిఖరం చూడు. దండధరుడై కావలెనే ఉన్నతంగా ఉన్నవాడు కనిపిస్తాడు. వాడే ప్రాణినాశం కరుడైన యముడు. ద్వారం రక్షించే నా పాదకింకరుడు. దినదినం

వచ్చి నా ధనకోశాలను మాటి తరిగినదంతా మరల తెచ్చి పరిపూర్తి చేసే పనిలో నియమింపబడినవాడే కుబేరుడు నా రాజధానిలో నివసించేవారు ఎవ్వరేమి కోరినా ఇం[illegible]నితో చెప్పి ఆ కోరికలను తీర్చే వేగులవాడుగా నిర్బతి నియమింపబడ్డాడు. నూరుయోజనముల విస్తీర్ణంగల నా లంకానగర ప్రాకారాన్ని చుట్టివస్తూ శత్రుప్రవేశ [illegible]ర్లభంగా చేసేవాడే ఈశానుడు.

ముప్పైరెండు కోట్ల దానవానీకం ఎప్పుడూ నన్ను కొలుస్తుంటుంది. ఇక ఇప్పుడు చెప్పు. నీ మగని వైభవం ఎంతో, నా వైభవం ఎంతో. దారిలో నన్ను నీవు ఘోరంగా దూషించావు. నీకు స[illegible]ధానంచెప్పటానికి అది సమయం కాదు. చెప్పి మెప్పించేకంటే చూపించి నమ్మించటం సులభం అందుకే అప్పుడు మౌనంగా ఉన్నాను. నేను ధీరుడనో, భీరుడనో దీనిబట్టి నీవే తెలుసుకో. ఇప్పటికింతే చూశావు. నీవు నా [illegible]వేరివై, నా సర్వస్వానికి రాణివైనప్పుడు ఇంకెంతో చూస్తావు. ప్రేమతో నన్ను భర్తగా గ్రహించు. ఎం[illegible]కింత వంత చెందుతావు? నా [illegible]టలు విను. ఇంత సులభమైన మార్గం నీ[illegible] ఎక్క[illegible]డా లభించదు. ఎలాగూ ఇక్కడికి వచ్చావు [illegible] [illegible]యోజనాయతమైన లంకా ద్వీపానికి? నా ఆజ్ఞలేక ఎవరు [illegible] [illegible] ఇందులో ప్రవేశించ లేడు [illegible] మందభాగ్యుడైన నీ మగడు ఇక ఇందులో ప్రవేశించుట? మేఘాన్ని [illegible] [illegible] [illegible]. రాముణ్ణి నమ్ముకుని [illegible] [illegible] [illegible] [illegible] నీవు ఇక్కడినుంచి పోలేవు. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] జరుగు తుందో చెప్పు నేను నీకు తగిన భర్తను. [illegible] [illegible] [illegible] చే[illegible] [illegible]రించం [illegible] [illegible] [illegible]. నీ మగడు వచ్చి నిన్ను కొనిపోతాడన్న ఆశ పట్టి అడియాస. త్రాళ్ళతో వాయువును బంధించటం సాధ్యమైతే నా లంకనుంచి నిన్ను నీ భర్త విడిపించటం సాధ్యపడుతుంది. నేను నీకు చూపించిన ఈ దేవతాధిపులకంటే మానవ మాత్రుడైన నీ మగడు గొప్పవాడా? పిచ్చా? [illegible]? ముప్పైమూడు కోట్ల దేవగణం నన్నూ, నా పరివారాన్నీ సేవిస్తుండే ఇక నీ మగనికి

తోడువదే మందప్రజ్ఞుడెవడున్నాడు? మౌర్ఖ్యం విడిచి సీతా! నాతో మనవిచ్చి మాటాడు. నీ మౌనం నాకు ప్రాణాంతకం.

"రాముడూ రాముడూ" అంటూ, విధి విరామం లేకుండా ఏడుస్తున్నావు. వాడు రాజ్యహీనుడు. అడవిద్రిమ్మరి. జోగి. తేజోహీనుడు. మీదు మిక్కిలి మరణించే మానవుడు. కుసుమసుకుమారమైన యౌవనం శాశ్వతం కాదు. గడచినకాలం రాదు. వరించి వచ్చిన సంపద వ్యర్థంగా పెట్టించకు. ఇంక ఆశ పెంచుకోకు. మనస్సుచేతనైనా చొరరాని చోటికి మానవుడెలా రాగలుగాడు? నన్ను జయించేవాడు లోకంలోనే పుట్టలేదు. నా సర్వస్వంతో నేను నీకు వశుడనవుతాను. కరుణతో చూచి కటాక్షించు. శంకించరాదు. నీకై నన్ను కింకరునిగా ఈ లంకానగరాన్ని ఏలుకో. నీ పూర్వజన్మకృతపాపం వనవాసాయాసరూపంగా తీరిపోయింది. నీ చేసిన పుణ్యఫలం చేనపై నా అనురాగం నీకు లభ్యమైంది. ఈ పరిమళం చందనసంపర్కం. ఈ చామీకరవిభూషలూ, పూసుకుని, ధరించుకుని, వాచామగోచరమైన సుఖలీలాకేళిలో చొక్కిపోదాం. త్రిమూర్తులకైనా లేని దివ్య విమానం, పుష్పకం ఉంది. దాని నధిరోహించి ఊర్ధ్వాధో లోకాలు చుట్టి వద్దాం" అని రావణుడు కామోద్రేకంతో, వినరాని, సహించరాని మాటలు పలుకుతుంటే, కర్ణద్వయం మూసుకుని మొగంపై పైటచెరగు కప్పుకుని కంటికీమంటికీ ఏకధారగా ఏడ్వసాగింది. "నెమలి కంటికి నీరువస్తే వేటగానికేం ముద్దు" అన్నట్లు, ఆ కఠోరకర్ముడికి జాలి ఎందుకువస్తుంది? "ధర్మలోపమని ఎందుకు సిగ్గుపడి ఏడుస్తావు? ఇక్కడ ధర్మలోపం ఏం వుంది? ఋషీశ్వరులు దైవకృతానుబంధాలను లెక్కించరు. నీ పదాంబుజపరాగం, అస్మల్లలాట తిలకాయమానంగా మొక్కుతాను. నన్నింక వేధించకు. నాకు వెర్రి ఎత్తించకు. మన్మధార్తిలో పడి పలుకుతున్న పలుకులుకాని సకల దానవలోక సార్వభౌముడు ఒక ఆడుదాని పాదాలంటి మొక్కుతానంటాడా?" అని పల్కుతూ ధరణీసుత తనకు దక్కినట్లే భావించి తనివిచెందాడు. తన చావుకు ఈ కామభావమే కారణం అవుతుందని కానీ, ఆ చావు తన చేతులార తెచ్చిన సీతవల్ల వస్తుందనికానీ తలచలేదు.

## సీత రావణుని నిర్భయంగా నిష్ఠురోక్తు లాడుట

ఆధిక్యప్రసంగం చేసి అసురపతి ఆగంగానే, గడ్డిపరక నడ్డంగా పెట్టుకుని "ఓరీ రావణా! నీవు పల్కిన వీరాలాపములకూ, దంభములకూ తగిన సమాధానం చెపుతా విను. చెప్పిన పలుకులలోని సారం తెలుసుకుని బ్రతుకును బాగుపరచుకో. నీ జైత్రయాత్రలో జయాలే కాక అపజయాలెన్నో వున్నై. ఈ మాటను నిరూపించను జటాయువు నీ [illegible] యుద్ధం [illegible], నీ సారథిని చంపి, నీ విల్లు విరచి నిన్ను నేలకు తెచ్చాడు కదా! అతడు వృద్ధుడే [illegible] నీవు చావకపోవునా. సంధిచేసుకుని సరాసరి లంకచేరేవాడివి. [illegible]లనందరినీ దాసులుగా చేసుకున్న నీవు నా పతిపేరు చెప్పగానే [illegible]! ఆ [illegible] వచ్చేవరకు ఆగలేదేం? [illegible]దేవుడవైతే దొంగవలె పారి వచ్చావెందుకు? అయన చేతిలో నీ చావు ఎలావుంటుందో వివరిస్తాను విను. [illegible] దేవతలు [illegible] వదిలారు. ఒకే [illegible] బాణంతోనే [illegible] చంపివేశాడు. [illegible] పద్నాలుగువేల [illegible] రాక్షసుల [illegible]! [illegible] సముద్రం! [illegible] సముద్రంలోపలి [illegible]. సుబాహుడు చచ్చాడు. ఎందరెందరో రాజులు ప్రేమించలేని ఎత్తలేని శివుని విల్లు ఎక్కుపెడుతుండగనే విరిగింది. పరశురాముని వైష్ణవాస్త్రం గ్రహించి అయన పుణ్యలోకాలను దాటివేశాడు. [illegible] [illegible] [illegible]! వారంతా దేవతలను [illegible]! [illegible], అలనాటి [illegible] రామబాణం [illegible] గడియల్లోనే [illegible] చేశాడు. నా పతి [illegible] నోట వెంట చెప్పకుండా నిమేషం [illegible] నీకే తెలిసేది. ఇన్ని [illegible] పురస్కరించుకుని నా పతిచే [illegible] రక్షపడి [illegible]. [illegible] వరం [illegible] [illegible]. [illegible] వరమిచ్చినవాడైనా అయన్ను ఎదిరించి జీవించలేడు. నేను లంకలో వున్నట్లు తెలిస్తే చాలు, అయన ఇక్కడికి రానక్కరలేదు. నీవే నన్ను కొనిపోయి అక్కడవిడిచి అయన కృపతో తిరిగి లంకకు చేరుకుంటావు. అష్టదిక్పాలకాది దేవతలంతా ఆయన్ను

ఆశ్రయించివున్నారు. ఒకేఒక శరం చాలు నీ పదికంఠాలకు కాలపాశంగా చుట్టుకుని ఊడ్చుకునిపోయి ఆయన కాళ్ళపై పడవేయటానికి. నిన్ను బ్రతికి వచ్చినవాణ్ణిగా చేసి వదులుతాడు. ఇప్పటి నీకావరంలో నా మాటలు సత్యం కావని త్రోసేస్తావు. కాని, ఈ లంకానగరంతో నీవు భస్మంకావటం తథ్యం. దూరంగా వుండి వాగవలసిందేకాని దుష్టభావంతో నన్ను ముట్టలేవని ముందే చెప్పాను. నీవు నాశనం కావటానికి నా ప్రాణేశునిశరమే అక్కర లేదు. నా అనుగ్రహవాక్యమే చాలు. ఆపని నాకిష్టంలేదు. నా భర్త పౌరుషం నీవు చూడాలి. ఆయనచే రాక్షస లోకమంతా రూపుమాసిపోవలె. ఇక నీవు పొమ్మన్నాపోను. నీ వంశక్షయం చేయించి, చూచి శాంతించి అప్పుడు పోతాను. అందమైన ఆడుది తేలికగా దొరికిందని సంతోషిస్తున్నావేమో. ఫలాల్లోకెల్లా విషముష్టి ఫలం చూడ ముచ్చటగానే వుంటుంది. నోట పెట్టగానే శవాన్ని బయట పెట్టిస్తుంది. సృష్టిలోని జీవకోటిలో అందమైనది సర్పం - అందమైనదని చెనకితే అంతకష్టానికి బత్తెం సంతన చేయవలసి వస్తుంది. నీ అవధ్యత్వ వరంలో లోకమంతా వున్నదికాని నాపతి మాత్రం లేడు. అప్పురంలో ఎలా యూపానికి కట్టిన పశువు హోమం కాకుండా వుండదో రామపత్నిని హరించిన ప్రాణి రక్షింపబడటం అలాగే వుండదు. నాపతిదేవుడు పరమ శాంతస్వభావుడు. ప్రసన్న వదనుడు. ఆర్తరక్షణుడు. దయాపయోధి. ధర్మస్వభావుడు. సత్యసంకల్పుడు. దాశరథి. సహ లక్ష్మణుడు. సత్య పరాక్రముడు. ఆయనకు అలుకరాదు. అలిగితే రవి శశిమండలాలు రాలి నేలపైపడతై. సకలోర్వీవలయిత సాగరం శోషిస్తుంది. శైలకానన సాగర సహితంగా పుడమి పరిభ్రమించి బద్దలైపోతుంది. నా హృదయనాథుడు కోదండపాణి కాకుండా వున్నంతవరకే ప్రకృతి ప్రకృతిగా వుంటుంది.

అల్పాయుష్కుడవు. గతేంద్రియుడవు. హీతబలుడవు. శాపగ్రస్తుడవు. శ్రీరామపత్ని తస్కరుడవు. నీకే వేలకొలది వంచితలైన వెలదుల వైధవ్యంతో నిన్నాడి పోసుకుంటారు. జీవాత్మలవలెనున్న మమ్ముల విడదీసిన పాపం నీకు సుఖోదర్కం ఎన్నటికీ కాదు. నీకు లేని దైవబలం నాపతి కున్నది. కాలవశుడై నీవంటి చేటుమూడినవారు చెడ్డపనులు మంచివనుకుని

చేస్తారు. తెలిసిపెట్టినా, తెలియక పెట్టినా నిప్పు చేతిని కాల్చక మానదు. వినాశకాలం దాపురించి నన్ను లంకకు తెచ్చావు. ఈ పాపం నీవొక్కడితో పోక నీకులానికే చుట్టుకున్నది. క్రతువు మధ్యంలో స్రుగ్భాండమండితమూ, బ్రాహ్మణ మంత్రపూతమూ అయిన వేదిని చండాలుడు అంటలేనట్లు రామపత్నిని నన్నంటగలవా నీవు? "నిన్ను బలవంతంగా ఎత్తుకునికదా వచ్చింది. ఇంక నన్నంటగలవా? అన్నమాటకు అర్థమేమిటి?" అని అనుకుంటావేమో? నేను దూరంగా వున్నప్పుడే ఈ కారుకూతలు కూస్తావుకాని, నన్ను కొని తెచ్చినప్పుడు నీకీభావం వున్నదేమో చెప్పు. రామబాణంతో ఇప్పుడు నన్ను తాకు. ఫలితం ఏమివచ్చిందో నీవుండేకదా నీకు తెలిసేది. హంతకునికి శిక్ష విధించేది చంపినందుకూడదు. సంకల్పించినందుకు. నన్ను బంధించు. రాక్షసుడవు కనుక భక్షించు. అందుకు నేనేమీ అనను. ఇకపై దుష్టవాక్యాలు పల్కినా, దుష్టచేష్టలకు కడంగినా ఈ సీత సీతగాదు. మృత్యువు నీ పని తలలో వ్రాసిన వ్రాతగా భావించు.

నిన్ను ఓర్పుగ చెప్పినట్లు చెప్పాను. ఇప్పటికైనా మించి పోయింది లేదు. నన్ను రామునితో [illegible] పతికి అప్పగించి శరణుకోరు. ఆశ్రితవాంఛితదూ, ఆర్తరక్షకుడూ అతను. నిన్ను తప్పక క్షమిస్తాడు. ఆయన ఆగ్రహానికి పాత్రం [illegible] గుంపులోవాడు స్మృతంస్మరాము." ఆ పని చేయటం నీకిష్టం లేకపోతే రాగల ఫలితానికి ఎదురుచూస్తూ రోజులు గడుపు. అంతేకాదు. అవాచ్యాలువాగకు. ఎవరెంత చెటి స్థితిలో వారంతే అనుభవిస్తారు. నా పతి వైభవముందు నీవైభవమెంత? నీ ఆయుష్య మాపతే నీ నగరాలు నూరు పాలవు కాని చీలటానికి. లోకశాసన దక్షులైన మహర్షులంతా ఆయన అనుగ్రహాన్ని కోరుతుంటారు. "నిన్ను సేవిస్తున్న వారంతా లోపల నీచేటు కాంక్షిస్తున్నారు. విద్యలు నిన్ను కొల్లారం [illegible] నేనాని శక్తితోరాదు. నాపతి నీపై యుద్ధ ప్రకటన చేసినప్పుడు వీరంతా నిన్ను చంకలోని మేకను పులికప్పగించి పారిపోయి నట్లు నాభర్త కప్పగించి వదలి వెళ్ళుతారు. ఇక నన్నుమరచి విస్మృతి చేసుకునే ప్రయత్నం చేసుకో" అని సీతపల్కుతుండే ఆమెకోపమో అసాహ్య శక్తి రావణునకు గోచరించి భయభ్రాంతుడైనాడు.

# రావణుడు సీతకు రాక్షస స్త్రీలను కాపు పెట్టుట

పొంగుతగ్గిన మహానదిలాగా కోపంతగ్గి సీత మౌనముద్ర వహించింది. ఏమి చేయాలో రాక్షసునకు తోచలేదు. "ఆమె చెప్పినట్లు కానివచ్చే సమయంలో రామునిపై ప్రతీకారవాంఛ మాత్రమే మెదిలేది. కాని కామ భావం స్ఫురించేదికాదు. ఏనాటికైనా తనకుతానై లొంగి రావలసిందే. బలాత్కరిస్తే మరణం తప్పదు. రామునికి విషయం తెలిసి నాపై యుద్ధానికి వచ్చినప్పుడుకదా ఆలోచించాలి. అది జరిగేవరకూ అంతవరకు ఈమెను రహస్యంగా రక్షిస్తాను" అని తలపోసి, హేళనచేస్తూ, "సీతా! నీవేమన్నా నాకు లోటులేదు. నీపై కోపంలేదు. ఇష్టంలేని వేళ యువతులు ఇలాగే ముందు భీష్మిస్తారు. ఎంతకాలం నిగ్రహిస్తావో నేనూ చూస్తాను. నీకు సంవత్సరకాలం వ్యవధినిస్తున్నాను. అంతవరకు నిదానంగా ఆలోచించుకో. నేను నీభర్త పట్ల ద్వేషినికాని నీపట్లకాదు. స్థిమితంగా మా ఉభయుల తారతమ్యాలు నీవే గ్రహిస్తావు. అప్పుడప్పుడు నీక్షేమంవిచారించి పోతుంటాను. వత్సరాంతానికి నీవు వశపడకుంటే, నా వంటవాళ్ళు నీ మాంసం ఆహారంగా చేస్తారు. ఓ రాక్షసాంగనలారా! ఈమెను మీకు పూర్తిగా అప్పగిస్తున్నాను. ఈరోజు మొదలు పన్నెండు మాసాలు గడువు కూడా కల్పిస్తున్నాను. అంతవరకు మీరీమెను కాపాడుతూ, నయానా, భయానా చెప్పి నాకు వశవర్తిని చేయండి. మీకీ కార్యంలో స్వేచ్ఛవుంది. మీరూ ఆడవాళ్ళు కనుక మరుగుమర్మాలు తెలుస్తై. ఇప్పుడే ఈమెను కొనిపోయి, సాటిలేని సౌందర్యంగల అశోకవనంలో శింశుపావృక్షం ఆవాసంగా వుంచి, అనుదినం అపాయరహితంగా చూస్తూ మదకరిణిని మావటివాడు మదం ఉడిగించి మాలిమి చేసుకున్నట్లు ఈమె మనస్సు మారేట్లు చూడండి. సీతా! నేను పోతున్నాను. నీవు కోరినట్లే నీకు విశ్రాంతి కల్పించాను. ఇక నా కోరిక కూడా నీవు చెల్లించు" అంటూ ఆజ్ఞ ఇచ్చి భూమి శబ్దించగా నడుస్తూ భవిష్యత్కార్యాచరణశీలుడై చరచర నడచి వెళ్ళాడు. వెంటనే దానవాంగనలు బంగారు శిబికపై నెక్కించుకొని పరమాహ్లాద ప్రసాదనసమర్థమైన అశోకవనానికి అవనిజను తీసుకుని వెళ్ళారు. జానకి కూడ రావణునిలో వచ్చిన పరివర్తనం గుర్తించి, కొంత వూరటపడి.

రామచంద్రుని ప్రయత్నం ఫలింప చేయుమని భగవంతుని ప్రార్థిస్తూ అశోకవనంలో దిగింది.

## రాముడు అపశకునములకని పలవించుట

రావణుడు ఎట్టకేలకు ఏ విపరీత చర్యలూ జరుపకుండా జానకిని ఏకాంతస్వేచ్ఛతో పిశాచాకారలైన రాక్షసస్త్రీల రక్షణలో విడిచి వెళ్ళిపోయాడు. వాళ్ళు ఆమెను పసిడి పల్లకిలో కూర్చుండబెట్టి అశోకవనం చేర్చి శింశుపావృక్షంనీడలో అమర్చిన చంద్రకాంత శిలావేదికపై కూర్చుండబెట్టి చుట్టూ కాపలాకాస్తూ కూర్చున్నారు. పులుల నడుమనున్న లేడివలె జానకి కనబడుతున్నది. మాయామృగం వెంటపోయిన రాముడు దాన్ని వధించి, ఆ మాయామృగం మారీచునిగా గుర్తించి, మరొక లేడిని చంపి, మాంసం సంతరించుకుని పర్ణశాలాభిముఖుడై త్వరత్వరగా రాసాగాడు. అతని వెనుకగా నక్క ఆకసంవంక మోరయెత్తి చూస్తూ కూసింది. ఆ కూతవిన్న రాముడు మనసులో శంకించాడు. "ఈ దారుణశివారుతం నాకు కీడు సూచిస్తూంది. జానకికి ఏ అపాయం రాలేదు కదా! మారీచుడు మరణించేవేళ నా కంఠస్వరంతో అరచిన అరపు సతీసోదరులు వింటే భ్రాంతులై నన్నుగూర్చి చెడుగా ఆలోచిస్తారు. అందులో జానకి అమాయకంగా, భయపడినా తమ్ముణ్ణి నాకోసం తప్పక పంపుతుంది. ఆమె మాట కాదనలేక సౌమిత్రి నన్ను వెదకుతూ వస్తాడు. పర్ణశాలలో రక్షణ రహితంగా ఉన్న జానకిని రాక్షసులేమైనా చేయవచ్చు. లోకంలో లేని ఈ బంగరుజింక ఏమిటి? దానికై సీత నన్ను అర్థించటం ఏమిటి? తమ్ముడు కాదన్నా వినక నేను ఇక్కడికి రావటం ఏమిటి? నా శరాహతి మరణించిన జింక మారీచునిగా మారటం ఏమిటి? చచ్చేవాడు "సీతా! లక్ష్మణా" అంటూ అరవటం ఏమిటి? జరిగిన సంఘటన పరిశీలిస్తే, రాక్షసులేదో వంచనతో నా అర్ధాంగిని అపహరించటమో, అశనంగా ఆరగించటమో చేయదలంచే ఈ మాయ పన్నారు. అది తెలియక సీత కోరింది. ఎన్నడూ ఏమీకోరని ప్రియురాలి కోరిక తీర్చటం మంచిదని నేను తలిచాను.

ఒంటరులై పర్ణశాలలో వున్న సతీసోదరులకు శుభం కలుగు గాక! తీరని వైరం దితిజులతో నాకు కలిగింది. ఏ కానికాలంలో ఈ కానన ప్రవేశం చేశామో, అడుగడుగునా ఆపదలు అడ్డు వస్తున్నై. ఖరదూషణ సంహారంతో నాపై కత్తికట్టి రాక్షసులు రంధ్రాన్వేషణం చేస్తున్నట్లు తోస్తున్నది. ఇది ముందుగా ఆలోచించి చేసిన పనే. మమ్ములను ముఖాముఖి ఎదురించలేక వంచనతో ఏదో కీడు తలపెట్టినట్లున్నారు. కాకపోతే రాక్షసుడు మాయామృగంగా ఎందుకు కనుపించుతాడు? నేనాపదలో వుండి సాయం కోరినట్లు నా కంఠాన్ని అనుకరించి ఎందుకు అరుస్తాడు? ఆ కేక విని లక్ష్మణుడు నా కోసం ఒంటరిగా సీతను వదిలివేస్తే ఆమెను అపహరించో, భక్షించో ప్రతీకారం చేద్దామని వ్యూహం పన్ని వుంటారు. ఇందుకు తగినట్లుగా నక్కల అరుపులు కీడునే సూచిస్తున్నై. దుర్నిమిత్తాలు ఎడతెగకుండా కనుపిస్తున్నై. ఏం కీడు మూడుతుందో, ఏం చెడ్డవార్త వినవలసివస్తుందో, ఏ విషాదసంఘటన చూడవలసివస్తుందో, మృగాలు అరుస్తూ నన్ను చుట్టి ఎడమవైపుగా ఏగుతున్నై. సీతకేదో కీడు తప్పక కలిగివుంటుంది" అని ఎన్నోవిధాల వూహిస్తూ, శంకిస్తూ, సీత మనస్సులో గాఢంగా నాటటంతో అడుగులవేగం ఎక్కువచేసి పర్ణశాలకు తిరిగి ప్రయాణం సాగిస్తున్నాడు. కాని, మనసుమనసులో లేదు. మేరు పర్వతంవలె నిశ్చలుడైన రాముడు తుపానుతాకిడికి సముద్రంవలె కల్లోలితమైన మనస్సుతో కలవరపడుతున్నాడు. అలవాటుపడిన దారులైనా, మాటిమాటికి తప్పుతూ, మళ్ళీ సరిఅయిన దారికి చేరుకుంటూ, "అబ్బా! ఈ మాయలేడి వంచనతో నన్ను ఎంతదూరం కొనివచ్చింది? ఎప్పుడు పర్ణశాల చేరుతాను? ఎప్పుడు ఆత్మేశ్వరిని చూస్తాను" అని నిట్టూరుస్తూ, సూర్యాతపానికి శరీరం స్వేదసిక్తం కాగా, అదాటుగా ముందుకుచూచి నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

## రాముడు లక్ష్మణుని చూసి సీతకై మిక్కిలిగా చింతించుట

వెంటనే సంబాళించుకొని "దృష్టిలో దోషం వుందా?" అని మళ్ళీ పరిశీలించి చూచాడు. దృష్టిలో దోషం కాదు. తన అదృష్టంలోనే దోషం

ఉంటామనుకున్నారు. ఆ వచ్చేవాడు తన తమ్ముడేయని గ్రహించు కున్నాడు. అతని వంగినతల, చిన్నబోయిన మొగం, మనసులేనిగమనం, కంపితగాత్రం చూచి, అనుమానించిన ఆపద రానేవచ్చిందని శరవేగంతో సమీపించి, సౌమిత్రి సవ్యకరాన్ని అందుకుని, గద్గదితో, ఆర్తితో, పరుష మర్థవాలైన పలుకులతో "అయ్యో! తమ్ముడా! ఏం పనిచేశావు? నిన్ను నమ్ముకొని జానకిని విడిచివచ్చాను. ఇప్పుడు సీతామెను ఏకాకినిగా ఎందుకు విడిచివచ్చావు? అపకారం జరిగిందని మనసు ఎంతో ఊహ రించాలో, విషయం తెలుస్తూ తెలియదు. ఇంత అనుమానానికి తావులేని హృదయం కీడునే సూచిస్తోంది. ఆమె ఇప్పుడు దైత్యులపాలపడివుంటుంది. మనం పర్ణశాలకువెళ్ళి ఏమి చూస్తాం? అస్థులా, మాంసాలా, మృగాలూ, పక్షులూ మూగిపెట్టి తింటుంటే చూస్తున్నా. ఇంత కష్టం ఎక్కడినుంచి వచ్చింది? తమ్ముడా! హరిణంగా తోచినవాడు రాక్షసుడు. ఎంతో దూరం. అలసినట్లే నటించి క్రమక్రమంగా తీసుకుపోయాడు. చివరకు నేను శరప్రయోగంచేస్తే కొండకు కూలా పర్వతంవలె దైత్యుడు పడిపోయాడు. ఇదంతా సీతాపహరణంకోసమే చేసి వుంటాడు. నా వామనేత్రం అదురుతున్నది. ఏ మాత్రం ఉత్సాహంలేదు. పర్ణశాలలో జానకి క్షేమంగా కంటబడదు. ఆరాములపంతో కసిగొన్న రక్కసులు తప్పక మనం లేకుండటం చూచి జానకిని పట్టుకొనుటకు యత్నం చేస్తారు. వాళ్ళనుచూచి భయపడి పారిపోతూ అడవిలో దారి తప్పిందో, లేక వాళ్ళ చేతికేచిక్కిందో, ఏదో ప్రమాదం తప్పక జరిగి వుంటుంది.

అయోధ్యలో అంతఃపురాల్లో హాయిగా లభించే సౌఖ్యం వదలి, రాజ్యభ్రష్టుణ్ణి, అడవిదిమ్మరినీ, దీనుణ్ణి నన్ను సంతోష సౌఖ్యాలలో తేల్చుదామని వచ్చిన మీ వదినను ఒంటరిగా ఎందుకు విడిచివచ్చావు? ఇక నా గతి ఏమిటి? ఎవరిని ప్రాణంతో సమానంగా ప్రేమించాలో, ఎవరికి నా అర్ధదేహం అననంగా చేశానో, ఎవరు నన్ను కృతార్థుణ్ణి చేయుటానికి సర్వ సౌఖ్యాలూ త్యాగంచేసి విపినసీమలకు వెంటవచ్చారో, నీవు నిరంతరం కంటిరెప్పవలె ఎవరిని కాచిపుంటావో ఆమెను రాక్షసులకు అప్పగించి

ఎలా వచ్చావు? ఆమె లేకుంటే ధరాపతిత్వ గీర్వాణపతిత్వాలు వచ్చినా నాకు తృణప్రాయాలని నీకు తెలుసు కదా? ఆమె ఇప్పుడు క్షేమంగా వున్నదా? పినతల్లి ఎదుట పధ్నాలుగేండ్లు అరణ్యవాసంచేసి జనకుని సత్యవంతుణ్ణి చేస్తానని పల్కిన ప్రతిజ్ఞకు భంగం రాదుకదా? ఆమె ఆశ్రమంలో కనుపించకపోతే అసువులు నాలో నిలువవు. నా మరణా నంతరం నీవు అయోధ్యకు పోగానే అపకృతి చింతించిన కైకమ్మ అద్దు తొలగిందనీ, శాశ్వతంగా తన కొడుకు రాజ్యం పాలిస్తాడనీ, తన దూర దృష్టి ఫలించిందనీ ఆనందం పొందకపోదు. రాజైన కొడుకుతో కూడి, భర్తృ మరణాన్ని పాలించని సవతిని సేవిస్తూ, తపోవ్రతా, వృద్ధురాలూ మృతపుత్రక అయిన నా తల్లి జీవించగలదా?

తమ్ముడా! నీ రాకతో జానకికి అపాయం జరిగివుంటుంది. దానికి సందేహంలేదు. పోదాం పద ఆశ్రమానికి. అక్కడ సీత వుంటే నేనూ వుంటాను. ఆమె లేకపోతే ఆమె నివసించిన ఆ చోటనే ఆత్మహత్య చేసు కుంటాను. నవ్వు వెన్నెల కురుస్తూ నా జీవితేశ్వరి ఎదురువచ్చి, ముద్దు ముద్దులతో ఆహ్వానించకపోతే తమ్ముడా! ఇక నీకు అన్న లేడనుకో. చెప్పయ్యా! చెప్పు జానకి ప్రాణంతోనే వుందా? నిన్ను కన్నుకప్పి సీతను దైత్యులేమీ చేయలేదు. అందుకే మారీచుడు నేను అన్నట్లుగా అరచి చచ్చాడు. ఆ కూతవిని సీత నిన్ను నా వద్దకు పంపివుంటుంది. నీవు రంధ్రం వెదకుతున్న రక్కసులకు అవకాశం కల్పించి ఆమెను విడిచి అడవికి వచ్చావు. ఇంకేముంటానికి ఏముంది? సీతావియోగంతో చెడ్డాను. పారంలేని శోకసముద్రంలో పడ్డాను. "అవశ్యమనుభోక్తవ్యం, కృతం కర్మ శుభాశుభమ్". శివధనుర్భంగం చేశాననీ, కౌశికమహర్షి యాగం కాచాననీ, తాటకాసుబాహులను చంపాననీ, వీరుడననీ తలంచి నన్ను వరించింది. నేనుండగా తనకెట్టి ప్రమాదంలేదని ధైర్యంతో ఎంత నేను చెప్పినా వినక వెంటవచ్చింది. ఆమె ఆశలన్నీ అడియాసలైనాయి. నేనుండగానే ఆమెకు అపకారం జరిగింది. నా పౌరుషం ఎందుకు? నేనార్జించిన శస్త్రాస్త్ర విద్య దేనికి? అబలను, నమ్మినదానిని, అర్ధాంగిని

కాపాడుకోలేని నేనుకూడ పురుషుడనేనా? నా జీవితానికి ఇది గ్రహాణ సమయం. ఏమైనా అనుభవించక తప్పదు."

## సీతను విడిచి ఏల వచ్చావని రాముడు లక్ష్మణుని ప్రశ్నించుట

ఈ విధంగా రాముడు సామాన్యునివలె భార్యను తలంచుకుని విచారిస్తూ, పరితపిస్తూ, ఆశ్రమానికిపోతూ లక్ష్మణునిచూచి, "తమ్ముడా! భవిష్యాన్ని జాగ్రత్తగా చూడగలనీవు, నేను లేనిసమయంలో మీ వదినను విడిచిరావటం ధర్మమని తలచావా? నీ వాలకం చూస్తూన్నకొద్దీ నాకు ఆతురత అధికం అవుతున్నది. ఇంత త్వరపాటుపని ఎందుకు చేశావయ్యా? నీ వుండగా, రాక్షసులేకాదు, దేవతలేకాదు, సృష్టిస్థితిలయకారులైనా ఆమెను తేరిచూడలేరనే విశ్వాసం నాకు వుండబట్టేకదా నీకామెను వప్పగించి వచ్చాను. మాయామృగరూపం మిదవించే ముప్పు వస్తుందని ముందే అనుకున్నాను. నాకు తోడుపడవలసివస్తే ఆమెను కూడ తోడు తీసుకొనిరాక ఒంటరిగా ఎందుకు వచ్చావు? నీవు ఒక్కడవే రావటం దూరం నుంచి చూడంగానే వామనేత్ర భుజాలు ఒక్కసారి అదిరినై. అప్పటినుంచీ మనస్సు కీడునే శంకిస్తూంది. దానికి తోడు నీ వదనం విషాదపూరితంగానూ, విన్నదనంతోనూ కన్పిస్తూంది. అక్కడ ఏం జరిగింది? ఆమెను విడిచి ఒక్కడవే రావటానికి కారణం ఏమి కల్గింది?" అని ఆపలేని ఆదుర్దాతో అడిగాడు.

లక్ష్మణుడు విలవిల్లా వణకుతూ, అన్నను సరిగా చూడలేక, ఆమె అన్న మాటలు చెప్పలేక, వేరేకారణం చెప్పటానికి ఏమీలేక, నిష్ఠురమైనా నిజం చెప్పక తప్పక, మోమువాల్చి, నేలచూస్తూ. "అన్నా! అపరాధం క్షమించు. నీవన్నమాటలన్నీ నిజమే. నాపైనీవు మోపినభారం, నా కర్తవ్యభారం ఎంతో నాకు తెలుసు. తెలుసు కనకనే నిన్ను కళ్ళారా చూడలేకుండా వున్నాను. నేను బుద్ధిపూర్వకంగా, ఈ అనుచితకార్యం చేసి నీ ఆజ్ఞాతిక్రమణ దోషం కట్టుకోలేదు. నేను భ్రాంతిపరుడ్ని కాలేదు. ఆలోచనా

రహితుణ్ణి అంతకంటే కాలేడు. జరిగినది జరిగినట్లు చెపుతా. ధర్మమైతే మన్నించు. అధర్మమైతే శిక్షించు. నీవులేని సమయంలో నేను ఎక్కడ వుండి ఎలా వదినను చూస్తానో నీకు తెలుసుకదా: ఈనాడూ ఆ విధంగానే వున్నాను. వదిన తనపని తాను చేసుకుంటున్నది. ఇంతలో "హా సీతా! హా లక్ష్మణా! ఆపదలో వున్నాను. ఆదుకోండి' అన్న అరుపు వినిపించింది. అది వింటానికి నీ కంఠస్వరంవలెనే వున్నది. ఆ మాట వినంగానే, ఆమె నీమీదవున్న అనురాగంతో ఏడుస్తూ నన్ను నీకు తోడ్పడపొమ్మన్నది. నేను వినీ ఉదాసీనంగా వూరుకున్నానే కాని, సమాధానంకూడ చెప్ప లేదు. అంతటామె కొంచెం తీవ్రతగా, "ఆపదలో అడ్డుపడకపోతే నీవు మా వెంట నేనికి వచ్చినట్లు? సుఖంగా అయోధ్యలోనే వుండ వచ్చుకదా" అన్నది. ఆ మాటలకు సమాధానంగా, "వదినా! ఎందుకమ్మా అంత భయం? ఎవరికోసం భయపడుతున్నావు? నా అన్న కోసమైతే అది అక్కరలేనిదీ, అనవసరమైనదీ అయిన కార్యం అవుతుంది. ఎందుకంటే, ఆ కేక మా అన్నది ఎన్నటికీ కాదు. నిజంగా ఆ కేక నా అన్న వేస్తే ఈ లోకం ఇలా వుంటదమ్మా! అంతవానికి సహాయం అవసరమైతే నేను చేయగల సాయం ఏముంటుంది? ఇది రాక్షసుల మాయ. దేవతలనే కాపాడు మహాసత్వ సంపన్నుడు మహావీరుడై, అభిమానరహితుడై, భీరు వల్ల పరుల సాయంకోసం ప్రాకులాడుతున్నాడని భావించటం నీ భ్రాంతే కాని. అది నిజంకాదు ఆయన పరాక్రమం నాకు తెలిసినంత నీకు తెలియకున్నా, నీవెరిగినంత వరకు ఆయన అజేయుడనీ, అసహాయశూరుడనీ గ్రహించావుకదా ఆకేక చిక్కాలి దూరనుంచి వినవచ్చింది కాని దగ్గరలో నుంచి వచ్చింది కాదు. అంత దూరం మనుష్యుల కంఠధ్వని అయితే వినపడదు. పోయినపని ముగించుకుని అన్న క్షేమంగా వస్తారు. భయపడ వలసిన పనిలేదు. ఎవరో తెలివితక్కువ వాళ్ళు తలచినట్లు తలంచటం నీకు తగదు. ఇప్పటికి పుట్టినవారిలో కానీ, ఇక ముందు పుట్టబోయే వారిలో కానీ, నా అన్నను ఎదిరించి జీవంతో మరలగలవాడులేడు. ఆ విధంగా భావించక అన్యథా భావిస్తే ఆయనపట్ల అపచారం చేసిన దానవవుతావు. నీవు యథార్థం తెలుసుకోలేక పొందుతున్న భీతి వదలి స్తిమితపడు"మని చెప్పి వేడుకున్నాను.

ఆ మాటలు విన్న వదిన అన్న మాటలు నేను ఉచ్చరించవచ్చునో లేదో, నీవు వినవచ్చునో లేదో, చెప్పక తప్పలేదు కనుక చెపుతున్నాను. "ఓరీ! కృతఘ్నుడా! ఆయన నీ పట్ల ఏం అనుచితం చేశాడు? అడవిలో తోడుపడమంటే శ్రీరంగ నీతులు వల్లిస్తున్నావా? ఆయన ఎంతవాడో నాకు తెలియక చెపుతున్నావా? ఎంతవానికైనా ఒకప్పుడు సాయం కావలసి వస్తుంది. మహారాజుగారు మూర్ఛిల్లిన సమయంలో పిన్నత్తగారు రథం యుద్ధభూమి నుంచి తప్పించలేదా? సేవదేవి వారు శాత్రవుల సంహరించలేదా? నీ వైఖరి చూస్తే ఆయన మరణానంతరం నన్ను ఆశిస్తున్నట్లున్నది. నీవూ, భరతుడు కలిసి ముందే ఆలోచించుకుని నీవు నావెంట వచ్చావు. అవకాశం కోసం కాచుకుని వున్నావు. అది వచ్చింది. నీ నైజగుణం వచ్చింది. అది ఎన్నటికీ ఫలించదు. ఆయనకు నిజంగా ఆపదే వస్తే ఆయనతోనే సీతసహగమనం చేస్తుందికాని, నీమతైన మీఎత్తుగడసాగనిస్తుందా?" అని మనఃఖేదంగా మాట్లాడింది."

## సీతను విడిచి వచ్చుట తగదని రాముడు సౌమిత్రికి చెప్పుట

అని దుఃఖంతో చెప్పితలవాల్చి ఊరకున్నాడు. విషయం అంతా విన్న రామచంద్రుడు. "తమ్ముడూ! ఏమైనా ఆమెను ఒంటరిగా విడిచి రావటం యుక్తంగాలేదు. ఆమె అనురాగంచేతో, భయంచేతో, తెలిసో, తెలియకో, కఠినంగా పలికినా, విజ్ఞుడవూ, ఆమెను రక్షకుడవూ అయిన నీవు తొందరపడి ఎందుకు వచ్చావు? ఆమె అన్నమాటలు నీవే గ్రహించావుకాని, ఆపై ముందే కీడు ఆలోచించలేదు. అసంబద్ధపు మాటలు అన్నదని, ఆమెను దిక్కులేనిదానిగా చేసిందేకాక, పెద్దవాడనైన నా ఆజ్ఞాభంగం కూడా చేశావు. ఇందులో ఎవరిననవలసినదేముంది? నాకర్మ బలీయమైనప్పుడు నేను అనుభవించాలి అంతే. నాయోగం ఎలావుంటే అలాగే జరుగుతుంది. పోదాం పద." అంటూ పర్ణశాలవైపు నడకసాగించాడు. అన్న తేలికగా అన్నా, ఆమె అన్న మాటలకంటే సౌమిత్రిని అధికంగా బాధించినై. భార్యపై భర్తకు అనురాగం, భర్తపై భార్యకు అనురాగం వుండక పోవటం విడ్డూరంగాని, వుండటం చాలా సహజం. అది లక్ష్మణుని పట్ల సీతా

రాముడు ప్రకటించిన విధానం విడ్డూరంగానేకాదు. విపరీతంగా కూడా వుంది. వెర్రితలలు వేసిన మోహం వివేక శూన్యుణ్ణి చేస్తుంది. విషయాన్ని విపరీతంగా చూస్తుంది. కాకుంటే, "ఆత్మాభిమానం చంపుకొని అయినా ఆమెను కాపాడవద్దా?" అని ధ్వనించేట్లుగా ఎందుకు మాట్లాడుతాడు? ఇంతకు సౌమిత్రి చేసిన తప్పేమిటి? సీత అన్నట్లు పరమభక్తుడైన భరతుడు, పరమత్యాగియైన లక్ష్మణుడు ఆమె కోసం కుట్ర చేశారా? అరణ్యవాసానికి పూర్వం భరతుడు అయోధ్యలో వున్నాడా? అని అనేక ముఖాల రాముడి మనస్తత్వాన్ని, జానకి మనస్తత్వాన్నీ శంకించవలసి వస్తుంది. ఈ భావాలే లక్ష్మణుని మెదడులో మెదిలినై. తప్పు చేయకుండా చేసిన వాడివలె సహించటం సాధ్యం కాలేదు సౌమిత్రికి. ప్రతిఫలశూన్యమైన త్యాగంతో తన్నుతాను అన్నకు అర్పించుకున్నందుకు అనవలసిన మాటలేనా ఇవి? సీత అన్నది ఆయనకు కోపంలో తెలియక అన్నదిగా తోచినై కాని, అభిమానపడి ఆమె ఇష్టం ప్రకారం వచ్చిన తమ్ముని చేత తప్పుగా తోచింది. కేవలమైన వ్యామోహం ఎంత చెడ్డది? తగిన విధంగా సమాధానం చెపుదామనుకుంటున్న లక్ష్మణునికి తల్లి స్ఫురించింది. "నాయనా! లక్ష్మణా! తొందరపడకు. అన్న ఆ భావాన్ని అంత తీవ్రమైనదిగా భావించకపోతే జరిగిన దానికి ప్రతీకారం జరుగదు. "ఆత్మానం మానుషం మన్యే. రామం దశరథాత్మజమ్," శాంతంతో సమాధానం చెప్పు" అని ప్రబోధించింది.

లక్ష్మణుడు అందునకు చూపు వచ్చినట్లయి. "అన్నా! ఇలా జరుగుతుందనీ, నీవు ఇలా బాధపడతావనీ నాకు తెలిసే అన్ని మాటలన్నా ఆమెను విడిచిరావటానికి ఇష్టపడలేదు. నేను నీశక్తిని గురించి చెప్పిన కొద్దీ ఆమెకు నాపై అసహ్యం ఎక్కువైంది. "వ్యర్థవాక్కులతో కాలం గడుపుతున్నావా? ఆయన అపాయానికి అడ్డుపోవా? పోకపోతే నేనిప్పుడే మరణిస్తా"నంటూ మరణప్రయత్నం చేయబోతుంటే చేసేదిలేక, దైవంపై భారంవుంచి వచ్చాను. ఇక నా దోషమేమిటో నీవే చెప్పు?" మంటూ సౌమిత్రి దైన్యపడి మాట్లాడాడు. రాముడికి తలతిరిగింది. "నిష్కారణంగా

తమ్ముణ్ణి పరుషంగా మందలించాను. ఆసమయంలో ఎవరైనా అంతకంటే చేయవలసింది ఏముంది? ఆమెకు ఆ దుర్భావం కలగటం ముందేదో కీడును సూచించటమే. లేకపోతే బిడ్డవలె చూచుకుంటున్న సీత ఇటువంటి భావం ఎలా పొందుతుంది? పాపం! తమ్ముడు నా మాటలకెంత నొచ్చుకున్నాడో." అని తలపోసి. "తమ్ముడా! విచారించకు. విధి ప్రతికూలమైనప్పుడు ఎంత వారైనా చేయగలిగింది ఏమీలేదు."

## పర్ణశాలలో సీత లేమికి రాముడు చింతించుట

అంటూ రాముడు వడివడిగా పర్ణశాలవైపుకు వస్తున్నాడు. పర్ణశాల చేరువైనకొద్దీ రామునిలో ఆరాటం హెచ్చింది పాదాలు నేలపై తొట్రుపాటుగా పడుతున్నై. సర్వాంగం వంగి శరీరం తీగలాగా వణికిపోతూంది. చూపులో నిర్మలత్వం తగ్గింది. దారి గుర్తించటం కష్టమైంది. లోకం అంతా అలికినట్లు గోచరిస్తూంది. అంతకంతకు తనకు రానున్న ఆపదశంక బాధ అధికం కాసాగినై. "సీత క్షేమంగా వుందా? ఇంక నేను ఆమెను చూస్తానా? ఆమె నన్ను అనురాగంతో ఆదరిస్తుందా? ఏమో! ఈ జన్మమున ఆ ప్రాప్తి వుందో లేదో? అయ్యో నేను ఎంత అదృష్టవంతుణ్ణి! ఈ దుశ్శకునాలు అందుకు అవకాశం లేదని చెపుతున్నై. ఆమెలేని జీవితం ఎంత దుర్భరం? ఈ అరణ్యవాసభారం ఆమె సాహచర్యం వల్ల నేకదా మోయగలిగాను. ఇకముందు నా గతి ఏమికానుంది? సారంలేని సంసార యాత్రలో సహచరి అనే స్వర్గం లేకపోతే మానవజీవితం వృథా. గడువు పూర్తి కాబోయే సమయంలో ఈ అవాంతర ఘటన దైవం నాకు ఎందుకు కల్పించాలె? మనోవాక్కాయ కర్మల్లో ఎట్టి చెడ్డను చేయలేదే." అని అనేక విధ భావపరంపర అవ్యాహతంగా మనస్సును కలచివేస్తుండగా పర్ణశాలకు వచ్చాడు.

హేమంతంలో పద్మినిలాగా, వాడినపూలూ, రాలినపండ్లూ, కదలిక లేని పక్షులూ కలిగి శోభ తరిగిన వృక్ష లతాదులతో శోకదేవతలాగా, సమయ సంస్కారహీనంగా, కాంతివిహీనంగా వెలవెలపోతూ దొంగలు పడి దోచిన కొంపలాగా, పక్షి విడిచిపోయిన గూడులాగా, నిశ్శబ్దంగా,

పిండంగా సంపద కోల్పోయిన సీమంతినిలాగా, వదలివేయబడిన, రుద్రాక్ష మాలికలు, కమండలువు, దండం, కృష్ణాజినంతో, పాడుబడిన ఇల్లులాగా పర్ణశాల కానవచ్చింది. అదురుతున్న గుండెతో, బెదురుతున్న మాషతో లోన ప్రవేశించాడు. సీతలేదు. రాముడు పెనుకేక పెట్టుతూ పడిపోతుంటే లక్ష్మణుడు ఆగి పట్టుకున్నాడు. పట్టుకున్న తమ్ముణ్ణి గట్టిగా పట్టుకుని "సోదరా. నా కొంప నిలువునా కూలింది. నా బతుకు వ్యర్థమైంది. నే పడిన శ్రమంతా పాడయిపోయింది. నా సీత ఏది? ఎక్కడ వుంది? అసురులు అపహరించినారా? మృగాలు భక్షించినవా? నమిత్తుశఫలాదుల కోసం అడవిలోకి పోయిందా? గౌతమికి స్నానం నిమిత్తం వెళ్ళిందా? ఇప్పుడు ఏంచేసేది? ఎక్కడ వెదికేది? ఎక్కడికని పోయేది? ఎవరు నా మొరాలిస్తారు? ఎవరు నాకు తోడ్పడతారు?" అంటూ పర్ణశాల అంతా పలు సార్లు వెదికాడు. పరిసరాలను చూశాడు. పేదుదుకొన్నట్లు, వెంగలి విధంగా, వెర్రివానివలె, తలతిక్కవాని చందంగా, వికారంగా చూస్తూ, మీదికీ, క్రిందికీ, దిక్కులకూ తలత్రిప్పుతూ, ఏడ్చి ఏడ్చి ఎర్రబడిన కళ్ళతో, తల మోదుకుంటూ నేలకూలి పడ్డాడు. చైతన్యం స్వాధీనం తప్పితే జడమైన ప్రకృతి ఏంచేస్తుంది? అంతకాలం ఆయన అనురాగవృష్టిని అనుభవించిన ఆ ప్రదేశం, ఏం చేయుకొంటుంది ఏమీ లేనిన్నట్లు గాలిదుమారంలో రేగిన దుమ్ములో మునిగిపోయింది.

## రాముడు సీతను వెదకుట

రఘుకులమణియైన రాముడు, జగదేకవీరుడు, విర్జిత ముఖసోముడు, అనంతకాలం తపశ్చర్యలో అణిమాదిసిద్ధుల అవలీలగా సాధించి, సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగిన మహర్షులకే ఆరాధ్యమైనవాడు, వ్రేలెత్తి చూపించ టానికి వెలితిలేనివాడు, అనన్న పట్టాభిషేకాన్ని అధకరించి అజరామరమైన కీర్తిని అందుకున్నవాడు, స్వీయనిగ్రహంతో, సత్యవ్రతపాలనంతో, తండ్రికి పుత్తమోత్తమగతులు కల్పించినవాడు, అఖండ బల పరాక్రమ సపన్నులైన అసురులను దహనుడు కాననం దహించినట్లు దహించిన వాడు, సతికై మతిపోయి గతితప్పి క్షితిపై పడి మూర్ఛిల్లటం లక్ష్మణునకు

తప్పు, చరాచరజగత్తుకు సహింపరాని వేదన కలిగించింది. ఇంద్రాదులు రావణ వధ లక్ష్యంగా రచిస్తున్నవ్యూహం చరమస్థాయికి చేరుకుంటున్న దని ఒకప్రక్క సంతోషిస్తున్నా, "పరమపురుషుని విస్తారణంగా బాధల్లో పడేస్తున్నా"మనే భావం ఇంకోప్రక్క అనుభవిస్తున్నారు. ప్రమాదరహిత ప్రదేశాన్నుంచి, ప్రమాదరహితమైన ప్రదేశానికి చేర్చి, జనస్థాన దనుజ విధ్వంసంతో సుఖిస్తున్న మహర్షులు, త్రికాలజ్ఞులై కూడ రాముడను సీతాప హరణదుఃఖంలో సహాయం చేయలేకపోయారు. స్థితప్రజ్ఞుడైన లక్ష్మణుడు అన్నను లేవతీశాడు. జలం ఇచ్చి దాహం తీర్చాడు. వీవన్తో విసరి సేద పోగొట్టాడు. పండ్లు భుజింపచెట్టి ఆకలి ఆర్పాడు.

"అన్నా! అధైర్యపడవద్దు. ఇక్కడ యుద్ధం జరిగిన పరికరాలు పడి వున్నై. ఎవరో దైత్యుడు యుద్ధోత్సాహంతో వచ్చి వదినను అపహరించి వుంటాడు. మనం శ్రమ అనుకోకుండా ఆమెను వెదుకుదాం. ఇప్పుడు ఇక విచారిస్తే లాభంలేదు. ఆమెజాడ తెలియకపోదు" అని ఓదార్చి, ధైర్యం చెప్పి, అన్వేషణ నిమిత్తం ఉద్యుక్తం చేశాడు. కొంతలో కొంత మనస్సును కుదుట పరుచుకుని రాముడు రొంపరగా ఏది ఆమె దొరుకుతుందనే ఆశతో అడవికి నడిచాడు. ఆ అన్వేషణలో శోకమే పెరిగాడు. ప్రకృతి అంతా సీతామయంగా గోచరిస్తున్నది. ఆమె లేకున్నా ఆమె రూపం ప్రకృతిలో ప్రతిఫలిస్తోంది. చెట్టుచెట్టునా, పుట్టపుట్టనా, గుట్టగుట్టనా, గట్టుగట్టునా వెదుకుతున్నాడు. ఎక్కడ ఆమె లేదు. "అయ్యో! ఏది నా సీత? ఎక్కడ నా సీత? ఓ బింబఫలమా! నీవలె మధురాధరం కలిగిన నా సీతను నీవు చూడలేదా? చిలుకా! నీవలె చక్కని పలుకులతో ప్రమదించార్చే నా భార్య నీవు గమనించలేదా? హరిణమా! మిక్కుటమైన చంచలనేత్రాలతో నిన్నుబోలిన నా సతి నీకెక్కడైనా కనిపించలేదా? ఓ గజరాజా! ఆమె గమ నానికి అసూయపడి ఎక్కడైన దాచావా? ఎన్నడూ శోకం ఎరుగదు. నన్ను శోకంలో ముంచి నా అర్ధాంగి అదృశ్య అయింది. అశోకమా! చెప్పు. నీవంటే ఆమెకు ఎంతో ఇష్టం. లతలారా! భూజములారా! మీకు తెలియ కుండా నీరజగంధి ఎక్కడికి పోతుంది? మీరు తప్పకచూచివుంటారు. నా మొరవిని నాకు సీత జాడ చెప్పండి. లక్ష్మణా! ఎవరా పోవుసరి? సీత కాదు

కదా? అయ్యో! సీతా! నన్ను విడిచి ఎలా పోగలిగావు? నన్నేం చేసి పోయావు? ఆగు. నేనూ వస్తున్నాను. నిన్ను వదలి నేనుండలేను. అవును. నిజంగా నీవు నా సీతవే. ఆ హారాలు, ఆ చీర, ఆ రైక, ఆ కంకణ మంజీరాలు అన్నీ నా తండ్రి మన వనవాసానికి ముందు సుమంత్రునిచే భద్రపరచి ఇచ్చినవే.

నా ప్రేమను శోధిస్తున్నావా? హాస్యానికిగానీ, ఆటకుగానీ, చాటున నుంచి నన్ను గేలిచేస్తున్నావా? నాకు తెలుసు నీవు నన్ను విడిచి ఎన్నడూ ఎక్కడికీ పోవు. సరసకార్యాలైనా విరసస్థితికి రానీయవు. నిన్నెవరో హరించి వుంటారు. కాకుంటే భక్షించి వుంటారు. అంతేకాని, భయంకరారణ్యంలో, రాక్షసులు తిరిగే చోట్లకు నీవెందుకు పోతావు? మనం మళ్ళీ కలిసే యోగం వుంటే ఏ ఒక్కరైనా నీ జాడ చెప్పరా? ఇక్కడ ఎవరు వున్నారు? వున్నవాళ్ళంతా రాక్షసులే. వాళ్ళు మాయావులు. మానవాశనులు. వాళ్ళకు తెలుసు. కాని వాళ్ళెందుకు చెపుతారు? నన్ను ఎదిరించి గెలువలేక, నా భార్యను నన్ను మాయంచేసి వ్యథతో కుమిలే నన్నుచూచి నవ్వుకుంటారు. ఈ లోకం ఎంత స్వార్థం కలది! నాసహాయం కోరి నన్నర్థించినవాళ్ళు, నా కష్టకాలంలో తోడు రారా? రారు. అవసరం తీరింతర్వాత ఎవరూ గౌరవించి కృతజ్ఞత చూపరు. చెట్టునుంచి పండు పడకుండా వుండాలికాని, పడితే మళ్ళీ తొడిమకు అంటించటం సాధ్యమా? నా పుణ్యఫలితం వున్నంతవరకు సీత నా వద్దనే వుంది. పాపఫలితం అనుభవానికి రావటంతోటే నన్ను వదలిపోయింది.

నాకు కర్మాధికారమే పోయింది. సీతా! ఇంక "అస్మాకం సహ కుటుంబానాం" అని చెప్పి కర్మకు ఉపక్రమించే అవకాశం ఏదీ? ఆపద సమయం ఆసన్నమైనప్పుడు నన్ను తలచుకుని ఎంత విలపించావో? కర్ణభూషణాలతో, చేర్చుక్కతో, ముక్కెరతో, కుంకుమతో, వేణీభరంతో, వెన్నెలవాన కురుస్తున్నట్లు వుండే నీ చల్లని వదనం ఆ ఘటనలో ఎలా వుందో వూహించలేనుకదా? ఊహించి మాత్రం చేయ దాటినమీదట చేయగలిగింది మాత్రం ఏముంది? పరమ సుకుమారమైన నీ శరీరం చిన్నాభిన్నం చేసి చెరకు ముక్కల్లాగా దైత్యులు భక్షిస్తారేమో," అంటూ ఉన్మాదివలె

పోయినచోటికేపోయి, చూచిందేచూచి, అడిగినవాటినేఅడిగి, అడవి అంతా తమ్మునితో కలిసి తిరిగాడు.

## సీత రాక్షసులచే హతమైనదనే నిర్ణయానికి వచ్చి రాముడు శోకించుట

ఎక్కడా ఆమె జాడ తెలియలేదు. గత స్మృతులు ఒక్కొక్కటి తలంపుకు రాసాగె. తలచి తలచి కుమిలిపోయాడు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు. "ఎవరైనా దొంగిలిస్తే ఏదో ఒకవిధంగా ఆమాకీ తెలుస్తుంది. ఆమె ప్రాణంతో వుండే ప్రయత్నమైనా చేయదా? చేస్తే వినపడదా? ఏమని కేక వినపడలేదు? లేదు. ఆమె అసురుల చేతిలో బడి హత్యకు గురియై వుంటుంది. ఆమె వాళ్ళ సంతోషం భక్షింపబడి కూడ వుంటుంది. గుంపువదలిన లేడిని క్రూరమృగాలు చంపి తిన్నట్లు నేను లేకపోవటంతో సీతను చంపటం తేలికగా జరిగివుంటుంది. ఎక్కడికని పోవటం? ఎక్కడని వెదికి చూడటం? ఈ అన్వేషణకు అంతం వుంటుందా? అది నా అంతంతోనే జరుగదా? తమ్ముడా! సౌమిత్రీ! అడవి అంతా తిరుగుతున్నాం. మీ వదిన జాడ తెలియటంలేదు. ఇంటికి భార్య కోసం వెళ్ళకవస్తే, స్వర్గంలో నా తండ్రి నన్ను చూసి "ఏమిరా రామా! పద్నాల్గేండ్లు వుండకుండానే. నన్ను సత్యవాదిని చేయటానికి వచ్చావా? నీ భార్య ఏది? ఒక్కడవే ఎందుకు వచ్చావ్"అంటే ఏం సమాధానం చెప్పేది? దుర్మార్గుణ్ణి యశస్సు వదలిపోయినట్లు నన్ను నీవు వదలిపోయావు. రాజ్యం లేనివాడని, అనాదరణంగా, వనప్రస్థం చేయించిన క్రూరుణ్ణని అలిగావా? ఇవి ఏవీ కావు. నిన్ను రాక్షసులే భక్షించివుంటారు. సందేహం లేదు. భార్యను పోగొట్టుకుని ఇంటికి నేనేం దాచుకుంటాను. చచ్చి నీ సన్నిధికే వస్తాను" అంటూ వాపోవసాగాడు.

## సౌమిత్రి రాముని సమాధానపరచుట

అన్నా! ఎందుకింత శోకిస్తావు? ఈ మహారణ్యంలో ఎక్కడో ఒకచోట తప్పక ఆమె జాడ తెలుస్తుంది. మనమిద్దరం లేకపోవటంతో

వరివయమైనవే కదా అని గౌతమిలో స్నానానికికానీ, పూలకోటల్లోకికానీ పోయి వుండవచ్చు. లేక మన తెలివితేటలు తెలుసుకుంటానికని దాగి వుండవచ్చు. దారి తప్పివుండవచ్చు. అడవిమృగాలు ఆమెకు అపకారం చేయవు. నీవు నిబ్బరంగా వుండు. మానవయత్నం చేద్దాం. దైవాను కూలం తర్వాత గదా!" అని సౌమిత్రి సమాధానవాక్యాలు పలికాడు. ఆ మాటలకు రాముడు కొంత పూరటపడి మిట్టలూ, పల్లాలూ, కొండలూ, కోనలూ, నదులు, సరస్సులూ, పుట్టలూ, గిరులూ, ఒకటేమిటి? విడువ కుండా అరణ్యమంతా అన్వేషించారు. సీత జాడ తెలియలేదు. రాముడు నిరాశతో, "తమ్ముడా! నీవు చెప్పినట్లే చూడతగినవనీ, తగనివనీ తలంపక అన్నీ చూశాం. ఎక్కడా ఆమె అలికిడి కనపడలేదు. పడ్డశ్రమంతా వ్యర్థమైంది. ఇంకేం చేద్దాం?" అని అడిగితే "అన్నా! నిరాశ పొందకు. తప్పక నా వదినను నీవు మరల పరిగ్రహిస్తావు. బలిచక్రవర్తినుండి వామనుడు భూమిని పరిగ్రహించలేదా? కాలం ఎప్పుడూ ఒకవిధంగానే వుంటుందా? ఎందుకో నా మనస్సు ఆమె మరణించలేదనీ, మళ్ళీ లభ్య మవుతుందనీ, మరిమరీ చెపుతూంది" అని సౌమిత్రి చెప్పాడు. "తమ్ముడా! వెతకవలసిన చోట్లన్నీ వెతకాం. ఏమిగిలిందేమని. అలివి కనుపించలేదు. ఇంకా నిరాశతో ఏం మిగిలేది" అంటూ రాముడు సోలుతూ, వాలుతూ, "హా సీతా! హా సీతా!" అంటూ నేలవ్రాలాడు. ఎన్నివిధాల తమ్ముడు చెప్పినా, మోహావిష్టుడై పుష్కరికలో రొమ్ముబాదుకుంటూ శోకించసాగాడు.

## ఉన్మాదివలె రాముడు సౌమిత్రివెంట సీతకై తిరుగుట

జానకీ! ఎన్నడైనా నన్నింత తీవ్రవేదనకు గురిచేశావా? ఎక్కడ దాగావు? ప్రాణం కంఠగతమవుతూంది. నీ వాక్యమధురాంబులతో నా దప్పిక తగ్గించు. "ఆశయాబద్ధతే లోకేకర్మణాబహుచింతయా" ఆశ లేకుండా నేనెక్కడ అన్వేషించగలను? ఐశ్వర్యంకంటే అనుకూలవతియైన ఇల్లాలు దొరకటం అదృష్టం అని కదా పెద్దలంటారు. ఆ అదృష్టం వుండికూడా అనుభవానికి దూరమైన నా భ్రమకేంమదు? కాల్పనా? నీకు పుష్పాలపై ప్రీతిమెండు. చక్కగా పూచిన అశోకవృక్షంచాటున దాగావు.

నిన్ను గుర్తించాను. ఇప్పుడే పట్టుకుంటాను. కాదు కాదు. పొరబడ్డాను. అక్కడ లేవు. కదళీతరువుల మాటున నిల్చి నా కనుకప్పావు. నీవు రంభోరువు కావటంచేత వెంటనే చూడలేకపోయాను. జాలిమాలిన లీలా వినోదం జానకీ! ఇంక చాలించు. నేనిక తాళలేను. కళ్యాణీ! ఇది నీకు కానిపని. దేనికైనా పరిమితి వుంటేనే బాగుంటుంది. నా మాట విను నాకు ప్రాణదానం చేయి. ఛీఛీ! ఎంత వెర్రివాడనవుతున్నాను! ఇప్పుడేకాదు, ఎప్పుడైనా నన్నింత క్రూరపరీక్షకు గురిచేసిందా? సంస్కృతి సభ్యతలు తెలిసిన జానకి జీవించివుంటే పర్ణశాలవిడిచి ఒంటిగా బయటకువెళ్ళుతుందా? అన్నా! లక్ష్మణా! మనం కొండలుప్రతిధ్వనించేలాగా కేకలుపెట్టి పిలుస్తుంటే ప్రాణంతో వుంటే బదులు పలకదా? ఆమె క్రూరరాక్షసుల దారుణకృత్యకు పాలైవుంటుంది. ఏ మాత్రం సంశయంలేదు. కన్నీరు కారుస్తూ, దిక్కులు చూస్తూ, మృగాలు సీత అసురులపాలై పడిందని చెప్తున్నై. నా పినతల్లి ఏం కోరి అడవికి పంపిందో అది నీ పోకతో సిద్ధించింది. నీవు లేకుండా అయోధ్యకు ఏ మొగం పెట్టుకునిపోయేది? నీవు లేని అంతఃపురంలో ఎలా కాలుపెట్టేది? ఇంక ఎవరికోసం జీవించేది? "అప్రయోజకుడు తన ఆలిని రక్షించుకోలేని అసమర్థుడు. ఏదైనా భయంకరారణ్యమధ్యంలో ధాన్యాన్ని ఒంటిగా వదలిపోగా తెలియని రాముడు చేసేదేమని" అని లోకం నిందిస్తుందా, "నేను దశరథ మహారాజుకు జ్యేష్ఠపుత్రుణ్ణి. తః అఖండసామ్రాజ్యానికి వారసుణ్ణి నేనే" అని చెప్పుకునే అర్హత ఇంకెక్కడ నాకుంది? కలంక చరిత్రులై, అమరినయశస్కులై, బల పరాక్రమసంపన్నులై అఖండధారాతలాన్ని పాలించిన వారి స్వచ్ఛచే ప్రతిభావంతమైన హేమసింహాసనంమీద, అదలను, అరిని కాపాడుకోలేని అతి దుర్బలుడు అధివసించి, మహామేధావులు, ధర్మకర్మపరినిష్ఠితులు, శక్తి సంపన్నులైన ప్రజలను పాలించే అవకాశంలేదు. అందుకు అన్నివిధాలా పరమభక్తాగ్రేసరుడు, త్యాగమూర్తి, తమ్ముడు ఒక్కడే తగినవాడు.

ఎంతో అల్లారుముద్దుగా చూచుచున్న జనకుడు నా అసమర్థతను అప్రయోజకతను చూడకముందే స్వర్గంచేరాడు. ఆయన జీవించివుంటే, లోకులాడే పలుగాకి మాటలకూ, అరవైవేల వత్సరాల వయోవృద్ధత్వంలో

అఖిల దేవతా ప్రీతికరంగా యజ్ఞంచేసి, అగ్నిభట్టారక వరప్రసాదంగా, కన్నవాడు ఇంత పనికిమాలినవాడైనాడనే బెంగకూ గురి అయ్యేవాడు. ఆయన సుకృతికర్మఫలాలు అపఖ్యాతి మోయకుండానే ఉత్తమ లోకవ్యాప్తి కలిగించినై. ఆయన అన్నివిధాలా అదృష్టవంతుడు. ఆయనకు తగిన పుత్రుణ్ణని అనిపించుకునే అవకాశం నాకు లేకుండాపోయింది. గడువు తీరగానే వస్తానని గంపంత ఆశతో ఎదురుచూస్తున్న మన తల్లులనూ, తమ్ములనూ, ఉపకృతి చేయలేకపోగా జీవితాంతం దుఃఖం కలిగించాను. "ఏమిరా నాయనా! కోడలు? ఎంత బాధపడిందో", అని తల్లులూ, "మహా గుణశీలసంపద కలిగింది కాబట్టే కారడవుల్లో ఉన్నా కనిపెట్టుకుండా వచ్చింది మా వదిన" అని తమ్ములూ, దీర్ఘకాల వనవాసానంతరం తిరిగి క్షేమంగా వచ్చారన్న సంతోషంతో, బహువిధ బహూకృతులుతెచ్చినాతుర్ని, అల్లుణ్ణి గౌరవించుదామనుకునే మామగారూ, అయ్యో! ఒంటరిగా వున్న నన్ను చూసి ఎంత క్షోభిస్తారో? అన్నపానాలు మాని. అయోధ్య వీడి. అడవికి మన వెంటవచ్చిన పౌరులు, రేపు మనం అయోధ్యకు పోగానే అంత అభిమానం, అంత ప్రేమా చూపుతారా? చూపకపోగా ఎంత చులకనగా చూస్తారో ఊహించు. తమ్ముడా! మీవదిన నాకెంత చిత్త సంక్షోభం తెచ్చిపెట్టింది! నా బ్రదుకెంత భారం చేసింది?

## రాముడు లక్ష్మణుని అయోధ్యకు పొమ్మనుట

నీవిక అయోధ్యకు పో. ఆయువు ఉంటే అన్న మాటప్రకారం అరణ్యవాసం పూర్తిచేస్తాను. లేకుంటే పితృవాక్యపాలనలో మరణించానన్న తృప్తైనా ఉంటుంది. మీ వదిన వుండికనుక ఆమె రక్షణకు నీ త్యాగం అవసరమైంది. ఆమె లేనప్పుడిక నీవు సంసారదూరుడవడం నా కోసం కావద్దు. నీవు పురంలోకి పోగానే తమ్ములిద్దరు నీ వద్దకువస్తారు. వారికి జరిగిన సంగతులుచెప్పి, "నాయనా! భరతా! ఇక నీవు పూనిన వ్రతనిష్ఠ వదలి, సింహాసనం స్వీకరించి మన పెద్దల కీర్తి ఇనుమడింపచేయుమని చెప్పు. గాఢపరిష్వంగం చేసి కుశలమడిగాననీ, మాతలకూ, మంత్రులకూ, మహర్షులకూ అభివాదం చేశాననీ చెప్పు. మన తల్లులకు,

మనపైకంటే సీతపై మమకారం ఎక్కువ. ఆమెకోసం ఎంతో ఆరాటపడతారు. నాకు మారుగా నీవు వారిని సముదాయించు. అన్నా వదినలేరీ అని అడిగితే విషయం వివరించు. సీత అన్వేషణకందలేదని చెప్పు. ఆమె వియోగం సహించలేక, అవమానం భరించలేక ఆత్మార్పణం చేసుకున్నాడు రాముడని చెప్పు. ఎంత యత్నించినా మనస్సు నిగ్రహించలేక పోతున్నాను. కాలం గడచినకొద్దీ గతకాలస్మృతులు కళ్ళకుకట్టి లోకం శూన్యంగా కనపడుతున్నది. చెప్పతగింది ఎంతో వున్నట్లు తోస్తుంది. చెప్పపోయేసరికి ఏమీ చెప్పలేక, చెప్పిందే చెపుతున్నానేమోయనిపిస్తుంది. "రాముడింత దుర్బలహృదయుడా? ఇంత స్త్రీవ్యామోహం కలవాడా? జితేంద్రియుడనీ, గంభీరుడనీ, శాంతప్రసన్నుడనీ అనుకున్నాం. కాని, అతిసామాన్యుడు కూడా పొందని చిత్త విక్షేపం పొందుతున్నా"డని అనుకునే అల్పజ్ఞ లోకానికి నా స్థితి అర్థంకాదు. వాళ్ళు నిన్ను ప్రశ్నిస్తే, నా మాటలుగా వారికి నీవు చెప్పు.

స్త్రీ పురుష మాత్రభేదంగా జరిగిన జీవసృష్టిలో జ్ఞానంకల మానవుడు తన్నుతాను నియమించుకున్నాడు. సృష్టికి ఒకక్రమం వున్నదని గుర్తించాడు. ఆ క్రమాన్ని పాటించే శక్తి, పరిహరించే యుక్తి రెండూ తనకున్నవని గ్రహించాడు. క్రమాన్ని పాటించటం వల్లా, అతిక్రమించటం వల్లా కలిగే పరిణామాలను పరిశీలించి, పరిశోధించాడు. తాను తనకొరకే కాదనీ, లోకం కొరకనీ, తన కర్మంతా లోకకల్యాణం కొరకేకాని కేవలం స్వార్థంకోసం కాదనీ తెలుసుకున్నాడు. తాను తెలుసుకున్న పరిజ్ఞానం లోకానికి విశదం చేశాడు. విధినియమ నిబంధనలతో అన్యోన్య జీవితాలను ముడివేశాడు. ఆ ముడే, వావివరుసలు. ఉచ్చనీచాలు. పాపపుణ్యాలు. కలిమిలేములు. సుఖదుఃఖాలు మొదలైనవాటి రూపంలో వ్యవహారలోకంలో ప్రకటితమవుతూంది. అందుకే బాహ్యజగత్తు ద్వంద్వభూయిష్ఠం. అంతర్లోకం ఏకత్వం కలది. ఆ రహస్యం చెప్పటానికే పెద్దలు "ఏకమేవాద్వితీయమ్" అన్నారు. నేను సనాతన సంప్రదాయాన్ని చిత్తశుద్ధితో పాటిస్తున్నాను. నేను మానవుడుగా పుట్టాను. పుట్టంగానే వంశం సంప్రదాయాలననుసరించి నన్ను పెంచారు. నాకు విద్యాబుద్ధులు నేర్పారు.

వివాహం చేశారు. ఇప్పుడు నేను స్వేచ్ఛగా నిర్ణయించుకోగల అధికారాన్ని పొందివున్నాను. నాకు తెలిసినంతలో సుఖదుఃఖాల స్వరూపం వేరుగావుంది. మానవులు అనేక సమయాల్లో ఏడుస్తూ వుంటారు. తల్లిదండ్రులు మరణించినప్పుడూ, సోదరులు చచ్చినప్పుడూ, అక్కచెల్లెళ్ళు గతించినప్పుడూ, ఇంకా ఇతర కార్యాలను పురస్కరించుకుని కూడా ఏడుస్తారు. ఈ ఏడ్పుల్లో విలక్షణమైన భేదం ఎంతో వుంది. అది సూక్ష్మదర్శనం గలవారికి త్వరగా తెలుస్తుంది. తలిదండ్రులకోసం ఏడ్చినంత, తమ్ములకోసం, అక్కచెల్లెళ్ళకోసం ఏడ్వం. కొడుకుకోసం ఏడ్చినంత మనుమలూ, మనుమరాళ్ళకోసం ఏడ్వం. ఏస్థితిలోనైనా తనమేలు కోరేవారు తలిదండ్రులు. తనకష్టం చూచి తపించి తమ్ము త్యాగం చేసుకునేవారు తలిదండ్రులు. అందుచేత అధికంగానూ, మనస్ఫూర్తిగానూ ఏడుస్తాం. తక్కినవారు తక్కిన లోకంతో సంబంధం కలవాళ్ళు కావటంచేత, వారి ఉపయోగానుపయోగాల మీద ఆధారపడి ఏడుస్తాం. తర్వాత కొడుకునుగూర్చి కూడా గొప్పగానే ఏడుస్తాం ఆస్తికుడైతే తనకింత కర్మ చేస్తాడనీ, వృద్ధాప్యంలో పోషిస్తాడనీ, తానూ, భార్యా కలిసి సేవచేస్తారనీ. ఇక భార్యాభర్తల విషయం చెపుతా విను.

విధినిషేధరీత్యా ఏర్పాటైన సంఘ వ్యవస్థతో, ఆర్ష ధర్మానుసారంగా ఈ వ్యక్తుల స్థానాన్నిమించిన స్థానం మరొకటిలేదు. ధరించబడే భార్యకానీ, ధరించే భర్తకానీ భాగస్వామ్యం సమానంగా కలవారు. స్త్రీ పురుష స్వేచ్ఛా సమాగమం మానవసంఘంలో నిషేధం. ఈ ఇరువురి కూడిక లేక సృష్టి లేదు. ఈ కూడిక విధిరూపంగా నియమింపబడ్డది. ఈ విధి నియమాలలో ఎంతో విజ్ఞానం వుంది. భర్త చనిపోతే భార్య జీవితం వ్యర్థం. ఆమె శరీర ధర్మాచరణలో అంతరాయం ఏర్పడుతుంది. మరొక ఆలంబనం ఆమెకు నిషేధం. ఇక భార్యపోతే భర్త జీవితం వ్యర్థ శబ్ద దశగుణితం. శరీర బాహ్యకర్మలకేగాని శాస్త్ర విహిత కర్మలకు అధికారంలేదు. శాస్త్ర విహిత కర్మలు లేకపోతే మనోనైర్మల్యం కానీ, జ్ఞానవృద్ధి కానీ, ఇంద్రియ సంయమం కానీ లభించవు. శ్రుతి, పురుషునకు వేరొక ఆలంబనం విధించింది. ఆ విధించటంలో ఎన్నో నిషేధాలు చెప్పింది. ఈ చెప్పటం కూడా పక్షపాత

దృష్టికాక లోకక్షేమంకోసమే చెప్పింది. అగ్నిసాక్షిగా వివాహకాలంలో "సత్యంవద, ధర్మంచర, నాతిచరామి" అని పాణిగ్రహించిన భర్త భార్య మరణానంతరం పునర్భార్యాగ్రహణం చేయటం నాకు ప్రీతికాదు, ఏదో ఆపద్ధర్మంగా చెప్పిన అధమపక్షాన్ని ఉత్తమంగా గ్రహించే ఉద్యుక్తుడుగాడీ రాముడు. భార్యాభర్తల సంబంధం జీవబ్రహ్మైక్య సంధానం వంటిది. ఆ బంధం అభేద్యం. అద్వైతం.

ఈ విధంగా చూసే నా దృష్టిలో ఏడ్వవలసి వస్తే భార్యకోసం. భర్త, భర్తకోసం భార్య ఏడ్వాలి. ఆ ఏడుపుకి ఎంత ఏడ్చినా చాలదు. ఇహలోకంలో అంతకంటె ఏడ్వదగిన వస్తువు ఇంకోటిలేదు కాబట్టి నేను. భరతునికి సమయానుకూలం చెప్పి రాజ్య పరిగ్రహణం చేస్తానని మాట ఇచ్చాను. ప్రతిమాలదైవం అనుకుంటే. భార్యతోకూడి ప్రజాపాలనం చేయవలసివస్తే. పౌరులు నన్ను అపార్థంగా గ్రహిస్తారు. నియమాతిక్రమణంతో సీతను బోధించే సీమల జాబితాలో చేరే దౌర్భాగ్యదశ రాముడు కోరడు. అనుకున్నది ఆచరిస్తాను. ఆచరించింది అనుభవిస్తాను. అంతే. ఆ స్ఫూర్తి జానకిలో ఉంది. సతీత్వం జానకి అంటే అత్యుక్తికాదు. అటు వంటి అర్ధాంగి అపహృత అయిందో. అపహరించబడిందో తెలియనప్పుడు ఏడుపుకాక ఇంకేముంటుంది? నేను మానవమాత్రుడినుంచి, దైవత్వానికి అధిగమించ దలచేవాణ్ణికాని మహర్షులవలె దూరదృష్టి. దివ్యశక్తి కలవాడను కాను. అందుకే ఏడుస్తున్నాను. నాకోసం ఏడవక. మీ వదినకోసం మీరు ఏడ్వండి" అని. ఆ పలుకులు విన్న లక్ష్మణుడుకూడ కర్తవ్యతామూఢుడై కలతపడసాగాడు.

తమ్ముడా. తగిలిన పుండుకే మళ్ళీ దెబ్బ తగిలిందన్నట్లు, వంశ పారంగా రాదగిన రాజ్యనాశనం, హితాప్తవియోగం, జనకమరణం, తల్లిని పాయటం, తమ్ముల ప్రేమకు దూరం కావటం నాకు ప్రాప్తించింది. ఇందులో ఒక్కటి చాలు దుఃఖం పొందటానికి. అన్నీ నాకే వచ్చినై. అవన్నీ ఆమె సాహచర్యంలో విస్మరించాను. ఇప్పుడామె లేకపోవటంతో అన్నీ నాపై తిరుగుబాటుచేసి అవకుడ్డి చేస్తున్నై. నాకు లోకమంతా జానకీ మయంగా కనుపిస్తూంది. అదుగో నా జానకి. ఎవడో దుష్టరాక్షసుడు

అపహరించుకునిపోతుంటే వీణానాదంవంటి కంఠస్వరం వికృతధ్వనిగా మారేట్లు ఏడుస్తూంది. ఆ మృదు మధురాలాపాలు వీనులు ఇంకా వింటున్నై. మేచక కేశ ధార రుచిరంగా వున్న వదనం రాహుగ్రస్త చంద్రబింబంలా శోభాహీనంగా కన్నులు చూస్తున్నై. నిర్దయులైన అసురులు పరమ కుసుమ పేశలమైన ఆమె శరీరాన్ని ముక్కలుముక్కలుగా ఖండించి తినివుంటారు. పవిత్రమైన ఆమెరక్తం పానంచేసి వుంటారు. ఇదిగో గోదావరి. ఇక్కడికి పద్మాలకోసం నాతో వచ్చేది. ఈ తిన్నెపై నిల్చి ప్రకృతిశోభను చూస్తూ పరవశించేది. అంతఃపురాల్లో అనేక సుఖాలను అనుభవించిన ఆమెతో వనవాస క్లేశభావం ఎంతవెదకినా కనుపించేదికాదు.

సూర్యదేవా! నీకు మ్రొక్కుతాను. నీవు లోకచక్షువవు. నీవు చొరరాని చోటుకానీ, నీవు చూడనిచోటు కానీ, లేదు. ఎందరికన్ను కప్పినా నీ కన్ను కప్పటం, ఎవరికీ సాధ్యంకాదు. నా ఆరవప్రాణం, అర్ధాంగి, సీత ఏమైంది? చెప్పు. నేను నీ వంశంవాణ్ణి. నిన్నారాధించేవాణ్ణి. నాపై దయవుంచి చెప్పు. వాయుదేవా! నీవు అంతర్బహిశ్చరుడవు. నీకు తెలియకుండా వుండదు. నీవైనా దిక్కులేని రామునిపై జాలి వహించి జనకజ వార్త చెప్పు. ఆమె జీవించివుందా? మరణించిందా?" అని అంతం లేకుండా, అడుగడు ఆక్రోశిస్తూ, ప్రలాపిస్తుంటే, సౌమిత్రి "అన్నా! శోకం మాను. శోకించి చేయగలిగింది మాత్రం ఏముంది? నీవంటి ప్రజ్ఞావంతులే కర్తవ్య దూరులైతే సామాన్యులేంచేస్తారు? ఓదార్పుకోసం కాదన్నా నా మనస్సు మాత్రం ఆమె మరణించలేదని మాటిమాటికీ హెచ్చరిస్తూంది. మాయామృగ రూపంతో వదినకు భ్రమ కల్పించారంటే ఆమెను అపహరించటానికి చేసిన ప్రయత్నమే అని తోస్తుంది. మనం నిరాశపడకుండా వెదకుదాం. ఆమె జాడ తప్పక తెలుస్తుంది." అని ఎంత చెప్పినా వినక, రాముడు "సౌమిత్రీ! నేను నడువలేకున్నాను. నీవు గోదావరి నదికి పోయి వెదకిరా. ఆమె పద్మప్రియ కావటంచేత వికసిత పద్మాలకోసం రావచ్చు" అని ఆదేశించాడు.

లక్ష్మణుడు అన్న చెప్పిన ప్రకారం గౌతమీ తటానికి పోయి పరిసరాలన్నీ వెదకి, పెద్దగా పిల్చి, సమాధానం లేక, మరలివచ్చి. "చూడ

తగిన చోట్లన్నీ చూచివచ్చాను. కేకవేసి పిల్చాను. కాని ప్రయోజనం లేక పోయింది" అని అన్నకు చెప్పాడు. రాముడు "తల్లీ! గోదావరీ! సీత నీ సమీపానికి వచ్చిందా? నీవంటే ఆమెకు ఎంతో ఆనందం. నీ జలం పానం చేయాలనీ, నీలో స్నానం చేయాలనీ, నీ పద్మాలు ధరించాలనీ, ఎప్పుడూ ఉవ్విళ్ళూరుతుంటుంది. అవకాశంవస్తే నీతీరంలో నిల్చి, నీ సౌందర్యాన్ని మనసారా ప్రస్తుతిస్తూంటుంది. చెప్పుతల్లీ! చెప్పు" మని దీనాతిదీనుడై నదికి అభిముఖంగా నిల్చి అర్థించాడు. ఆ ప్రార్థన విన్న భూతకోటి చెప్పుమని ఎంత వత్తిడి చేసినా, రావణుని భయంతో నది మాటాడక మౌనం వహించింది. రాముడు నిట్టూర్చి "ఈ నదికూడ నా ప్రార్థన మన్నించలేదు. లక్ష్మణా! నాకూతురేమైందని అడిగితే మామగారికేం సమాధానం చెపుతాను! కోడలేదన్న తల్లిని ఏవిధంగా సమాధాన పరుస్తాను? ఆదరించే బంధువులులేక, అర్ధాంగిలేక శోకంతో జాగరం చేసే నాపట్ల యామవతులు బహూగా యామవతులుకావా? తమ్ముడా! ఇకనీవు అయోధ్యకుపో. మనకున్న ఋణానుబంధం నేటితో తీరింది. పూజ్యులందరికీ నా నమస్కారాలని చెప్పు. చిరంజీవులందరికీ ఆశీస్సులనిచెప్పు. అంతకంతకు సమిధలు వేసినకొద్దీ మండే మంటవలె సీతావియోగాగ్ని నన్ను దహించి వేస్తూంది. నాకై నీవు చేసిన త్యాగం ఈ జన్మలో నేకాదు, ఏజన్మలోనైనా తీర్చ దగింది కాదు. ఇక నీవు అయోధ్యకుపో" అనిచెప్పి ఆవేదన అధికంగా మూర్ఛిల్లాడు.

## అడవి మృగాలు రామునకు సీత పోబడి సూచించుట

అన్న పాటుకు సౌమిత్రి అదరిపడ్డాడు. తన ప్రయత్నం ఫలించలేదని తహతహపొందాడు. ఏవిధంగా అన్న స్వస్థుడవుతాడని యోచించాడు. దండకకు పంపేటప్పుడు, గంగ దాటినప్పుడు తల్లి తనకిచ్చిన వరం స్ఫురణకు వచ్చింది. రాగానే తల్లిని మనస్సులో స్మరించాడు. ఆమె మనోగోచరంకాగానే తన కర్తవ్యం ఏమిటో తెలుసుకున్నాడు. "భయపడకు నాయనా! అన్న కర్తవ్యోన్ముఖుడు కాబోతున్నాడు. ఆందోళన పడవలసిన

అవసరంలేదు. నీవు అన్న వుపశమనం కోసం చెప్పినవన్నీ సత్యాలే. అదే జరిగింది అన్నకు స్పృహ వస్తూంది. అన్నీ సవ్యంగానే జరుగుతై" అని బోధించి అంతర్థానమైంది. సమాశ్వాసంపొందిన సౌమిత్రి వుప చారాలకు రాముడు తేరుకున్నాడు. తమ్ముఁడందించిన జలం త్రాగి దాహం తీర్చుకున్నాడు. స్తిమితపడి ముందుకు చూచాడు. తమ్ముణ్ణి పిల్చాడు.

"తమ్ముడా ! అటుచూడు. మృగాలు మందగాచేరి మాటిమాటికీ నావంక చూచి ఏమో చెప్పబోతున్నట్లు సైగలు చేసుకుంటున్నై. మీ వదిన జాడ వీటికి తెలుసునేమో. లేకపోతే అవి ఎందుకు అలాచూస్తై ! ఓ మృగాల్లారా ! నాబాధ చూడలేక జాలి చూపులు చూస్తున్నారు. ఏదో చెప్ప బోతున్నట్లు సైగలు చేస్తున్నారు. మిమ్ముల ప్రేమతో చూచి, మీతో కలసి మెలసి, మీకు మంచి ఫలాలు తినిపించి ఆనందించే సీతజాడ తెలిపి మీరైనా పుణ్యం కట్టుకోండి" అని కన్నీరు కారుస్తూ, గాద్గద్యంతో అడిగాడు. వెంటనే అవి అన్నీ లేచి దక్షిణ ముఖాలై మోరలెత్తి ఆకసం చూపుతూ, భూమ్యాదిశగా, రామలక్ష్మణుల మొగాలు చూస్తూ పరువులు తీసినై. వాటి ఇంగితం గ్రహించిన లక్ష్మణుడు, "అన్నా ! నీ ప్రశ్నకు మృగాలు శుభసూచకంగా, నిన్నూ, ఆకాశాన్నీ, భూమినీ చూపిస్తూ, నైఋతిదిశగా పరుగెత్తుతున్నై. దీన్ని బట్టిచూస్తే, మనం ఆ దిక్కుగాపోతే ఆమె జాడ తెలియవచ్చు. లేకపోతే అన్ని మృగాలూ అవైపే ఎందుకుపోతై ! ఇకనీవు విచారం వదలి జంతువులు పోతున్న దిశగా పోదాంరా" అన్నాడు. ఆ మాటలు రామునకు అమృతోపమానాలయినై. తత్ క్షణం కోదండాన్ని ధరించి అనుగత లక్ష్మణుడై అరిగాడు. కొంత దూరం పోయేసరికి దారిలో తలలో ముడిచిన పూలరాలి వుంటం చూచారు. ఆ పూలను చూడగానే రామునకు శోకంపొంగి వచ్చింది.

"తమ్ముడా ! మృగసంకేతాన్ని గుర్తించి ఈ దారివెంట రావ తెచ్చిన ఫలం కొంత కనుపించింది. ఇవి నేను కోసి మీ వదిన కిచ్చిన పూలు. ఆమె వేణిలో ముచ్చటగా ముడుచుకున్నది. పర్ణశాలనుంచి ఇంత దూరం ఎలా వచ్చింది? ఎవరు తెచ్చారు? ఈ ఈపూలు రాలటానికి

కారణం ఏమిటి ? ఏది ఏమైనా జానకి మరణించలేదని తోస్తూంది. కన్న బిడ్డపై కనికారంతో భూమీ, తన వంశంవారనైన నాపై జాలితో సూర్యుడూ ఆమెను రక్షించి వుంటారు. ఇంకా ముందుకు పోయి వెదుకుదాం. ఈ ప్రస్రవణగిరికి తప్పక తెలిసి వుంటుంది. ఆ మృగాలవలెనే ఈపర్వతం జాడ తెలుపుతుందేమో. నా అదృష్టం మంచిదైతే గిరిరాజుకు సద్భావం కలుగవచ్చు" అని చెప్పి. దైన్య భావంతో పర్వతానికి అంజలిచేసి -ఓ క్షితిభృన్నాధా ! అచల, సర్వాంగ సుందరి. మనోహరమైన ఈ వనంలో చూడబడియెనా సీత నీచేత ? విడువబడుట నాచేత, ఒంటి నడయాడుచుండ ఇచ్చట ? అని ప్రార్థనా పూర్వకంగా ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా ఆ పర్వతరాజు ప్రతిధ్వని చూపంగా.

"ఓక్షితిభృన్నాథా! అచల. సర్వాంగ సుందరి. మనోహరమైన ఈ వనంలో చూడబడియె: (నా + ఆ సీత) నా సీతనీ చేత విడువబడుట నా చేత. ఒంటి నడయాడుచుండ ఇచ్చట," అని చెప్పాడు. తానన్నమాటలే తిరిగి వినపడటంతో రాముడు కోపించి ఓయీ! పర్వతరాజా! మంచిగా అడుగుతున్నా. నా సీతను నాకు అప్పగించు. లేదా జాడైనా చెప్పు. చెప్పక పోతే నిన్ను నా శరజాలంతో సమూలంగా రూపుమాపుతా. తమ్ముడా! గోదావరికూడ నా ప్రార్థన మన్నించలేదు. ఆ నదిలో ఒక్క నీటిబొట్టు కూడా లేకుండా నాబాణాలతో పీల్చేస్తాను" అని క్రోధోద్రిక్త మానసుడై, ధనువును చేత ధరించాడు. ధరించి పర్వతంవైపు దృష్టి సారించి, శరాన్ని సంధానం చేయబోతుండగా సమీప ప్రదేశంలో నేల నలిగి కొన్ని పాద చిహ్నాలు కనుపించినై.

## రాముడు జానకి ఆభరణాలను నేలపై చూచుట

వెంటనే తమ్ముణ్ణి వెంట బెట్టుకుని ఆ చోటికి చేరాడు. ఆ నేలంతా కాలి గుర్తులు స్ఫుటంగా కనుపిస్తున్నై. కొన్ని చిన్న పాదముద్రలూ, మరి కొన్ని పాదముద్రలు పెద్దవీ వెంటవెంటవున్నై. రాముడు ఆ పాదముద్రలను నిదానంగా పరిశీలించుతూ పోతుండగా, విరిగిన ధనుస్సూ, ముక్కలైన రథం, జారిపడిన అంబులపొదీ కానవచ్చినై. అవన్నీ చూచిన రాముడు ఆవేశంతో,

అనుజునకు చూపిస్తూ, "తమ్ముడా! ఈ అడుగులు మీ వదినవి. ఈ పెద్దపాదాలు రాక్షసుడివి. త్రుటిత ధనూరథతూణీరాలు ఎవరివో తెలియటం లేదు. ఈ పూల సరాలూ, ఈ బంగారు నగలూ జానకి ధరించినవే. కంఠం తెగి రాలిన పగడాలవలె కనుపిస్తున్న నెత్తురు బొట్లు సీతను ఖండించి నప్పుడు కారి పడి వుంటై. ఈ భయంకర కార్యం ఒక్కడు చేసినట్లు తోచటం లేదు. జానకికై ఇద్దరు బలవంతులైన రక్కసులు పోరివుంటారు. అందులో ఒకడు జయించి నా సీతను కబళించి వుంటాడు. లేకపోతే రథం, చాపం, పొది ఇక్కడ ఎందుకు పడివుంటై? ఆ గెలిచినవాడే సీతను వెన్నాడి వుంటాడు. అందుకే చిరుపాదాల వెనుక పెద్ద పాదాల గురుతులున్నై. ఈ రథాన్ని చూచినా, ఈ మణిమౌక్తికఖచితమైన ధనువును చూచినా, ఆ రక్కసుడెవడో సామాన్యుడు కాదని తోస్తుంది. తునియలైన ఈ కవచంచూడు. ఆ మూర్తి ఎంత వున్నత మైందో, ఎంత బలిష్ఠ మైందో తెలుస్తుంది. ఇంతే కాదు. ఇటుచూడు. తరుణారుణార్కసన్నిభమై, తపనీయ దండ సంఘటితమై వెలుగులు చిమ్మే శ్వేతచ్ఛత్రం, చిరిగి విరిగి పడివుంది. బంగరు తనుత్రాణాలతో, భీమాకృతులతో, బలిసిన తనువులతో, భీష్మ పిశాచాస్యాలతో వున్న ఈ ఖరాలు చచ్చిపడివున్నై. ధూమకేతువులాగా వున్న కేతనం రూపుమాసింది. మొనలు మాత్రమే విరిగి కుప్పలు కుప్పలుగా కూలిన అస్త్రశస్త్రాలు కొండల్లాగా గోచరిస్తున్నై. వింటిలో బాణం వింటిలోనే విరిగింది. ఎడమ చేతిలో పగ్గాలూ, కుడిచేతిలో పెలగోలా దాల్చి రథం తోలుతున్నవాడు తోలుతున్నట్లే సారథి చచ్చివున్నాడు. కర్ణాభరణాలుగా కుండలాలు ధరించి, తలపై పాగా, చేతిలో చామరాలూ గల ఇద్దరు పరిచారకులు నేలకూలారు.

ఇది సామాన్యుల నడుమ జరిగిన సమరంకాదు. ఈ విచ్ఛిన్నమైన వస్తువులను చూస్తే, తేజోబల పరాక్రమాలతో చెప్పతగినవారనే భావం స్ఫురిస్తుంది. ఇంత భీకరయుద్ధం జరిగి, ఇన్ని విలువగల పరికరాలు నాశనమైనా, పోరినవారిలో ఏ ఒక్కరూ మృతుడైనట్లు కనబడదు. పోరిన వారిలో ఒకడు రథికుడు. రెండోవాడు పదాతియో, మరేదైనా వాహనం కలవాడో తెలియటంలేదు. రథహీనుడై, భగ్నచాపుడైనవాడు ప్రాణభీతితో

పారిపోతే, జయించినవాడు సీతను హరించి వుంటాడు. తప్పకుండా సీత రాక్షసులచేత అపహృత అయినట్లు రూఢి అయింది. దారిచూపి మృగాలు మహోపకారం చేస్తే, దానవులు దొంగలై నాకపకారం చేశారు.

## రాముడు దేవతలపై కోపించి జగత్సంహారం చేయబూనుట

ఇదమిత్థంగా తెలియక ఇంతవరకు నా కర్మను నేను నిందించుకున్నాను. ఇప్పుడు స్పష్టంగా రక్కసులచేత అపహరింపబడిందని తెలిసింది. ఇక జీవితాంతం దనుజాళితో నాకు విడరాని వైరం సంప్రాప్తమైంది. హృతయైనా, మృతయైనా, భక్షిత అయినా రాక్షసుల చేతికి సీత చిక్కింది. అధర్మ సంచారులచేత ధర్మ కర్మలు బాధింపబడుతుంటే ధర్మదేవత ఏమయినట్లు? ఏ దేవతల ప్రీతికై ఎల్లప్పుడు విధివిహిత కర్మలు చేస్తున్నానో, ఆ దేవతలు నాకింత అపకారం జరిగితే పట్టనట్లు క్షేమంగా తిరుగుతున్నారు. సృష్టిస్థితిలయాలు చేయగలిగిన శక్తివుంది. కరుణాస్వభావంతో సాధువైనవాణ్ణి దుర్బలుడుగా, మతిహీనుడుగా జ్ఞానంలేనిలోకం చూస్తుంది. లోక క్షేమంకోసం, శాంత్యహింసలతో జీవించే పురుషుణ్ణి షండుడని సంఘం త్రోసివేస్తుంది. సోదరా! నా కథ ఇప్పుడిలాగే వుంది. కుడితే తేలూ, కుట్టకుంటే కుమ్మరిపురుగూ. ఏ విధంగానూ లోకం సత్యదర్శనం చేయదు. "యద్భావం తద్భవతి." తన భావంతోనే పరుల భావాన్ని కొలుస్తారు. నాలో వున్న సద్గుణాలన్నీ దోషాలుగా పరిగణింపబడినై. ఇంక ఈ అసురఘాతిగణం ఎట్టిపాటు పడుతుందో ఇప్పుడే చూస్తాను.

కలకలమంటూ పొద్దుపొడిచి చంద్రుని వెలుగును దోచుకున్నట్లు, నాలోని కోమలగుణాలను తుడిచివేసి కరుకుతనంతో ప్రకాశిస్తాను. రాక్షస పిశాచకోట్లుగానీ, యక్షగంధర్వదేవతాసమూహంగానీ, మానవలోకంగానీ ఇంక ఒక్కక్షణంకూడా సుఖంగా వుండలేరు. హతమనుష్యపావక ప్రభమై, నిర్మథితాద్రిశిఖరమై, గతిరహితగ్రహమై, నష్టనిశాకరదీప్తమై, శోషిత జలరాశిసప్తకమై, ఛిన్నలతాద్రుమగుల్మమై, ఈ జగత్తు [illegible] లాగా నానేర్చిన దివ్యాస్త్ర సందోహాన్ని ప్రయోగిస్తాను. ఈ దివ్యాస్త్రంతో ఆకాశాన్ని ఛేదిస్తాను. దీనితో [illegible]. దీనితో జగత్ప్రళయం

చేస్తాను. రాముడు దిక్కులేనివాడో, శక్తిలేనివాడో, ఇంద్రియలంపటుడో, ఇంద్రియవిజితో, సత్యపరాక్రముడో, దుర్బలుడో, వ్యర్థుడో, సార్థకజన్ముడో ఒక్కసారి లోకం తెలుసుకుంటుంది. చెక్కుచెదరకుండా నా జీవితేశ్వరిని తెచ్చి నాకు అర్పించి, చేసిన తప్పుకు శరణాగతి పొందితే సరి లేకపోతే ఈ సృష్టికి ఈనాటితో ఆయువు సరి. లక్ష్మణా! నిగ్రహాన్ని అధిగమించి ఆగ్రహం పెరుగుతూంది. అతలకుతలంగా, అల్లకల్లోలంగా పంచబంగాళంగా, బీడుగా, బగ్గుం పాడుగా చతుర్దశభువనాలు చెల్లాచెదరై పోతవి. మర్యాదాసహితంగా సృష్టించిన బ్రహ్మసృష్టి అమర్యాదమై, అరూపమై, నాశన సముద్రంలో, సొక్కి, సోలి, వ్రాలి, తూలి మునుగుతుంది.

నా కపకారం చేసిన రాక్షసులూ, ఉపకారం పొంది నిర్లిప్తులుగా వున్న దేవతలూ, అస్మత్ప్రయోగశిలీముఖనికృత్తులై ఏమవుతారో చూడు. నేను-నేను జగత్క్షేమంకోసమే కాని, జగత్క్షోభం కోసం ఎన్నడూ అస్త్రధారణం చేయలేదు. నాభార్యకే దిక్కులేకపోతే, సామాన్యుల ఇల్లాండ్రకు రక్షణ ఎక్కడ? నేను జీవించివుండగా ధర్మహాని జరుగుటకు వీలులేదు. "స్వయం తీర్త్వా పరాం తారయతి" నన్ను నేనే వుద్ధరించుకోలేకపోతే ప్రజలనేమి వుద్ధరిస్తాను? ధర్మరక్షణకోసం దండం ధరించవలసిన నేను దైన్యాన్ని పొందితే లోకం గర్హిస్తుంది. మానవుడు శ్రుతిహితమైన సత్కర్మాచరణపరాయణుడు కావాలె. తత్కర్మాధిష్ఠానదేవతలు కాపాడాలె. నా విధి నేను ఇంతవరకు లోపంలేకుండా నిర్వర్తించాను. దేవతలు రాకూడని వ్యతిరేకఫలం నాకు ప్రసాదించారు. ప్రభువుగా నేను వారిని శాసించాలె. లేకపోతే సనాతనధర్మం కూలిపోతుంది. నా సీత నాకు ఎలా అప్పగించరో నేను చూస్తాను" అని, గుణవంతుడూ, వీర్యవంతుడూ, ధర్మజ్ఞుడూ, కృతజ్ఞుడూ, సత్యవాదీ, దృఢవ్రతుడూ అయిన రాముడు కోదండానికి గుణం తగిలించి, దివ్యాస్త్రాన్ని తొడిగి, ప్రళయాగ్నిలాగా ప్రకాశిస్తూ, "ఓ సర్వభూత సమూహమా! నా సహధర్మచారిణి సీతను నా కప్పగించు. నా కోరిక ధిక్కరిస్తే, "జరామరణాలూ, కాలం, అదృష్టం ఏవిధంగా అనివార్యాలో, నాకోపంగూడా అలాగే అనివార్యం"

అవి తెలిసి ప్రవర్తించటం మంచిది" అంటూ సమాధానం కోసం ప్రతీక్షిస్తున్నాడు.

ప్రళయసమయంలో ఫాలనేత్రాన్ని తెరచిన పరమేశ్వరుడిలాగా దుర్నిరీక్ష్యంగా వున్నవాణ్ణి, ఎన్నడూ కోపించి ఎరుగనివాణ్ణి, సీతావియోగ దుఃఖ కర్శిత తప్యమానుడైనవాణ్ణి, వుష్ణనిశ్వాసములు మాటిమాటికీ వదలుతున్నవాణ్ణి, లోకాలను నిర్దగ్ధంచేయటానికి నిశ్చయుడైనవాణ్ణి, అన్నను చూచి సౌమిత్రి పెదవులు ఎండిపోగా, ముఖం వెలవెల పారగా, కాళ్లు తడబడుతుండగా "అన్నా! ఆగ్రహం పరిత్యజించు. లోకాన్ని అనుగ్రహించు. సర్వభూతహితరతుడవు. శాంతహృదయుడవు. మృదుమధుర భాషణుడవు. నీకు కోపం నైజగుణం కాదు. చంద్రుడిలో లక్ష్మి, సూర్యునిలో ప్రభ, ధాత్రిలో ఓర్పు, సదాగతిలో (వాయువు) సదాగతిత్వం ఎలా స్థిరములో అలాగే ఇవన్నీ కీర్తితో కూడి నీలో సుస్థిరాలు. ఇటువంటి నీవు లోకాన్ని హాపటి పెట్టటం తగదు. తల్లే బిడ్డలకు విషం పెట్టతలిస్తే, కల్లా, నిజం తెలుసుకోకుండా రాజశేఖరులు ప్రజలను విధిస్తే, భర్తే భార్యను ఏలుకోకుండే, కంచే చేనుమేస్తే ఇంక గతేమిటి?

శాంతంతో విషయ పరిశీలనం చేయి. ఇప్పుడు మనం చూచిన యుద్ధపరికరాలన్నీ ఒక్కడివే అయివుంటవి. అందుకు సందేహం లేదు. ఈ రథికుణ్ణి ఈ విధంగా హింసించిన వాడెవడో ఎవరు తప్పక వుండి వుండాలె విరిగిన బాణాలన్నీ ఒకరివిగానే కనబడుతున్నై. ఇతనితో పోరినవాడు దేహబలం తప్ప ఇతర ఎలంటేసహాయాలు లేకుండా పోస్తున్నాడు. సైన్యం పోరాడిన చిహ్నం కనబడదు. ఏది ఏమైనా ఈ అపరాధం జరిగింది ఒక్కడివల్లనే. ఒక్కడు అపరాధం ఆచరిస్తే, అతడెవడో తెలుసుకుని దండించాలిగాని, లోకక్షయం చేయటం ఏం ధర్మం? రాజులైనవారు దండధరులైనా శాంతిప్రియులు కావాలె. ఇది లోక సామాన్యమైన నీతి. ఇది నీపట్ల సహస్ర గుణితం కావాలె. సకలభూతశరణ్యుడవు నీవు. సత్యధర్మస్వరూపుడవగు నీవు. దిక్కులకెల్ల దిక్కైన నీవు ప్రతీకారవాంఛ ధర్మాతిరేకంగా కలిగితే దేవతలు ఏం చేస్తారు? భూతగణం ఏం చేస్తుంది? రాక్షసవర్గం ప్రతిఘటించి బ్రతుకుతుందా? అదిగాక సురలు, భూతాలు,

గిరులూ, నదీనదాలు, నీపట్ల ఎన్నడూ విప్రియం చేయవు. దీక్షితునిపట్ల ఋత్విజులు ఏ విధంగా ఉపకారం చేయరో ఆ విధంగా వారు ఉపకారం చేయరు. ధనుర్ధారులమై, కొండలనక, కోనలనక వెతుకుదాం. తాపసుల నడిగి ప్రార్థించుదాం. అవసరమైతే అన్ని లోకాలు గాలించుదాం. నా హృదయంగానీ, కనిపిస్తున్న శకునాలు గానీ, వదినకు ప్రాణభయంలేదని చెపుతున్నై. ఎందుకంటే: కామార్తుడై వచ్చినవాడు ఆమెను ఆహారంగా కొనటానికి రాడు ఆ పని అసురరాక్షసులు చేస్తారు. ఆమెను అపహరించి ఆ వియోగ బాధతో జీవితాంతం క్రుంగిపోయేట్లు నిన్ను చేయటమే ప్రత్యర్థి వూహ కావచ్చు లేక దుష్టకామమోహితుడై కాని పని చేయవచ్చు అంతే కాని ఆమె ఆయుర్దాయమాత్రం హరించడు. జగన్నాయకుడవైన నీవు తప్పక ఏ నాటికైనా అపహారిని దండించి తప్పక పరిగ్రహిస్తావనే ఆశకొద్ది ఆమెను ఆత్మహత్య చేసుకోనీయదు.

"మన వంశానితో వంశోద్ధరణ జరగాలని ఎంతో శ్రమించి అలౌకిక ప్రక్రియతో సంతతిపొంది. అందులో నీ మీద సర్వలక్ష్యాలను సంధించి. "మరణ సమయంలో నిన్నే స్మరిస్తూ తండ్రి దేవలోకాన్ని పొందా"డని ఎమ్ముడు ధరణి చెప్పలేదా? నీవు అధమంగా చింతించవద్దు. నీకేమైనా కీడు జరిగితే ఇక్ష్వాకుల కీర్తిప్రతిష్ఠలు, పరిపాలన అంతటితో ముగుస్తుంది. నీవు లేక నీ సోదరులకు వేరే లోకం లేదు. వాళ్ళు లేక వాళ్ళ తల్లులు బ్రతుకరు. వాళ్ళపైన ఆధారపడిన ప్రజలు అక్కడ జీవించరు. ఎక్కడకైనా పోవటమో, అక్కడ వారిని అనుసరించటమో చేస్తారు. అఖిల ప్రాణులకు ఆధారమైన నీవే శోకానికి లొంగిపోయి వెర్రివాని చేష్టలు చేస్తే, అల్పసత్వులూ, ప్రాకృతులు అయినవారి గతి ఏమిటి? నీ నడక అటువంటివారికి మార్గదర్శకం కావాలె కాని, విన్నం కారాదు. ఇటువంటి సంకటపట్టాలు సంయమంతో, సహనంతో సాధించాలె. ఆ మార్గం లోకానికి ఆదరణీయం కావాలె. బలవంతులూ, ధనవంతులూ, విద్యావంతులూ, తప్పిన్నవారికి రక్షకులుగా వుండాలెకాని భక్షకులు కారాదు.

నహుషపుత్రుడైన యయాతి నాకం పొందికూడా అవివేకంతో ఆపద తెచ్చుకోలేదా? మన వంశపురోహిత, మహర్షిశ్రేష్ఠుడు, వసిష్ఠులవారు శత పుత్ర వియోగాన్ని సహించలేదా? ఆయన ఆగ్రహిస్తే, అడ్డపడే దిక్కేది? సర్వభూతసృష్టిని భరించే భూదేవి కారణరహితంగా కంపించటంలేదా? సకల లోక చక్షువులుగా ప్రకాశించే సూర్యచంద్రులు అల్పగ్రహగ్రస్తం కావటంలేదా? ఎంతటి మహాత్ములైనా, అమరులైనా చివరకు త్రిమూర్తులైనా దైవసంకల్పాన్ని దాటలేరు. వారే కాదు, సృష్టిలో కల్గిన జీవి కష్టరహితంగా కాలం గడిపినట్లు దృష్టాంతమేమైనా చూపగలవా? రఘునాథా. మేలు కీడు జీవకోటికి సహజం. హితమైనా, అహితమైనా జీవితేచ్ఛకోసం చిత్తం చెడే విధంగా వెత చెందవద్దు. ఇంత పండితులు మహాత్ములు మీకు ఎక్కడిది? శోకం కార్యసాధకం కాకపోగా, అన్ని అనర్థాలకు మూలం. మీవంటి సత్యసంధులు దుస్సహమైన కష్టాలు కలిగినప్పటికీ నిర్వికారంగా ఉంటారు. ఉత్తములైన ధీరులు మహావ్యామోహితులై, అనర్థకాలైన కార్యాలపై అభిప్రాయం కలగనీయరు. మీవంటి జితేంద్రియులకు సుఖదుఃఖాలు రెండూ ఒక్కటే. ప్రతివస్తువులోనూ బాహ్యం, అభ్యంతరం రెండూ వున్నై. అల్పులైనవారు అల్పమని భావించే అర్థం తరచకే. విజ్ఞులైనవారు కాంచే బాహ్యార్థానికి కారణం అని గుర్తించరు. మీరు బాహ్యాభ్యంతరాలకు కీర్తి వహించిన పురుషోత్తములు. ఆలోచించండి. మానుషికం కంటే దైవికం గొప్పది" అనేదా నాకు మీరు చెప్పిందే. నేను సామాన్యుణ్ణి. నాకు తెలిసింది. నేను చేయాల్సిందీ. తల్లి చూపించిన దారి ఒక్కటే. అది మీరూ, వదినా. అంతే. ఇప్పుడు మీరు నివురుకప్పిన నిప్పువలె వున్నారు. పూర్వం నాకు మీరు బోధించిన ధర్మమనే వాయువుతో నివురును పోగొడుతున్నాను.

నా సామాన్యబుద్ధికి తోచిన విషయంకూడా మీరు శోధించవలసిన పని లేదనీ, ఈ ప్రదేశంలోనే వదినవార్త తెలుస్తుందనీ చెప్తున్నది. మనం పర్ణశాలలో ప్రవేశించినప్పుడు వదిన లేకపోవటం ఒక్కటే తెలిసింది. ఓర్పుతో వెదకటం మొదలుపెట్టిన తర్వాత ఆమె దక్షిణంగా పోయినట్లు

మృగసంకేతం తెలిపింది. అనంతరం ఆమె ధరించిన పూలూ, ఆభరణాలూ కనిపించినై. తర్వాత విచ్ఛిన్నమైన యుద్ధపరికరాలూ, వదిన పాదచిహ్నాలూ, ఇంకొకపురుషుని అడుగులూ గోచరించినై. దీనివల్ల ఆమె మరణించలేదనీ, బలాత్కారంగా తీసికొని పోబడిందనీ, ఆ అపహరించినవాణ్ణి ఎవరో ఎదు ర్కొన్నారనీ బోధపడింది. కాబట్టి ఆమె జీవించి వున్నది. ఈ దారినే మరి కొంతదూరంపోతే కొంత కొత్తవిషయం తెలియవచ్చు. చిత్రకూటంలో భరతాదులు, మహర్షులు నీకు సమాధానం చెప్పి సమ్మతింపచేయలేక పోయిరే. నేను విన్న సరిదిద్దగలనా? పనిపెట్టుకుని బృహస్పతి వచ్చినా ప్రయోజనంలేదు. నీ నియమనిష్ఠురతకు పోలిక నీవేకాని, లోకంలో లేదు. వదినకై శోకం మాను. ప్రత్యర్థి ఎవ్వడో తెలుసుకుని ప్రతీకారం తీర్చు. నోరులేని గిరులూ, అపకారంచేయని దేవతలూ నీ ఆగ్రహానికి గురి కాకుండా చూడు. శోకంతో ప్రసుప్తమైన నీ జ్ఞానం పీకు గుర్తుచేయబడింది. దీనిలో నా కర్తవ్యం నామమాత్రం. ఇంతచేసినా ఫలితం శూన్యమైతే నీవు ఇప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని అమలుపరచు. నా అభ్యంతరం ఏమీలేదు." అని పాదాలపైబడి గట్టిగా పట్టుకుని వేడుకున్నాడు.

## సౌమిత్రి మాటలకు శాంతించి రాముడు సీతను వెదకుట

సారగ్రాహి అయిన రాముడు సౌమిత్రి మాటల్లోని సారం గ్రహించాడు. కూర్మం శిరఃపాదాలు లోనికి ఉపసంహరించినట్లు ఆ శోకశక్తి అంత లీనం చేశాడు. శాంతుడైనాడు. దిక్పాలుడైనా సన్నివేశ సందర్భానుసారంగా ప్రబోధించి మహాగంభీరుడై ఉదయించినసూర్యుడు మాదిరిగా అభినందించాడు. నిర్వాహప్రదేశంలోని నీరజంవలె నిశ్చలంగా కోదండాన్ని నేలకు ఆనించి పాతగా, పూర్వ కర్మాచరణాధీనమైన బుద్ధిచేత పట్టుకున్నాడు. సహజ శాంత ప్రసన్నుడుగా సౌమిత్రికి దర్శనం ఇచ్చాడు. "లక్ష్మణా! నీ హితవాక్యాలను విరసంగా భావించి మీ వదిన ఆపదపాలైంది. నీ అను మాన దృష్టిని శంకించి నేనూ ఆపదపాలైనాను. నీవు సత్యదర్శనుడవు. నీవు మృగసంకేతాన్ని నేర్పుగా గ్రహించి మార్గం నిర్దేశించావు. కొంత ప్రయోజనం చేకూరింది. నాకు సీత మరణించలేదని విశ్వాసం కలిగింది.

ఆమె అసురులచేత అపహరించబడి వుంటుంది. ఇప్పుడు నా కోసం కల్లార్చి సరియైన కర్తవ్యం తెలిపావు. ఇకముందు మనం ఏమిచేయాలో నీవే నిర్ణయించు" అని రాముడు అనగానే, సౌమిత్రి పేదపెన్నిధి పొందినంతగా సంతోషించి, "అన్నా నీవు నన్నింతగా అభినందించవద్దు. పరిచారకుడు పనివేళ్లు కల్గిన ప్రభువు పనికోసం పిలిస్తే ఒకడాపని పూర్తి చేస్తాడు. అంతమాత్రంచేత అతని ఆధిక్యం ఏముంటుంది? కాకపోతే ఆ సమయానికి అక్కడ అతను వుంటమే ఒక అదృష్టం. అంతమాత్రమే. అంతకుమించి ఆరోపించటం అనవసరం. ఈ దండక కేవలం భయంకరారణ్యమే కాకుండా, మనోహర ప్రదేశాలెన్నో కలిగి వుంది. తాపసులకూ, దేవతలకూ సంచారయోగ్యమైన పర్వతనదీ వనాలుకూడా వున్నై. అందుచేత ఈ దిశగానే ఇంకా ముందుకు పోదాం. మృగాలు ఈ దిక్కేకదా సూచించినై. ఆపదలో ధైర్యం అనుకున్నంతగా ఏదీ ఆదుకోలేదు. బుద్ధి సంపన్నులైన మీవంటివారు ఇటువంటి వేళల్లో గాలికి చలించని పర్వతం లాగా వుంటారు" అని వినయంగా చెప్పాడు. దానికి ఎంతో సంతోషించి తమ్ముడు తన్ను అనుసరించిరాగా, రాముడు ధనువును సజ్యంచేసి బాణం తొడిగి దిశలు పరికిస్తూ ముందుకు సాగాడు.

## రామలక్ష్మణులు జటాయువును చూచుట

ఆ దారి పోయిపోయి ఘోరారణ్యంలో ప్రవేశించింది. ముందు నడుస్తున్న రాముడు ఒకప్రక్కగా పర్వతంలాగా పడివున్న పక్షిరాజును చూశాడు. వీడే ఈ ఆకారంతో నా భార్యను మ్రింగివుంటాడని వూహించి "తమ్ముడా! భయంకరాకారంతో వున్న ఈ గ్రద్దను చూడు. ఇంత ఆకారం పక్షులకు వుండదు. వీడు తప్పక రాక్షసుడే అయివుంటాడు. వీడే సీతను మ్రింగి వుంటాడు. ఒక్కబాణంతో వీణ్ణి గతాసువు చేస్తాను" అని అంటూ కోదండం ఆ పక్షివైపుకు త్రిప్పాడు. ఉపకారం చేయబోయి అసురులకు ముప్పు తెచ్చుకున్న పక్షికి అపకారం జరుగబోతున్నదని అగోచరభూతకోటి ఆక్రందించసాగింది. ఇంతలో సౌమిత్రి "అన్నయ్యా! కొంచెం ఆగి పరిశీలించు. ఈ పక్షివాలకంచూస్తే మనకు ఇంతకు పూర్వం పరిచయమైన పక్షి

జాతికి చెందినట్లు కనబడుతున్నది. పైగా నెత్తురు వరదలో తోగివుంది. సమీపించి చూద్దాం. అవసరమైతే అప్పుడే ఆ పని చేద్దాం" అని చెపుతుండగానే "రామా! రామా! పాహిమాం పాహిమాం పాహి. అస్త్రం విడువకు. నీ కోసమే కొనవూపిరితో నిరీక్షిస్తున్నాను. నీవీ ప్రదేశం వస్తావని నాకు తెలుసు. తెలిసింది నీకు చెప్పి జీవితం ముగించుదామని బలవంతంగా ప్రాణాలు బంధించి వుంచాను. త్వరగా వస్తే చెప్పి మరణిస్తాను" అన్న మాటలు వినిపించినై. రామలక్ష్మణులు ఆ మాటలు దూరంనుంచి విని తత్తరపడుతూ సమీపించారు.

## జటాయువు రామునకు సీతాపహరణ విషయం చెప్పుట

సోదరులు సమీపిస్తున్నకొద్దీ పక్షిప్రాణాలు కంఠగతం కాసాగినై. "ఆయుష్మంతుడా! రామా! నేను జటాయువును. ఓషధికోసం వెదికినట్లుగా మీరు ఎవరికోసం వెదుకుతున్నారో ఆ తల్లి సీతాదేవినీ, నా ప్రాణాన్నీ రావణుడు అపహరించాడు. ముందు నీవూ, తరువాత తమ్ముడూ పర్ణశాలలో ఒంటిగా వదలివెళ్ళగా, రావణుడు ఆమెను దొంగిలించి రథంలో ఆకాశ మార్గాన పోతుంటే, ఆమె ఆర్తనాదం ఆలించి వెంటనే వాడి గమనాన్ని అడ్డుకున్నాను. నా శక్తి వంచన లేకుండా సమరం సల్పాను. ఏ యుద్ధంలోనూ వాడు పొందని అవమానం పొందించాను. నేను విరిచిన చాపం అదిగో. పడగొట్టిన అంబులపొదీ; నుగ్గుచేసిన బాణసమూహం ఇదిగో. చచ్చినసారథీ, గాడిదెలూ, నేలగూలిన ఛత్రం అవిగో. రూపుచెడి భూమిపడివున్న కామగమైన రథం బద్దలై ముక్కలుగా వ్రీలిపడిన తనుత్రాణం ఇవిగో. నన్ను పోరులో జయించటం సాధ్యంకాదని దప్పియున్న సమయంలో ఖడ్గంతో నారెక్కలు నరికాడు. నేను నేలపడిపోగానే ఆమెను భుజముపై పెట్టుకుని అంతరిక్షానికి లంఘించి పారిపోయాడు.

'రామా! నేను వృద్ధుణ్ణి. వాడు యౌవనుడు. నేను సహజశక్తి గల పక్షిని. వాడు బ్రహ్మప్రసాదితవరబలగర్వం కలవాడు. అయినా శక్తిలోపం లేకుండా కాలం కలిసివస్తుందని పోరాను. ఇప్పటికే ఆమె కోసం రావణునిచే చంపబడ్డాను. మళ్ళీ నీవు ఆమెకొరకే నన్ను చంపటం

ధర్మంకాదు. నేను మాయావిని కాను. మీ జనకమిత్రుడను. ఇంతవర కైనా మీకు వివరించగలిగినందుకు జీవం నిల్చిన సమవర్తికి నమస్కరిస్తు న్నాను. నన్ను శత్రువుగా భావించక ఆప్తుడుగా భావించి అనుగ్రహించు" అంటూ బాధతో సొమ్మసిల్లింది ఆ విషాదగాథ వింటున్న సోదరుల హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. భగవన్నిర్మాణంలో ఎన్ని రహస్యాలు దాగివున్నవో అని ఆశ్చర్యపడ్డారు. "బుద్ధిగల్గిన జీవులలో ఎన్నెన్నో రాగద్వేషాలు సముద్రతరంగాలలాగా వువ్వెత్తున లేచి విరుగ బడుతుంటే భిన్నప్రకృతిగల ఈ పక్షిరాజు ఇంత ధార్మిక ప్రవర్తనగలవాడు కావటం ఎంత విశేషం? ఈ శకునిప్రవరుడు ఏమాశించి తన ప్రాణంమీదకు తెచ్చుకున్నాడు?" అని సోదరులు క్షణకాలం తదేక ధ్యానంలో నిల్చిపోయారు.

## రాముడు జటాయువు స్థితికి దుఃఖించుట

రాముడు వుద్విగ్నకంఠంతో, స్రవద్బాష్పనేత్రాలతో, ప్రభవత్ కృతజ్ఞతాభావ భారహృదయంతో చేతిలోని కోదండాన్ని జారవిడిచి, నెత్తురు లాలలు గ్రక్కుతున్న నోటితో, ప్రాణావసానసమయాన్ని సూచిస్తున్న మూతపడినకన్నులతో, రెక్కలు నరకబడటంచేత కారిననెత్తురు మడుగులో పడి కదలలేకుండా వున్న శరీరభాగంతో, జీవోత్క్రమణవేళ కంఠంలో కలిగే "గురగుర" శబ్దంతో, పరోపకారభావంచేత ప్రాణార్పణం చేయ బోతున్న పక్షిరాజును గాఢంగా కౌగిలించుకుని, స్మృతిహీనుడైనాడు. "పరమపుణ్యాత్ముడా! పక్షిరాజా! నీ స్థితి చూడలేకుండా వున్నాను. నా నిమిత్తం శరీరత్యాగంచేసి, ఆ వార్త నాకు తెలుపటానికి ఇంతవరకు జీవితాన్ని నిలుపుకున్న నీకు నేనేమి ప్రతికృతి చేయగలను? నీ మరణస్థితి సీతకై నేను పొందిన శోకాన్ని క్రిందుపరుస్తూంది. ప్రాణంతో నేకాక, పోతున్నప్పుడుకూడ నా క్షేమాన్ని చింతించిన మహానుభావుడవు. నీ సౌహార్దం నాకు మరువరానిది. మరపురానిది. తమ్ముడా! అనువంశికమైన రాజ్యాధికారం భంగపాటూ, భయంకరాటవులలో సంకటపాటూ, నా ప్రాణంలో ప్రాణం సీత కోలుపాటూ, ఆప్తులకెల్ల శోకకారణమైన పక్షి

మిత్రుని త్రుంగుడుపాటూ, నా అభాగ్యం ఎంతటిదో చెపుతున్నవి కదా? ఈ అనర్థకాలు అగ్నినికూడా కాల్చకలిగినంతగా ఆక్రమించినై. ఈ శోక తాపభారం పోగొట్టుకొనటానికి సముద్రంతో పడితే ఆ జలమంతా ఈ తాపానికి ఇంకిపోతుంది. అయిగువేల బ్రద్దలై ఆవిరి చిమ్ముతుంది. ఇంత నిర్భాగ్యుడు లోకంలో ఎవడూ వుండడు. ఈయన మన తండ్రికి మిత్రుడే కాక, మనకుకూడ పరమాప్తుడైనాడు. ఈ అనఘుడు ఇంకెంతో కాలం జీవించవలసినవాడు. నాకైలూనపక్షుడూ, ఉగ్రసక్తుడై నేలపడివున్నాడు. ఇది నా దురదృష్టం. ఇంత మహోపకారంచేసిన ఈ పూజ్యుని ఈఅవస్థలో చూడలే"నంటూ మూర్ఛిల్లాడు.

## రామునకు జటాయువు సీత వృత్తాంతం చెప్పుట

లక్ష్మణుడు అన్నకు సకలోపచారాలు సలిపాడు రాముడు తెప్పరిల్లి "అయ్యో! సోదరా! ఈ మహోపకారి నాకోసం తనబలం వైరిబలం తెలిసి కూడా యుద్ధంచేసి విగతపక్షుడై కొనప్రాణంతో వున్నాడు శ్వాసకోశాలు కూడా మందగించినవి. ఎలుగుకూడా నాలికో [illegible]ట్లాడినట్లుంది. ఇక ఎక్కువకాలం జీవించనట్లు తోస్తుంది. ఓ పూజ్యవిహంగమశ్రేష్ఠా! నిన్ను బాధపెట్టతలచి అడగటంలేదు. నా భార్యను హరించి నాకూ, అడ్డంపోయిన నీకూ అపకారం చేసినవాణ్ణి అంతకాలయం చేర్చేదాకా నిద్రించను. శక్తివుంటే, సీతాపహరణానికీ, నీ వధకూ హేతువైన వాడి విషయం వివరించు అతనికి మాపట్ల వైరం ఎందుకు కలిగింది? ఆ సమయంలో సీత ఎలావుంది. ఏ విధంగా వాపోతుంది? శత్రువు గుణగణాలెట్టివి. దానవుడెటువంటి వాడు? వాడి పురం ఎక్కడ? శౌర్యం ఏపాటిది? తండ్రీ! దయచేసి చెప్పు." అని దీనంగా అడిగాడు. ఆ మాటలువిన్న జటాయువు లేనిశక్తి తెచ్చుకుంటూ, "రామా! వద్గుణ ధామా! రావణుడు నాచేత భంగపడి, మార్గాంతరం లేక దొంగ చాటుగా రెక్కలు నరికి-సమీరదుర్దిన సమాకుల మాయాగూఢుడై సీతమ్మతో ఆకాశానికి ఎగిరి దక్షిణ దిక్కుగా పారిపోయాడు. అసురుడు అవని జాతను అపహరించిన ముహూర్తం విచారిస్తే, యజమానికి తాత్కాలికంగా బాధకలిగినా పోయినసొమ్ము తిరిగి పొందుతాడు. తత్తరపాటుతో, విచారించ

కుండా అపహరించిన రావణుడు బడిశం మ్రింగిన చేపలాగా చస్తాడు, ఇది కీడులో మేలు. నీవు రావణునితో యుద్ధం చేయక తప్పదు. ఆ సమరంలో సబాంధవంగా వాడు సర్వనాశనం అవుతాడు. తిరిగి నీ భార్యను నీవు గ్రహిస్తావు. ఇద్దరు కలిసి అయోధ్యా నగరానికి ఆనందంగా పోతారు. రామా! కన్నులు తిరుగుతున్నై. మనస్సు స్వాధీనం తప్పుతూంది. విశ్రవుడికి ఔరసుడు. ఈశ్వరమిత్రుడికి తమ్ముడు. అతడు— అని చెప్పబోతూ నోటివెంట రక్తం, మాంసం క్రక్కసాగాడు. "చెప్పు తండ్రీ! చెప్పు. అతడు ఉండేచోటు తెలుపు" అంటూ రాముడు ఆతురతతో అడుగుతుండగానే పక్షిరాజు ఆయుప్రాణం పైకి లేచిపోయింది. కన్నులు ఎరుపెక్కగా, నోరు తెరచి నిట్టూర్పుగా కాళ్ళు చాచి, మెడ వేలవైచి తనువు పడటంగా జటాయువు మహాప్రస్థానం చేశాడు.


## జటాయువు మరణానికి రాముడు శోకించుట

ఆర్తిలోనే జటాయువు అసువులు వీడటంతో రాముడు తండ్రి మరణవార్త విన్నప్పటికన్నా అధికంగా దుఃఖించాడు. మహోపకారం చేయ నెంచిన అప్పుడు శత్రువు వుండేచోటూ, ఇతర వివరాలు చెప్పకుండా మరణించటంతో తనకర్మ పరిపాకం ఇంకా కాలేదని విచారపడ్డాడు. "తమ్ముడా! ఇదేం దైవవిపర్యాసం? ఈ పుణ్యమూర్తి అనేక వర్షాలు దుర్మార్గులైన రాక్షసులున్న దండకాటవిలో నిర్భయంగా పక్షి లోకాన్ని పాలిస్తూవుండి చివరకు ఇక్కడే రాక్షసుని చేతనే మరణించాడు. ఎంత వారికీ కాలం అనుల్లంఘనీయం కదా? అవ్యాజంగా మనపట్ల కలిగిన అనురాగ భావంతో సీతను రక్షించబోయి విహంగరాజ్యాన్ని, తన ఆయుష్షునూ కూడ నాకై ధారపోశాడు. ఇంత మహోపకారిని మనం ఎప్పుడైనా చూశామా? శూరులూ, శరణ్యులూ, హితచారులూ, సాధువులూ, ధర్మపథవర్తులూ మానవులలోనే కాదు తిర్యక్కుల్లో కూడా వున్నట్లు ఈ పుణ్యాత్ముడు నిరూపించాడు. ఈతడు తండ్రిలాగా, పూజనీయుడూ, మాననీయుడూ, ప్రియతముడూ నాకు. ఈతని దుర్మరణ దుఃఖం సీతాపహరణ దుఃఖంకన్నా శతగుణితంగా నన్ను బాధపెడుతూంది. ఏమిచేసినా ఈతని ఋణం తీరదు. ఒకే ఒక మార్గం వుంది. ఆ మార్గాని అనుసరిస్తాను.

# రాముడు జటాయువునకు అగ్ని సంస్కారం చేయుట

"సౌమిత్రీ! ఈతడు తిర్యగ్జాతికి చెందిన వాడైనా పుణ్య కర్మలు చేశాడు. నాకై ప్రాణాలర్పించాడు కనుక ఇతనికి ఉత్తమలోక ప్రాప్తి కలిగిస్తాను. నీవు చితిని ఏర్పాటుచేయి. రెండు చంద్ర కట్టెలు తీసుకునిరా. తరిచి అగ్ని పుట్టిస్తాను. ఆ అగ్నితో ఈపుణ్యమూర్తిని దహనం చేస్తాను. నా తండ్రికి చిత్రకూటంలో కర్మ చేసినట్లే చేస్తాను." అని చెప్పగానే సౌమిత్రి వెంటనే చితిని ఏర్పాటు చేశాడు. ఇరువురు కలిసి జటాయు కళేబరాన్ని చితిపైకి చేర్చారు. రాముడు ఉత్తరాభి ముఖంగానిల్చి. "సర్వలోకాధి దేవతలారా! నేను తండ్రి ఆజ్ఞా పాలనంలో వంచనా బుద్ధి లేకుండా పయనిస్తుంటే, నేనుచేసే కర్మలు మీకు ప్రీతి కలిగిస్తుంటే, ధర్మ చ్యుతకాని నష్టి రాకుండా ఉంటే, యజ్ఞశీలురకూ, ఆహితాగ్నులకూ, అపరావర్తులకూ, యతులకూ, సత్యవ్రతులకూ, ఎట్టి ఉత్తమోత్తమ గతులు లభించునో అట్టి ఉత్తమగతులు ఈ పక్షిరాజునకు ప్రసాదించండి. పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మలోక నిత్య నివాసం కల్పించండి" అంటూ ప్రార్థించి చితికి అగ్ని కొలిపాడు. అశ్రుతర్పణం చేశాడు. రోహి మాంసం తెచ్చి లేతపచ్చికపై మానవ ప్రేతాలకు పెట్టినట్లే పిండాలు పెట్టి, పైతృక కర్మ సమయంలో బ్రాహ్మణులు చదివే మంత్రాలు చదువుతూ శ్రాద్ధవిధి పూర్తిచేసి, తమ్మునితో కలసి గోదావరిలో స్నానంచేసి. ఉదక క్రియలు కూడ జరిపాడు. మహర్షికల్పుడైన రామునిచేత అంత్యక్రియలు యథావిధి పొంది జటాయువు అనితర సాధ్యమైన అనుత్తమ స్థానాన్ని శాశ్వతంగా పొందాడు. అనంతరం సోదరులు జరిగిన పరిణామాలను సింహావలోకనం చేసి పతంగపతి పలికిన భవిష్యత్సూచకమైన పలుకులు పలుసార్లు మననంచేశారు. ఆ ప్రదేశం వీడలేక వీడుతూ, ఆప్తులకన్న మిన్నగా అంతటి క్రూర దానవునితో ఆహవంచేసి అసువులు వీడిన పక్షి రాజుకు కడసారి కృతజ్ఞతగా ఆతని చితికి అంజలించారు. పిమ్మట ఇరువురూ సీతాన్వేషణా తత్పరమతులై ఇంద్రోపేంద్రులవలె కలిసి దండకారణ్యంలో మూడవ భాగం వైపు ప్రయాణం సాగించారు.

(సశేషం)


71,165

# ఎమెస్కో వచన రామాయణం

శతావధాని కోట వీరాంజనేయశర్మ



Volume Five

Price Rs. 5/-

cover printed at nandini art printers hyderabad - 29.